శ్రీమద్భగవద్గీత చింతామృతం.

తెలుఁగు పద్యానువాదము.. చింతా రామకృష్ణారావు.



శ్రీకృష్ణం వందే జగద్గురుమ్.

ప్రారబ్ధం భుజ్యమానోపి గీతాభ్యాసరతస్సదా |

స ముక్త స్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే ||

శ్రీమద్భగవద్గీత చింతామృతం.

తెలుఁగు సేత.. చింతా రామకృష్ణారావు.

ప్రార్థన

శా. శ్రీమన్మంగళ భారతంబునఁ గృపన్ శ్రీదంబుగా గీతనే
శ్రీమంతుండగు నర్జునుండెరుఁగ నా శ్రీకృష్ణుఁడే చెప్పె, తా
ప్రేమన్ జెప్పిన గీతనాంధ్రముననే ప్రీతిన్ రచింతున్ గృపన్
ప్రేమన్ భారతి! వ్రాయఁజేయుమిది, నిన్ జిత్తంబునన్ గొల్చెదన్. 1.

రచనకు ప్రేరణ.

ఉ. శ్రీమదనంతుఁడైన హరి చెప్పిన గీతను తెల్గుభాషలో
ధీమతులెన్నుచుం బొగడఁ దీయగ వ్రాయుడటంచుఁ బల్కె తాఁ
బ్రేమను నా కుమార్తె యగు రేవతి వేంకటరత్నమాఖ్య, సత్
ప్రేమగ వ్రాయఁ జేసినది విద్యలతల్లి మహత్వ గీతనే. 2.

గీతావగాహన

శా. శ్రీమంతంబగు నంతరాత్మ, మరియున్ జీవాత్మయున్, గృష్ణుడున్
ధీమంతుండగు నర్జునుండునగుచున్ దేదీప్యమానంబుగా
శ్రీమంతంబుగ జూప, గాంచితిది మచ్చిత్తంబునన్ సర్వమున్,
నీమంబొప్పగ తల్లిదండ్రులకు దీనిన్ వ్రాసి యర్పించితిన్. 3.

ఈ తెలుఁగు గీతాపాఠకులకు నేనాశించు ఫలములు.

మ. భగవద్గీత సుధాస్రవంతి, కొనినన్ భక్తుల్ చిదానందమున్,
సుగుణప్రాభవ వృద్ధియున్, శుభములన్, శుద్ధంపువాగ్వైఖరిన్,
నిగమాకారుని దివ్యదర్శనము, క్షోణిన్ సౌఖ్య సద్భాగ్యముల్,
భగవద్గీత కృపన్ లభించు, నటుపై బ్రహ్మత్వమే కల్గెడున్. 4.

అంకితము.

పూజ్యులయిన మా నాన్నగారికి మా అమ్మగారికి.



కీ.శే. చింతా సన్యాసిరామారావు...చింతా వేంకటరత్నం.

4. సీ. శ్రీప్రదంబైనట్టి చింతా వరాన్వయ సన్యాసిరామాఖ్య గణ్యమూర్తి

వేంకటరత్నము విజ్ఞాన తేజులు నాదు పితరులు విజ్ఞానఖనులు,

సంగీతజ్యోతిష్య సాహిత్య వేత్తలు పండితప్రవరులు భక్తిపరులు,

నా కంటి రెప్పలై నాదు రక్షణఁ జేసి జ్ఞాన వృద్ధిని గొల్పి గౌరవముగ

తే.గీ. సంఘమందున బ్రతుకంగ సన్నుతమగు

బోధనావృత్తిఁ జూపిన పూజనీయు

లట్టి నా తల్లిదండ్రుల కంకితముగ

స్వీకరింపగ నొసగితిన్ జిత్తమలర ....5.

శ్రీమద్భగవద్గీత
1వ అధ్యాయము
అర్జున విషాద యోగము.

ధృతరాష్ట్రుడు పలికెను;
శా. ధర్మక్షేత్రముగా నెఱుంగనగు నిద్ధాత్రిన్ గురుక్షేత్రమున్
ధర్మాత్ముండగు పాండుపుత్రులును బోధన్ గల్గు నా పుత్రులున్
గర్మల్ ప్రేచఁగఁ జేరిరే సమర కాంక్షన్ వారలుత్సాహులై?
మర్మంబున్విడి యేమి చేయుదురొ, ప్రేమన్ దెల్పుమో సంజయా! ||1-1||
భావము.
ఓ సంజయా! ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమునందు యుద్ధ కాంక్షతో చేరియున్న నాయొక్క పుత్రులు, మరియు పాండురాజు కుమారులు ఏమిచేసిరి? తెలియఁజేయుము.
ధృతరాష్ట్రుడితో సంజయుడిట్లు పల్కెను
తే.గీ. అపుడు దుర్యోధనుండట ననుపమముగఁ
గలుఁగు పాండవ వ్యూహమున్ గాంచి వెడలి
గురువు ద్రోణునిఁ జేరెను వరలు భీతిఁ
బలికె తెలియఁగ నతనికి నిలువ లేక. ||1-2||
భావము.
ఆ సమయమున రాజైనదుర్యోధనుడు వ్యూహరచనతో రణమునకు మోహరించియున్న పాండవ సైన్యమును చూచి, ద్రోణాచార్యుని సమీపించి ఇట్లు పలికెను.
మ. సదయం గాంచుఁడు మీదు శిష్యుఁడగు దృష్టద్యుమ్నుఁడన్ ధీవరుం
డదిగో వ్యూహము తా రచించె మహిలో నాశ్చర్యముం గొల్పు నా
మదికిం గంటకమైనదై, రిపులకుం భాగ్యంబుగా నిల్వగా,
నది మీ దృష్ఠికిఁ దెచ్చితిన్ గనఁగ మీ రాచార్యదేవా! సుధీ! ||1-3||
భావము.
ఓ గురువర్యా! బుద్ధిశాలియు, మీ శిష్యుడునగు ధృష్టద్యుమ్నునిచేత వ్యూహాకారముగ రచింపబడియున్నట్టి పాండవుల ఈ గొప్ప సైన్యమును జూడుడు!
కం. సాత్యకి, విరటుఁడు, ద్రుపదుఁడు
స్తుత్యులును, మహారథులును జూడగ నచ టౌ
న్నత్యము సూపగ నుండిరి
స్తుత్యుఁడ! భీమా ర్జునులకుఁ దుల్యులు వారల్. ||1-4||
భావము.
ఆచార్యా! పాండవ సేనలో భీమర్జునలకు సమానులుగా సాత్యకి, విరటుడు, ద్రుపదుడు, అందరును గొప్ప పరాక్రమవంతులు, మేటి వీరులు కొందరు వారి పక్షముననుండిరి.
మత్తకోకిల.
శ్రీకరా! యల ధృష్టకేతువు, చేకితానుఁడు, వీరుఁడౌ
ప్రాకటంబుగ కాశికాపురిరాజు, శైభ్యుఁడు, ధీరుఁడౌ
రాకుమారుఁడు కుంతిభోజుఁడు క్రాలుచున్ నరపుంగవుం
డాకడన్పురజిత్తు రాజు, మహాసుయోధులు నిల్చిరే. ||1-5||
భావము.
దృష్టకేతువు, చేకితానుడు, వీర్యవంతుడైన కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, నరశ్రేష్ఠుడైన శైబ్యుడు ఉండిరి.
ఆ.వె. తా పరాక్రముఁడు యుధామన్యుఁ డట వీర్య
వంతుఁడుత్తమౌజు డంతె కాక
యట సుభద్ర తనయు డభిమన్యుడును, ద్రౌప
దీ కుమారు లుండి రాకరముగ. ||1-6||
భావము.
పరాక్రమశాలి యధామన్యుడు, వీర్యవంతుడైన ఉత్తమౌజుడు, సుభద్ర కుమారుడు అభిమన్యుడు, ద్రౌపదీ కుమారులు ఉన్నారు. వీరందరూ మహారథులే.
తే.గీ. బ్రాహ్మణోత్తమా! తెలియుఁడు ప్రస్తుతమున
ఘనులు మన పక్షమందునఁ గలిగిరెవరొ,
నాదు సైన్యంబునందలి నాయకులను
దెలిపెదను మీకు నేనిటఁ దెలియుటకని. ||1-7||
భావము.
బ్రాహ్మణోత్తమా! మనలో విశిష్టులైన వారెవరో తెలుసుకొనుఁడు. నా సైన్యంలోని నాయకులను మీ గుర్తుకోసం తెలిపెదను.
తే.గీ. భీష్ముఁడును, మీరు, కర్ణుండు, వీరవరుఁడు
కృపుఁడు, సోమదత్తజుఁడు, భూరిశ్రవుడును,

ఘనుఁడు ద్రోణ సుతుండు, వికర్ణుఁడు నిటఁ
గలరు మనసైన్యమందున ఘనసుచరిత! ||1-8||
భావము.
మీరు, భీష్ముడు, కర్ణుడు, యుద్ధములో జయము పొందే కృపుడు, అశ్వత్థామ, వికర్ణుడు, అటులనే సోమదత్తుని కుమారుడు భూరిశ్రవుడు కలరు.
తే.గీ. కువలయమున శూరులు యుద్ధ కోవిదులును,
త్యక్తజీవులై రెందరో ధరణిపైనఁ
బ్రేమతోడ నా కొఱకని వీరవరులు,
చూడుడందరిన్ మీరలు, శుభ సుచరిత! ||1-9||
భావము.
ఇంకనూ ఎందరో యుద్ధకోవిదులైన శూరులూ, నానా శస్త్రాలను ధరించి నాకోసము జీవితాలని త్యాగము చేసిరి.
తే.గీ. భీష్మ రక్షిత సైన్య మభేద్యమనఁగఁ
గలిగె మనకు ననల్పమై, కనుఁడు మీరు,
భీమ రక్షిత సైన్య మవిస్తృతి నటఁ
గలిగె వారికి నల్పమై, ఘన సుచరిత! ||1-10||
భావము.
భీష్ముని చేత రక్షింపబడే మన బలం అపరిమితమైనది. భీముని చేత రక్షింపబడే వారి బలం పరిమితమైనది.
కం. మీరలు వ్యూహములన్నిట
మీరక మీ స్థానములను మెలగుచు భీష్మున్
నేరుపుతో రక్షింపుడు,
చేరగ సద్విజయ పథము శ్రీమంతముగా. ||1-11||
భావము.
అన్ని ఎత్తుగడలలోను మీరంతా ఎవరి స్థానములలో వారుండి, సదా భీష్ముని రక్షించవలెను
కం. అతనికి హర్షము గూర్చుచు
పితామహుఁడు సుప్రతాప వీరుఁడు భీష్మం
డతులిత శంఖానాదము
క్షితి, కురువృద్ధుండు చేసె కీర్తిప్రదుఁడై. ||1-12||
భావము.
అతడికి హర్షము కలిగించుచు ప్రతాపవంతుడైన కురు వృద్ధుడు గట్టిగా సింహగర్జన చేసి శంఖం ఊదెను.
తే.గీ. శంఖముల్ భేరులే గాక సమరమునకు
సిద్ధమని దెల్ప పణవముల్, చెలగి మ్రోగె
గోముఖంబులు, తప్పెటల్, కూడి మ్రోగ
వినగ గజిబిజిగాఁ దోచె, విశ్వమునను. ||1-13||
భావము.
ఆవెంటనే శంఖములూ, భేరులూ, పణవములూ(చర్మవాద్యాలు)అనకాలు(తప్పెటలూ,మద్దెలలు)గోముఖములు ఒకేసారిగా మ్రోగెను. ఆ ధ్వని గజిబిజి అయినది.
కం. శ్వేతాశ్వరథముపై వి
ఖ్యాతిగ హరియును కిరీటి యలరుచు శంఖం
బాతత గతిఁ బూరించిరి,
జ్ఞాతంబవ సైనికులకు జయనాదముగా. ||1-14||
భావము.
అప్పుడు తెల్లటి గుర్రాలు పూన్చిన గొప్ప రథంలోకూర్చున్న మాధవుడు, అర్జునుడుదివ్యశంఖములను ఊదిరి.
తే.గీ. పాంచజన్యంబు పూరించె భవ్యుఁడు హరి,
దేవదత్తమర్జునుఁడూదె దిశలు మ్రోగ,
పౌండ్రకమ్మూదె భీముఁడు,భయము కలుగ,
యుద్ధమునకని సైన్యంబు సిద్ధపడగ. ||1-15||
భావము.
పాంచజన్యమును హృషీకేశుడూ, దేవదత్తమును ధనంజయుడూ, పౌండ్రకమనే మహాశంఖమును భీమకర్ముడైన వృకోదరుడు ఊదిరి.
తే.గీ. కుంతి కొడుకు ధర్మజు డట నంత విజయ
మూదె, నకులుఁడూదె సుఘోష మోద మలర,
యూదె మణిపుష్పకంబును యోధుఁడయిన
మాద్రితనయుఁడు సహదేవమహితుఁడెలమి. ||1-16||
భావము.
కుంతీపుత్రుడు ధర్మరాజు అనంతవిజయమును, సుఘోష, మణిపుష్పకాలనేవాటిని నకుల సహదేవులు ఊదిరి.
ఆ.వె. మహిత రథి శిఖండి, మరియు ధృష్టద్యుమ్నుఁ
డు నపరాజితుఁడతఁడు కనఁగనట

సాత్యకియు, విరాట్టు, సధనుకాశీరాజు
శంఖనాదమచటసలిపిరపుడు. ||1-17||
భావము.
ఓ రాజా గొప్ప ధనువు కలిగిన కాశీ రాజు, మహారథుఁడైన శిఖండీ, ధృష్టద్యుమ్నుఁడూ, విరాటుడూ, అపరాజితుడైన సాత్యకీ శంఖనాదము చేసిరి.
ఆ.వె. తవిలి ద్రుపదరాజు, ద్రౌపదీ సుతులును,
వరసుభద్ర సుఁతుడు, వరలిరచట,
రాజులందరచట ప్రారంభ సూచిగా
శంఖ నాదములను సలిపినారు. ||1-18||
భావము.
ద్రుపదుడూ, ద్రౌపది కుమారులు, మహాబాహుఁడైన సుభద్ర కుమారుఁడైన అభిమన్యుడూ వేరువేరుగా శంఖాలను ఊదిరి.
తే.గీ. భూమి నాకాశమున శంఖపూరణ రుతి
మించి భీతిలగ ప్రతిధ్వనించెనపుడు,
ధార్తరాష్ట్రుల హృదయముల్ దర్పముడుగ
చీల్చి నిస్తేజులుగఁ జేసె చెన్ను గాను. ||1-19||
భావము.
ఆ ధ్వని భూమ్యాకాశాలలో భయంకరముగా మార్మోగుచు ధార్తరాష్ట్రుల హృదయాలను చీల్చింది.
తే.గీ. అప్పు డచ్చట ప్రబలిన యాహవమున
నగచరసుకేతనుండగునర్జునుండు
యుద్ధ సన్నద్ధచిత్తులై యొప్పియున్న
ధార్తరాష్ట్రులఁ గాంచి సత్ స్ఫూర్తిని గని, ||1-20||
భావము. ఓ రాజా! అప్పుడు కపిధ్వజుఁడయిన అర్జునుఁడు యుద్ధ సన్నద్ధులై యున్న ధృతరాష్ట్రునకు సంబంధించినవారిని చూచి స్ఫూర్తి పొంది,(తరువాత పద్యముతోనన్వయము.)
తే.గీ. ఓ మహారాజ! యచటమహోజ్వలముగ
నొప్పియున్నట్టి కృష్ణని నొకపరి గని
(అర్జునుఁడనెను)
అర్జునుండనె తన రథమాహవమున
నడుమ నిలుపు మనుచు భక్తి పొడమ మదిని. ||1-21||
భావము.
ఓ మహారాజా! అప్పుడు శ్రీకృష్ణునితో అర్జునుఁడు తన రథమును ఉభయ సైన్యమునకు మధ్య నిలుపమనెను.
తే.గీ. యుద్ధమును చేయఁ గోరుచు నున్నదెవరొ
యెవరితో యుద్ధమును జేయ నెదురు నిలువ
వలెనొ వారినే నే జూడ వలయునిపుడె
యనెను కృష్ణునిఁ జూచుచు నర్జునుండు. ||1-22||
భావము.
యుద్ధంచేయగోరి ఎదురు చూస్తూ నిలబడి ఉన్న వారిలో నేను ఎవరితో యుద్ధం చేయాలో వారిని చూడాలి
తే.గీ. దుష్టుఁడగు ధార్తరాష్ట్రుని తోడనుండి
తృప్తిఁ గలిగింప వానికి నాప్తులగుచు
నుండి రిచ్చట, యిచ్చట నున్న నేను
చూడగావలె వారిని చూపు మనెను. ||1-23||
భావము.
దుర్బుద్ధి కలిగిన దుర్యోదనునికి ప్రియం చేయఁగోరి యుద్ధము చేయుటకు ఎవరెవరు ఇక్కడ సమావేశమై ఉండిరో వాళ్ళను నేను చూస్తాను.
సంజయుడిట్లనెను;
తే.గీ. భారతా! వినుమనుచును పలికె సంజ
యుండు, విని కృష్ణుఁడా యర్జునుం డనిన ప
లుకులను, రథంబు నిలిపెను ప్రకటితముగ
నుభయ సైన్యంబు మధ్యన నొప్పిదముగ ||1-24||
భావము.
అర్జునుని కోరికమీద కృష్ణుడు ఉభయ సేనల మధ్య ఉత్తమమైన రథమును నిలబెట్టి,
తే.గీ. ద్రోణ భీష్మాది ముఖ్యుల తోడ నిచట
ఘనుల కనుమంచు సారథి కవ్వడికనె
కౌరవుల సైన్యబలమునుఁ గనులఁ గాంచ,
వ్యూహమునెఱింగి సాగుచు పోవ నెంచి. ||1-25||
భావము.
భీష్మ, ద్రోణ, మిగిలిన రాజుల ఎదుట నిలబెట్టి, సమావేశమై ఉన్న ఈ కౌరవులను చూడు అన్నాడు.

తే.గీ. అర్జునుం డటఁ గాంచె తా నపుడు తండ్రు
లను, గురువులను, తన తాతలను సుతులను
మనుమలను తన మేనమామల నెఱింగె,
వారలను మదిఁ గనె తనవారెయనుచు. ||1-26||
భావము.
అప్పుడు అర్జునుడు తండ్రులను, తాతలను, గురువులను, మేనమామలను, కుమారులను, మనుమలను చూచెను.
తే.గీ. అర్జునుం డింకయున్ గాంచె నచట నుండి
నట్టి యుభయపక్షంబుల నలరుచున్న
సైనికులనప్పుడా బంధుజనులను మది,
యుద్ధసన్నద్ధులై యున్న యోద్ధతతిని. ||1-27||
భావము. ఇంకా అర్జునుడు, సజ్జనులను, రెండు సేనల మధ్య నిలబడి ఉన్న యావన్మంది బంధువులను సమీక్షించి,
తే.గీ. చూచి ఘన తరంబగు కృపన్ క్షోభ చెంది,
ఘన విషాదంబులో మున్గి, క్షణము నిలిచి,
(అర్జునుడు ఇలాఅన్నాడు)
కృష్ణునిఁ గని పలికెనిటు, కృష్ణ! గాంచ
నుభయ పక్షాల, బంధువులుండిరకట. ||1-28||
భావము.
అర్జునుడు ఇలాఅన్నాడు; ఉదృతమైన కరుణ ఆవహించగా విషాదంతో ఇలా అన్నాడు. యుద్ధం చేయగోరి సమావేశమై ఉన్న నా బంధువులను చూడగా
తే.గీ. కనగ వీరిని, కంపంబు కలుగుచుండె,
శిథిలమగుచుండె దేహంబు, జిహ్వ యెండె,
గగురుపాటును బొందితిఁ గలతఁ జెంది
మనసు దుర్బలమగుచుండె, మాధవుండ! ||1-29||
భావము.
నా అవయవాలు శిధిలమై పోవుచున్నవి, నోరు పోవుచున్నది, నా శరీరం వణుకుచున్నది, రోమాలు నిక్క పొడుచుచున్నవి.
శ్లో. గాణ్డీవం స్రంసతే హస్తాత్త్వక్చైవ పరిదహ్యతే |
న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ||1-30||
తే.గీ. చేతి గాండీవ మది జారు, భీతి తోడ,
దేహమే మండుచుండెను దేవదేవ!
నిలుచుటకు శక్తి లేదిక, నిలకడ విడి
మతియు భ్రమియించుచుండెను మాధవుండ!
భావము.
గాండీవం చేతిలోనుండి జారిపోవుచున్నది, వళ్ళు మండుచున్నది, నిలుచుటకునూ ఓపికలేకుండెను. మనస్సుభ్రమించుచున్నది.
శ్లో. నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ |
న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే ||1-31||
తే.గీ. కేశవా! దుశ్శకునములు క్షితిని గంటి,
స్వజన హననంబుచేతను ఫలమదేమి
కలుగునో గాంచ లేకుంటి, కమలనయన!
ఇట్టిదుస్స్థితిన్ గడచుటదెట్టులగునొ?.
భావము.
కేశవా! దుశ్శకునాలు కనిపిస్తున్నాయి. స్వజనాన్ని చంపుట వలన యేమి మేలు కలిగుతుందో తెలుసుకోలేకుంటిని..
కం. కోరను విజయము, నే నిన్
గోరను రాజ్యంబు, సుఖము, కోరెదఁ జెపుమా
గోరిన రాజ్యము భోగము
నేరీతి ఫలము కలుగును కృష్ణా! కృపతో. ||1-32||
భావము. ఓ కృష్ణా! నేను జయం కోరను, రాజ్యం కాని సుఖాలు కాని కోరను. గోవిందా రాజ్యం వలన కాని, భోగాల వలన కాని, జీవించడం వలన కాని ప్రయోజనం ఏమిటి.
తే.గీ. రాజ్య, సుఖ, భోగములెవరి రంజనకని
కోరుచుంటిమో, వీడిరి వారు సర్వ
సంపదలను, ప్రాణములను, శాశ్వతముగ,
నిలిచి యుండిరిచ్చోటనే, నీరజాక్ష! ||1-33||
భావము.
ఎవరికోసం మనం రాజ్యాన్ని, సుఖ భోగాన్ని కోరుకుంటామో వారు ప్రాణాలను, సంపదలనుత్యజించి ఇక్కడ

నిలబడి ఉన్నారు.
తే.గీ. తండ్రులున్, మేన మామలు, తాతలు మరి
మామలున్, సుతులును, బావ మరుదులు, వర
లుదురు వియ్యంకు లాచార్యులు మనుమలును,
నిలిచి రిధ్ధాత్రి నిచ్చట నీవు కనుమ. ||1-34||
భావము.
ఆచార్యులు, తండ్రులు, పుత్రులు, తాతలూ, మేనమామలూ, మామలూ, మనుమలూ, బావమరుదులూ, వియ్యంకులూ మొదలైన వారు.
తే.గీ. కనుమ మధుసూదనా! నీవు కరుణ వీడి
నన్నుఁ జంపినన్ గాని నే నెన్నటికిని
కల త్రిలోకాధిపత్యంబు కలుగునయినఁ
జంపగాబోను, భూమికై చంపఁగలన? ||1-35||
భావము.
మధుసూదనా; నేను చంపబడినప్పటికీ, త్రిలోక అధిపత్యానికైనా వీరిని చంపడానికి ఇష్టపడను. ఇక భూలోక రాజ్యం కోసం చంపుదునా.
తే.గీ. ధార్తరాష్ట్రులఁ జంపిన దాని వలన
సంతసం బేమి కలుగును? సన్నుతాత్మ!
ఆతతాయులం జంపిన నదియు మనకు
పాపఫలమునే యిచ్చును పరమపురుష! ||1-36||
భావము.
జనార్ధనా! దృతరాష్ట్ర కుమారులను చంపుట వలన మనకి సంతోషమేమి కలుగును? ఆతతాయులను చంపినా మనకు పాపమే వచ్చును.
తే.గీ. తలప ధార్తరాష్ట్రులఁ జంపఁ దగదు మనకు,
వారు బంధుసమేతులై వరలిరిచట
మన జనంబులన్ చంపిన మనమదెటుల
సుఖము పొందగలారము? సుజనపాల! ||1-37||
భావము.
అందువలన బంధు సమేతులైన దార్తరాష్ట్రులను చంపడం తగదు. మన వాళ్ళను చంపడం వలన మనం ఎలా సుఖపడ గలము.
తే.గీ. లోభమును జేసి కానరు లోతుగాను,
కులవినాశన కార్యము కొలుపు దోష
ము నిలఁ జేయు మిత్రద్రోహమునకు కలుగు
పాపఫలమది నరకపు కూపముకద.
||1-38||
భావము.
లోభంచేత తెలివి తప్పిన వీళ్ళు, కులక్షయం వలన కలిగే దోషాన్ని, మిత్ర ద్రోహం వలన కలిగే పాపాన్ని చూడలేక పోయినప్పటికీ,
తే.గీ. ఓ జనార్ధనా! కులనాశ మొదవునంచుఁ
దెలిసియున్నట్టి మనమిట్లు తెలివితప్పి
యిట్టిపాపంబు చేయగానేల? చెపుమ,
పాపదూరులమై యుంట పధ్ధతి కద ||1-39||.
భావము.
జనార్ధనా! కులక్షయం వలన ఏర్పడే దోషాన్ని తెలిసిన మనం ఈ పాపం నుండి ఎందుకు తొలగ కూడదు?
తే.గీ. కుల వినాశనము వలనకూలిపోవు
మన సనాతన ధర్మము, మహినధర్మ
మున నడుతురుగ పాపులై మన కులజులు
చింతఁ జేయుము నీవును శ్రీకరుండ! ||1-40||
భావము.
కులక్షయం వలన సనాతనమైన ధర్మం నశించును.
ధర్మం నశించినపుడు యావత్కులము అధర్మము వైపు తిరుగును.
తే.గీ. వ్యాప్తమగు నధర్మముననే యాడువారు
చెడుదు రద్దానిచేతను చెడును కులము.
వర్ణ సంకరమేర్పడు, వసుధపైన
నీవు చింతింపుమో కృష్ణ! ధీవరేణ్య!, ||1-41||
భావము.
కృష్ణా! అధర్మం వ్యాపించడంతో కులస్త్రీలు చెడిపోవుదురు.
కులస్త్రీలు చెడినచో వర్ణసంకరము ఏర్పడును.

తే.గీ. వర్ణ సాంకర్యమగుటచే వర్ణమునకు,
కులవినాశన కారణ కలితులకును
నరకమే గతి, పితరులీ నరకమొందు
దురుదకముపిండ హీనులౌదురు కనంగ. ||1-42||
భావము.
సాంకర్యం వలన కులానికి, కులాన్ని నాశనం చేసినవారికి నరకమే గతి.
వీరి పితరులు పిండోదక క్రియలు లేక నరకములో పడుదురు.
తే.గీ. వర్ణ సంకర హేతువౌవారిదోష
మునను శాశ్వత కుల ధర్మ ములు నశించు,
జాతి ధర్మంబులు నశించు, ఖ్యాతి చెడును,
దుస్స్మృతుల నుండి కాపాడు తోయజాక్ష! ||1-43||
భావము.
వర్ణసంకరానికి కారకులైన కులనాశకుల ఈ దోషాల వలన
శాశ్వతమైన జాతి ధర్మాలు, కులధర్మాలు పెకలింపఁ బడును.
కం. కులధర్మము వీడిన లో
కులు నరకము పొంది మిగుల కుములుదురటగా
కలకాలము, వింటినటుల,
జలజాతేక్షణ! ముకుంద! సజ్జన పూజ్యా! ||1-44||
భావము.
జనార్ధనా కులధర్మాలు తొలగిపోయిన మనుష్యులు కలకాలం
నరక వాసులగుదురని వింటిమి.
ఆ.వె. అకట! రాజ్య సుఖమునాశించి యిప్పుడు
స్వజనులను వధింప నిజముగానె
సిద్ధపడితిమికద, ఛీ, యెంత పాపంబు
చేయఁ బూనితిమిట, శ్రీముకుంద! ||1-45||
భావము.
అక్కటా! రాజ్య సుఖం కోసము స్వజనమును వధించుటకు సిద్ధమైన
మనం ఎంతటి మహాపాపానికి ఒడి గట్టుచుంటిమో కదా.
తే.గీ. కన ప్రతీకార బాహ్యునై కౌరవులను
చంపనెంచక శస్త్రముల్ చయ్యనవిడి
యుండ నన్ గౌరవుల్ సంపిన నది
మేలె నాకెంచగా నిజము, నీల దేహ! ||1-46||
భావము.
ప్రతీకారము చేయక నిరాయుధుఁడనై ఉన్న నన్ను శస్త్రాలు చేపట్టి
కౌరవులు యుద్ధములో చంపినా, దానివలన నాకు మేలే ఎక్కువ
జరుగును.
సంజయుఁడు ఇట్లు పలికెను.
<u>కందపద్య గర్భ తేటగీతి.</u>
అని పలికి యర్జునుండట మనమున విల
పించుచు ఖిల మానసుడయి, భీతిని హరి
నుడువులు రథమును విన కను దిగి యమ్ము
లు నిక విల్లు విడిచె, హా మదినికలగుచు
<u>తేటగీతిలో ఉన్న కందపద్యము</u>..
అని పలికి యర్జునుం డట
మనమున విలపించుచు ఖిల మానసుడయి, భీ
తిని హరి నుడువులు రథమును
వినకను దిగి, యమ్ములు నిక విల్లు విడిచె, హా! ||1-47||
భావము.
సంజయుడు ఇట్కుపలికెను; అర్జునుడు ఇట్లు పలికి శోకముతో నిండి యున్న మనస్సుతో యుద్ధభూమిలో బాణాలతో సహా ధనస్సుని వదిలి రథము వెనుక భాగములో కూర్చొనెను.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " అర్జునవిషాదయోగము" అనెడి మొదటి అధ్యాయము సమాప్తము

2వ అధ్యాయము
సాంఖ్యయోగము
సంజయుడుఅనుచుండెను.
తే.గీ. కలతఁ జెందుచు కన్నీరు కార్చుచున్న
యర్జునుని జూచి శ్రీకృష్ణుఁడనియెనిట్లు.
మానవాళికి మార్గంబు మహిత గతిని
జీవనము సాగ గీతను చెప్పఁ బూని. || 2-1 ||
భావము.
దయామయుడైన అర్జునుడు కన్నీరు కార్చుచుండగా శ్రీ కృష్ణపరమాత్మ ఇట్లు అనెను.
శ్రీకృష్ణుఁడనుచుండెను.
తే.గీ. ఆర్యధర్మ విరుద్ధంబు, ననుచితమగు
ఘోరమైనట్టి యపకీర్తి కోరుకొనెడి
నరక దుష్ప్రాప్తిహేతువౌ దురిత బుద్ధి
పొడమె నీకెట్టు లర్జునా? మూర్ఖుఁడవొకొ? || 2-2 ||
భావము.
అర్జునా! ఈ సంక్లిష్ట సమయంలో ఆర్యధర్మ విరుద్ధమూ, అపకీర్తి దాయకమూ, నరకప్రాప్తి హేతువూ అయిన ఈ పాడుబుద్ధి నీ కెందులకు పుట్టినది?
తే.గీ. పొందకను ధైర్య మిటను నపుంసకునటు,
తగదు నీకిది, వీడుట తగు నధైర్య
మునిక, హృదయపు దౌర్బల్యమును త్యజించు,
యుద్ధమును జేయ నీవింక సిద్ధమగుము || 2-3 ||
భావము.
నపుంసకుడిలాగ అధైర్యం పొందకు. ఇది నీకు పనికిరాదు, మనోదౌర్బల్యము నీచమయినది. దానిని విడిచిపెట్టు. నీవు శత్రుమర్దనుడవు కదా! యుద్ధము ప్రారంభించుము.
అర్జునుఁడు ఇట్లు పలికెను.
తే.గీ. మహిత మధుసూదనా! నేను మహితులయిన
ద్రోణ భీష్మాది యోధులతోఁ దెగించి
యుద్ధమెట్టులఁ జేయుదు నుజ్జగించి
పెద్దలయెడ గౌరవమును? వద్దువద్దు. || 2-4 ||
భావము.
అర్జునుడు : మధుసూదనా! పూజార్హులైన భీష్మ ద్రోణాదులను బాణాలతో నేనేవిధముగా కొట్టగలను?
తే.గీ. మహితులైనట్టి గురువులన్ మడియఁ జేసి,
రక్తసిక్తంపురాజ్య సంప్రాప్తమవగ
పాలనము సేసి బ్రతుకుట పాడియగునె,
దీనికన్నను భిక్షాన్నమే నయమిల.
తే.గీ. మహిత గురువులన్ వధియించి మనుట శ్రేయ
మవదుగ, కన రక్త కలిత మయిన రాజ్య
భోగముల కంటె బ్రతుకఁగ ముష్టి మేలు.
పాపమును తిని బ్రతుకుట పాడి యగునె? || 2-5 ||
భావము.
మహానుభావులైన గురువులను చంపడం శ్రేయస్కరము కాదు. వారిని సంహరించి రక్తసిక్తములైన రాజ్యభోగములు అనుభవించుట కంటే బిచ్చమెత్తుకొనుట మేలు.
తే.గీ. యుద్ధమును చేయుటొప్పొనొ? యొప్పు కాదొ?
యెఱుఁగ లేకుంటి, విజయంబదెవరికగునొ
తెలియ దెవరిని జంపిన దృష్టిఁ గనుదొ
వారె యెదురుగనుండిరి నీరజాక్ష!
తే.గీ. రణ ఫలంబది గ్రహియింప రాదు నాకు,
జయమొ, యోటమియో చెప్పఁ జాలముకద
యెవరినివధించిన విరక్తి నెరయును మది
నదిగొ ధార్తరాష్ట్రులిచటనెదుట కలరు. || 2-6 ||
భావము.
యుద్ధం చేయడం మంచిదో కాదో తెలియుట లేదు. మనము జయింతుమో, వారు జయింతురోచెప్పలేము. ఎవరిని చంపితే మనకు జీవితం మీద విరక్తి కలుగునో ఆ ధార్తరాష్ట్రాదులే ఎదురుగా ఉండిరి.
కం. గురువులు బంధువులనుచును
దరగని మమకారమునను తరిగెను జ్ఞానం
బరయుచు మార్గము చూపుము

గురువుగ నీ శిష్యునకును గోవింద! కృపన్. || 2-7 ||
భావము.
గురువులూ బంధువులూ అనే మమకార దోషంవల్ల నాబుద్ధి నశించినది. మంచి ఏదో చెడు ఏదో తెలియుట లేదు. శిష్యుడిగా నిన్ను ఆశ్రయించిన నాకు ఏది శ్రేయోమార్గమో దానిని ఆదేశించుము.
తే.గీ. ఆధిపత్యంబు భువిని నాకమరవచ్చు
నట్లె స్వర్గాధిపత్యమే యమరవచ్చు
నైనగాని సచ్ఛాంతి నాకమరఁబోవ
దలముకొనియున్న దుఃఖంబు తొలఁగిపోదు. || 2-8 ||
భావము.
భూలోకాధిపత్యం లభించినా, స్వర్గాధిపత్యం సిద్ధించినా నా శోకం తగ్గుతుందనుకోను.
సంజయుఁడనుచుండెను.
తే.గీ. ఇట్లు శ్రీకృష్ణునుని తోడ నెఱుకపడగ
నర్జునుఁడు తన భావన ననుపమముగఁ
దెలిపి యుద్ధము చేయక నిలిచె నకట,
మొద్దుబారిన మదితోడ భూమిపైన. || 2-9 ||
భావము.
అర్జునుడు శ్రీకృష్ణుడితో ఆవిధముగ చెప్పి యుద్ధము చేయనని ఊరకుండెను.
తే.గీ. రెండు సేనలమధ్యలో నుండి యున్న
దుఃఖ తప్తుఁడౌ యర్జునున్ దురిత హరుఁడు
మురహరి కనుచు పరిహాసముగను బలికె
జ్ఞాన సంపూర్ణ సద్భాసమాన ముఖుఁడు. || 2-10 ||
భావము.
రెండుసేనల మధ్య విషాదవశుడైయున్న అర్జునుని చూచి శ్రీ కృష్ణపరమాత్ముఁడు పరిహాసముగా ఈ విధముగా అనెను.
శ్రీకృష్ణభగవానుడిట్లనుచుండెను.
తే.గీ. నీవు దుఃఖించు చుంటివి నేడు పార్థ!
యవసరము లేని వారికై, యనవసరము,
జ్ఞాని వలెఁ బల్కుచుంటివి చనిన, యున్న
వారికొఱకు దుఃఖింపరు ప్రతిభు లిలను || 2-11 ||
భావము.
అర్జునా! దుఃఖించనవసరం లేనివాళ్ళకోసం దుఃఖించుచున్నావు. పైగా మహావివేకి వలె మాట్లాడుతున్నావు. చచ్చిపోయినవారినిగురించికాని, బ్రతికున్నవారిని గురించి కాని వివేకులు శోకించరు.
కం. భావింప వీరు నేనును
నీవుఁ గనఁగ నుందుముకద నేడును రేపున్
నీవేలఁ దెలియకుంటివి?
నీవిది గ్రహియింప వలయు నేర్పరివగుచున్. || 2-12 ||
భావము.
నీవూ నేనూ వీళ్ళంతా గతంలోనూ వున్నాము. భవిష్యత్తులో కూడా ఉంటాము.
కం. జీవుని కిల కౌమారము
యౌవనవార్ధక్యములవి యరయుచు దేహం
బే వదలి మరల పుట్టును,
జీవము దుఃఖింపదు కద క్షితి నెన్నినచో. || 2-13 ||
భావము.
జీవుడికి ఈ శరీరంలో కౌమారం, యౌవనం, వార్ధక్యం వచ్చినట్లే మరణానంతరం మరో శరీరం వస్తుంది. ఇందుకు ధీరుడు దుఃఖించడు.
తే.గీ. విషయవశమైన యింద్రియా లసదృశమగు
సుఖము దుఃఖములను తేలుచున్ జరింప
వే, యశాశ్వత మింద్రియ విషయముల క
లయిక, బాధలనుసహించు ప్రియ నరుండ! || 2-14 ||
భావము.
కుంతీ పుత్రా! విషయాలకు వశమైన ఇంద్రియాలవల్ల శీతోష్ణాది గుణాలూ,సుఖదుఃఖాలూ కలుగుతుంటాయి. కోరికలకూ, ఇంద్రియాలకూ కలయిక అశాశ్వతం. కనుక
కం. పురుష శ్రేష్ఠుఁడ! యెవడిల
నిరుపమ సుఖ దుఃఖములు గణించు సమముగా
వెరపున ద్వంద్వములంటవు,
వరధీరుఁ డతం డమృతము వడయగ నొప్పున్. || 2-15 ||
భావము.

పురుషశ్రేష్ఠుడా! సుఖదుఃఖాలలో సమముగా ఉండే ఏ ధీరుణ్ణి ద్వంద్వాలు బాధించవో అతఁడు అమృతత్వానికి అర్హుఁడు అగును.
తే.గీ.లేనిదుండ దాయున్నది లేకపోదు
భువిని తత్వజ్ఞులెఱుఁగుదురవి జగాన,
నీవు తత్వజ్ఞుఁడవు పార్థ! భావనమునఁ
దెలిసికొమ్మిది, నిజమును దెలియవలయు. || 2-16 ||
భావము.
లేనిది ఎప్పటికీ వుండదు. ఉన్నది ఎప్పటికీ లేకపోదు. ఈ రెండింటి నిర్ణయం తత్వజ్ఞులకే తెలియును.
తే.గీ. ఆత్మ విశ్వంబునంతటన్ వ్యాప్తమయిన
వస్తు వని గ్రహియింపుము పార్థ! నీవు,
నాశనము లేని దయ్యది నరుఁడ! తెలియ,
చేయనేర రంతమవ దానిఁ, జెడని దదియె.
|| 2-17 ||
భావము.
ఈ విశ్వమంతటా వ్యాపించియున్న ఆత్మ అనే వస్తువు నాశనము లేనిది. దానినెవరూ అంతము చేయలేరు.
తే.గీ. నాశనము లేని యాత్మకు నీ శరీర
మెన్నగా శాశ్వతము కాదు, కన్నుఁ దెరిచి
యాత్మయే నిత్యమని నమ్ముమయ్య పార్థ!
యుద్ధమును జేయ నీవింక సిద్ధమగుము. || 2-18 ||
భావము.
నాశనం లేని ఆత్మకు ఈ శరీరాలు శాశ్వతాలు కావు. ఆత్మ ఒక్కటే నిత్యం. కనుక ఓ భారత వీరా! యుద్ధం మొదలు పెట్టు.
తే.గీ. చంపునాత్మయనుచు, నాత్మ చంపఁబడున
నుచును మూర్ఖులనుచునుం ద్రనుపమముగను,
చంపఁబోదాత్మయు తాను చంపఁబడదు
తెలియవలయునిదియె నీవు తెలివిఁ గలిగి. || 2-19 ||
భావము.
ఈ ఆత్మ చంపుతుందని కాని, చంపబడుతుందని కాని భావించే
వాళ్ళిద్దరూ అజ్ఞానులే. ఆత్మ చంపునది కాని చచ్చునది కాని కాదు.
తే.గీ. జనన మరణముల్లేనిది, సతము కలది,
జన్మరాహిత్య శాశ్వత సంస్థితమది
యాత్మ, నశియింపబోవదనంతమదియు
దేహమంతమైపోయినన్ దేహి నిలుచు.
|| 2-20 ||
భావము.
ఆత్మకు పుట్టుట చాచ్చుట అనునవి లేవు. అది ఒకప్పుడు ఉండి, మరొకప్పుడు లేకపోవడం జరగదు. జన్మరహితమూ, శాశ్వతమూ, అనాది సిద్ధమూ అయిన ఆత్మ నిత్యము. అందువలన శరీరమును నాశనము చేసినను అందులోని ఆత్మ మాత్రము చావదు.
తే.గీ. చావుపుట్టుకల్ లేనిదై శాశ్వతమయి
యుండునాత్మ యంచెఱిగిన నోపునెవఁడు
చంపగను దాని దానిచేఁ జంపఁజేయ?
పార్థుఁడా! నీ వెఱుఁగవొకొ? పద్ధతినిట. || 2 . 21||
భావము.
పార్థా ! ఆత్మ నాశనరహితమనీ, చావు పుట్టుకలు లేనిదనీ, శాశ్వతమైనదనీ తెలుసుకున్నవాఁడు ఎవరినైనా ఎలా చంపుతాడు?ఎలా చంపిస్తాడు?
తే.గీ. ప్రాత చిరిగిన వస్త్రమున్ వదిలిపెట్టి
నూతనంబైన వస్త్రమున్ దొడుగునటుల,
శిథిలదేహంబు వీడుచు జీవుఁ డటులె
క్రొత్త దేహంబులో చేరి కుదురుకొనును. || 2 . 22||
భావము.
మానవుడు చినిగిపోయిన పాతబట్టలను విడిచిపెట్టి క్రొత్తబట్టలు వేసుకున్నట్లే ఆత్మ కృశించిన శరీరములను వదలి కొత్త దేహములు పొందును.
తే.గీ. అగ్ని కాల్చగ లే దాత్మ నరసి చూడ,
శస్త్రములు చీల్చలేవు, ప్రశస్తమయిన
నీరు తడుపంగలే, దిక ఘోరమైన
గాలి యారగాఁ జేయలేదే లయింప || 2 - 23 ||
భావము.
ఈ ఆత్మను ఆయుధములు నరకలేవు; అగ్ని కాల్చలేదు; నీరు తడుపలేదు; గాలి ఎండబెట్టలేదు.

తే.గీ. ఆత్మ ఖండింపఁబడని దీవరసి చూడ,
కాలదగ్నికి, తడవదు కనగ నీటి
కి నిల నెండదు, నిత్యము, వినగ శాశ్వ
తంబ దచలమునయి, సనాతనమెఱుంగ,. || 2-24 ||
భావము.
ఆత్మ ఖండించరానిది, కాలనిది, తడవనిది, ఎండనిది; అది నిత్యము, సర్వవ్యాప్తం, శాశ్వతము, చలనరహితము, సనాతనము అయినది.
తే.గీ. ఇంద్రియముల కగోచర మెన్న నాత్మ,
మనసు కందద దవికారి, మదిని యాత్మ
తత్వ మెఱుఁగుము నీవిక తలచి గలుగు
చింత వీడుము, బాధ్య తావంత కనుము. || 2-25 ||
భావము.
ఆత్మ జ్ఞానేంద్రియాలకు గోచరించదు. మనస్సుకు అందదు. వికారాలకు గురికాదు. ఈ ఆత్మతత్వము తెలుసుకొని నీవు విచారించుట మానుకొనుము.
తే.గీ. పార్థ! దేహంబుతోఁ బాటు వరలుచున్న
యాత్మకున్ జావు పుట్టుక లలరు ననుచు
నీవు భావించుచున్నను, ధీవరేణ్య!
మదిని శోకింపఁ బనిలేదు మృదుల హృదయ!. || 2-26 ||
భావము.
అర్జునా ! శరీరముతోపాటు ఆత్మకు కూడా సదా చావు పుట్టుకలుంటాయని భావిస్తున్నప్పటికీ నీవిలా శోకించవలసిన పనిలేదు.
కం. పుట్టిన మరణము తప్పదు
పుట్టుట తప్పదు మరణము పొందినచో, నే
జట్టియు మార్చగ లేడిది,
యిట్టుల దుఃఖింపఁ దగ దిదేల నెఱుఁగవో? || 2 . 27 ||
భావము.
పుట్టిన వానికి చావు తప్పదు. చచ్చిన వానికి పుట్టుక తప్పదు. తప్పించరాని ఈ విషయంలో తపించనవసరం లేదు.
కం. పుట్టక పూర్వము తెలియదు
గిట్టిన పిదపను తెలియదు కించిత్తయినన్.
బుట్టిన జీవిని గూర్చి మ
రిట్టుల యీ మధ్యము కని యేలను చింతల్? || 2 . 28 ||
భావము.
జీవులు పుట్టుకకు పూర్వం కాని, మరణానంతరం కాని ఏ రూపంలో వుంటాయో తెలియదు. మధ్యకాలంలో మాత్రమే కనబడుతాయి. అర్జునా ! అందువలన విచారమెందుకు?
తే.గీ. అచ్చెరువుగాను కను నొకండాత్మనెంచి,
చిత్రముగ బల్కు నొక్కండు చింతఁ జేసి,
వింతగా నొక్కఁ డాత్మను వినుచు నుండు,
నొక్కడున్ దెలియఁగ నేర డక్కజమిది. || 2-29 ||
భావము.
ఒకడు ఈ ఆత్మను ఆశ్చర్యంగా చూచుచుండును. ఇంకొకడు దీనిని గురించి విచిత్రముగా మాటలాడుచుండును. మరొకడు వింతగా వినుచుండును. అయితే ఈ ఆత్మ స్వరూపస్వభావాలు తెలుసుకున్న వాడు ఒక్కడూ లేడు.
తే.గీ. అన్ని దేహంబు లందుండు నాత్మ కరయ
మరణ ముండదు, దీనికై మదిని దలచి
వగచుటెందుల కో పార్థ! ప్రాణులకయి,
వీడుమజ్ఞానమును నీవు, వీడు చింత. || 2-30 ||
భావము.
అన్ని దేహాలలోనూ వుండే ఆత్మకు చావు అనెడిది లేదు. అందువలన ఈ ప్రాణులను గూర్చి నీవు దుఃఖించనక్కరలేదు.
తే.గీ. నీదు ధర్మంబుఁ గనియైన నీవు జంకు
వీడఁగాఁ దగు, యుద్ధంబు వీరవృత్తి
క్షత్రియోత్తమ! యిది నీవు కానలేవొ?
ధర్మబద్ధంపు వర్తన తగును నీకు. || 2-31 ||
భావము.
నీ ధర్మాన్ని తెలుసుకుని అయినా నీవు జంకకు. ఎందుకనగా క్షత్రియునికి ధర్మయుద్ధమును మించిన మహాభాగ్యం మరొకటి లేదు.
తే.గీ. తెరచి యున్న స్వర్గ ద్వార మరయ యుద్ధ
రంగము, లభియించెను నీకు బెంగదేల?
పుణ్యఫలమిది కనగ నపుణ్యులకిల

దొరకబోదని గ్రహియించు మరసి నీవు. || 2-32 ||
భావము.
తెరచివుంచిన స్వర్గద్వారం లాంటి ఈ సంగ్రామం నీకు అప్రయత్నంగా లభించింది. ఇట్టి సదవకాశం పుణ్యం చేసుకున్న క్షత్రియులే పొందఁగలుగుదురు.
తే.గీ. చేయుమీ ధర్మ యుద్ధము చేయకున్న
కులపు ధర్మము వీడినన్ గూళవగుదు
పేరు ప్రఖ్యాతులన్ బాపు భీరువగుదు,
పాపివగుదు వర్జున! నీవు పరువు పోవు. || 2-33 ||
భావము.
నీవు ఈ ధర్మయుద్ధము చేయకపోయినచో నీ కులధర్మమూ, పేరు ప్రఖ్యాతులూ పాడుచేసి పాపం కట్టుకొందువు.
తే.గీ. అంత మాత్రమే కాదయ, వింతగాను,
నీకుఁ గలిగిన యపకీర్తి లోకమందుఁ
జెప్పుకొందురు లోకులు, చింత చేయ
మరణమే కద యపకీర్తి మాన్యులకును. || 2-34 ||
భావము.
అంతే కాకుండా నీ అపకీర్తిని ప్రజలు చిరకాలం చెప్పుకుంటారు. పరువు ప్రతిష్ఠలున్నవానికి అపనిందకంటే మరణమే మంచిది.
కం. వీరాగ్రేసరునిగ నిను
గౌరవముగఁ జూచువారు గాంచుదు రికపై
భీరువనుచు చులకనగా,
పోరాములవేల ధీరపుంగవ నీకున్? || 2-35 ||
భావము.
ఇన్నాళ్ళూ నిన్ను మహావీరుడిగా గౌరవిస్తున్న వాళ్ళంతా, భయపడి యుద్ధం మానేశావని భావించి చులకనగా చూస్తారు.
తే.గీ. నీ పరాక్రమమును గూర్చి నీదు రిపులు
చెడుగ పల్కుచు నిందింత్రు, చేవలేని
వాని వలె నుండ సాధ్యమా? దీనముగను
దుఃఖితులమయి పార్థుఁడా! తోచలేదొ? || 2-36 ||
భావము.
నీ శత్రువులు నీ పరాక్రమాన్ని నిందించుచు అనరాని మాటలెన్నో అందురు. అంతకుమించిన దుఃఖమేమున్నది?
తే.గీ. యుద్ధరంగంబులో మృతి యొసగు ముక్తి
జయము పొందిన రాజ్యంపు సౌఖ్యమబ్బు,
నర్జునా యిది నీ మది నరయవేల?
యుద్ధసన్నద్ధుఁడుగ నగు మొప్పుగాను || 2-37 ||
భావము.
అర్జునా ! ధర్మయుద్ధములో మరణించిన స్వర్గము పొందుదువు. శత్రువులను జయించిన రాజ్యభోగములు అనుభవింతువు. అందువల్ల కృతనిశ్చయంతో యుద్ధమునకు నడుంబిగించుము.
తే.గీ. సుఖము దుఃఖము నొకటిగ చూడు పార్థ!
లాభనష్టంబులఁ గన వలయు నటులనె,
యపజయంబైన జయమైన నటులె గనుము,
యుద్ధమునకు సన్నద్ధమై యొప్పుమయ్య. || 2-38 ||
భావము.
సుఖదుఃఖములూ, లాభనష్టములూ, జయాపజయములూ సమానముగా భావించి సమరము సాగించుము. అప్పుడు నీకు పాపము కలగదు.
తే.గీ. ఆత్మతత్వమ్ము సాంఖ్య మతానుసార
మీకు వివరించి చెప్పితి ప్రాకటముగ.
కర్మయోగంబుఁ దెలిపెద కలిగియున్న
బంధనము లాత్మ వీడగా, పార్థ! వినుము. || 2-39 ||
భావము.
పార్థా ! ఇంతవరకూ నీకు సాంఖ్యమతానుసారము ఆత్మతత్వమును గూర్చి చెప్పితిని. ఇక సంసారబంధము వదులుకొనిటకు సాధనమైన నిష్కామ కర్మయోగమును గూర్చి చెప్పెదను వినుము.
తే.గీ. కర్మయోగమారంభించి కడవరకును
చేయకున్నను, యేకొద్ది చేసిన నది
వ్యర్థమయిపోదు,చక్కగా సార్థకమగు,
కలుగు సంసారభయమును దొలఁగఁ జేయు. || 2-40 ||
భావము.
ఈ కర్మయోగము ప్రారంభించి, పూర్తి చేయలేకపోయినా వ్యర్థముగా పోదు; దోషము లేదు. ఏ కొద్దిగా ఆచరించినా ఈ యోగం దారుణమైన సంసారభయము నుండి కాపాడును.

తే.గీ. నిశ్చయాత్మక బుద్ధి సన్నిశ్చితముగ
నుండునెల్లప్పుడున్, వేరె యుండఁబోవ
దస్థిరమగు సంకల్పుల నరసి చూడ
వార లస్థిరాలోచనల్ పరుగు పెట్టు. || 2-41 ||
భావము.
కురునందనా ! నిశ్చయాత్మకమైన బుద్ధి ఒకే విధంగా వుండును. స్థిరసంకల్పము లేనివారి ఆలోచనలు పరిపరివిధములుగా పరుగులుపెట్టును.
తే.గీ. వైదికులమంచు నల్పజ్ఞులీ దివిసుఖ
లేశమును గని యన్యము లేదనుచును
పుష్పితంబగు వాక్కులు భువిని పలుకుఁ,
దత్ పరంబును గానరు, తలపఁ బార్థ!. || 2-42 ||
భావము. :
ఓ పృథాకుమారా! వేదములను అనుసరించుచుంటిమని చెప్పువారు వేరొక్కటి లేదనివాదింతురు అల్పజ్ఞానముగల మానవులు ఈపుష్పితమగువాక్కును చెప్పుదురు.
ఆ.వె. గొప్ప జన్మ నెంచి, కూర్మితో స్వర్లోక
మొంద నెంచి, పదవులంద నెంచి,
చేయఁ దగిన క్రియలు చెప్పెను వేదమే.
అట్టి మాట లల్పు డనుసరించు.
ఆ.వె. వేదవాక్కులనుచు వేరేమి లేదంచు
భోగ వాంఛితుండు పొందఁ జేయు.
పుణ్యఫలము తరుగ పుడమిపై జనియించు,
ముక్తిపొంద తా నయుక్తుఁడెంచ. || 2-43 ||
భావము. :
స్వర్గలోకప్రాప్తి, ఉత్తమజన్మము, అధికారము వంటివానిని పొందుటకై వివిధములైన కర్మలను ఉపదేశించు వేదములందలి మధురమైనవాక్కుల యెడ అల్పజ్ఞులు అనురక్తులగుదురు. భోగానుభవమును మరియు సంపన్న జీవితమును కోరువారగుటచే అట్టివారు దానికి మించినది వేరొకటి లేదని పలుకుదురు.
తే.గీ. భోగములయెడను, విలాస ములయెడలను
నిరుపమాసక్తులకు బుద్ధి నిలువనేర
దరయ నిశ్చయమొనరదయ, నిజ మిదియె,
అర్జునా,! నాదు మాటల నాదరించు. || 2-44 ||
భావము.
భోగములు, విలాసముల పట్ల, మిక్కిలి మమకారాసక్తి ఉన్నవారికి దాని వలన దిగ్భ్రమచెందిన బుద్ధితో నిశ్చయమైన బుద్ధి సాఫల్యం కాదు. అది స్థిరముగ నిలువదు.
తే.గీ. వేదములుగుణత్రయముల ప్రీతిఁ గొలుపు
కర్మకాండను వివరించుఁ, గాన పార్థ!
తలఁపఁ బోవకు వాటికై ద్వంద్వరహిత
శుద్ధ సత్వగుణుండవైశోభిలుమిల. || 2-45 ||
భావము.
అర్జునా ! వేదములు సత్వ రజ స్తమములను మూడుగుణములు కలిగిన కర్మకాండలను వివరించును. నీవు త్రిగుణములనూ విడిచిపెట్టి, ద్వంద్వములు లేనివాడవై యోగక్షేమములు కోరకుండా శుద్ధ సత్వగుణము అవలంబించి ఆత్మజ్ఞానివి కావాలి.
తే.గీ. ఎవరు వర నదీజలములకేగనెంత్రు
వారు బావి నీటి కొఱకు పోరు తెలియ,
బ్రహ్మసుజ్ఞానమరసెడివారు ప్రతి ఫ
లముల నిచ్చు వేదములకిల నరుగరుగ. || 2-46 ||
భావము.
నదినుంచి నీరుతెచ్చుకొనెడివారు నూతికి యే విధముగా ప్రాముఖ్యమివ్వరో ఆ విధముగనే బ్రహ్మజ్ఞానులు ప్రతిఫలాపేక్షతో కూడిన వేదకర్మలకు ప్రాధాన్యత ఇవ్వరు.
తే.గీ. కర్మ చేయుటకర్హత కలదు నీకు,
కర్మఫలముపై నర్హత కలుగ దీకు,
కర్మఫలముల హేతువు కావు నీవు,
కర్మచేయుటమానకు ధర్మమిదియె. || 2-47 ||
భావము.
వేదాదులచే విదింపబడిన కర్మను చేయుటకే నీకు అర్హత కలదు. కాని కర్మఫలముల యందు ఎట్టి అధికారమును లేదు. నీవే కర్మఫలములకు హేతువని ఎప్పుడునూ భావింపకుము. ధర్మమును నిర్వహింపకుండనుండుట యందు ఎప్పుడునూ ఆసక్తుడవు కాకుము
తే.గీ. సఖుఁడ! విజయాపజయములన్ సమముగఁ గను,

మహిత సమభావమున ధర్మ మార్గముననె
నిర్వహింపు నీ ధర్మము,నిర్మలమతి
నిదియె యోగము, కనుమిది ముదముతోడ || 2-48 ||
భావము.
ఓ అర్జునా! జయాపజయములందు ఆసక్తి విడిచి నీవు సమ భావముతో స్వధర్మమును నిర్వహింపుము. అట్టి సమభావమే యోగమనబడును.
తే.గీ. భక్తినొనరించి సత్కర్మ, వదలు మహిత
హీన కర్మలన్, గోరుచున్ హృద్యముగను
శరణు వేడుము, హీనులాశలను మునిగి
ఫలము లాశింత్రు, నీవటుల్ వలదు పార్థ! || 2-49 ||
భావము.
ధనంజయా! భక్తియుక్తమైన సేవచే హీనములైన కర్మములన్నింటినీ దూరముగా వదులుము. తృష్ణచైతన్యముతో భగవంతుని శరణు పొందుము. కర్మఫలములను అనుభవింపగోరువారు లోభులు.
కం. సమ భావన కల మహితులు
ప్రముదంబున విడుతురిటనె పాపము పుణ్యం
బమలిన! నీవు నటులనే,
గమనింపుచుఁ జేయు, మిదియె కన యోగమగున్. || 2-50 ||
భావము.
సమభావన కలిగిన పురుషుడు పుణ్యాపాపములు రెండింటినీ ఈ లోకముననే వదిలివేయుచున్నాడు. కనుక సమత్వబుద్ధి అయిన నిష్కామకర్మనే నీవు ఆచరించుము. కౌశలముతో కర్మలు చేయడమే యోగమని తెలుసుకొనుము.
తే.గీ. భువి మనీషులు కర్మ జ పుణ్యపాప
ఫలములాశ చేయక కర్మ బంధనములు
విడిచి సన్ముక్తి నొంద భావింతు రటులె
చేయగాఁ దగుఁ బార్థుఁడా! సిద్ధమగుము. || 2-51 ||
భావము.
నిష్కామయోగులు కర్మఫలం ఆశించకుండా జన్మబంధాలనుంచి తప్పించుకుని, ఉపద్రవములేని మోక్షము పొందుచుండిరి
తే.గీ. మోహ కలిలమున్ నీ బుద్ధి పూర్తిగాను
దాటిపోవునో యప్పుడు తప్ప కీవు
వినఁబడిన వినదగినట్టి విషయములయె
డను విరక్తిని పొందుదువు నుతముగను || 2-52 ||
భావము.
నీ బుద్ధి అజ్ఞానమనే కల్మషాన్ని అధిగమించినప్పుడు నీకు విన్న విషయములూ, వినబోయే అర్థములూ విరక్తి కలిగించును.
తే.గీ. అర్థవాదముల్ పెక్కుగా నాలకించి
సంచలించిన నీ మది సన్నుతముగ
నిశ్చలస్థితిపొందిన నిశ్చయముగ
నాత్మసుజ్ఞానమునుపొంది యలరఁగలవు. || 2-53 ||
భావము.
అర్థవాదములు అనేకము వినుట వలన చలించిన నీ మనస్సు నిశ్చలముగా ఉన్నప్పుడు నీవు ఆత్మజ్ఞానము పొందుదువు.
అర్జునుఁడు పలుకుచుండెను.
తే.గీ. హరి! సమాధిస్థితినియుండి యలరువాని
లక్షణములెట్టులుండును? శ్లాఘనీయ!
అతని మాటలు చేష్టలు నలరునెటుల?
ననుచు పార్థుండు పలికెను, వినగ నెంచి? || 2-54 ||
భావము.
కేశవా ! సమాధినిష్ఠ పొందిన స్థితప్రజ్ఞుడి లక్షణములేమిటి? అతని ప్రసంగమూ, ప్రవర్తనా ఏ విధముగా ఉండును?
శ్రీకృష్ణ భగవానుఁడనుచున్నాడు.
తే.గీ. మనసు లోపలి కోరికల్ మనుజుఁడెవఁడు
విడిచిపెట్టుచు భువిపైన వెలుగుచుండు
కన స్థితప్రజ్ఞుఁడతఁడెయౌ కనుము మదిని,
కని స్థితప్రజ్ఞుడై వెల్గు ఘనతరముగ. || 2-55 ||
భావము.
మనసులోని కోరికలన్నిటినీ విడిచిపెట్టి, ఎప్పుడూ ఆత్మానందమే అనుభవించేవాడు స్థితప్రజ్ఞుడు.
తే.గీ. కష్ట సమయంబులందునఁ గలత పడక,
సుఖములందున పొంగక శోభనొప్పు
సతము విగతరాగద్వేషుఁ డతులిత మతి
స్థిర శుభమతిని మునియందు రరయుమయ్య. || 2-56 ||

భావము.
దుఃఖాలకు క్రుంగనివాడూ, సుఖాలకు పొంగనివాడూ, భయమూ, రాగద్వేషములూ వదిలిపెట్టినవాడూ అయిన మునీంద్రుడు స్థితప్రజ్ఞుడగును.
ఆ.వె. మోహ దూరుఁ డగుచు స్నేహమున్ వ్యామోహ
మును విడుచునెవండు మనుచునుండి,
చను శుభాశుభముల సంతసంబును ద్వేష
ముందడతనిప్రజ్ఞ యలరు భువిని. || 2-57 ||
భావము.
స్నేహవ్యామోహాలు లేకుండా వ్యవహరిస్తూ శుభాశుభాలు కలిగినప్పుడు సంతోషము, ద్వేషము పొందకుండా ఉండేవాడు స్థితప్రజ్ఞుడు.
తే.గీ. కూర్మ మవయవములు ముడ్చుకొనునటులుగ
విషయ సంసక్త మతిని తా వేరు చేసి,
మెలగువారిల గుర్తింపు మేలుగాను
పొంది మహిత సుఖము లొందు పార్థ!
|| 2-58 ||
భావము.
తాబేలు తన అవయవాలను లోపలికి ఎలా ముడుచుకొనునో అలాగే ఇంద్రియాలను సర్వవిధములా విషయసుఖాల నుంచి మళ్ళించిన వాడు స్థితప్రజ్ఞుఁడగును.
తే.గీ. పృథ్వి పయిని నిరాహారు విషయవాంఛ
లణగిపోవచ్చు నపుడైన నణగిపోవు
విషయ వాసనలతనికి, విదితమగుచు
నాత్మదర్శనమగునేని యణగునదియు. || 2-59 ||
భావము.
ఆహారం తీసుకోనివాడికి ఇంద్రియవిషయములు అణగిపోవును. అయితే విషయ వాసన మాత్రం వదలదు. ఆత్మదర్శనంతో అది కూడా అడుగంటిపోవును.
తే.గీ. ఆత్మనిగ్రహాసక్తితో యమిత గతిని
యత్న మొనరించు మహితుని యాత్మనైన
లొంగదీయు నింద్రియతతి లోలనమున
భ్రష్టుఁడైచెడవచ్చు పార్థ! వినుమ., || 2-60 ||
భావము.
కుంతీనందనా ! ఆత్మనిగ్రహము కోసము అమితముగా ప్రయత్నించే విద్వాంసుడి మనసును కూడా ఇంద్రియాలు బలవంతముగా లాగుతాయి.
తే.గీ. యోగ సాధకుఁడు జితేంద్రియుఁడగుచు, నను
మనసులో నిండుగా నింపి మసలవలయు,
నప్పు డాతనిప్రజ్ఞ మహాద్భుతముగ
సుస్థిరంబగు,నో పార్థ! శుభకరమగు. || 2-61 ||
భావము.
యోగసాధకుఁడు ఇంద్రియములన్నింటినీ వశపరచుకొని నామీదే మనస్సు వుంచవలెను. అట్టివాడి ప్రజ్ఞ సుస్థిరమగును.
తే.గీ. ఇంద్రియార్థంబులాశింప నెన్నఁజాల
నట్టి యాసక్తి పుట్టి మోహంబుకలిగి
కోరికలుపుట్టు నందుచేఁ గోపమొదవు
నర్జునా! గ్రహియింపుమా, యనుపమముగ. || 2-62 ||
భావము. ఎప్పుడూ శబ్దాది విషయాల గురించే ఆలోచించు వానికి
వాటిమీద ఆసక్తి ఎక్కువగా పెరుగును. ఆసక్తివల్ల కోరికలు పుట్టును.
కోరికలు కోపమును కలగజేయును.
తే.గీ. కోపమునఁగల్గు సమ్మోహమోపనంత,
మసలు దానిచే స్మృతివిభ్రమంబు కలుగు,
బుద్ధియు నశించు దానిచేపూర్తిగాను,
బుద్ధి నశియింప పతనమ్మె పొందు తుదకు. || 2-63 ||
భావము.
కోపం మూలంగా అవివేకము కలుగును. అవివేకమువలన మరపు, మరపువలన బుద్ధి నశించుట, బుద్ధి నాశనము వలన తానే నశించుట జరుగును.
తే.గీ. నిగ్రహ మతితో నింద్రియ నిగ్రహమున
నదుపుకల్గివర్తించువా డెదను సౌఖ్య
శాంతు లందుచు సుఖియించు సన్నుతముగ,
ఇంద్రియాతీతవశ్యాత్ముఁడెన్న ఘనుఁడు. || 2-64 ||
భావము.

మనసును నిగ్రహించుకొని రాగద్వేషములు లేకుండా తన అదుపాజ్ఞలలో వున్న
ఇంద్రియముల వలన విషయసుఖములు అనుభవించెడివాడు మనశ్శాంతి పొందును.
తే.గీ. అతని దుఃఖము లన్నియు నావిరియగు
దైవ కృపఁ గల్గియున్నచో ధరణిపైన,
భువి ప్రశాంత చిత్తునియొక్క బుద్ధి యుండు
స్థిరముగాను ప్రశాంతిగా త్వరగ నిజము. || 2-65 ||
భావము.
మనస్సు నిర్మలముగ నుండిన సమస్త దుఃఖములూ సమసిపోవును. మనసు నిర్మలముగా వున్నవాని ప్రజ్ఞకు చలనం లేదు.
తే.గీ. మనసు నిగ్రహంబది లేని మానవునకు
ఆత్మ చింతన, జ్ఞానము నలవడవిల,
వాని కుండదు శాంతి యవ్వాని కెఱుఁగ
సుఖము లభియింప నేరదు, శూన్యసుఖుఁడె. || 2-66 ||
భావము.
మనోనిగ్రహం లేనివానికి ఆత్మవివేకం కాని ఆత్మచింతన కాని అలవడవు. అట్టివానికి మనశ్శాంతి ఉండదు. మనశ్శాంతి లేనివాడికి సుఖము శూన్యము.
తే.గీ. నావ చుక్కాని లేనిచో నాశనమగు
ను సుడి గాలిచే, యటులె మనుజులును తమ
యింద్రియాసక్తులకులొంగెనేని యదియె
ప్రజ్ఞనే నాశనము చేయు పార్థ! వినుము. || 2-67 ||
భావము.
సుడిగాలి చుక్కాని లేని నావను దిక్కుతోచకుండా చేసినట్లు, ఇష్టానుసారము ప్రవర్తించే ఇంద్రియాలకు లొంగిపోయిన మనస్సు పురుషుని బుద్ధిని పాడు చేయును.
తే.గీ. కావునర్జునా! విషయ సుఖముల దెసకు
వెళ్ళఁ బోవకే, యింద్రియ విజయుఁడయిన
బుద్ధి వికసించు దానిచే పూర్ణమయిన
ప్రజ్ఞతో వెల్గగల్గును పార్థ! కనుము. || 2-68 ||
భావము.
అర్జునా ! అందువల్ల విషయసుఖముల వైపునకు వెళ్ళకుండా ఇంద్రియాలను నిగ్రహించుకున్నవాడికి స్థిరమైన బుద్ధి కలుగును; అతఁడే స్థితప్రజ్ఞుడు.
తే.గీ. ఆత్మతోననుభూతిలేనట్టిప్రాణి
కోటికదిరాత్రి, యోగులకు పగలదియె,
విషయలంపటులకుపవల్ విజ్ఞులయిన
యోగుల కదియె రాత్రి సద్యోగ వేళ. || 2-69 ||
భావము.
ఆత్మానుభూతిలేని అన్ని ప్రాణులకూ రాత్రిగాతోచే సమయములో మనోనిగ్రహము కలిగిన ముని మేలుకొని యుండును. విషయాలపట్ల ఆసక్తితో సర్వప్రాణులూ మెలకువగా వున్నపుడు ఆత్మనిష్ఠకలిగిన యోగికి రాత్రి అగును.
తే.గీ. నిండుచుండియు జలధి తా నిరత మటుల
చలనమొందక యుండుటన్ సకలజలము
లందు చేరు నటులె కామ మణగి యున్న
మదిని శాంతియు చేరును మహిత! పార్థ! || 2-70 ||
భావము.
నిరంతరం నిండుతున్నప్పటికీ చలించకుండా నిలిచిన సముద్రంలో నదీజలాలు ఎలా ప్రవేశిస్తాయో అలాగే ఎవనిలో కామాలన్నీ లీనమై అణగిపోవునో అతఁడు శాంతి పొందును. భౌతిక సుఖాలకు బానిస అయినవాడికి మోక్షము లేదు.
తే.గీ. కోరికలు వీడి యహమును చేరనీక
మమతలను వీడి యాశనన్ మదిని వీడి
మెలఁగు నెవ్వఁడు వాఁడె యీ మేదినిపయి
శాంతి సౌఖ్యంబులందును, సన్నుతముగ.
|| 2-71 ||
భావము.
కోరికలన్నిటినీ విడిచిపెట్టి ఆశ, అహంకారము, మమకారము లేకుండా మెలగేవాడు పరమశాంతి పొందును.
తే.గీ. ఇట్టు లెవరు బ్రహ్మజ్ఞాన మిద్ధి పడయు
నతనిఁ జేర వైహికవాంఛ లంతిమమున
నైన యిట్టి సుజ్ఞానంబు నందినయెడ
మోక్షమది ప్రాప్తమగునయ్య! బుద్ధినిడుమ. || 2-72 ||
భావము.
అర్జునా ! ఇలా బ్రహ్మజ్ఞానము పొందినవాడి దృష్టి ప్రపంచవిషయాల మీదకు మళ్ళీ యింకెప్పుడూ మళ్ళదు. జీవితం చివరిఘట్టంలో అయినా అలాంటి జ్ఞానం కలిగితే మోక్షం లభించును.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని "సాంఖ్యయోగం" అనెడి రెండవ అధ్యాయము సమాప్తము

3వ అధ్యాయము.
కర్మయోగము.

అర్జునుడు ఈ విధముగ పలికెను.
తే.గీ. నీ మతంబున కర్మయే నిత్యమధిక
మయిన జ్ఞానమయినచో మహాత్మ! కృష్ణ!
ఘోర కర్మలందేల నన్ గోరి నిలుపు
చుంటివో తెల్పు మనుపమ! సుప్రకాశ! || 3-1 ||
భావము.
జనార్ధనా! నీ అభిప్రాయములో కర్మ కంటే జ్ఞానమే ఎక్కువైతే కేశవా! ఘోరకర్మలో నన్ను ఎందులకు నియోగించితివి?
తే.గీ. భ్రాంతిఁ గల్గించుచుంటివి పలికి నీ వ
యోమయంబైన మాటల నో మహాత్మ!
శ్రేయమెయ్యది నాకదే చెప్పుమయ్య!
నిశ్చితంబుగ, తెలియగ, నేర్పుమీర.|| 3-2 ||
భావము.
అయోమయమైన మాటలతో నా బుద్ధికి భ్రాంతిని కలిగించుచుంటివి. ఏది నాకు శ్రేయమో దానిని నిశ్చయముగా చెప్పుము.
శ్రీభగవానువాచ.
తే.గీ. జ్ఞాన యోగంబు చేత నా సాంఖ్యులకును,
కర్మయోగంబు చేత నా కర్మయోగు
లకును, సృష్టికిన్ ముందుగా సకల మెఱుఁగ
చెప్పఁ బడెనయ్య నా చేత గొప్పగాను.. || 3-3 ||
భావము.
భగవంతుడు యీ విధముగా పలుకుచుండెను.
పాప రహితుడా!! ఈ లోకంలో సాంఖ్యులకు జ్ఞానయోగం చేతను యోగులకు కర్మయోగం చేతను సాధన, సృష్టికి ముందే నాచేత చెప్పబడినది.
తే.గీ. కర్మలను జేయనంత నిష్కర్మ సిద్ధి
కలుగఁ బోవదు తెలియుమా కవ్వడి! మరి
సన్యసించిన మాత్రాన సాధ్య మవదు
సిద్ధిఁ బొందుట, కనఁగ ప్రసిద్ధమిదియె. || 3-4 ||
భావము.
కర్మలను చేయనంత మాత్రాన నిష్కర్మ సిద్ధి కలుగదు. కేవలం సన్యసించుట వలన సరైన సిద్ధి కలగదు.
తే.గీ. కర్మఁ జేయక యుండుట క్షణము కూడ
సాధ్యపడఁ బోదు జనులకు, సహజమిదియె,
ప్రకృతి జన్య గుణంబుల ప్రాభవమున
జేయఁబడుచుండు కర్మముల్ సిద్ధమిదియు. || 3-5 ||
భావము.
ఎవరూ ఒక్క క్షణం కూడా కర్మ చేయకుండా ఉండలేరు. ప్రకృతి జన్యమైన గుణాల వలన అన్నికర్మలు అవశ్యంగానే చేయబడుతున్నాయి.
తే.గీ. బయటి కింద్రియ నిగ్రహ వర్తనుఁడయి
యాత్మలో సంస్మరించెడి యధముఁ డిలను
మూర్ఖుఁ డరయఁగ కపటి తాన్, బుద్ధిహీను
డనగ నొప్పు నతని నిల గుణవిశాల!. || 3-6 ||
భావము.
ఎవరైతే కర్మేంద్రియాలను నిగ్రహించి మనస్సులో ఇంద్రియ విషయాలను స్మరిస్తూ ఉంటాడో,అతడు పరమ మూర్ఖుడు, కపటాచారి అని పిలవ బడతాడు.
తే.గీ. పార్థ! జ్ఞానేంద్రియములను వశమునందు
మనసుచే నుంచుకొనుచు తా మానకుండ
కర్మ యోగ మనాసక్తి ధర్మ మరసి
చేయు నాతఁడు శిష్ఠుఁడు, జీవితమున.. || 3-7 ||
భావము.
అర్జునా! జ్ఞానేంద్రియాలను మనస్సు ద్వారా నిగ్రహించి, కర్మేంద్రియాల ద్వారా అసక్త భావంతో
కర్మయోగాన్ని ఎవరు ప్రారంభించునో అతడు విశిష్టుడు అవుతాడు.
తే.గీ. నీదు విధ్యుక్త ధర్మంబు నీవొనర్చు,
కర్మమానుట కంటె యా కర్మ చేయు
టనునదియె మేలు, కర్మ చే యక మనుటన
భువిని కష్టము తలఁపగా ప్రవర! పార్థ!. || 3-8 ||
భావము.

నీ విధ్యుక్త కర్మని నీవు చేయుము. కర్మ మానుట కంటే కర్మ చేయుట మేలు. కర్మ చేయకపోయినచో శరీరయాత్ర జరగదు.
తే.గీ. యజ్ఞములకని చేసెడి యట్టి కర్మ
ముల కితరమగు కర్మలన్ పూర్తిగాను
బంధనంబయ్యె లోకంబు, పార్థ! యజ్ఞ
కర్మ సంగమంబు వదలి కర్మొనర్చు.|| 3-9 ||
భావము.
యజ్ఞం కోసం చేసే కర్మలకంటే ఇతర కర్మలతో ఈ లోకం బంధింప బడి ఉన్నది. కుంతీకుమారాయజ్ఞ కర్మలనే సంగమము వదిలి కర్మలను చక్కగా చేయుము.
తే.గీ. యజ్ఞములతోడను ప్రజల నాప్రజాప
తియె యొనర్చి సృష్టి, పలికె తీయగ నిటు
యజ్ఞములు చేసి వెలుగుడీ యసదృశమగు
కామ ధేనువు యజ్ఞంబు, క్షేమ మొదవు.. || 3-10 ||
భావము.
యజ్ఞములతో సహా ప్రజలను సృష్టించి ప్రజాపతి పూర్వం ఈ విధముగా చెప్పెను. యజ్ఞం వలనమీరు వృద్ధి పొందుడు. అది మీ ఇష్ట కామధేనువు.
తే.గీ. దేవతాతతిన్ గొల్వుఁడు దివ్యమయిన
యిట్టి యజ్ఞమ్ములను జేసి, యిత్తు రరసి
మీకు దేవతల్ శుభములు, మేలు గొలుప,
నిహపరమ్ముల సాధింపు డహము వీడి.|| 3-11 ||
భావము.
దేవతలను ఈ యజ్ఞములో ఆరాధించుడు. ఆదేవతలు మిమ్మలను అనుగ్రహింతురు.
తే.గీ. యజ్ఞ భావిత దేవత లఖిల భోగ
ముల నొసంగుదు రా భోగములను పొంది,
ప్రతిగ నేమియు నీయక వారలనుభ
వించ నది చౌర్యమేయగున్ బ్రీతిఁగనుమ. || 3-12 ||
భావము.
యజ్ఞం చేత ఆరాధించబడిన దేవతలు మీకు ఇష్ట భోగాలను ఇస్తారు. వారికి ఏమీ సమర్పించకుండా
వాళ్ళు ఇచ్చిన వాటిని అనిభవించేవాడు చోరుడే యగును .
తే.గీ. దేవతల కిచ్చి, శేషమున్ దినిన, పాప
ములవి వాయు, ధన్యుఁడౌ పుడమిపైన,
తనకు వండుకొనుచు తిను ధర్మబాహ్యుఁ
డరయఁ బాపంబు తినుటగున్, వరలఁ బోడు. || 3-13 ||.
భావము.
యజ్ఞంలో దేవతలకు ఇవ్వగా మిగిలినది తినెడిసజ్జనుడు అన్ని పాపములనుండి విముక్తుడు అగును.
తమ కోసం మాత్రం వండుకొనెడి పాపాత్ములు పాపమునే తినువారగుదుఉ.
తే.గీ. అన్నమునఁ బుట్టు జీవు లా యన్న మరయ,
మేఘమున సంభవంబగు మేఘ మరయ
యజ్ఞమున సంభవంబగు యజ్ఞ మరయ
కర్మ వలన సంభవమగు, కనుము పార్థ! || 3-14 ||
భావము.
అన్నము వలన జీవులు పుట్టును,అన్నము మేఘము వలన పుట్టును, మేఘము యజ్ఞము వలనపుట్టును, యజ్ఞము కర్మ వలననే సంభవము.
తే.గీ. బ్రహ్మచే కర్మ కలిగెను, బ్రహ్మ చూడ
మహిత పరమేశుచేఁ గల్గె, మదిని గాంచ
సర్వమున వ్యాప్తుఁడై వెల్గు శక్తి యతఁడె
యజ్ఞమందు ప్రతిష్ఠితుం డరయ నతఁడె. || 3-15 ||
భావము.
కర్మ బ్రహ్మదేవుని వలన జనించినది. ఆ బ్రహ్మ అనంతమైన పరమాత్మ వలన ఉద్భవించెను. కాబట్టి
సర్వ వ్యాపకమగు పర బ్రహ్మము నిత్యమూ యజ్ఞములో ప్రతిష్ఠితమై యుండునని తెలుసుకొనవలయును.
తే.గీ. ఇట్టి భ్రమియించు చక్రము నెవఁడు భువిని
యనుసరించడో పాపి తా నర్జున! కన
నింద్రియములకు లోనగు నెన్న రాని
పాపి, నిజమిది కను మది భ్రాంతివీడి. || 3-16 ||
భావము.
ఇలా పరిభ్రమించే చక్రాన్ని అనుసరించని వాడు పాపి, ఇంద్రియలోలుడు,అర్జునా, అతడు జీవించుట వ్యర్థము.
తే.గీ. ఆత్మ లోన రమించుచు, నాత్మలోన
పూర్ణ తృప్తిని బొందెడు పూజ్యున కిక

చేయ వలసినదేదియు క్షితిని లేదు,
బ్రహ్మజీవైక్యసిద్ధియే పరమపథము. || 3-17 ||
భావము.
ఆత్మలోనే రమిస్తూ, ఆత్మలోనే పరిపూర్ణ తృప్తిని పొందే వాడికి చేయవలసిన కార్యమంటూ లేదు.
తే.గీ. అతనికి పని చేయంగ మేలరయ లేదు,
చేయకున్నను నష్టంబు చేరఁ బోదు.
తన కొఱ కితరులపయిన తానెపుడును
కనగ నాధారపడఁ బోడు కనుము నిజము.. || 3-18 ||
భావము.
అతడికి పని చేయడం వలన ప్రయోజనం కాని, మానడం వలన దోషం కాని ఏమీ ఉండదు. తనప్రయోజనం కోసం సమస్త ప్రాణులలోనూ దేనిపైనా ఆధారపడడు.
తే.గీ. కావునన్ కర్మలొనరింపగా తగు నది
మదిననా సక్తితోడ నేమరక చేయు
టొప్పునయ లోకకళ్యా ణమొనరఁ గోరి
చేసి నిష్కామకర్మలన్ భాసిలుమిల.|| 3-19 ||
భావము.
కాబట్టి, మమకార బంధాలను విడిచిపెట్టి, ఆసక్తి రహితుడవై, నీ పనులను ఒక కర్తవ్యములాగా నిర్వహించుము. కర్మ ఫలములపై ఆసక్తి లేకుండా పని చేయటం వలన మానవుడు ఆ పరమాత్మను చేరుకోగలడు.
తే.గీ. అవని నిష్కామ కర్మల నంచితముగఁ
జేసి జనకాదులున్ ముక్తి చెందిరి కద,
లోక కల్యాణమునుగోరి శ్రీకరముగ
కర్మలన్ జేయఁ దగు నీకు మర్మమెఱిఁగి. || 3-20 ||
భావము.
జనకుడు మొదలైన వారు(నిష్కామ)కర్మల వలననే మోక్షము పొందిరి. లోకకల్యాణాన్ని దృష్టిలోఉంచుకుని అయినా కర్మ చేయడమే నీకు తగును.
తే.గీ. శ్రేష్ఠుఁ డెద్దానిఁ జేయునో జేయుదు రదె
జనులు, దేనిని శ్రేష్ఠుఁడు ఘనతరముగ
తగ ప్రమాణంబుగాఁ గొను దాని నరసి
స్వీకరింతురు జనులెల్ల లోకమునను. || 3-21 ||
భావము.
శ్రేష్ఠుడు దేనినైతే ఆచరిస్తాడో, దానినే ఇతర జనులు ఆచరిస్తారు. అతడు దేనిని ప్రమాణంగాస్వీకరిస్తాడో దానినే లోకం అను సరిస్తుంది.
తే.గీ. పార్థ! యీ మూడులోకాల వరల నాకుఁ
జేయ వలసిన పనిలేదు, చిత్తమలర
మునుపు పొందక యున్నది, పొందఁ దగిన
దేదియున్ లేదు, కర్మల నిటులె యుందు. || 3-22 ||
భావము.
అర్జునా నాకు ఈ మూడు లోకాలలో చేయవలసిన పని లేదు. ఇంతకు ముందు పొందకుండా ఉన్నదిముందు పొందవలసినది ఏమీలేదు. అయిననూ కర్మలలో వర్తిస్తాను.
తే.గీ. పార్థ! విశ్రాంతిఁ గొనక నే పనులఁ జేయ
కున్న, నన్ననుసరింత్రు మన్ననమున
జనులు కావున కర్మలన్ సలుపుచుందు
ఫలితమాశించనేరను, భవ్యమదియె. || 3-23 ||
భావము.
అర్జునా; నేను విశ్రాంతి లేకుండా నిరంతరం పని చేయకపోతే, మనుష్యులు అన్ని విధాలనామార్గమే అనుసరిస్తారు.
తే.గీ. కర్మ దూరుండ నయిన లోకములు నాశ
నమగు, వర్ణ సంకరమది నా వలననె
కలుగు, నేనె కారణముగా కాన యటుల
జరుగనీయక కర్మలు జరుపుచుందు. || 3-24 ||
భావము.
నేను కర్మలు చేయకపోతే ఈలోకాలన్నీ నశించి పోతాయి. వర్ణ సంకరానికి కారకుఁడనగుదును. ఈప్రజలను నాశనము చేసిన వాఁడనగుదును.
తే.గీ. పార్థ! యజ్ఞాన వశుఁడు తా పనుల నెట్లు
చేయుచుండునో యటులనే చేయుదు రిల,
పనులు జ్ఞానులు లోకమున్ వరలఁ జేయ
నిరత నిష్కామ కర్మలై వరలుదురయ. || 3-25 ||
భావము.

అర్జునా! అజ్ఞానులు కర్మలతో మునిగి తేలుతూ ఎలా పని చేయుదురో వివేకి లోక శ్రేయస్సు కోరుతూఅటులనే పని చేయవలెను.
తే.గీ. కర్మలన్ జిక్కు నజ్ఞాని కలుషబుద్ధి
నెపుడు చెదరగొట్టగరా దహీన మతులు,
తాను యోగంబులో నిల్చి తనపనులను
జేయుచున్, జేయఁ జేయనౌన్, ధీయుతులయి. ‖ 3-26 ‖
భావము.
కర్మలలో ఇరుక్కు పోయిన అజ్ఞానుల బుద్ధిని వివేకి చెదర కొట్టరాదు. తాను యోగంలో నిలిచి చక్కగాపని చేస్తూ వాళ్ళని ఆ మార్గంలో నడుస్తూ కర్మలాచరించునట్లు ప్రోత్సహించవలెను.
తే.గీ. ప్రకృతి గుణములన్ గర్మలు వరలఁ గలవు,
మూఢుఁ డనుకొను తానిటన్ మూలమనుచు
నన్నిటికిని కారణమని, యహము వలన
జ్ఞాని తలఁపడటుల కను జ్ఞానభాస! ‖ 3-27 ‖
భావము.
ప్రకృతి గుణాల వలన అన్ని కర్మలు నిర్వహింప బడును. అహంకారము వలన భ్రమించిన మూఢుఁడు తానే కర్తనని తలపోయును.
తే.గీ. మహిత బల! గుణ కర్మల మహిత తత్వ
మెఱిగి యున్నట్టివాఁడు తా నెఱిఁగి గుణము
గుణమునందె వర్తించెడు ననుచు, తగులు
కొనడు కర్మలలోఁ దాను ఘనుఁ డతండె. ‖ 3-28 ‖
భావము.
మహాబలుడా! గుణకర్మ విభాగాల తత్వం తెలిసిన వాడు గుణాలు గూణాలలో వర్తిస్తాయని తెలిసి ఆకర్మలలో తగులుకొనడు.
తే.గీ. ప్రకృతి ధర్మంబుచే మోహ పరవశులయి
కర్మలన్ మున్గు మందులు, ఘనులు జ్ఞాన
రహిత మందుల నెన్నుచు మహిని తాము
చెదరఁ గొట్టగా రాదది మదిని దలచి.. ‖ 3-29 ‖
భావము.
ప్రకృతి యొక్క గుణాల వలన మోహములో పడిన వారు గుణ కర్మలలో మునుగుచుందురు. సరిగాతెలియని మంద బుద్ధులను సర్వము తెలిసిన జ్ఞాని చెదర కొట్టరాదు.
తే.గీ. సర్వకర్మలన్ నా యందు సరగుననిడి,
చిత్తమున్ నిల్పి యాత్మలోఁ, జెలఁగు మమత
నాశ మది వీడి యారాట మనునది విడి
యుద్ధమును జేయుమర్జునా! శ్రద్ధఁ గలిగి. ‖ 3-30 ‖
భావము.
సర్వ కర్మలను నా యందు సమర్పించి, చిత్తాన్ని ఆత్మలో నిలిపి, ఆశా మమకారములను వదిలి,
ఆరాటమును విసర్జించి యుద్ధము చేయుము.
తే.గీ. మత్సర రహితు లెవ్వారు మన్మతంబు
నాచరింతురో వారలే యనుపమగతి
కర్మ బంధముల్ విడుదురు ఘనతరముగ.
నీవు గ్రహియింపుమర్జునా! నేర్పు మీర. ‖ 3-31 ‖
భావము.
నాయొక్క యీ మతాన్ని ఏమానవులు మత్సరం లేకుండా ఆచరిస్తారో, వాళ్ళు కూడా కర్మల నుండివిడుదల పొందుతారు.
తే.గీ. ఏ యసూయాపరులు నా యభీష్ట మతము
ననుసరింపరో యా యజ్ఞు లనవరతము
జ్ఞానులందరిచేతను ఘనతరముగ
వంచితులగుచుందురిలను పార్థ! కనుమ. ‖ 3-32 ‖
భావము.
ఎవరైతే అసూయాపరులై నా ఈ మతాన్ని అనుష్ఠించరో ఆ తెలివి తక్కువ వారు సర్వజ్ఞానముల నుండి వంచితులై నశించిపోవుదురని తెలుసుకొనుము.
తే.గీ. అనుసరించు సత్ జ్ఞానియు నాత్మ ప్రకృతి,
యాత్మ ప్రకృతినే జీవాళి యనుసరింపఁ
గలవు గ్రహియింప, నిగ్రహ బల మదేమి
చేయఁ గల్గును? పార్థ! సు జ్ఞేయ మిదియె.. ‖ 3-33 ‖
భావము.
జ్ఞానవంతుఁడైనా తన ప్రకృతి ననుసరించే వ్యవహరిస్తాడు. ప్రాణులు తమ ప్రకృతిని
అనుసరిస్తాయి. నిగ్రహమేమి చేస్తుంది.
తే.గీ. ఇంద్రియము లన్నిటి విషయ మెంచి చూడ

రాగములు ద్వేషముల్గల్గు, ప్రథిత కర్మ
యోగి లోబడ రాదట్టి రాగములకు
ద్వేషముల కవే శత్రువుల్ తెలియుమిదియె.. || 3-34 ||
భావము.
ప్రతి ఇంద్రియ విషయంలోను రాగద్వేషములు ఉండును. కర్మయోగి వాటికి లోబడ రాదు. అవేఅతనికి శత్రువులు.
తే.గీ. గుణము లేనిదైనను గాని తనదె యయిన
ధర్మమే మేలు, కన పరధర్మమేల?
నది భయంకర మరయు మో యర్జునాఖ్య!
మన సుధర్మంబె చరియింప మనకు శుభము.. || 3-35 ||
భావము.
బాగా ఆచరించిన పర ధర్మం కన్నా లోపభూయిష్టమైనది ఐనా స్వధర్మం మేలు. పర ధర్మం భయంకర మైనది.
అర్జున ఉవాచ|
భావము.
అర్జునుడు ఈ విధముగ అడిగెను.
తే.గీ. కృష్ణ! పాపంబుల నెవరి ప్రేరణమున
మానవుఁడు చేయుచుండెనో మదిని చేయ
నిష్టమది లేకపోయినన్? సృష్టిలోన
ప్రేర ణెవరిది పాపంబు విరివి చేయ?. || 3-36 ||
భావము.
కృష్ణా! ఇష్టం లేకపోయినా ఎవరో బలవంత పెడుతున్నట్లు మానవుడు పాపము ఎందుకుచేయుచుండును? ఆ ప్రేరణ శక్తిఎవరిది? ఎవరి కారణంగా పాపము చేయును?
శ్రీభగవానువాచ|
భావము.
శ్రీ భగవానుఁడు ఇట్లు పలుకుచుండెను.
తే.గీ. క్రోధ కామముల్ కన రజో గుణము నుండి
యుద్భవించు నాకలి దానికుండు మెండు,
పాప మూల రజోగుణ వర్ధనంబె
శత్రు వందరికీధరన్, సరిగ కనుమ.. || 3-37 ||
భావము.
ఇవి కామము, క్రోధము, రజోగుణము నుండి ఉద్భవించుచున్నవి. దానికి మహా ఆకలి. అది పాపిష్ఠిది.ఈలోకంలో అందరికి అదే శత్రువని తెలుసుకో.
తే.గీ. అగ్నిని పొగయును, మలిన మద్ధమును, మరి
మావి శిశువును క్రమ్మునట్లే విజయుఁడ!
క్రమ్మివేయును జ్ఞానమున్ గామమరయ,
కామమును గెల్చువారలే ఘనులు భువిని.. || 3-38 ||
భావము.
అగ్నిని పొగ ఆవరించినట్లు, అద్దాన్ని దుమ్ము కప్పినట్లు, గర్భస్త శిశువుని మావి కప్పినట్లు జ్ఞానమును కామము కప్పి వేయును.
తే.గీ. కామమది తృప్తిఁ గలిగింపఁ గాని యగ్ని,
జ్ఞానమున కది వైరి, సు జ్ఞానమునది
కప్పివేయును, మనుజుని కనులు మాయ
క్రమ్మి కామాగ్ని దగ్ధుఁడై కనడు నిజము. || 3-39 ||
భావము.
తృప్తి పరచడానికి వీలులేని అగ్ని వంటిది కామము .ఇది జ్ఞానానికి నిత్య శత్రువు. దీనితో జ్ఞాని యొక్క జ్ఞానము కప్పబడి ఉండును.
తే.గీ. కామమునకు నాధారముల్ కనగ బుద్ధి
యింద్రియంబులు, మనసు, జ్ఞానేంద్రియమును
కామమది కప్పి వ్యామోహ కలితుఁ జేయు
మానవుని, కాన కామమున్ మాపవలయు.. || 3-40 ||
భావము.
ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, కామానికి ఆధార స్థానములు అని చెప్పబడుతున్నవి.ఈ కామము జ్ఞానమును కప్పి వేసి ఇంద్రియముల ద్వారా దేహధారిని వ్యామోహ పరుచును.
తే.గీ. జ్ఞాన విజ్ఞాన నాశినిన్ గామము నిక,
వదిలి పెట్టుము పార్థుఁడా! పట్టుపట్టి
యింద్రియములను గెలువుమో యింద్ర తనయ!
మహిత కర్తవ్యదీక్షతో మహిని నీవు. . || 3-41 ||
భావము.

అందువలన భరత కుల శ్రేష్టుడా! ముందుగా నీవు ఇంద్రియములను నిగ్రహించి, జ్ఞాన విజ్ఞానాలను నాశనం చేసే పాపిష్టి కామమును నిర్మూలించు.

తే.గీ. ఇంద్రియంబులు ఘనమని యందురనఘ!
అంతకన్నను మనసెయౌ నధిక ఘనము,
మనసుకన్నను బుద్ధియఘ మరియు ఘనము,
బుద్ధికన్న నాత్మ ఘనము బుద్ధినరయ.. || 3-42 ||

భావము.

ఇంద్రియాలు గొప్పవని చెబుతారు. ఇంద్రియాలకన్నా అధికమైనది మనస్సు. మనస్సు కన్నా గొప్పది బుద్ధి, బుద్ధి కన్నను శ్రేష్ఠమైనది ఆత్మ.

తే.గీ. బుద్ధి కన్న నాత్మయె ఘనంబుగఁ గ్రహించి,
నిగ్రహించుచు నిను నీవు, నేర్పు మీర
కామమను శత్రువున్ గెల్చి, ఘనతరముగ
చేయఁ దగినట్టి ధర్మంబుఁ జేయుమరసి. || 3-43 ||

భావము.

మహాబాహుడా! ఇలా ఆత్మను బుద్ధికన్నా ఎక్కువైన దానిగా తెలుసుకొని, నిన్ను నీవు నిగ్రహించుకొని, కామరూపి అయిన శత్రువునను జయించుము.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " కర్మ యోగము " అనెడి
3వ అధ్యాయము. సమాప్తము.

4వ అధ్యాయము
జ్ఞానకర్మసన్యాసయోగము.

శ్రీభగవానువాచ|
భావము.
శ్రీ కృష్ణభగవానుడు పలికెను.
తే.గీ. ఘనతరంబుగ కర్మ యోగంబు రవికి
బోధఁ జేసితిన్, దానది బోధఁ జేసె
మనువున, కతఁ డిక్ష్వాకునకును దెలిపె, న
నన్య మిదియు నీ వెఱుఁగుమో యర్జునుండ! || 4-1 ||
భావము.
అవ్యయమైన ఈ కర్మయోగాన్ని నేను సూర్యుడికి భోదించితిని. సూర్యుడు
మనువుకి చెప్పెను. మనువు ఇక్ష్వాకునికి చెప్పెను.
తే.గీ. రాజ ఋషు లెఱింగిన యట్టి రాజయోగ
మిది, పరంతపా! ప్రాప్తించె నిల పరంప
రగనె, పరికింప నీయోగ మగణితమెగ
కాలగర్భంబులో నేడు కలిసిపోయె. . || 4-2 ||
భావము.
ఇలా పరంపరగా ప్రాప్తమైన కర్మయోగమును రాజర్షులు ఎరుగుదురు.
ఓ పరంతపా! కాల గతిలో ఈ గొప్ప యోగం ఈ లోకంలో నశించి పోయినది.
తే.గీ. అట్టి ప్రాచీన యోగంబు నర్జున! సఖుఁ
డవని, భక్తుండ వని నీకు సవివరముగ
బోధఁ జేసితి నుత్తమ పూజ్యమౌ ర
హస్య యోగంబిదక కనుమయ్య నీవు. || 4-3 ||
భావము.
ఆ సనాతనమైన యోగమును నా భక్తుడవు, స్నేహితుడవు ఐన నీకు
భోధించితిని. ఇది ఉత్తమమైనదీ రహస్యమైనదీ అని యెఱుగుము.
భావము.
అర్జునుడు ఈ విధముగ అడిగెను.
తే.గీ. ఇప్పటిదె నీదు జన్మం, బ దెప్పటిదగు
సూర్యదేవుని జన్మము? సూర్యునకును
బోధఁ జేసితినంటివి బోధ పడద
దెట్టులన సాధ్యమౌనొ నే నెఱుగ లేను. || 4-4 ||
భావము.
నీ జన్మ ఇటీవలది. సూర్యుని జన్మ ఎంతో ముందున్నది. నీవు సూర్యునికి
ఉపదేశించితివని అంటివి. దీనిని ఏ విధముగా అర్థము చేసుకోవలెను?
శ్రీ కృష్ణభగవానుడు ఈ విధముగ పలికెను.
తే.గీ. గడచిపోయిన జన్మలు కలవు పెక్కు
నీకు, నాకును, నెఱుఁగవు నీవు, నేనె
రుంగుదును వాటి నన్నిటిన్, భంగపడకు
మర్జునా నీవు సత్యంబు నరయ వలయు. || 4-5 ||
భావము.
అర్జునా! నాకును నీకును కూడా ఎన్నో జన్మలు గడిచిపోతునవి. నేను వాటన్నిటిని
ఎఱుఁగుదును. నీవు ఎఱుఁగవు.
తే.గీ. జన్మమే లేనివాడ నీ జగతిలోన
నవ్య యుండను, జీవుల కధిపతి నిక
నాదు ప్రకృతిని దాటుచు నాదు మాయ
వలన జన్మించుచుందును, వలసినపుడు.. || 4-6 ||
భావము.
జన్మ లేని వాడినీ, అవ్యయుడినీ, జీవులందరికి అధిపతినైన, నా ప్రకృతిని
అధిరోహించి నా మాయ వలన జన్మించుచుందును.
తే.గీ. ధర్మ మది క్షీణమగుచు నధర్మ మెపుడు
వృద్ధి యగుచుండు నప్పు డేన్ పృథ్విపైన
పుట్టు చుందు నధర్మమున్ మట్టుపెట్టి
ధర్మ సంరక్షణను జేయ, ధర్మ మిదియె. || 4-7 ||
భావము.
అర్జునా! ఎప్పుడు ధర్మము క్షీణించి అధర్మము వృద్ధి చెందునో

అప్పుడు నన్ను నేను సృజించుకొందును.
తే.గీ. సాధు జనులను రక్షింప, సమయు నటులఁ
జేయ దుష్కర్ములను భువిన్, జేయగాను
ధర్మ సంస్థాపనంబును ధరను నేను
సంభవింతు యుగయుగములంభరతజ! ॥ 4-8 ॥
భావము.
సాధువులను రక్షించడానికి, దుష్టులను నాశనం చేయడానికీ, ధర్మాన్ని
నెలకొల్పడానికి యుగ యుగంలోను నేను జన్మిస్తాను.
తే.గీ. అర్జునా! యెవ్వ రెఱుఁగుదు రతులితమును
దివ్యమునునైన నా జన్మ, దీపితమగు
దివ్య తత్వంబు వారికి దేహమువిడ
ముక్తియే గల్గు, నిజమిది యుక్తి గనుమ. ॥ 4-9 ॥
భావము.
అర్జునా! దివ్యమైన నా జన్మ కర్మల తత్వాన్ని ఎవరు యధార్థంగా
తెలుసుకొందురో, వారు ఈ శరీరాన్ని వదలిన తరవాత తిరిగి పుట్టరు.
తే.గీ. రాగమును భయక్రోధముల్ వేగమె విడి
నన్ను గూర్చిన తలపుల నున్న వారు
నన్నె తా మాశ్రయించిన సన్నుతులట
జ్ఞాన తపమున నన్ జేరఁ గలగుదు రిల. ॥ 4-10 ॥
భావము.
రాగ భయ క్రోధాలను విడిచి నన్ను గురించిన ఆలోచనలతో నిండి, నన్ను
ఆశ్రయించిన వారు ఎందరో జ్ఞానతపస్సు వలన నన్ను అందుకొనిరి.
తే.గీ. ఎవ్వ రెట్టుల నన్గొల్తు రీప్సితముగ
వారి నట్టులే నేనును పార్థ! కనుదు,
నాదు జాడలోనే జనుల్నడచుదు రిల,
నీవు గ్రహియింప వలెనిది నేర్పుమీర.. ॥ 4-11 ॥
భావము.
అర్జునా! నన్ను ఎవరు ఎలా కొలిస్తే నేను వారిని అలాగే అనుగ్రహింతును. మనుష్య
లెప్పుడూ నా జాడలోనే సంచరింతురు.
తే.గీ. కర్మ ఫలములు పొందంగ ఘనతరముగ
దేవతాళిని పూజింత్రు తృప్తిఁ గనగ
కర్మ ఫలములు లభియించు ఘనతరముగ
వేగముగ, పార్థ! గ్రహియించు ప్రీతితోడ. ॥ 4-12 ॥
భావము.
కర్మల ఫలితాన్ని కోరుకునే వారు దేవతలను ఆరాధింతురు, మానవ
లోకంలో కర్మల వలన కలిగే ఫలము త్వరగా లభించును కదా!
తే.గీ. గుణము కర్మంబులన్ నాలుగు విధములగు
వర్ణములు గొల్పినాడ నే వరలఁజేయ,
కాను సృష్టిఁ జేసిన నేను కర్త ననియు,
మార్పు లేనివాడననియు మదిని గనుమ.. ॥ 4-13 ॥
భావము.
నాలుగు విధాలైన వర్ణాలు గుణ కర్మల విభజనలను అనుసరించి నా వలన
సృష్టించ బడినవి. వాటిని సృష్టించిన వాడినైనా నేను కర్తను కాననీ,
మార్పులేని వాడిననీ తెలుసుకో.
తే.గీ. నన్ను కర్మలంటవనియు, నాకు నెపుడు
కర్మ ఫల వాంఛ లేదని ఘనతరముగ
నెఱుఁగు వాడు కట్టుబడడీ యిలను మహిత
కర్మ ఫలములచే, పార్థ! కనుము నిజము.. ॥ 4-14 ॥
భావము.
నన్ను కర్మలంటవనీ నాకు కర్మ ఫలముపై కోరిక లేదనీ ఎరిగినవాడు
కర్మలచేత కట్టుబడడు.
తే.గీ. కర్మమొనరింప బడెను సకలమునెఱిఁగి,
పూర్వమున ముముక్షువులచే పూర్తిగా, మ
రటులె నిష్కామ కర్మంబు నరసి చేయు
మర్జునా! యంచు శ్రీకృష్ణుడనియెఁ దెలియ.. ॥ 4-15 ॥
భావము.
ఇది తెలుసుకొనియే పూర్వము ముముక్షువుల చేత కర్మ చేయబడినది.అందు

వలన పూర్వీకుల చేత పూర్వము చేయబడినట్లే నీవు కూడా నిష్కామ కర్మనే చేయుము.
తే.గీ. ఏది కర్మయగు నకర్మ యేది యగు న
నుచు ఋషులును భ్రాంతులగుటను దెలియవలె,
నీ వశుభము నుండి విముక్తి నియతి నెఱుఁగఁ
దెల్పెదను నీకు దాని ననల్ప సుగుణ!. || 4-16 ||
భావము.
కర్మ ఏది అకర్మ ఏది అనెడి విషయములో ఋషులు సహితము భ్రాంతిలో
పడుదురు. దేనిని తెలుసుకొనిన నీవు అశుభము నుండి విముక్తి పొందుదువో
ఆ కర్మ విషయము నీకు చెప్పెదను.
తే.గీ. కర్మలను గూర్చెరుగవలె, కర్మలను వి
కర్మలను నకర్మలను ప్రగణితముగను
దెలుసుకొన వలె నర్జునా!తెలియ నవదు
కర్మల స్వభావ నిగూఢ ఘనత భువిని.|| 4-17 ||
భావము.
కర్మల గురించి తెలుసుకొనవలెను. వికర్మల అకర్మల గురించి కూడా తెలుసు
కొనవలెను. కర్మల యొక్క స్వభావము చాలా నిగూఢమైనది.
తే.గీ. కర్మలనకర్మను నకర్మ గర్మముననను
గాంచువాడె బుధుండిలన్, గాంచ యోగి
యతఁడు, కర్మఁ జేసిన ఘనుం డరయ భువిని,
యనుచునర్జునుతోకృష్ణు డనియె తెలియ. || 4-18 ||
భావము.
కర్మలో అకర్మనీ అకర్మలో కర్మనీ ఎవఁడు దర్శించునో అతఁడు మనుష్యులలో
అందరికంటే బుద్ధిమంతులు. అతడే యోగి యావత్తు కర్మని పూర్తిగా చేసిన
వాడగును.
తే.గీ. కామ సంకల్ప రహితుడై కర్మల నిలఁ
జేయు ప్రారంభమెవ్వరు ధ్యేయమలర
జ్ఞాన దగ్ధ కర్ముని వాని గాంచిన ఘనులు
సద్వివేకిగా ఘనులెంత్రు సఖుఁడ! పార్థ! . || 4-19 ||
భావము.
ఎవరు కామ సంకల్పం లేకుండా అన్ని కర్మలను చక్కగా ప్రారంభింతురో, జ్ఞానాగ్నిలో
కర్మలన్నిటినీ కాల్చివేయుదురో అతనిని వివేకి అని విద్వాంసులందురు.
తే.గీ. కర్మ ఫలబంధమును వీడి, కలిగి తృప్తి,
దేనిపైన ననాధారి యైనవాడు,
కర్మ మగ్నుఁ డైనను గాని కర్మఁ జేయ
నట్టివాడే సుమా మది పెట్టి చూడ.. || 4-20 ||
భావము.
కర్మ ఫలంతో సంగాన్ని వదిలి నిత్యతృప్తుడై దేనిమీద ఆధారపడని వాడై,
కర్మలలో నిమగ్నుడై ఉండేవాడు ఏకర్మనీ చేయని వాడే అగును.
తే.గీ. ఆశయే లేక దేహమ్ము ననుపమగతి
నిగ్రహించి, పరిగ్రాహి నేనటంచు
తలప కెవ్వండు చేయునో తనువున పని,
పొంద డెట్టి పాపంబులు, భువిని పార్థ!. || 4-21 ||
భావము.
ఆశలేక, మన శరీరాలను నిగ్రహించి, అన్నిటి యందు పరిగ్రహ భావాన్ని
వదిలి, కేవలం శరీరంతో కర్మ చేసేవాడు ఏ పాపాన్నీ పొందడు.
తే.గీ. ప్రాప్త మగునదే ఘనమని పరవశించి,
ద్వంద్వమునకు నతీతుఁడై వరలుచుండి,
మత్సరములేక, ఫలితంబు మంచిది కని
పొంగకనె గర్మ సలుప నసంగుఁ డతఁడు.. || 4-22 ||
భావము.
యాదృచ్ఛికముగా లభించిన దానితో సంతృప్తుడై, ద్వంద్వాలకు అతీతుడై,
మాత్సర్యం లేకుండా, ఫలం లభించినపుడు కూడా సమంగా ఉండేవాడు
కర్మ చేసినా బద్ధుడు కాడు.
తే.గీ. నేను విశ్రాంతియే లేక నిరతము పనిఁ
జేయకున్నచో మనుజులే చేయుదు రయ
నాదు మార్గంబునే గొని మోదమలర,
నీవు గ్రహియింపు మర్జునా నిజమునెపుడు.. || 4-23 ||

భావము.
అర్జునా! నేను విశ్రాంతి లేకుండా నిరంతరం పని చేయకపోతే, మనుష్యులు అన్ని విధాల నా మార్గమే అనుసరిస్తారు.
తే.గీ. కర్మలన్ నేను విడువ లోకములు నశ్య
మగును, గన వర్ణసంకరం బగును, కార
ణ మిట నేనే యగుదును, మనమున గనిన
ప్రజవినాశన కారినై పాపినగుదు.. ‖ 4-24 ‖
భావము.
నేను కర్మలు చేయనిచో ఈలోకములన్నియు నశించి పోవును. వర్ణ సంకరమునకు కారకుడనగుదును. ఈ ప్రజలను నాశనము చేసిన వాడనగుదును.
తే.గీ. దైవ యజ్ఞమున్ కొందరు ధర చరింత్రు,,
బ్రహ్మ మన నగ్ని కర్పిత బ్రహ్మలగుదు
రిలను కొందరీ యజ్ఞమున్ సలలితముగ,
నాత్మ సుజ్ఞాని కర్థమౌ నరయు మీవు.‖ 4-25 ‖
భావము.
కొందరు యోగులు దైవ యజ్ఞమునే చక్కగా చేయుదురు. కొందరు బ్రహ్మమనే అగ్నిలో యజ్ఞము ద్వారా యజ్ఞమును (తనలోని జీవభావాన్ని) అర్పింతురు.
తే.గీ. నిగ్ర హాగ్నిలో వేల్తు సమగ్రముగను
కొందరింద్రియంబులు, మరి కొంద రింద్రి
యాగ్నిలోవేల్తురు శ్రవణమాదిగ గల
తృష్ణలన్, దీర్చుకొనుటకు, తెలివి మాలి. ‖ 4-26 ‖
భావము.
శ్రవణం మొదలైన ఇంద్రియాలను కొందరు నిగ్రహమనే అగ్నిలో వేల్చుతారు. మరి కొందరు ఇంద్రియము అనే అగ్నిలో శబ్దాది విషయాలను వేల్చుతారు.
తే.గీ. జ్ఞాన, కర్మేంద్రియంబుల కర్మములను
సంయమాగ్నిలో వేల్తురు సంయమివరు
లిట్లు కొందరరయు మిదియె ఘనము గన,
నాత్మసంయమనంబది యనుపమమిట.‖ 4-27 ‖
భావము.
మరి కొందరు జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ కర్మ లన్నింటిని జ్ఞానంతో వెలిగింప బడిన మన స్సంయమన మనే అగ్నిలో వేల్తురు.
తే.గీ. కఠిన యత్నంబుతో ఘనుల్ జ్ఞాన, ద్రవ్య,
యోగ, స్వాధ్యాయ, సత్తపో యుక్త యజ్ఞ
ములను కల్గి యుందురిలను పూజ్యముగను,
నీవు గ్రహియింపుమర్జునా! నియతితోడ. ‖ 4-28 ‖
భావము.
మరికొందరు కఠినమైన నియమాలతో ప్రయత్నము చేయుచు ద్రవ్య, తపో, యోగ, స్వాధాయ, జ్ఞాన యజ్ఞములు కలిగి ఉందురు..
తే.గీ. శ్వాస నల నిరోధించి, యపానమునకు
బ్రాణమున్, బ్రాణమునకు నపాన మెన్ని
యాహుతుల్ చేయుదురు కొంద రనుపము లిల,
నీవు గ్రహియింపుమిద్దియు నిర్మలాత్మ!. ‖ 4-29 ‖
భావము.
అటులనే ప్రాణాయామ పరాయణులైన మరి కొందరు ఉచ్వాస నిచ్వాసములను నిరోధించి, అపానానికి ప్రాణాన్ని, ప్రాణాన్ని అపానానికి, ఆహుతులుగా అర్పింతురు.
తే.గీ. పరిమితాహారులే ఘనుల్ ప్రాణమునకు
బ్రాణ మాహుతి యొనరింత్రు, వారు యజ్ఞ
విదులె, కల్మషంబులనిట వీడుచుంద్రు
యజ్ఞములచేత, నిజమిది యరయుమీవు.. ‖ 4-30 ‖
భావము.
మరికొందరు నియమితమైన ఆహారాన్ని స్వీకరిస్తూ, ప్రాణాన్ని ప్రాణానికి ఆహుతులుగా అర్పింతురు. వీరందరూ యజ్ఞానాలను ఎఱిగినవారే. యజ్ఞం వలన కల్మషములను హరింప చేసుకొందురు.
తే.గీ. యజ్ఞ శేషాన్నమమృతమో యర్జునుండ!
యజ్ఞ దూరుల కిహమె లే దరసి చూడ
పర మదెట్టులబ్బును కనన్ పార్థ! నిజము.

యజ్ఞములు చేయవలయునేమైనకాని.. || 4-31 ||
భావము.
అర్జునా! యజ్ఞమున సమర్పించగా మిగిలిన ఆహారం అమృతము. యజ్ఞము
చేయని వారికి ఈ లోకమేలేదు, పరలోకమెక్కడ?
తే.గీ. ఈ విధంబుగ యజ్ఞము లెన్నియో వి
ధములు వేదముల్ వివరించె, ధరను కర్మ
జనితముల్ కను, వరముక్తి కనుమదెఱిఁగి,
నిజమెఱుంగుమోయర్జునా విజయము గన.. || 4-32 ||
భావము.
ఈ విధముగా అనేక విధముల యజ్ఞములు వేదాలలో విస్తరించబడి ఉన్నాయి. అవి
అన్నియు కర్మల వలన జనించునని తెలుసుకొనుము. ఈ విధముగా తెలుసుకొనినచో విముక్తుఁడవగుదువు.
తే.గీ. ద్రవ్యమున జేయు యజ్ఞంబు భవ్య మవదు
జ్ఞాన యజ్ఞంబు కన్నను గనగ పార్థ!
జ్ఞాన యజ్ఞంబు గొప్పది కలియునన్ని
రకముల ఫలితముల్ కడు రమ్య గతిని.. || 4-33 ||
భావము.
అర్జునా! పరంతపా! ద్రవ్యంతో చేసే యజ్ఞం కంటే జ్ఞాన యజ్ఞం శ్రేష్ఠమైనది. అన్ని రకాల కర్మలూ జ్ఞానంలో లీనమౌతాయి.
తే.గీ. జ్ఞాన మాత్మార్పణము, సేవ, ధీనిధివయి
ప్రశ్న వేయుట వలనను, పార్థ! యెఱుఁగు
మాత్మ తత్వజ్ఞు లది కడు నాదరముగ
బోధఁ జేయుదురయ నీకు బోధపడగ.. || 4-34 ||
భావము.
జ్ఞానాన్ని ఆత్మార్పణ భావం, సేవ, ప్రశ్నించడం ద్వారా తెలుసుకో, జ్ఞానులు, తత్వవేత్తలూ ఐనవారు నీకు ఉపదేశిస్తారు.
తే.గీ. ఏది పొందిన మోహననెపుడు పడవొ,
యేది పొందిన నీలోన నెన్ని చూడ
గలవొ జీవులన్ నాలోన ఘనతరముగ
పొందుమా దానినే నీవు, కుందనేల?. || 4-35 ||
భావము.
అర్జునా! దేనిని పొందిన తిరిగి ఇలా మోహములో పడవో, దేని చేత అశేషమైన జీవరాశుల్ని నీలోను, నాలోను
చూడగలుగుదువో ఆ జ్ఞానాన్ని పొందు.
తే.గీ. పాపు లందరిలో మహా పాపివయిన
జ్ఞాన మనియెడి పడవలో ఘనతరముగ
పాపమును దాటగల వీవు పట్టుపట్టి,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పుమీర. || 4-36 ||
భావము.
పాపులందరిలోకి ఎక్కువ పాపం చేసిన వాడివైనా పాపాన్నంతటినీ
జ్ఞానమనే పడవతో దాటఁగలవు.
తే.గీ. కట్టెలను కాల్చు జ్వలితాగ్ని, యట్టులేను
జ్ఞాన రూపాగ్ని కర్మలన్ గాల్చివేయు,
ఘనతరంబగు జ్ఞాన సంస్కారి వగుమ,
కర్మలన్ బాసి శుభములే కనుము పార్థ!. || 4-37 ||
భావము.
అర్జునా జ్వలించే అగ్ని కట్టెలను కాల్చినట్లుగా, జ్ఞానమనే అగ్ని
కర్మలను కాల్చివేస్తుంది.
తే.గీ. జ్ఞాన మట్లు పవిత్రమై కలుగదన్య
మరయ, నిజమిది, సుజ్ఞాని నిరుపమముగఁ
బొందు తనలోనె జ్ఞాన మున్, సుందరముగ,
నీవునట్టులే పొందనౌ నేర్పుమీర. || 4-38 ||
భావము.
జ్ఞానం లాగ పవిత్రమైనది ఇంకొకటి లేదు. యోగ సంసిద్ధిని పొందినవాడు
దానిని కాలక్రమేణా తనలోనే పొందఁగలఁడు.
తే.గీ.. శ్రద్ధ నింద్రియ నిగ్రహ జాణ యగుచు,
తనదు జ్ఞానానుభూతినే తనదు లక్ష్య
ముగను గలిగినవాడిల పొందు జ్ఞాన
దీపితంబగునునుభూతి దేలు శాంతి.. || 4-39 ||
భావము.
శ్రద్ధతో ఇంద్రియ నిగ్రహాన్ని కలిగివుండి, జ్ఞానానుభవాన్ని లక్ష్యంగా

పెట్టుకున్న సాధకుడు ఈ జ్ఞానము చేతలభించు పరమ శాంతిని పొందును
తే.గీ. జ్ఞానమున్ శ్రద్ధ కొరవడ్డ సంశయాత్మ
డునశియిం చిహము పరము గనగలేడు,
సుఖము పొందగ లేడిల చూడగాను,
నీవు గ్రహియింపుమర్జునా! నేర్పు మీర.. || 4-40 ||
భావము.
జ్ఞానం, శ్రద్ధ కొరవడిన సంశయాత్ముడు నశించును. సంశయంలో
పడ్డవాడికి ఈ లోకంలేదు. పరలోకమూ లేదు. సుఖం కూడా లేదు.
తే.గీ. యోగమునకర్మలన్ వీడు యుక్తిపరుని,
జ్ఞానమున సంశయచ్చేద ఘనుని యాత్మ
నిష్ఠు నే కర్మలున్ గట్ట నేర విలను,
పార్థ! గ్రహియింపుమిదినీవు పట్టుపట్టి.. || 4-41 ||
భావము.
అర్జునా! యోగం వలన కర్మలను వదిలించుకొని, జ్ఞానం వలన
సంశయాలను నివృత్తి చేసుకున్న ఆత్మ నిస్టుడిని కర్మలు బంధించలేవు.
తే.గీ. ఆత్మ సుజ్ఞాన ఖడ్గాన నసదృశముగ
నీదు సంశయముల్ నీవు నేర్పు మీర
ఛేదనము చేసి యోగంబు చేయబూను
మర్జునా! లేచి నిలబడుమభయమిత్తు.. || 4-42 ||
భావము.
అందుచేత అజ్ఞానం వలన జనించి నీ హృదయంలో ఉన్న సంశయమును
ఆత్మజ్ఞానమనే ఖడ్గంతో ఛేదించి, యోగమును అవలంబించు. అర్జునా
లేచి నిలబడుము.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " జ్ఞానకర్మ సన్న్యాస యోగము " అనెడి
4వ అధ్యాయము. సమాప్తము.

5వ అధ్యాయము.
కర్మసంన్యాసయోగము

అర్జునుఁడు ఇట్లనెను.
తే. కర్మసన్యాస మొకపరి, కర్మయోగ
మొకపరి ప్రశంసితములయ్యె, నొక్కదాని
నిందు ఘనమైనదేదియో ముందు తెలుపు
మయ్య! శ్రీకృష్ణుఁడా!యనె నర్జునుండు.. || 5-1 ||
భావము.
ఓ కృష్ణా ఒకసారి కర్మ సన్యాసాన్ని, మరొకసారి కర్మ యోగాన్ని పొగుడుతున్నావు. ఈ రెండింటిలో ఏది శ్రేయస్కరమో దానిని నాకు తెలుపుము.
శ్రీ కృష్ణుడన్నాడు.
తే.గీ. కర్మసన్యాసము మరియు కర్మ యోగ
ము ఘనమైన వానందదము లరయగ ను,
కర్మసన్యాసమే మేలు కర్మయోగ
ము సరి కాదు దానికి చూడ ముక్తిదమది. || 5-2 ||
భావము.
కర్మసన్యాసమూ, కర్మయోగమూ రెండూ కూడా ఉత్తమమైన ఆనందానికి తీసుక వెళ్ళునవే. ఐతే ఈ రెండింటిలో కర్మ యోగము కర్మసన్యాసము కంటే మెరుగైనది.
తే.గీ. కనగ నద్వేషియు విముక్త కాంక్షు డిలను
నిత్యసన్యాసి, కనుమిది నీవు పార్థ!
ద్వంద్వ భావరహితుడిట బంధముక్తు
డగును, నిజమిది భువిపైన సుగుణధామ! . || 5-3 ||
భావము.
ఎవరైతే ద్వేషించకుండా, కాంక్షించకుండా ఉంటాడో, అతఁడే నిత్యసన్యాసి అని తెలుసుకో. ఓ మహాబాహూ! ద్వంద్వాలు లేనివాడే బంధాల నుండి తేలికగా విడుదల పొందఁగలడు.
తే.గీ. సాంఖ్య మని యోగ మని యంద్రు చంటివారు,
పెద్దలట్టుల పల్కరు విజ్ఞులగుట
నెవ్వరారెంట నొకదాని నెన్ని నిలుతు
రట్టి వారికీ రెండును నమరు పార్థ!. . || 5-4 ||
భావము.
పసివారు (అజ్ఞానులు) మాత్రమే సాంఖ్యమూ, యోగమూ వేరు వేరు అని అంటారు. విద్వాంసులు అనరు. ఎవరైతే ఒకదానిలో సరిగా నిలబడుదురో వారికి రెండింటి ఫలమూ లభించును.
తే.గీ. సాంఖ్యు లేస్థానమును పొంది, సమ్మతిఁ గను
చుందు రట్టిదే యోగులున్ పొందుదు రిల
సాంఖ్యయోగంబులొకటంచు సరసులు గను
చుందు రవ్వారి దృష్టియే శుద్ధమరయ.. || 5-5 ||
భావము.
సాంఖ్యులచేత ఏస్థానం పొందబడుతుందో, ఆస్థానమే యోగులుచేత పొందబడుతుంది. సంఖ్య యోగాన్ని ఒకటిగా ఎవరు చూస్తున్నారో వారే నిజమైన దృష్టి కలిగిన వారు.
తే.గీ. కర్మయోగ దూరులకిల కష్టమగును
కర్మసన్న్యా ససాధన, కర్మయోగు
లనతికాలమునను బ్రహ్మమంద గలరు,
తేలికగనే మహాబాహు! తెలియుమిదియు.. || 5-6 ||
భావము.
ఓ మహాబాహో! కర్మయోగం చెయ్యని వాళ్ళకు కర్మసన్యాసాన్ని సాధించడం కష్టం. కర్మ యోగంతో కూడిన మానవుడు త్వరలోనే తేలికగా బ్రహ్మమును చేరుకుంటాడు.
తే.గీ. కర్మ యోగమ్మునన్ గూడి, నిర్మలమగు
చిత్తముండి జితేంద్రియ సిద్ధులిలను,
తెలియుదురిల నాత్మ వలెను దీపితమగు
పరుల యాత్మలన్, జిక్కరు బంధములకు.. || 5-7 ||
భావము.
కర్మ యోగంతో కూడుకొని, విశుద్ధం ఐన బుద్ధితో మనస్సు, ఇంద్రియాలను జయించి, అన్ని ప్రాణులలోని ఆత్మను తన ఆత్మగా తెలుసుకున్న వాడు కర్మలను చేసినా బంధంలో చిక్కుకోడు.
తే.గీ. సత్య మెఱిగిన యోగి తా సతము గనుచు
చూచుట, వినుటయును, స్పృశించుటయు, గాలి

పీల్చుట, తినుట, వాసన పీల్చుటయును
నిద్రయును, తాను చేయమిన్ నిరత మెఱుఁగు.. || 5-8 ||
భావము.
పరమసత్యాన్ని ఎఱిఁగిన యోగయుక్తుడు చూస్తున్నప్పుడు, వింటున్నప్పుడు, స్పృశించుచున్నప్పుడు, వాసన చూస్తున్నప్పుడు, తింటున్నప్పుడు, పడుకుంటున్నప్పుడు, ఊపిరి పీలుస్తున్నప్పుడు
తే.గీ. మాట లాడునప్పుడు, వీడి మనునపుడును,
పట్టుకున్నపుడును, కనురెప్ప పడి తెరచు
నపుడు నింద్రియముల్ విషయముల సంచ
రించుట నెఱుఁగు, నిజమునే, యెఱుఁగు తాను.. || 5-9 ||
భావము.
మాట్లాడుతున్నప్పుడు, వదిలేస్తున్నప్పుడు, పట్టుకుంటున్నప్పుడు. కనురెప్ప…
తే.గీ. బ్రహ్మ కర్పించి కర్మలన్, భక్తి గలిగి,
సంగ భావంబు వీడిన సన్నుతు లిల
నీట తామర తడవని వాటమునను
పాప మంటక శుద్ధులై వరలుదురిల.. || 5-10 ||
భావము.
ఎవరైతే కర్మలను బ్రహ్మమునకు అర్పించి, సంగభావాన్ని వదిలి పనిచేయుదురో, అట్టివాడు నీటిలో ఉన్న తామరాకు ఎటుల నీటివలన తాకబడదో అటులనే పాపము చేత తాకబడడు.
తే.గీ. త్రికరణములను శుద్ధులై ప్రకటితమగు
సంగ రహితులై యోగులు సకలకార్య
ములను కేవలేంద్రియములన్ బూర్తి చేసి
కర్మఫలదూరులైయుందురర్మిలి సఖ! || 5-11 ||
భావము.
యోగులు తమ అంతఃకరణ శుద్ధి కోసం సంగభావాన్ని వదిలి కేవలం శరీర, మనో, బుద్ధి. ఇంద్రియాలతో మాత్రమే కర్మలు చేస్తారు.
తే.గీ. అరయ కర్మఫలత్యాగి యగుచు యోగి
శాశ్వతంబైన శాంతినే సతము గనును.
కోరికలు వీడనేరక కూరుకొనుచు
పోవుచుండును బంధనములను యోగి.|| 5-12 ||
భావము.
యోగయుక్తుడైన వాడు కర్మఫలాన్ని వదిలి పెట్టి శాశ్వత మైన శాంతిని పొందుతాడు. యోగికానివాడు కోరికల కారణంగా కర్మఫలానికి అతుక్కు పోయి బంధింప బడతాడు.
తే.గీ. కర్మసన్యాసి విజితాత్ముఁ డర్మిలి తన
దేహదేవాలయంబున తేలుచుండు
సంతసమ్మున నేమియున్ సుంతయేని
చేయడిక చేయఁజేయడు జితవిధాత. . || 5-13 ||
భావము.
మానసికంగా అన్ని కర్మల్ను సన్యసించి, పూర్తిగా తనను తాను స్వాధీనంలో ఉంచుకున్న దేహధారి, తొమ్మిది ద్వారాల పురంలో తాను ఏమీ చేయకుండా, ఎవరిచేత చేయించ కుండా సుఖంగా ఉంటాడు.
తే.గీ. క్షితిని కర్తృత్వమున్ కర్మ సృజన చేయ
డరయ దైవమ్ము, కర్మ మహాఫలంబు
లందబోవడు, ప్రకృతియె యట్టు లమరి
నడచుచుండును సృష్టి నీవరయు మిదియు.. || 5-14 ||
భావము.
భగవంతుడు కర్తృత్వాన్ని గానీ, కర్మలని గానీ సృజించడం లేదు. కర్మ ఫలంతో సంయోగాన్ని ఆయన చేయడు. ప్రకృతే ఆ ప్రకారముగా వ్యవహరించుచున్నది.
తే.గీ. పుణ్య పాపంబులు గొనని పూజ్యుఁడు హరి,
జ్ఞాన మదికప్పబడెడు నజ్ఞానమునను,
భ్రాంతిలో మున్గి ప్రాణులు వర్తిలుటను
తెలియవచ్చును చూచినన్ దెలివిఁ గలిగి.|| 5-15 ||
భావము.
భగవంతుడు పాపాలను కాని, పుణ్యాలని కాని స్వీకరించడు. జ్ఞానం అజ్ఞానంచేత కప్పబడును. అందుచేత ప్రాణులు భ్రాంతులగుదురు.
తే.గీ. పూర్ణ సుజ్ఞాన బలముచే పూర్తిగాను
వసుధ నజ్ఞాన మెవనిలో పాతఁబడునో
వానిలో దైవతేజంబు భానునివలె
చూడ గనిపించు నిజమిది సుగుణతేజ! || 5-16 ||

భావము.
ఎవరిలో నయితే సమగ్రమైన జ్ఞానం ద్వారా అజ్ఞానం నాశనం చేయబడినదో వారిలో ఆ పరమాత్మ జ్ఞానము సూర్యునివలె ప్రకాశింప బడును.
తే.గీ. ఆత్మలో బుద్ధి నిలుపుచు నాత్మభావ
మునె మదినినింపి యాత్మయే ముఖ్యమనెడి
జ్ఞాన నిర్ధూత కల్మషుల్ ఘనులు కనగ
జన్మరాహిత్యమొందు ప్రశస్తముగను.. || 5-17 ||
భావము.
ఆత్మలోనే బుద్ధిని నిలిపి, ఆత్మభావంతో మనసు నింపి, ఆత్మనే అంతిమ లక్ష్యముగా పెట్టుకొని ఆత్మాభాసము చేసేవారు పాపములు నశింప బడిన వారై తిరిగిరాని స్థితిని పొందుదురు.
తే.గీ. వసుధ విద్యా వినయులగు బ్రాహ్మణులను,
కుక్క నేనుగున్ గోవును కుక్క మాంస
భక్షకుల సమదృష్టితోఁ బరిగణించు
పండితుడు సమదర్శియై, వంద్యుఁడతఁడు.
|| 5-18 ||
భావము.
మహాత్ములు విద్యా వినయాలతో కూడిన బ్రాహ్మణుడిలో, గోవులో, ఏనుగులో, కుక్కలో, కుక్కమాంసాన్ని వండుకుని తినే చండాలునిలో కూడా పండితులు సమాన తత్వాన్నే చూస్తారు.
తే.గీ. ఎవరి మనసు సామ్యస్థితి నెల్లవేళ
లందు నిలుచునో వారలే యనుపమమగు
విజిత సంసార బంధ స న్నిజశరీరు
లరయ వారలా బ్రహ్మమే ధరణిఁ దలప.. || 5-19 ||
భావము.
ఎవరి మనస్సు సామ్యస్థితిలో నిలిచి ఉండునో, వారు ఈ శరీరములో ఉండగనే సంసారమును జయింతురు. నిర్దోషమైన బ్రహ్మము అన్నింటా సమముగా ఉన్నందున వారు కూడా బ్రహ్మములోననే నిలిచి ఉందురు.
తే.గీ. సుస్థిరంబగు బుద్ధితో శోభిలుచును
భ్రాంతి రహిత బ్రహ్మజ్ఞాని పరవశింప
డతని కానందదంబైనదందినపుడు,
క్రుంగ డప్రియప్రాప్తికిన్, గుణనిధాన! || 5-20 ||
భావము.
స్థిరమైన బుద్ధితో, భ్రాంతి రహితుఁడై బ్రహ్మతత్వములోనిలిచి ఉన్న బ్రహ్మజ్ఞాని, ప్రియమైనది లభించినపుడు సంతోషించడు అప్రియమైనది లభించినప్పుడు ఉద్వేగమును పొందడు.
తే.గీ. బాహ్యమౌ స్పర్శ లేనట్టి బ్రహ్మవేత్త
సుఖము నాత్మానుభూతితో శోభిల గను,
నిరుపమానంద సామ్రాజ్య నేత యతఁడు,
ధరణిపై వెల్గు నిరుపమ ధన్యు డతఁడు.
. || 5-21 ||
భావము.
బాహ్య స్పర్శలో తగుల్కోనివాడు, ఆత్మలో ఉండే సుఖాన్ని పొందును. బ్రహ్మతత్వానుసంధానములో నిలిచిన ఆ యోగి అనంతమైన ఆనందాన్ని పొందును.
తే.గీ. బాహ్య సంస్పర్శ భోగమ్ములేహ్యమయిన
దుఃఖ మూలమ్ము లెఱుఁగుమా, తోచలేదొ?
యవధులున్నట్టివాటికై యరుగరెపుడు
సద్వివేకులు, ముక్తిసత్సారవిదులు.. || 5-22 ||
భావము.
కుంతీకుమారా! బాహ్య విషయ స్పర్శలవలన జనించు భోగములన్నియు దుఃఖములకు మూలమే. ఆది అంతములతో కూడుకొనిన ఆ క్షణిక సుఖములలో వివేకవంతుఁడు రమించడు.
తే.గీ. దేహ జనిత కామాదులఁ దేల కెవ్వ
డవని నెదిరించి నిలుచునో యతఁడె యోగి,
యతఁడె సుఖమును పొందునో యగణిత గుణ!
ముక్తిఁ గైకొంట కద్దియే ముఖ్యపథము.. || 5-23 ||
భావము.
ఏవరైతే ఈ శరీరం ఉండగానే కామక్రోధముల నుండి పుట్టిన ప్రేరణలని తట్టుకొనుటకు సమర్థుఁడగునో, అతడే యోగి, అతడే సుఖవంతుఁడగును.
తే.గీ. ఎవ్వఁ డాత్మలో నానంద మెన్నుచు గను
నాత్మలో జ్ఞాన సజ్జ్యోతి ననవరతము
నిలుపుకొనునాతఁడే యోగి, తలచిచూడ

నతఁడె బ్రహ్మమై మోక్షంబు ననుభవించు.. || 5-24 ||
భావము.
ఎవరైతే తనలోనే సుఖమును పొందుతూ, తనలో తాను ఆనందించుచు తనలోనే జ్ఞాన జ్యోతిని నిలుపుకున్న యోగి బ్రహ్మ స్వరూపుడై మోక్షమును పొందును.
తే.గీ. కల్మష విదూరమై భేదముల్మనమును
వీడిపోయి నిగ్రహశక్తి పెరిఁగి మదిని
ప్రాణికోటి హితమునెన్ను వారె ఋషులు,
వారె బ్రహ్మనిర్వాణంబుఁ బడయు ఘనులు.. || 5-25 ||
భావము.
కల్మషాలు నశించి, భేదభావం తొలగిపోయి, మనస్సుని నిగ్రహించి, అన్ని ప్రాణుల హితాన్ని కోరే ఋషులు బ్రహ్మ నిర్వాణాన్ని పొందుదురు.
తే.గీ. విజిత కామాదుడై గొప్ప పేరుగాంచి,
విజిత మానసుడై, యాత్మ విశ్వరూప
మెఱుఁగు నెవ్వ డా యోగికి నెఱుఁగఁ దగిన
బ్రహ్మనిర్వాణ సుస్థితి పట్టుబడును. . || 5-26 ||
భావము.
కామక్రోధాల నుండి విడిపడి, మనస్సును జయించి, ఆత్మ స్వరూపాన్ని ఎఱిఁగిన యతులకు బ్రహ్మ నిర్వాణస్థితి అంతటా ఉండును.
తే.గీ. ఇలను బాహ్యేంద్రియానుభూతులను గొనక
నెట్టివేయుచు భృకుటిపై పెట్టి ధ్యాస
తలచ వలయు ప్రాణాపానములను సమము
గా మదిని జూడ వలయును, కనుమటులనె.. || 5-27 ||
భావము.
శబ్దస్పర్శాది బాహ్య ఇంద్రియ విషయాలను బయట నుంచి బయటకే నెట్టివేసి, ధ్యాసను భ్రూమధ్యంలో నిలిపి, నాసికారంధ్రాల ద్వారా చలిస్తున్న ప్రాణ, అపాన వాయువులను సమానంగా చూడాలి.
తే.గీ. ఇంద్రియంబుల్మనోబుద్ధులిలగ్రహించి
మోక్షమే లక్ష్యముగ గల్గి, పూర్తిగాను
కోపమున్ భయమును వీడి కోరికలిక
లేని ఋషియే గనున్ ముక్తి లీలగాను!. || 5-28 ||
భావము.
ఇంద్రియ మనోబుద్ధులను నిగ్రహించి, మోక్షమే తన అంతిమ లక్ష్యముగా పెట్టుకుని కోరికలను, భయమును, కోపమును వదిలిన ఋషి ఎప్పుడూ ముక్తుడే.
తే.గీ. యజ్ఞ తపముల భోక్తగా, నన్ని ప్రాణు
లకును హితునిగా, ప్రభువుగా సకల మరయ
నేనెగా గాంచు ఘనుడిల నిత్య సుఖియు,
ముక్తుడున్ గాంచ నిజమిది, పుడమిపైన.
. || 5-29 ||
భావము.
యజ్ఞాలకు తపస్సులకి భోక్తగా, అన్ని లోకాలకు ప్రభువుగా, అన్ని ప్రాణుల హితము కోరువాడిగా నన్ను తెలుసుకున్న వాడు శాశ్వత శాంతి పొందును.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " కర్మసన్యాస యోగము " అనెడి
5వ అధ్యాయము. సమాప్తము.

6వ అధ్యాయము.
ఆత్మసంయమయోగము.

శ్రీ భగవానుడనుచున్నాడు.
తే.గీ. కర్మ ఫలలాభమునకయి కాంచకుండ
కర్మములు చేయు నెవ్వడు ఘనుఁ డతండు,
కర్మసన్యాసి తలపగ కవ్వడి! విను
మగ్నికార్యకర్మంబుల నతఁడు చేయు. || 6-1 ||
భావము:
కర్మఫలము పైన ఆధారపడకుండా, చేయ వలసిన కర్మని ఎవరు చేయునో
అతడే కర్మ సన్యాసీ, కర్మ యోగి కూడా అగ్ని కార్యాన్నీ, కర్మనీ వదిలివేసినవాడు కాదు.
తే.గీ. కనగ సన్న్యాసమే యోగ మనగ నెఱుఁగు
మెవరు సంకల్పమును వీడ రవని వారు
యోగి కానేరరర్జునా! భోగులరయ,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పుమీర.. || 6-2 ||
భావము:
అర్జునా దేనిని సన్యాసమని అంటారో అదేయోగమని తెలుసుకో.
సంకల్పాలను సన్యసించనివాడు ఎవడూ యోగికాలేడు.
తే.గీ. ధ్యాన యోగ సాధకునకుఁ దలచి చూడ
నిత్య నిష్కామకర్మమే నిరుపమ గతి,
యోగ సిద్ధునకెటులైన నొప్పిదముగ
మహిని గాంచ కర్మత్యాగ మార్గమొప్పు.. || 6-3 ||
భావము:
ధ్యానయోగాన్ని సాధించదలచిన మునికి నిష్కామకర్మయోగమే మార్గము.
యోగసిద్ధి పొందినవాడికి కర్మత్యాగమే సాధనము.
తే.గీ. విషయ కర్మములపయినఁ బ్రీతి లేక
సకల సంకల్పముల్ వీడు సన్నుతు నిల
ననితరమగు యోగారూఢు డందురరయ,
తెలియుమర్జునా నిజమిది, తెలియవలయు.. || 6-4 ||
భావము.
ఇంద్రియ విషయములపై కాని, కర్మలపై కాని ఆసక్తి లేకుండా
సంకల్పములన్నీ విడిచిపెట్టినవాడిని యోగారూఢుడందురు.
తే.గీ. శత్రువును బంధువాత్మయే సరిగ నరయ
మానవులకిలన్, కాన యా మానవుండె
తనను తానుద్ధరించుకోతగును, నిజము,
పతనమును పొందతగదు శుభంబుఁ గనగ.||. || 6-5 ||
భావము.
తన మనస్సే తనకు బంధువూ, శత్రువూ కూడా. కనుక మానవుడు
తనను తానే ఉద్ధరించుకొనవలెను. తన ఆత్మను అధోగతి పాలు
చేసుకోకూడదు.
తే.గీ. ఆత్మజితునకు బంధువా యాత్మ నిజము,
కానివానికి శత్రువే కనగ నాత్మ,
కాన యాత్మ నిల జయించు ఘనులు ఘనులు,
చేతకాకున్న నది వారి చేటు నిజము.. || 6-6 ||
భావము.
మనస్సును స్వాధీనపరచుకున్నవాడికి తన మనస్సే బంధువు.
మనసును జయించనివాడికి తన మనస్సే ప్రబల శత్రువుగా ప్రవర్తించును.
తే.గీ. ఆత్మ జితుఁడే ప్రశాంతుఁడౌ నరసి చూడ
నాతనికి దైవదర్శన మనవరతము
కలిగి, శీతోష్ణ సుఖదుఃఖములును మాన
ము నవమానమునొకటిగా కనగలుగును.|| . || 6-7 ||
భావము.
ఆత్మను జయించిన ప్రశాంతచిత్తుడు పరమాత్మ సాక్షాత్కారము
నిరంతరము పొందుతూ శీతోష్ణములు, సుఖదుఃఖములు, మానావమానములపట్ల
సమభావము అతనికి కలుగుచుండును.
తే.గీ. జ్ఞాన విజ్ఞాన తృప్తుఁడౌ ఘనుఁడు, నిర్వి

కారుడును జితేంద్రియుఁడు, బంగారము,శిల,
మట్టినొకటిగా కనువాఁడు మహిని యోగి,
గాను జెప్పఁబడును పార్థ! ఘనుఁడ! కనుమ. || 6-8 ||
భావము.
శాస్త్రజ్ఞానమువలనను, అనుభవజ్ఞానమువలనను సంతృప్తి చెందినవాడు,
నిర్వికారుడు, ఇంద్రియాలను జయించినవాడు, మట్టినీ రాతినీ
బంగారమునీ్ని సమదృష్టితో చూసేవాడు యోగి అని చెప్పబడును.
తే.గీ. సాధువుల, సుహృ న్మిత్రులన్ శత్రువులను,
బంధువులను విరోధులన్, వసుధపైన
ఘన దురాచారులన్ మదిన్ గాంచునెవఁడు
నొక్కటిగ ఘనుఁడతఁడె సర్వోత్తముండు. || . || 6-9 ||
భావము.
శ్రేయోభిలాషి, స్నేహితుడు, శత్రువు, ఉదాసీనుడు, మధ్యస్థుడు,
విరోధి, బంధువు, సాధువు, దురాచారి—వీళ్ళందరిపట్ల సమబుద్ధి
కలిగినవాడే సర్వోత్తముడు.
తే.గీ. యోగి యేకాంత వాసియై యింద్రియముల
ను, మదిని వశపరచుకొని, కుమతి వీడి
యేమియు గొనక,చిత్తంబు నెటులనైన
నాత్మపై నిల్పవలెను నిరంతరంబు.. || 6-10 ||
భావము.
యోగి ఏకాంత స్థలంలో ఒంటరిగా ఉండి, ఆశలను వదలి,
ఇంద్రియాలనూ మనస్సునూ వశపరచుకుని, ఏమీ పరిగ్రహించకుండా
చిత్తాన్ని ఆత్మమీదే నిరంతరము నిలుపవలెను.
తే.గీ. ధరణి సమతలమందున దర్భగడ్డి
పరచి దానిపై చర్మమున్ బరచి దాని
పైన వస్త్రమ్ము పరచియ ద్దాని పైన
స్థిరముగాకూర్చొని తపము సేయ వలయు. || 6-11 ||
భావము.
ఎక్కువ ఎత్తూ పల్లమూ కాని పరిశుద్ధమైన ప్రదేశములో దర్భలు పరచి,
దానిమీద చర్మమూ, ఆపైన వస్త్రమూ వేసి తన స్థిరమైన ఆసనమును
ఏర్పరచుకొనవలెను.
తే.గీ. ఆసనముపైన గూర్చుండి, ధ్యాసనిలిపి,
యింద్రియములను, మనసునో యింద్రసముడ!
వశ పరచుకొని, మదినిల్పి, నిశలు నహము
లాత్మ శుద్ధికై యోగిగానగుట తగును. || 6-12||
భావము.
ఆ ఆసనంమీద కూర్చుని, ఇంద్రియాలనూ మనస్సునూ స్వాధీన
పరచుకుని, ఏకాగ్రచిత్తంతో ఆత్మశుద్ధికోసము యోగాభ్యాసము చేయవలెను.
తే.గీ. దేహమును, మెడన్, దలను, మదిని దలంచి
తిన్నగా దృష్టి నాసాగ్ర మున్నిలుపుచు,
సాధనము చేయవలెనయ్య! సరస సుగుణ!
యోగమున్ జేయఁ దగునిట్లు యోగివగుచు. || 6-13||
భావము.
శరీరమును, మెడను, తలను నిటారుగా కదలకుండా ఉంచి, దిక్కులు చూడకుండా తన ముక్కు కొసని చూస్తూ....
తే.గీ. భయము వీడి, ప్రశాంతుడై, బ్రహ్మచర్య
దీక్ష నూని, జితమనస్కుఁడై క్షమమున
నన్నె చిత్తంబునన్ నిల్పి, నన్నుఁ జేర
ధ్యానమును లక్ష్య యుక్తుఁడై తనియవలయు.. || 6-14||
భావము.
ప్రశాంతమైన మస్సుతో భయాన్ని విడిచి, బ్రహ్మచర్య వ్రతములో నిలిచి, మస్సును బాగుగా నిరోధించి, నాపై చిత్తమును న్ని
నిలిపి, నన్ను చేరు లక్ష్యముతో ధ్యాన యుక్తుడై ఉండవలెను.
తే.గీ. ఆత్మ నిగ్రహమున యోగి యహరహంబు
ధ్యాన మగ్నుఁడై నాలోన ననుపమముగ
కలిగినట్టిది, మోక్షమై ఘనతరమగు
శాంతి పొందును, కనుమిది సన్నుతాత్మ!. || 6-15||
భావము.

మనస్సును నిగ్రహించి యోగి ఈ విధముగా ఎప్పుడూ ఆత్మను ధ్యానములో నిలిపి, నాలో ఉన్నదీ, మోక్షరూపమైనదీ అయిన శాంతిని పొందఁగలఁడు.

తే.గీ. అతిగ తినువా డసలు తిననట్టి వాడు,
నతిగ నిద్రించువాడును, క్షితిని యసలు
నిద్రపోనట్టివాడును నిలువ లేడు,
సాత్త్వికాహారి యోగిగా సాగగలడు.. || 6-16 ||

భావము.
అర్జునా! ఎక్కువ తినేవాడికి, బొత్తిగా తినని వాడికి, ఎక్కువ నిద్ర పోయేవాడికి, అసలు నిద్రపోనివాడికి ధ్యానయోగం సాధ్యపడదు. ఎల్లప్పుడు సాత్త్వికాహారమునే భుజించవలెను.

తే.గీ. అవని పయి యుక్త భుక్తి విహారునకును
కర్మలన్యుక్తచేష్టప్రకాశునకును
యుక్త స్వప్నావబోధక రక్తునకిల
దుఃఖ హరణమౌ యోగమస్తోక సుగతి.|| 6-17 ||

భావము.
ఆహార విహారాలను యుక్తంగా ఉంచుకునే వానికీ, కర్మలో తగు మాత్రముగా వినియోగించే వానికీ, నిద్రనూ మెలకువనూ తగుమాత్రముగా వినియోగించే వానికీ, నిద్రనూ మెలకువనూ సమంగా పాటించే వానికీ యోగము (జనన మరణ) దుఃఖాన్ని హరించును.

తే.గీ. కామ్యవస్తువుపై కోర్కె, కలుగక మది
వశము నందున్న, నాతనిన్ వసుధపైన
యోగ సిద్ధు డనందు రో యురుగుణాఢ్య!
యోగసిద్ధుడే ధన్యుడయుక్త రహిత.. || 6-18 ||

భావము.
ఏ కామ్య వస్తువు పైనా కోరిక లేక, నిగ్రహింప బడిన మనస్సు ఆత్మలోనే ఉన్నప్పుడు అతడిని యోగ సిద్ధుడని అందురు.

తే.గీ. యోగి మనసు గణింపగ నొప్పియుండు
వాత రహితంపు దీపమవారితగతి
కావునన్పోల్తురట్టులే ఘనులు నిజము
నీవు గ్రహియింపుమర్జునా నిరుపమముగ.|| 6-19 ||

భావము.
ఆత్మ సమ్యమ యోగాన్ని అభ్యసించే యోగి మనస్సును, గాలి లేని చోట ఉంచిన దీపం స్థిరంగా ఉండే స్థితితో పోల్చుతారు.

తే.గీ. యోగి నిగ్రహాత్మెచ్చట నొందు శాంతి,
నాత్మ దర్శనమును యోగి హాయి నెచట
పొందుచుండునో తెలియుము బంధురముగ,
ననుపమాన శుభాస్పదా! ఘనసుచరిత! || 6-20 ||

భావము.
యోగాభ్యాసం ద్వారా నిగ్రహింప బడిన మనస్సు ఎక్కడ ఉపశమనము పొందుతుందో, ఎక్కడ తనలోతాను ఆత్మస్వరూపాన్ని చూస్తూ(యోగి) ఆనందిస్తాడో,

తే.గీ. ఏది బుద్ధితో దెలియనౌ నేది యింద్రి
యములకు నతీతమైనట్టి, దంతు లేని
దేది యాసుఖమును యోగి యెచ్చటుండి
యనుభవించుచును చలింప డరయు మయ్య.. . || 6-21 ||

భావము.
ఏది బుద్ధితో మాత్రమే తెలుసుకోతగినదో, ఇంద్రియాలకు అతీతమో, అంతములేనిదో, ఆ సుఖమును యోగి ఎక్కడ ఉండి అనుభవించుచు, ఆ అనుభవాలనుండి చలించక ఉండునో,

తే.గీ. ఏది పొందిన యోగి తా నితరమయిన
దేది పొందినన్ ఘనముగా నెంచకుండు,
ననుభవించుచునుగణింప డనుపమముగ
దేనియందుండుటన్, యోగి తానె పార్థ!. || 6-22 ||

భావము.
దేనిని పొందిన తరవాత ఇతరమైన ఏ లాభాన్ని కూడా దానికంటే ఎక్కువ అనుకోడో, దేనిలో నిలిచి విపరీతమైన దుఃఖముచేతకూడా చలించడో, అతడే నిజమైన యోగి.

తే.గీ. యోగమన దుఃఖ దూరులై యుండుటె కద,
నిర్విచారులై దీక్షతో నిండు మదిని
యత్నమును చేసి సాధించు టరయుమయ్య,
యోగమన నిది తెలియుమో రాగదూర! || 6-23 || .

భావము.
దుఃఖముతో సంబంధము లేని స్థితిని యోగము అని తెలుసుకోవాలి, ఆ యోగమును నిర్విచారమైన మనస్సుతో, పట్టుదలగా సాధించ వలెను.

తే.గీ. సకల సంకల్ప జనిత వాంఛలను విడిచి,
మనసు నిగ్రహించగవలె ఘనతరమగు
నింద్రియములను పట్టుతోనెలమిఁ బార్థ!
నీవు సాధింపవలెనిది నేర్పుమీర. ॥ 6-24 ॥
భావము.
సంకల్పమువల్ల పుట్టిన అన్ని కోరికలను పూర్తిగా విడిచి పెట్టవలెను.
మనస్సు ద్వారానే ఇంద్రియములన్నింటిని అన్ని వైపులనుండి నిగ్రహించవలెను.
తే.గీ. ధైర్యమును కల్గు బుద్ధితో తప్పకుండ
నెమ్మదిగ మనసును శాంతిని నిలుప వలె,
మనసునాత్మలో నిలిపుచు ననితరముగ,
తలపరాదితరంబింక ధర్మవర్తి! ॥ 6-25 ॥ .
భావము.
ధైర్యముతో కూడిన బుద్ధితో నెమ్మది నెమ్మదిగా మనస్సును
(బాహ్య ప్రపంచమునుండి మళ్ళించి)శాంతింప చేయవలెను.
మనస్సును ఆత్మలో నిలిపి తదితరమైనది ఏదీ తలచుకో కూడదు.
తే.గీ. చంచలంబగు చిత్తంబు నెంచి యెచటి
కేగినన్ గాని మరలించి వేగిరముగ
నాత్మలో నిల్పవలెను సమంచితముగ
పార్థ గ్రహియింపుమియ్యది స్వార్థమువిడి. ॥ 6-26 ॥
భావము.
నిలకడ లేని చంచలమైన మనస్సు ఎక్కడెక్కడికి పోతుందో,
అక్కడక్కడనుండి దానిని తీసుకు వచ్చి ఆత్మలో నిలబెట్టాలి.
తే.గీ. శమితమగురజో గుణుఁడు ప్రశాంత చిత్తుఁ
డనుపమబ్రహ్మరూపుడై యలరు నట్టి
యోగి కాత్మసంబంధమౌ యుత్తమ సుఖ
మందునో పార్థ! కనుచు నీవందవలయు. ॥ 6-27 ॥
భావము.
ఈ విధంగా రజోగుణం శమించి, దోషరహితమైన, ప్రశాంతమైన మనస్సుతో కూడి బ్రహ్మ స్వరూపుడైన యోగికి ఆత్మ
సంబంధమైన ఉత్తమ సుఖం లభిస్తుంది.
తే.గీ. ఆత్మ నభ్యసించుచు యోగి యనవరతము
కల్మషములకు దూరుడౌ, ఘనతరమగు
బ్రహ్మ సత్స్పర్శ సౌఖ్యము పడయునతడు,
పారమేలేని సౌఖ్యమున్ బడయునతడు.. ॥ 6-28 ॥
భావము.
ఈ విధ్ధముగా నిరంతరము ఆత్మాభ్యాసము చేయు యోగి యొక్క కల్మషములు పూర్తిగా నశించును. బ్రహ్మ స్పర్శ ఉన్న
అత్యంత సుఖమును తేలికగా పొందగలఁడు.
తే.గీ. యోగసంయుక్త సమదర్శి యోగి, కాంచు
నన్నిటన్ దనన్, దనలోన నన్నిటిఁ గను
నన్నియున్ దానె గన దానె యన్నిటనని
భావయుక్తుడై ప్రబలెడి భవ్యుడతడు.. ॥ 6-29 ॥
భావము.
యోగంతో కూడిన సర్వత్రా సమత్వాన్ని చూసే యోగి అన్ని ప్రాణులలో తననీ, తనలో అన్ని ప్రాణులనూ చూచును.
శ్లో. యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి|
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి. ॥ 6-30 ॥
తే.గీ. అన్నిటన్ నన్ను, నా లోన నన్నిటి నిలఁ
గనెడి వానికి మరుఁగవన్, వినుము పార్థ!
మరుఁగు కాడతఁడును నాకు, ధరణిపైన
నతఁడు నేనేను, నేనన్ననతఁడె తెలియ.
భావము.
నన్ను అన్నిటిలోనూ, నాలో అన్నిటినీ ఎవరు చూచుదురో అట్టి వారికి నేను మరుఁగు కాను. అతఁడు నాకూ మరుఁగు కాడు.
శ్లో. సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః|
సర్వథా వర్తమానోऽపి స యోగీ మయి వర్తతే. . ॥ 6-31 ॥
తే.గీ. అన్ని ప్రాణులలోనున్న నన్ను,
దైవ మొక్కడే యనుచు తా తలచుచుండి
నన్ను సేవించు నాయోగి మన్ననమున
నుండు నాలోన నెటులున్న నిండుమదిని.
భావము.

అన్ని ప్రాణులలో ఉన్న నన్ను అన్నింటా పరమాత్మ ఒక్కఁడే అన్న భావము పొంది సేవించునో, ఆ యోగి ఏ విధముగా సంచరించినను నాలోనే వర్తించుచుండును.
తే.గీ. దుఃఖ సుఖములందున తనతో నితరులఁ
బోల్చుకొనుచు సమముగా ప్రపూజ్య యోగి
శ్రేష్ఠు డందరి కన్నను చింత చేయ,
నెఱుఁగు మర్జునా! నీవిది యెఱుక గలిగి.. || 6-32 ||
భావము.
అర్జునా! దుఃఖము గానీ, సుఖముగానీ తనతో పోల్చుకొని తనతో సమానముగా అందరిలోనూ చూచునో, ఆ యోగి శ్రేష్ఠుడని నా అభిప్రాయము.
అర్జునుడడిగెను.
తే.గీ. నీవు చెప్పిన యీ యోగ మే విధమున
నిలుచు చంచలంబగు చిత్త ఫలకముునను
ననుచు తోచునో కృష్ణుడా! యరయు మిదియు,
నాదు తప్పున్న మన్నించు నలిన నేత్ర!. || 6-33 ||
భావము.
కృష్ణా నువ్వు చెప్పిన ఈ ఆత్మ సంయమ యోగము మనస్సు యొక్క చంచల స్వభావము వలన నిలుచునని నాకు అనిపించుట లేదు.
తే.గీ. మనసు చంచలమైన, ప్రమాథి, దృఢము,
బలముతో నొప్పుచుండును, పవను నెటుల
యణచ సాధ్యంబు కాదల్లె యణప జాల
మరయ దీనిని, శ్రీకృష్ణ! తెరవు నీవె.. || 6-34 ||
భావము.
కృష్ణా! మనస్సు చంచలమైనది, భాధా కరమైనది, బలమైనదీ, గట్టిదీ, గాలిని అణచుట వలె దీనిని నిగ్రహించుట కూడా కష్టమని నేను భావింతును.
శ్రీకృష్ణుడిట్లు పలికెను.
తే.గీ. అవును, చంచల చిత్తమ్ము నణచ లేము,
నిగ్రహించుట కష్టము, నిరుపమాన!
పార్థ! సాధన చేతను భవ్యమయిన
దివ్య వైరాగ్య భావనన్ దీని నణచు.|| 6-35 ||
భావము.
సందేహము లేదు. మనస్సును నిగ్రహించుట చాలా కష్టము. అది చలించుచుండును. అయితే కుంతీ కుమారా! అభ్యాసం చేతా వైరాగ్యము ద్వారానూ మనోనిగ్రహము సాధ్యమగును.
తే.గీ. మనసు స్వాధీనమున లేని మనుజున కిల
పొంద యోగ మసాధ్యంబు, పొంద గలఁడు
మనసు స్వాధీనమున గల మహితుఁ డిద్ధి
యత్నమును చేసి యోచించి హాయిగాను. . || 6-36 ||
భావము.
మనస్సు స్వాధీనములో లేని వాడికి యోగము పొందుట కష్టమని
నా అభిప్రాయము. చిత్తము స్వాధీనములో ఉన్నవాఁడు ప్రయత్నించినచో
ఉపాయముతో సాధించ వచ్చును.
అర్జునుడిట్లు పలికెను.
తే.గీ. శ్రద్ధ గలిగియు మనసును చక్కగాను
వశమునం దుంచుకొనలేక పతితుఁడయిన
యోగ చలితుండయినయట్టి యోగి యేమి
యగును? తెలపుమా నాకు నే నరయునటుల.. || 6-37 ||
భావము.
శ్రద్ధ ఉన్నా మనస్సుని పూర్తిగా స్వాధీనంలోనికి తెచ్చుకొనలేక పోయెడివాఁడు,
యోగం నుండి మనస్సు జారిపోయి యోగసిద్ధిని పొందనపుడు ఏమగును?
తే.గీ. నియతి బ్రహ్మ పథమునందు నిలువలేని
మందబుద్ధి రెంటనుభ్రష్టుడందురు కద,
చెదరినట్టిమేఘునివోలె చెడునొ తాను?
చెప్పుమా కృష్ణ! సన్నుతి చేసెద నిను.. || 6-38 ||
భావము.
ఓ మహానుభావా! బ్రహ్మ పథములో నిలవలేని మంద బుద్ధి ఇహపరాలు
రెంటికీ భ్రష్టుడై చెదిరిన మేఘమువలె నశించి పోవడా?
తే.గీ. పూర్తిగా నాదు సందేహమును దొలంగఁ
జేయఁ దగువాఁడ వీవేను, చేయ లేరు

తొలగగా నాదు సందేహ మిలను పరులు,
నీకు మ్రొక్కెదన్ దెలుపుమో నీరజాక్ష!. || 6-39 ||
భావము.
కృష్ణా! నా ఈ సందేహాన్ని సమూలంగా ఛేదించ తగిన వాడివి నీవే.
నా అనుమానమును తీర్చగలిగిన వారు లోకములో నీకంటే ఎవరూ లేరు.
శ్రీకృష్ణభగవానుడిట్లు పలికెను.
తే.గీ. అర్జునా! యోగమునభ్రష్టుడయినవాని
కిహపరంబుల నాశన మెన్న లేదు.
మంచి వానికి దుర్గతి మహిని రాదు,
భయము పొందగ పనిలేదు నయనిధాన!. || 6-40 ||
భావము.
అర్జునా యోగభ్రష్టుడికి ఈ లోకములో కానీ పరలోకములో కానీ నాశనము
లేదు. నాయనా! మంచి పని చేసేవాడెవడూ దుర్గతిని పొందడు కదా.
తే.గీ. అరయుమోయి, యోగభ్రష్టు డందు పుణ్య
లోకములనందు వసియించి, శ్రీకరముగ
పుణ్యకర్ములయింట తా పుట్టి, యచట
భోగభాగ్యంబులన్ దేలు పుడమిపైన. || 6-41 ||
భావము.
యోగభ్రష్టుడు పుణ్యలోకాలని పొంది అనేక సంవత్సరాలు అక్కడ
నివసించి. తరవాత శుచివంతులు, శ్రీమంతులు ఐన వారి ఇంట జన్మిస్తాడు.
తే.గీ. అటుల కాని యోగభ్రష్టు డనితరమగు
జ్ఞాన సంపన్నులిండ్లలో కలిగి జన్మ
నిహపరంబులనందెడు మహిని పార్థ!
కనగ నరుదైన జన్మంబు ఘనుడ! వింటె?. || 6-42 ||
భావము.
లేదా యోగ భ్రష్టుడు జ్ఞానులైన ఇండ్లలో పుడతాడు. లోకములో
ఇట్టి జన్మ చాలా అరుదైనది.
తే.గీ. పూర్వదేహపుయోగంపుబుద్ధినచట
తిరిగి పొంద సాధనచేయు నిరుపమగతి,
యోగమది పండి మరల తా యోగియగును,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 6-43 ||
భావము.
కురునందనా! అక్కడ పూర్వ దేహ సంబంధమైన యోగ బుద్ధిని
పొంది, ఆస్థాయి నుండే తిరిగి సంపూర్ణ యోగ సిద్ధిని పొందడానికి ప్రయత్నిస్తాడు.
తే.గీ. అవనిపైన యోగభ్రష్టు డనుపమగతి
సాధనము చేయు వివశుడై జయ సుయోగ
మార్గమును గాంచ లాగును మనసతనికి,
ప్రణవమంత్రమున్ బలికినన్ వరలగలడు.. . || 6-44 ||
భావము.
పూర్వ జన్మలో చేసిన అభ్యాసం వలన యోగ భ్రష్టుడు వివశుడై
యోగము వైపు లాగబడతాడు. యోగమును గురించి కేవలము కుతూహలము
చూపినా, ఓంకారమును జపించుట వలన లభించే వైదిక కర్మ ఫలాన్ని
దాటి పోతాడు.
తే.గీ. యోగి సద్దీక్షతో డ చేయు జతనమున,
పాపముల నుండి విడివడి, పరమగతిని
శుద్ధుడై సదభ్యాసపు శుద్ధ ఫలము
చేత పొందు నో యర్జునా! ఖ్యాతిగాను.. || 6-45 ||
భావము.
యోగి దీక్షతో చేసే ప్రయత్నము వలన పాపములన్నింటి నుండి విడివడి శుద్ధుడై, అనేక జన్మల అభ్యాసము చేత
యోగసిద్ధిని పొంది పరమగతిని(మోక్షం)చేరుకొనును.
తే.గీ. అర్జునా! తాపసుల కంటె నధికుడరయ,
జ్ఞానులకు మించు నధికుడు, కర్ములకును
మించు నధికుండు యోగియే, మించుచీవు
యోగి కావలె పడయ సద్యోగమిలను.. || 6-46 ||
భావము.
అర్జునా! తపస్సు చేసేవారికంటే, జ్ఞానులకంటే, జ్ఞానులకంటే, కర్మచేసే వారికంటే కూడా యోగి అధికుడు. అందుచేత
నువ్వు (ఆత్మ సంయమ)యోగివి అగుము.

తే.గీ. మనసు నాపైన నిలిపెడి మహిత యోగి
నన్ను సేవించునుత్తముం డెన్న యోగి
పుంగవుండిలఘునులలో పుంగవుండు,
నీవు కావలెనట్టుల నిరుపమముగ.. . || 6-47 ||
భావము.
యోగులందరిలో తన మనస్సుని నాలో నిలిపి శ్రద్ధగా ఎవరు సేవిస్తారో. అతడు ఉత్తముడని నాఅభిప్రాయము.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " ఆత్మసంయమ యోగము " అనెడి
6వ అధ్యాయము. సమాప్తము.

7వ అధ్యాయము.
జ్ఞానవిజ్ఞానయోగము.

శ్రీభగవానువాచ|
భావము.
శ్రీకృష్ణభగవానుడనుచున్నాడు.
తే.గీ. మనసు నాపైన నిలుపుచు మహిత యోగ
మభ్యసించుచు మదిని న న్నాశ్రయించి,
శంకయే లేని విధముగా చక్కగ నను
పూర్తిగా నెఱ్ఱెఱుఁగుదువో యార్తి వినుము.. || 7-1 ||
భావము.
నాపై మనస్సును లగ్నము చేసి,యోగాన్ని అభ్యసించుచు నన్ను ఆశ్రయించి,
నిస్సంశయముగా, క్షుణ్ణముగా ఏ విధముగా తెలుసుకో గలవో దానిని గురించి ఆర్తితో వినుము.
తే.గీ. అనుభవ జ్ఞానమున గల ఘనతరమగు
శాస్త్ర విజ్ఞానమును నీకు చక్కగాను
తెల్పుదున్ సర్వమున్ నీకుఁ దెలిసిపోవు
తెలియవలసినదుండదు తెలియనిద్ధి. || 7-2 ||
భావము.
అనుభవముతోఁ గూడిన శాస్త్ర పరిజ్ఞానమును నీకు పూర్తిగా చెప్పుదును. దీనిని
తెలుసుకున్న పిదప నీకు వేరుగా తెలుసుకొనవలసినది ఏదియూ ఉండదు.
తే.గీ. మోక్ష సిద్ధికై యత్నించు భూమిపైన
వేలలో నొక్కడే, యందు వేలలోన
నొక్కడే నన్నెఱుంగును నిక్కమిదియె,
పుణ్యసత్ఫలయుతునకే పొసగునిద్ధి.. || 7-3 ||
భావము.
వేలాది మనుష్యులలో ఏ ఒక్కరో మోక్షసిద్ధి కోసం ప్రయత్నింతురు.
అలా ప్రయత్నించే సిద్ధులలో కూడా ఏ ఒక్కరో నన్ను యథార్థముగా
తెలుసుకో గలుగుదురు.
తే.గీ. అగ్ని, భూమియు, వాయువు నాకసమును,
నీరు, మనసును, బుద్ధ్యహంకారము లవి,
యష్టప్రకృతులు నావిగా నరయుమీవు,
తెలియఁ జెప్పెద నేనవి తెలియు మీవు.. || 7-4 ||
భావము.
భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము మరియు మనస్సు బుద్ధి,
అహంకారము అనునవి నా ప్రకృతి ఎనిమిది విధాలుగా ఉన్నది.
తే.గీ. ఓమహాబాహుడా! యల్ప యొప్పిదమిది,
యిదియె కాక వేరగు జీవి యయిన ప్రకృతి
నాది, కనుమిది, దాననే నడచుచుండు
జగము, లేదన్యమెంచినన్, ప్రగణితముగ.. || 7-5 ||
భావము.
ఓ మహానుభాహుఁడా! ఇది అల్పమైనది. ఇంతకన్నా వేరై జీవుడిగా మారినదీ
నా పరమైన ప్రకృతి అని తెలుసుకో. దాని వలననే ఈ జగత్తు భరించబడును.
తే.గీ. అన్ని ప్రాణులకునుమూల మరసిచూడ
యిట్టి యీ నా ప్రకృతిమూల మిదియె నిజము,
సృష్టి యుత్పత్తి నాశముల్ చేయుదేను
నేనె మూలమంచెఱుఁగుము నిఖిలమునకు.. || 7-6 ||
భావము.
ఈ నా ప్రకృతి అన్ని ప్రాణులకీ మూలమని తెలుసుకో. యావత్తు
జగత్తు యొక్క ఉత్పత్తి, నాశనములకు మూలము నేనే అని తెలుసుకొనుము.
తే.గీ. ఓ ధనుంజయా!నన్నుమించొక్కటైన
లేదు, లోకాన, సర్వమున్ నాదు కృషిని
నడుచు, సర్వమున్, నా యందె నడపబడును
దారమున మణులట్టులే ధీరవర్య!. || 7-7 ||
భావము.
ధనుంజయా! నాకన్నా ఏక్కువైనది ఏదీలేదు. జగత్తు యావత్తు దారంలో
మణులవలె నాలో గుచ్చబడి ఉన్నది.
తే.గీ. నీరు రుచి నేనె, వేద యోంకార మేనె,

తలప నెలవంక , సూర్యుల వెలుగు నేనె,
నేనె మనుజులన్ దీక్షయు, నింగిలోన
శబ్దమున్ నేనె, గ్రహియించు జయనిధాన!. ‖ 7-8 ‖
భావము.
కౌంతేయా! నీటిలోని రుచిని, సూర్యచంద్రులలోని వెలుగును,
వేదాలలోని ఓంకారమును, ఆకాశములో ఉన్న శబ్ద గుణమును.
మానవులలోని పట్టుదలను నేనే.
తే.గీ. నేనె పృథ్వీలో వాసనన్, నేనె యగ్ని
లోని వేడిని, జీవులలోని ప్రాణ
మేనె, తపము తాపసులలో నేనె యెఱుఁగ
నన్నియున్నేనె, యెఱుఁగుమో యర్జునుండ!. ‖ 7-9 ‖
భావము.
నేను పృథ్వీలోని వాసనని. అగ్నిలోని వేడిని. జీవుల లోని ప్రాణాన్ని.
తపస్సు చేసేవారిలో తపస్సుని నేనే సుమా.
తే.గీ. జీవులన్నింటిలోనున్న జీవమగు స
నాతనమగు బీజము నేనె, జ్ఞానులందుఁ
దెలివి నేనేను, ప్రతిభులన్ దెల్లమయెడి
ప్రతిభ నేనౌదునర్జునా పరులు కారు. . ‖ 7-10 ‖
భావము.
అర్జునా! అన్ని జీవులలో సనాతన బీజాన్ని నేను అని తెలుసుకో.
బుద్ధిమంతులలోని తెలివిని. ప్రతిభా వంతుల లోని ప్రతిభను నేనే సుమా.
తే.గీ. కామరాగాదులే లేక కలిగి యున్న
బలము నేనును బలునందు భరతకులజ!
ధర్మబద్ధమౌ కామము తలప నేనె
జీవులందున, గనుమిది, భావమరసి.. ‖ 7-11 ‖
భావము.
ఓ భరతశ్రేష్ఠుడా! బలవంతులలోని కామరాగాలు లేని బలాన్ని నేను. జీవులలో
ధర్మ విరుద్ధము కాని కామము కూడా నేనే సుమా.
తే.గీ. నా వలన వచ్చుచుండెడి భావములవి,
తామసిక, రాజసికములుఁ దలప సాత్వి
కములు, నా లోన నుండెడున్ ఘనతరముగ,
నేను వాటిలో లేనని నీవెఱుఁగుము.. ‖ 7-12 ‖
భావము.
ఇంకా ఏవి తామసిక, రాజసిక, సాత్విక భావాలో అవన్నీ నా వలననే వచ్చునని
గ్రహించు. అయితే నేను వాటిలో లేను. అవినాలోననే ఉన్నవి.
తే.గీ. త్రిగుణపూర్ణ భావాళిచే బ్రగణితముగ
భ్రాంతిలో బడి లోకము ప్రస్ఫుటముగ
వీటికన్నతీతమై వెలుగుచున్న
నవ్యయుండగు నన్నువా రరయఁబోరు.‖ 7-13 ‖
భావము.
మూడుగుణాలతో నిండి ఉన్న ఈభావాల చేత ప్రపంచము యావత్తూ
భ్రాంతిలో పడి, వీటికన్నా అతీతమూ, అవ్యయమూ అయిన
నన్ను గుర్తించలేదు .
తే.గీ. భువిని త్రిగుణాన్వితపు మాయ నెవడుదాటు?
నేను సృష్టించితిని దీని నెనరున నను
నెవరు సేవింతురో వార లెఱుకఁ గలిగి
దాట గలుగుదు రీ మాయ, తత్వమరసి. . ‖ 7-14 ‖
భావము.
దివ్యమైన, త్రిగుణాలతో కూడిన నా ఈ మాయ దాట రానిది. ఎవరు నన్నే
సేవిస్తారో వారు ఈ మాయని దాట గలరు.
తే.గీ. మూఢులున్, దుష్కృతులు, నధములును, మాయ
చేత జ్ఞానము లేనట్టి ఛిద్రమతులు,
నసుర భావ భరితులౌ నరాధములును,
నన్ను సేవింపఁ జాలరు మన్ననమున.. ‖ 7-15 ‖
భావము.
దుర్మార్గులు మూఢులు, మాయ చేత జ్ఞానం నశించిన వారు, అసురభావాన్ని
ఆశ్రయించిన వారు ఐన నరాధములు నన్ను సేవించరు.

తే.గీ. ఆర్తు, డర్థార్థి, జిజ్ఞాసు, వవని జ్ఞాని,
యనెడి నలువురు సేవింతు రనితరమగు
భక్తితో నర్జునా! నన్ను, శక్తికొలది,
నీవు గ్రహియింపుమిద్ధియు నిండుమదిని.. ‖ 7-16 ‖
భావము.
భరత కుల శ్రేష్టుడవైన ఓ అర్జునా! ఆర్తుఁడూ, జిజ్ఞాసువూ, అర్థార్థీ, జ్ఞాని
అనే నాలుగు రకాల పుణ్యాత్ములు నన్ను సేవింతురు.
తే.గీ. అట్టి నలువురిలో నన్ను ననితరమగు
భక్తిఁ గలుగుచు సేవించు వాఁడు శ్రేష్ఠుఁ
డతనికిష్టంబు నేనౌదు నతఁడె నాకు
నిష్టుడంచు గ్రహింపుమో యింద్ర తనయ!. ‖ 7-17 ‖
భావము.
ఈ నలుగురిలో నిత్యము నాతో కూడి పరమాత్మనైన నాయందు మాత్రమే
భక్తి కలిగి ఉండెడి జ్ఞాని శ్రేష్ఠుఁడు. అటువంటి వానికి నేను ఎక్కువ ప్రియుఁడను.
అతఁడే నాకు కూడా ఇష్టుడు.
తే.గీ. వీరలంద రుదారులే, వీరిలోన
జ్ఞాని నాదౌ స్వరూపమౌన్, కారణమిదె
నన్నె సర్వోత్తమగతిగ నెన్ను జ్ఞాని,
యాశ్రయించును నన్నే నవిశ్రమముగ.. ‖ 7-18 ‖
భావము.
వీరందరూ ఉదారులే. జ్ఞాని మాత్రం నాస్వరూపమని నా అభిప్రాయము.
ఎందుకనగా అతఁడే సర్వోత్తమైన గతి అని నన్నే ఆశ్రయించి ఉండును.
తే.గీ. నరుఁడనేకజన్మల తుదిన్ జ్ఞాని యగుచు
సర్వమున్ వాసుదేవుఁడే శాశ్వతుఁడని,
నన్నె కొలుచును, భువిపైననెన్న నిట్టి
వారలరుదుగా నుందురు ప్రస్ఫుటముగ. . ‖ 7-19 ‖
భావము.
అనేక జన్మల తరువాత నరుఁడు జ్ఞాన వంతుడై సర్వమూ
వాసుదేవుడని నన్ను కొలుచును.అట్టి మహాత్ముడు చాలా అరుదుగా ఉంటాడు.
తే.గీ. సహజమైన స్వభావాన సకలవాంఛ
ల నిల దీర్చుకొనగ, జ్ఞాన ఖని నశింప,
నితర దేవతలను గొల్చు క్షితిని జ్ఞాని,
నియమనిష్ఠలతోడను నిరుపమముగ.. ‖ 7-20 ‖
భావము.
తన సహజ స్వభావానికి లోనై ఆయా కోరికల వలన జ్ఞానం హరించుకు పోగా
ఆయా నియమాలని పాటించుచు వారు ఇతర దేవతలను ఆరాధింతురు.
తే.గీ. భక్తు లెవరెవ రేస్వరూపములలోన
శ్రద్ధతోడుత దైవంబు నుద్ధతిగను
కోరుకొందురో వారిలో కొలుపు దేను
భక్తి నా దేవతలపైన ప్రబలనిత్తు.. ‖ 7-21 ‖
భావము.
ఏయే భక్తులు ఏయే రూపములో భగవంతుడిని శ్రద్ధతో ఆరాధించవలెనని
కోరుకొందురో ఆయా భక్తులకు ఆయాదేవతయందే అచంచలమైన శ్రద్ధని నేను కలిగింతును.
తే.గీ. భక్తు లెవ్వార రెట్టిదైవముల గొలువ
నెంతు రవ్వారికినిభక్తి నెనరగొల్పి
వారికాదైవ శక్తిగా ప్రబలి నేనె
కోర్కెలను తీర్తు, గ్రహియించుకొనుము పార్థ!‖ 7-22 ‖
భావము.
అతడు శ్రద్ధతో కూడుకొని ఆరూపాన్ని ఆరాధించ సాగుతాడు. నాచే
ప్రసాదింప బడిన ఆ కోరికలను,తాను ఆరాధించిన దేవతారూపముద్వారా పొందుదురు.
తే.గీ. అల్ప బుద్ధులయినవారి కందు ఫలము
లరయ నశియించు, నాదేవతాళిఁ గొలువఁ
జేరుదురు దేవతలను, నన్ జేరుదు రిల
నన్ను సేవించువారలు మన్ననముగ.‖ 7-23 ‖
భావము.
అల్ప బుద్ధులైన వారికి లభించే ఫలం నశించి పోయేదిగా
ఉండును. దేవతలను ఆరాధించేవారు దేవతలను చేరుదురు,

నన్ను ఆరాధించేవారు నన్ను చేరుదురు.
తే.గీ. పరమమున్ శ్రేష్ఠతమమునై పరగు నాదు
గుణము నెఱుఁగని వారలు కనుదురు నను
పరిమితాకారుఁడ ననుచుఁ, దరచి చూడ
జ్ఞాన చక్షువునకు నేను కనబడుదును.|| 7-24 ||
భావము.
పరమము, సర్వశ్రేష్టమునైన నా స్వభావం ఎఱుఁగని,
తెలివి తక్కువ వాళ్ళు ఇంద్రియాలకు గోచరము కాని పరిమితమైన
రూపముగా భావింతురు.
తే.గీ. యోగ మాయావృతుడనయి యున్న నేను
కనఁబడనుగ యందరికిని, కనగ లేదు
మూఢ లోకము నాశనము భువి లేని
వానిగా నన్ను, నర్జునా! జ్ఞాన భాస!|| 7-25 ||
భావము.
యోగమాయ చేత ఆవరింపబడి ఉన్న నేను అందరికి కనపడను. నన్ను
ఈ మూఢ లోకం పుట్టుకా నాశనం లేనివానిగా తెలుసుకొన లేదు.
తే.గీ. నే నెఱుంగుదును, గతించి, లేని వారి,
నున్నవారిని, జనియింప నున్నవారి
నిట్టి నన్నెఱింగినవారి నరయ లేరు.
కనఁగ లేరిల నరుడ! నన్ ఘనతరముగ. || 7-26 ||
భావము.
నేను గతించిన జీవులను, ఇప్పుడు ఉన్నవాళ్ళనూ, ముందు పుట్టబోయే
వారినీ ఎఱుఁగుదును. నన్ను మాత్రం ఎవరూ ఎరుగరు.
తే.గీ. ఓ పరంతపా! రాగంబు నొనరు ద్వేష
ములను పుట్టుమోహంబున పుట్టినపుడె
జీవు లొందెడు భ్రాంతిని, ధీవరేణ్య!
అర్జునా గ్రహియింపుమీ వహము విడిచి. || 7-27 ||
భావము.
పరంతపా! అర్జునా! రాగద్వేషాల నుండి జనించే ద్వంద్వాల మోహం
వలన పుట్టుకతోనే అన్ని జీవులూ భ్రాంతిని పొందుతున్నవి. || 7-28 ||
తే.గీ. పుణ్య కర్మల వలననే గణ్య జనుల
పాపమంతంబగునో వారు ద్వంద్వ మోహ
ములకు దూరులై చెదరక నిలచు దీక్ష
తోడ నన్ గొల్తురరయుమా, దుర్విదార!. || 7-28 ||
భావము.
పుణ్య కర్మల వలన ఏ జనుల యొక్క పాపం అంత మైనదో, వాళ్ళు, ద్వంద్వ
మోహాల నుండి పూర్తిగా విముక్తులై చెదరని దీక్షతో నన్ను కొలుస్తారు.
తే.గీ. సాధకులు జరా మరణముల్, సత్వరంబె
విడువనెంచి నన్ గొలుతురో, విశ్వమందు
నాత్మ తత్వ జ్ఞులగుదు రాయాత్మనెఱిగి,
కర్మమునుగూర్చెఱుఁగుదురు, ధర్మరూప!|| 7-29 ||
భావము.
జరా మరణాల నుండి విడుదల కావాలని ఎవరు నన్ను ఆశ్రయించి సాధన చేస్తారో వారు సంపూర్ణముగా ఆబ్రహ్మమూ ఆత్మ
తత్వాన్ని యావత్తు కర్మనీ తెలుసుకొందురు.
తే.గీ. ఆదిభూతంబుతోడనా యాది దైవ
తంబుతోడను నాది యజ్ఞంబుతోడ
కూడియున్న నన్నెవరిల గొప్పగాను
తెలుసుకొందురో తుదిని నన్ తెరుగఁ గను.|| 7-30 ||
భావము.
సమస్త అధిభూత (పదార్ధ క్షేత్రము), అధిదైవ (దేవతలు), మరియు అధియజ్ఞము (యజ్ఞములకు ఈశ్వరుడు) లకు అధిపతిని
నేనే అని తెలుసుకున్న జ్ఞానోదయమయిన జీవాత్మలు, మరణ సమయంలో కూడా పూర్తిగా నా యందే స్థితమై ఉండును.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " జ్ఞానవిజ్ఞాన యోగము " అనెడి
7వ అధ్యాయము. సమాప్తము.

8వ అధ్యాయము.
అక్షరబ్రహ్మయోగము..

అర్జునుడనుచున్నాడు.
తే.గీ. ఏది బ్రహ్మమౌ? నధ్యాత్మ యేది? కృష్ణ!
ఏది కర్మమౌ నధిభూత మేదియగును?
దేనినధిదైవత మనంద్రు? తెలుపుమయ్య!
వ్యక్తమగునట్లు చెప్పుమా యసమతేజ!. ‖ 8-1 ‖
భావము.
పురుషోత్తమా! ఆ బ్రహ్మ ఏది? ఆధ్యాత్మము ఏది? కర్మ అంటే ఏమిటి?
అధి భూతమని దేనిని అందురు? అధి దైవతమని దేనిని అందురు.
తే.గీ. ఎట్టు లుంటివి దేహాన? నెట్టులీవు
నిగ్రహాత్ముల కెట్టుల నేర్పు మీర
ప్రాణములు వీడు సమయాన ప్రణవరూప!
తెలియగాబడుచుంటివి తెలుపుమయ్య! ‖ 8-2 ‖
భావము.
మధుసూధనా! ఈ శరీరంలో ఎలా ఉన్నావు? నిగ్రహ వంతులచేత
మరణ సమయంలో నీవు ఎలా తెలియఁ బడుదువు.
శ్రీకృష్ణభగవానుడనుచున్నాడు.
తే.గీ. బ్రహ్మమది నాశరహితమౌ పరమ మరయ,
నది స్వభావంబుచేత నాధ్యాత్మ మనగ
పిలువబడు, జీవసృష్టిని వెలయ జేయు
కార్యమే కర్మ మెఱుఁగుమా ఘనుడ పార్థ!. ‖ 8-3 ‖
భావము.
నాశరహితమైన యీ బ్రహ్మము గొప్పదయినది. ఆయన యొక్క
స్వభావము ఆధ్యాత్మ మనబడుతుంది. జీవరాశిని పుట్టించే సృష్టి
కార్యమునే కర్మ అంటారు.
తే.గీ. అరయ నధిభూతము నశించునదియె పార్థ,
పురుషు డధిదైవతంబె యా పురుషులందు
నచట నధియజ్ఞుఁడను నేనె, యనుపమాన!
జ్ఞాన సంభాసుడా! పార్థ! కాంచుమిటుల.. ‖ 8-4 ‖
భావము.
నర శ్రేష్ఠుడా! నశించి పోయే తత్వము అది భూతము. జీవుడు అధి దైవతము.
జీవులలో అధి యజ్ఞుఁడు నేనే.
తే.గీ. అంతకాలంబునన్ నన్ను నరసి కనుచు
దేహమును వీడువారు స్వాధీనమతులు
నాదు తత్వమొందుదురయ, నయవిభాస!
తెలియుమియ్యది నీవు సందేహమేల?. ‖ 8-5 ‖
భావము.
అంతకాలంలో కూడా నన్నే స్మరించుకుంటూ ఎవరు శరీరాన్ని వదిలి
వెళుతున్నారో, వారు నా తత్వాన్నే పొందుదురు. ఇందులో సందేహములేదు.
తే.గీ. దేహమును వీడు సమయాన దేనిపయిని
చిత్తముండునో దానినే జీవుడొందు,
నన్ను దలచుచున్ గతియించ నన్ను జేరు,
ముక్తి నొసగెడి నన్ గన ముక్తి కలుగు. ‖ 8-6 ‖
భావము.
కుంతీ కుమారా! మరణ సమయంలో ఏ విషయాన్ని స్మరిస్తూ కళేబరాన్ని
వదులుదురో, నిత్యమూ ఆ విషయాన్నే తలచుకోవడం చేత మరణానంతరము దానినే పొందుదురు.
తే.గీ. కాన, నీ వన్ని కాలాలఁ గనుము నన్ను,
యుద్ధమును జేయుమట మనో బుద్ధులరసి
నాకునర్పింప నీవంక నన్నుఁ జేరు
దువయ, సందేహమే లేదు, ప్రవర పార్థ! ‖ 8-7 ‖
భావము.
అందుచేత నువ్వు అన్ని కాలాలలోనూ నన్నే స్మరించు, యుద్ధము
చేయుము. మనో బుద్ధులను నాకు సమర్పించిన నీవు నన్నే పొందుదువు.
ఈ విషయములో సందేహము లేదు.
తే.గీ. అంచితాభ్యాస యోగ యుక్తాత్ములరయ

ఘనతరంబగు చింతనన్ ఘనుడగు పర
మపురుషుని చేరుకొందురు, మరువ కిద్ది,
పార్థ! చింతలన్ విడిచినన్ బరగు సుఖము.. || 8-8 ||
భావము.
అర్జునా అభ్యాస యోగంతో కూడుకొని మనస్సు ఇతర విషయాలకు
పోనప్పుడు, నిరంతర చింతన వలన దివ్యమైన పరమ పురుషుని
చేరుకొందువు.
తే.గీ. శాసకుఁడు, సనాతనుడును, సర్వవిదుడు,
తలప సూక్ష్మాతిసూక్ష్ముడు, తలప నలవి
కాని రూపుడు, భర్త, ప్రకాశ రవియు,
తపసునకతీతుడతనినితలతురెవరొ, || 8-9 ||
భావము.
సర్వజ్ఞుడు, సనాతనుడు, శాసకుడు, సూక్ష్మాతి సూక్ష్మమైన వాడు,
అందరిని భరించే వాడు, చింతించడానికి అలవికాని రూపం కలవాడూ,
సూర్యుని వలె తేజో వంతుడూ, తపస్సుకి అతీతమైన వాడూ, అయిన
పురుషుణ్ణి ఎవరు నిత్యమూ ధ్యానిస్తారో,
తే.గీ. వారు ప్రాణము విడువేళ ధీర మతిని
భక్తితో యోగ బలముచే ముక్తి గనుదు
రరయుచున్ హరిన్ భృూమధ్యమందు నపుడె,
యైహికము వీడి పరకాంక్షులతులితముగ.. || 8-10 ||
భావము.
అతడు ప్రాణం వదిలి పోయే సమయంలో చలించని మనసుతో,
భక్తిని కలిగి ఉండి, యోగ బలంతో, ప్రాణాన్ని కనుబొమల మధ్య చక్కగా
నిలిపి దివ్య మైన ఆపరమ పురుషుణ్ణి చేరుకుంటారు.
తే.గీ. వేదవేత్త లశ్వరమందు రేదొ మరియు
రాగ దూరులై రచయితల్ సాగు దేని
నొంద బ్రహ్మచర్యమునను నొప్పిదముగఁ
దెలిపెదను దాని నెఱుగంగఁ, దెలియుమీవు.. || 8-11 ||
భావము.
వేదవేత్తలు దేనిని నాశనం లేనిదిగా చెబుతారో, రాగ రహితులైన
రచయితలు దేనిని చేరుకుంటారో, దేనిని కోరి బ్రహ్మచర్యంలో
చరిస్తారో ఆ పదాన్ని నీకు సంగ్రహంగా చెప్పెదను.
తే.గీ. ఇంద్రియద్వారముల్ మూసి హృదయమాత్మ
లోన నిలుపుచు, బ్రాణమున్ లో సహస్ర
దళపు పద్మంబునను నిల్పి తాను యోగ
నిష్ఠతోడ సాధనచేయ నేర్వవలయు.. || 8-12 ||
భావము.
ఇంద్రియ ద్వారాలన్ని నిరోధించి, మనసును ఆత్మలో నిలిపి, శిరస్సులో
తన ప్రాణశక్తిని నిలబెట్టి యోగ నిష్ఠను అవలంబించవలెను.
తే.గీ. బ్రహ్మవాచక మోమ్మను పలుకు నెవరు
సంస్మరించుచు ప్రాణముల్ చక్క విడుచు
నతడు పరమగతిని పొందు, నవనిపైన,
నిజము గ్రహియింపుమర్జునా నీవు సతము.|| 8-13 ||
భావము.
బ్రహ్మ వాచకమైన ఓం అనే ఏకాక్షరాన్ని ఉచ్చరిస్తూ, ఎప్పుడూ
నన్ను స్మరిస్తూ, ఎవరు శరీరం విడిచి పెడతారో వారు పరమ గతిని
చేరుకొందురు.
తే.గీ. అన్య చింతన లేక న న్ననవరతము
చింతనము చేయు వారల చిత్తమందె
యుండి, సులభుడనై యొప్పి యుందు పార్థ!
నీవు గ్రహియింపు నా మాట నేర్పుమీర.. || 8-14 ||
భావము.
అర్జునా! మనస్సు ఇతర విషయాలవైపు వెళ్ళ నీయకుండా, నిరంతరమూ నన్ను ఎవరు స్మరింతురో నిత్య యుక్తుడైన ఆ
యోగికి నేను సులభుఁడను.
తే.గీ. పరమపదమైన నామోక్షపదము గన్న
మహితు లరయ నశాశ్వత, మహితమునగు
దుఃఖ మూల పునర్జన్మ తొలగి ముక్తి

పొంది సుఖియింతురవ్వారు పూర్ణ గతిని.. ‖ 8-15 ‖
భావము.
పరమ పదమైన నామోక్ష పదాన్ని పొందిన మహాత్ములు, దుఃఖానికి
ఉనికి పట్టూ, అశాశ్వతమూ అయిన పునర్జన్మని పొందరు.
తే.గీ. బ్రహ్మలోకము వరకును వచ్చునవియె
తిరిగి లోకములన్నియున్, తిరిగి జన్మ
మెత్తఁ జేయునవియె, నన్ను నెట్టులయిన
చేరిన విముక్తి కల్గును ధీర పార్థ! ‖ 8-16 ‖
భావము.
అర్జునా! బ్రహ్మ లోకం వరకూ అన్ని లోకాలూ తిరిగి వచ్చేవే, (పునర్జన్మను
ఇచ్చేవే). నన్ను చేరితే మాత్రం పునర్జన్మ ఉండదు.
తే.గీ. కనఁగ విధికి వేయి మహాయు గములు పగలు,
కాంచ నటులె వేయి మహాయు గములు రాత్రి,
తెలియువారలహోరాత్రములనెఱుంగు
వారని తెలియుమిపుడీవు పార్థ! కనుచు.‖ 8-17 ‖
భావము.
వేయి మహా యుగాలు బ్రహ్మకు ఒక పగటి కాలం. వేయి మహా యుగాలు
బ్రహ్మకుఒక రాత్రి కాలం. ఇది తెలిసిన వారు అహో రాత్రుల గురించి
తెలిసిన వారు.
తే.గీ. విధికి పగటివేళ జనించు విపుల వస్తు
జాల మవ్యక్తమందుడి, వేళ మళ్ళి
రాత్రి కన్నియు నవ్యక్త బ్రహ్మ మందు
లీనమైపోవు, తెలియుము జ్ఞాన విభవ!. ‖ 8-18 ‖
భావము.
బ్రహ్మ దేవునుని పగటి కాలంలో అవ్యక్తములో నుండి చరాచర వస్తు
జాలమంతా జనించును. రాత్రి కాగానే అవ్యక్తమైన బ్రహ్మము లోనే అంతా
లీనమై పోవును.
తే.గీ. పార్థ! జీవతతియు కర్మ వశము చేత
జన్మలెత్తుచున్ బోవుచు జరుపుచుండు,
బ్రహ్మకున్ రాత్రి యయినంత ప్రాణికోటి
నాశనంబగు నిజమిది, జ్ఞాన రూప!. ‖ 8-19 ‖
భావము.
అర్జునా ఈ జీవ సముదాయమే కర్మ వశముగా అనేక జన్మలు
ఎత్తుతూ (బ్రహ్మకు)రాత్రికాగానే నశించును.
తే.గీ. అట్టి యవ్యక్త ప్రకృతికి, ననరూప
మును వినాశ రహితసనాతనమునయిన
భావమగుబ్రహ్మమునశించఁబోవదెపుడు
జీవులన్నియు పోయినన్, ధీవిశాల!. ‖ 8-20 ‖
భావము.
ఆ అవ్యక్త ప్రకృతికంటే, భిన్నమూ, ఉత్తమమూ, ఇంద్రియాలకు
గోచరము కానిదీ, సనాతనమూ అయిన భావము(పరమాత్మ)ప్రాణులన్నీ
నశించినా నశించకుండా ఉండును.
తే.గీ. ఇంద్రియాగోచరంబునై యెసగుచుండు
నరయ నవినాశమగు పరమాత్మ పథము
జేరుటుత్తమ మది ముక్తి జీవులకిడు,
నేనె యామార్గమర్జునా! ధీనిధాన!. ‖ 8-21 ‖
భావము.
ఇంద్రియాలకు గోచరము కానిదీ, నాశనము లేనిదీ, అని చెప్ప బడిన
ఆ పరమాత్మ భావమే చేరవలసిన ఉత్తమ మార్గమని ఋషులు
చెప్పుదురు. దేనిని పొందిన ప్రాణులు జన్మించరో అదే ఆ సర్వోత్తమస్థానము, ఆ సర్వోత్తమ స్థానమే నేను.
తే.గీ. అన్ని ప్రాణులునెవ్వనియందు కలవొ,
యంతటన్ గలడెవ్వఁడో యట్టి దైవ
మనుపములగుభక్తులకరయగను లభ్య
మగును, గ్రహియింపుమర్జునా! యమరవినుత!. ‖ 8-22 ‖
భావము.
అర్జునా ఎవనిలో అన్ని ప్రాణులు ఉన్నవో, ఎవరు అంతటా
వ్యాపించి ఉన్నారో ఆ పరమ పురుషుడు అనన్య భక్తి వలననే

లభించును.
తే.గీ. ఎట్టి సమయాన మరణింప నిముడు ముక్తి,
యెట్టి సమయాన మరణింప పుట్టుకొదవు
యోగులకునట్టి కాలమ్ము నూహచేయ
దెల్పెదను నీకు నర్జునా! తెలియునటుల.. || 8-23 ||
భావము.
భరతకుల శ్రేష్టుడా! ఏకాలంలో శరీరం వదిలి వెళ్ళిన యోగులు
తిరిగి జన్మించరో. ఏ కాలంలో శరీరం విడిచి వెళ్ళిన యోగులు తిరిగి
జన్మిస్తారో, ఆ కాలం గురించి చెబుతాను విను.
తే.గీ. అగ్ని, పగలుత్తరాయణ మారునెలలు
శుక్లపక్షంబులనుమార్గ సుగతి నెంచి
బ్రహ్మమును జేరుచుందురు బ్రహ్మవిదులు.
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర. || 8-24 ||
భావము.
అగ్ని, పగలు, శుక్లపక్షం, ఉత్తరాయణం ఆరు నెలలు అనే మార్గంలో
బ్రహ్మ విదులు బ్రహ్మను చేరుకొందురు.
తే.గీ. కృష్ణపక్షంబు, పొగ, రాత్రి, తృష్ణ, దక్షి
ణాయనమున యోగికి చూడ నారునెలలు,
పయనమును జేసి చంద్రుని వరలు జ్యోతి
పొంది వచ్చును తిరిగి తాన్, పుణ్యగేహ!. || 8-25 ||
భావము.
పొగ, రాత్రి, కృష్ణపక్షం ఆరు నెలలు దక్షిణాయనం అనే మార్గంలో
ప్రయాణించిన యోగి చంద్రుని జ్యోతిని పొంది తిరిగి వస్తాడు.
తే.గీ. శుక్ల, కృష్ణ, మార్గము లవి చూడ రెండు
శాశ్వతంబని తలపనౌన్, చక్కనైన
శుక్లమున జన్మ కలుగదు, చూడ మనకు,
కృష్ణ యందు పునర్జన్మ క్షితిని కలుగు. || 8-26 ||
భావము.
జగత్తులో శుక్ల, కృష్ణ అనే ఈరెండు మార్గాలు శాశ్వతం అని
భావించబడుచున్నవి. మొదటి దానివలన పునర్జన్మ కలగదు.
రెండవ దాని వలన కలుగుతుంది.
తే.గీ. పార్థ! యీ రెండు మార్గముల్ పరమయోగి
యెఱిఁగి భ్రమియింప డీవింక యెఱిఁగి యన్ని
కాలములలోన యోగివై ఘనత నిలువు
మహిత మార్గమ్ము దీనిని మరువబోకు.. || 8-27 ||
భావము.
పార్థా! ఈ రెండు మార్గాలను ఎఱిఁగిన ఏ యోగీ భ్రమించడు. అందుచేత
అన్ని కాలాలలోను నీవు యోగయుక్తుడివి అగుము.
తే.గీ. వేద యజ్ఞ తపో దాన విధుల చేత
పుణ్యఫలమేది కల్గు తత్ పుణ్య ఫలము
నధిగమించు నిది కనంగ నరసి యోగు
లందుదురు దీనినే ముక్తి నందగోరి.
. || 8-28 ||
భావము.
వేదాలు, యజ్ఞాలు, తపస్సులు, దానాలలో ఏ పుణ్య ఫలం చెప్ప
బడినదో దానినంతటిని ఇది అధిగమిస్తుంది. దీనిని ఎఱిఁగిన యోగి
ప్రధానమైన పరమమైన స్థానమును అందుకొనును.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " అక్షరబ్రహ్మ యోగము " అనెడి
8వ అధ్యాయము. సమాప్తము.

9వ అధ్యాయము.
రాజవిద్యారాజగుహ్యాయోగము.
శ్రీకృష్ణుడిట్లనుచుండెను.
తే.గీ. నీ వశుభవిముక్తిన్బొంది నిరుపమాన
ముక్తి బొందుదువో యట్టి పూజ్యమయిన
బ్రహ్మ విజ్ఞానమున్ నీకు వరలఁ జెపుదు
నీర్ష్య లేనట్టి యర్జునా యెఱుఁగుమిదియు.. || 9-1 ||
భావము.
దేనిని తెలుసుకోవడం వలన నీవు అశుభం(సంసారం)నుండి విముక్తుడవు
అవుతావో అటువంటి అతి రహస్యమైన ఈ(బ్రహ్మ)జ్ఞానాన్ని అసూయా
రహితుడవైన నీకు విజ్ఞానంతో సహా చెబుతాను.
తే.గీ. సహ్య రాజవిద్యా రాజగుహ్యమిద్ధి,
యుత్తమము పవిత్రంబిద్ధి, చిత్తమునను
నిలుచుఁ దేలికగానిద్ధి, నిలుపు ధర్మ
మిద్ధి, యరయట తేలిక బుద్ధిమంత!. || 9-2 ||
భావము.
ఇది రాజవిద్యా, రాజగుహ్యము, పవిత్రమయినది, ఉత్తమమయినది.
దీనిని సులభముగా అర్ధము చేసుకొనవచ్చును. ధర్మ పరమైనది, అభ్యసించడం
తేలిక, నిలకడగా ఉంటుండినది.
తే.గీ. ధర్మమునునమ్మ రో పరంతప! ధరిత్రిఁ
గొందరట్టివారలు ననున్ మందమతులు
చేరబోవక మృత్యుసంసారబాధ
లందుచున్ సంచరింతురు, బంధనముల.. || 9-3 ||
భావము.
అర్జునా ఈ ధర్మంలో విశ్వాసం లేని పురుషులు నన్ను పొంద లేక
మృత్యు సంసార మార్గం లోనే తిరుగుతున్నారు.
తే.గీ. వ్యక్తమవనట్టి నాచేత వ్యాప్తమయ్యె
సృష్టి యంతయున్, జీవులు చేరి యుంద్రు
కనగ నా లోన, వారిలో కలుగబోను
నేను, నిజమిదే యర్జునా! జ్ఞాన భాస!. || 9-4 ||
భావము.
ఈ జగత్తు యావత్తు అవ్యక్తంగా ఉండే నాచేత వ్యాపించబడి ఉన్నది.
జీవులందరూ నాలో నిలిచి ఉన్నారు. అయితే నేను వాళ్ళలో లేను.
తే.గీ. లేవు ప్రాణులు నాలోన, నీవు నాదు
యోగ మహిమను కనుగొను మో నరుండ!
భూతసృష్టిని చేసి తత్ పోషకుఁడ న
యియును లేనయ్య వాటిలో, యిదినిజంబు.. || 9-5 ||
భావము.
ప్రాణులు కూడా నాలో లేరు. నా యోగమహిమని చూడు. భూత రాశిని
పుట్టింతును, భరింతును. కాని ఆభూతాలలో ఉండను.
తే.గీ. ఉండునాకసముననె ప్రచండవాయు
వెట్టులోయట్లె నాలోననే చరించు
ప్రాణులన్నియు సతతంబు పార్థ! కనుము.
నిజము గ్రహియించుమిప్పుడే నిర్భయముగ.. || 9-6 ||
భావము.
సర్వత్రా సంచరించే ప్రచండ వాయువు ఎలాగైతే ఆకాశంలోనే ఉండునో,
అటులనే అన్ని ప్రాణులు నా లోనే ఉనవని తెలుసుకో.
తే.గీ. పార్థ! కల్పాంతమందున ప్రాణికోటి
నాదు ప్రకృతిని పొందెడున్, నేనె మరల,
కల్పమారంభమైనప్డు కలుగు జీవ
కోటిని బయట వేయుదున్, గుంభనముగ.. || 9-7 ||
భావము.
కుంతీ కుమారా! కల్పము పూర్తి అయినప్పుడు జీవులందరూ నా ప్రకృతిని పొందుదురు. కల్ప ప్రారంభంలో జీవులందరిని
నేనే తిరిగి బయటికి వేయుచున్నాను.
తే.గీ. ప్రకృతి వశమైనదైన యీ ప్రాణికోటి
ని మరలను నాదు మాయచే న్దిరిగి తిరిగి

సృష్టిఁ జేయుచునుందును దృష్టిపెట్టి,
నీవు గ్రహియింపుమిద్ధియు నిరుపమాన!|| 9-8 ||
భావము.
ప్రకృతి వశమైన ఈ యావత్తును నేను నా మాయను ధరించి
తిరిగి తిరిగి సృజించుచుందును.
తే.గీ. పార్థ! కర్మలుంచవునన్ను బంధనమున,
కర్మలందు నిరాసక్తి కారణమున
నుందు నే నుదాసీనతనంది, నిజము,
కర్మబంధుడకానట్టి కారణమున.. || 9-9 ||
భావము.
ఓ ధనంజయా! ఆ కర్మలు నన్ను బంధించవు. ఆ కర్మలలో ఆసక్తి లేక
నేను ఉదాసీనంగా ఉంటాను.
తే.గీ. ప్రకృతి సృష్టించును చరాచరములు, నాదు
ఘనత రాధ్యక్షతన్ దీని కారణమున,
మరలమరలప్రవర్తించు మహిత సృష్టి,
నిజము గ్రహియింపు మో పార్థ! నిరుపమగుణ!|| 9-10 ||
భావము.
నా అధ్యక్షతన ప్రకృతి చరాచర ప్రపంచాన్ని సృజిస్తుంది. ఆ కారణం
చేతనే జగత్తు తిరిగి తిరిగి ప్రవర్తిస్తుంది.
తే.గీ. భూత జాలాధిపతినైన పురుషుడ నగు
దేహములనాశ్రయించిన మోహదూరు
నన్ను లక్ష్యంబు చేయరు నన్నెఱుఁగని
మూర్ఖ మానవు లర్జునా! పుడమిపైన. || 9-11 ||
భావము.
జీవరాశికి అధిపతినై ఉండీ మానవ శరీరాన్ని ఆశ్రయించిన (నా
పరమ తత్వాన్ని గుర్తెరుగలేని మూఢులు) నన్ను నిర్లక్ష్యము చేయుదురు.
తే.గీ. వారు వ్యర్థాశలను మరి వ్యర్థ కర్మ
ములను వ్యర్థమౌ యజ్ఞానమున్ జెలంగి
మతులు చెడిపోయి రాక్షస మతుల బృథ్వి
నాశ్రయించుచునుండుదురహరహంబు.. || 9-12 ||
భావము.
వారు వృధా ఆశలతో దండగమారి కర్మలతో, అనవసరమైన జ్ఞానంతో,
మతులు చెడి, భ్రాంతి గొలిపే ఆసురిక, రాక్షస ప్రకృతిని
ఆశ్రయించిన వారగుదురు.
తే.గీ. పార్థ! దైవీప్రకృతిని, ప్రపంచమందు
భూతరాశికాదియగు నన్ బూర్తిగ కను
దురు, మహాత్ములు, సేవించుదురు సతంబు,
పూర్ణమనములతోనొప్పి, మోదముననను.|| 9-13 ||
భావము.
అర్జునా! మహాత్ములైతే దైవీ ప్రకృతిని, భూత రాశికి ఆది అయి
నాశంలేని వాడిగా నన్ను తెలుసుకొని అనన్యమైన మనసుతో సేవింతురు.
తే.గీ. వారు నన్ను కీర్తించుచున్ పరమ నిష్ఠఁ
గలిగి సాధన చేయుచున్ గౌరవముగ
వందనంబులు చేయుచు భక్తితోడ
నాకు, నుపవసింతురునన్ను శ్రీకరముగ.. || 9-14 ||
భావము.
వారు ఎప్పుడూ నన్ను కీర్తిస్తూ, దృఢమైన నిష్ఠతో సాధన చేయుచు, భక్తితో
నాకు నమస్కరించుచు నిత్య యుక్తులై ఉపాసింతురు.
తే.గీ. పరులు కనగ ద్వైతాద్వైత భావములను
విశ్వమంతటన్ గల నన్ను ప్రీతితోడ
నుపవసింతురు దీక్షతో నుత్తమమగు
జ్ఞాన యజ్ఞంపు మార్గాన ఘనతరముగ.. || 9-15 ||
భావము.
మరి ఇతరులు జ్ఞానయజ్ఞము ద్వారా ఆరాధిస్తూ ఏకత్వ
(అద్వైత)భావంతో , వేరు అనే(ద్వైత)భావంతోనూ, విశ్వమంతటా
ఉన్న నన్ను ఉపాసింతురు.
తే.గీ. నేనె క్రతువును, యజ్ఞంబు నేనె కనగ,

నాహుతులు నేనె హోమంబు నేనె పార్థ!
నేనె మూలికల్, మంత్రంబు నేనె, యగ్ని
నేనె, యాహుతు లరయఁగ నేనె పార్థ!|| 9-16 ||
భావము.
నేనే క్రతువుని, నేనే యజ్ఞాన్ని, పితరుల కర్పించఁ బడే ఆహుతునినేను.
హోమము చేసే మూలికలు నేను. మంత్రమూ నేను. అగ్నిని ఆహుతిని
కూడా నేనే.
తే.గీ. జగతికినితల్లి తండ్రియు, ప్రగణితముగ
కర్మ ఫలదాత, వేద్యము, కనగ నేనె,
నేనె ఋగ్యజుస్సామముల్ నేనె ప్రణవ
మోంకృతి, నరయుమా పార్థ! యుత్తమముగ. || 9-17 ||
భావము.
ఈ జగత్తుకి తండ్రి, తల్లి, కర్మఫల ప్రదాత, తెలియబడవలసినదీ,
పవిత్రమైన ఓంకారమూ, ఋక్, సామ, యజుర్వేదాలు నేనే.
తే.గీ. నేనె గతి, భర్త, ప్రభువును, నేనె సాక్షి,
నేనె స్థానంబు వసియింప, నేనె శరణు,
నేనె యాప్తుడన్, నిధి నేనె, నేనె నవ్య
యమగు మూల హేతువునని యరయుమీవు.. || 9-18 ||
భావము.
నేను లక్ష్యమునూ, భరించేవాడిని, పాలించేవాడిని, అన్నిటికి సాక్షినీ,
సర్వానికి నివాస స్థానాన్ని, అందరికి శరణ్యమును, ఆప్తుడిని,
నేనే నిధినీ అవ్యయమైన మూలకారణమూ.
తే.గీ. నేనె తపమును, వర్షంబు నేనె కనగ,
నేనె గ్రహియింతు, సృజియింతు నేనె, వినుమ
నేనె మృతి కన, నమృతంబు నేనె, వింటె?
నేనె మంచిని, చెడ్డయున్ నేనె పార్థ!. || 9-19 ||
భావము.
ఓ అర్జునా! తపస్సు, వర్షము, గ్రహియించువాడిని, సృజించువాడిని,
మృతి, అమృతము, మంచియు చెడ్డయు అన్నీ నేనే.
తే.గీ. వేదములు మూడు చదివిన విజ్ఞులఖిల
పాపదూరులికను సోమపానులు, మరి
యజ్ఞ కర్తలున్ నన్గొల్చి యరిగి స్వర్గ
సుఖములొందుదు రర్జునా! సుగుణ గణుఁడ!|| 9-20 ||
భావము.
మూడు వేదాలనూ అధ్యనం చేసినవారు, సోమరసం త్రాగిన వారు.
పాపాలను నిర్మూలించుకున్న పుణ్యాత్ములు నన్ను యజ్ఞముల ద్వారా
పూజించి స్వర్గ వాసమును కోరుకొందురు. పుణ్య ఫలమైన ఇంద్ర లోకమును
పొంది, ఆ స్వర్గములో దివ్య భోగములను అనుభవింతురు.
తే.గీ. స్వర్గ భోగులు తమపుణ్య చయము తరుగ
మనుజ లోకంబునే చేరు మరల, పార్థ!
కర్మబద్ధులకీగతి కలుగుచుండు
నన్నె నమ్మిన ముక్తి సంపన్నులగును. || 9-21 ||
భావము.
(స్వర్గాన్ని కోరే)వారు విశాలమైన స్వర్గాన్ని అనుభవించి తమ పుణ్యం
వ్యయము అయిపోగానే మరల మానవ లోకములోకి ప్రవేశింతురు. ఈ విధముగా
వేదములలోని ఉత్తమ లోకములనిచ్చు కర్మ కాండను పట్టుకున్న
కామదాసులు (జనన మరణాలను) పొందుతుంటారు.
తే.గీ. అన్య చింతన లేక నన్ననితరగతి
నుపవసించుదురోవారల యోగము, మరి
క్షేమమును నేను వహియింతు ప్రేమతోడ,
నీవు గ్రహియింపవలె నిది నేర్పుతోడ.|| 9-22 ||
భావము.
అనన్య భావంతో నన్ను చింతిస్తూ నాయందే నిష్ఠ కలిగి, ఏజనులు నన్ను
పరిపూర్ణముగా ఉపాసింతురో, వారి యోగక్షేమములను నేనే వహింతును.
తే.గీ. భక్తు లన్యదేవతలను భక్తి గొలువ
యట్టిదేవతల్ నన్నె పూజాదికముల
సేవఁ జేయు టీవరయుమా చిత్తమందు

నేనె మూలమో యర్జునా నీవెఱుఁగుము. ॥ 9-23 ॥
భావము.
అర్జునా ఇతర దేవతల భక్తులు కూడా తమ దేవతలను శ్రద్ధతో
ఆరాధిస్తుంటే, వాళ్ళు కూడా విధానం లేకుండా నన్నే ఆరాధింతురు.
తే.గీ. అన్ని యజ్ఞంబులన్ భోక్తనరయ నేనె,
యధిపతియు నేనె, పూజింతు రన్యులయిన
దేవతాళిని వారు నన్ దెలియలేక
జన్మములు పొందుచుందురు సహజముగనె.. ॥ 9-24 ॥
భావము.
నేనే అన్ని యజ్ఞాలకి భోక్తని అధిపతిని. ఇతర దేవతలను ఆరాధించే
వారు యదార్థంగా నన్ను తెలుసుకోలేరు. అందువలన వారు
(మరలా జన్మలలో) దిగజారి పోవుచుండిరి.
తే.గీ. దేవతల గొల్వ చేరనౌ దేవతలను,
పితరులన్ గొల్వ చేరనౌ పితరుల నిక
భూతముల్ గొల్వ జేరనౌ భూతములను,
నన్నుఁ గొల్చిన చేరనౌ నన్నె పార్థ!. ॥ 9-25 ॥
భావము.
దేవతలను ఆరాధించే వాళ్ళు దేతలను, పితరులను ఆరాధించే
వాళ్ళు పితరులను, భూతాలను ఆరాధించేవాళ్ళు భూతాలనూ,
నన్ను ఆరాధించే వాళ్ళు నన్నే చేరుకుంటారు.
తే.గీ. భక్తి నొసగిన పుష్పంబొ ఫలమొ జలమొ,
ఆకొ గైకొందునర్జునా! శ్రీకరముగ,
నేను, భక్తిభావంబెంచి నియతితోడ,
భక్తి లేనట్టివారిచ్చు ఫలమదేల?. ॥ 9-26 ॥
భావము.
ఏవ్వరు భక్తితో ఆకునో, పువ్వునో, ఫలాన్నో, నీటినో నాకు సమర్పిస్తారో
ఆ శ్రద్ధ మనస్కులు భక్తితో ఇచ్చిన దానిని నేను స్వీకరిస్తాను.
తే.గీ. అర్జునా! నీవు తినుదాని, నహరహంబు
చేయు దానిని, హొమంబు చేయ నదియు,
చేయుదానమున్ తపమును చేయఁగఁదగు
నర్పణంబును నాకు హృదర్పితముగ. ॥ 9-27 ॥
భావము.
అర్జునా నీవు ఏది తినుదువో, ఏది చేయుదువో, ఏది హొమంచేయుదువో, ఏది
దానము చేయుదువో, ఏది తపస్సు చేయుదువో, అది నాకు అర్పణము చెయుము.
తే.గీ. ఈ విధముగ సన్యాసయోగేంద్రుఁడవయి
కర్మఫలబంధములు వీడి కలియు దీవు
నన్ను నర్జునా! యోగివై మిన్నగాను
ధర శుభాశుభ ఫలములన్ దాటుమింక. ॥ 9-28 ॥
భావము.
ఈ ప్రకారంగా సన్యాసయోగంతో కూడుకున్న వాడవై శుభాశుభ ఫలాలు
కలిసిన కర్మ భంధాల నుండి విడుదల పొంది, నీవు నన్ను చేరుకొందువు.
తే.గీ. జీవులన్నిట నే నుంటి జీవ మగుచు,
ద్వేష రాగ విదూరుండ, భాసిల నను
భక్తి సేవించువారిలో వరలుచుందు
వారు నాలోన నుందురు వరలుచుండి.॥ 9-29 ॥
భావము.
నేను ప్రాణులందరిలోను సమంగా ఉన్నాను. నాకు ద్వేషింప
తగినవారు అంటూ లేరు, ప్రేమించవలసిన వారూ లేరు. అయితే
నన్ను భక్తితో ఎవరు సేవింతురో వారు నాలో ఉందురు. నేను
వారిలో ఉందును.
తే.గీ. కన దురాచారుఁడైనను ఘనతరమగు
దీక్షతో నన్ను సేవింప తెలియ నతఁడు
సజ్జనుండుగా నెన్నుచే సరి, నిజంబు,
భక్తి సంయుక్తు లొందెడున్ ముక్తి, నిజము.॥ 9-30 ॥
భావము.
ఎంత దుర్మార్గుడైనా అతడు అనన్య భావంతో సేవిస్తే అతడు సరైన
నిర్ణయం తీసుకున్న వాడే, కాబట్టి సత్పురుషుడుగానే ఎంచతగిన వాడు.

తే.గీ. అతడు ధర్మాత్ముఁడై శాశ్వతాత్మనెఱీఁగి
శాశ్వతమ్ముఁగ పొందును శాంతి కనఁగ,
నాదు భక్తుండు నశియింపరాదు, నీవె
యీ ప్రతిజ్ఞను చేయుమో సుప్రకాశ!. || 9-31 ||
భావము.
అర్జునా అతడు త్వరలోనే ధర్మాత్ముడై, శాశ్వతమైన శాంతిని పొందుతాడు.
నాభక్తుడు నశించడని ప్రతిజ్ఞ చెయ్యి.
తే.గీ. పాప యోనులున్, శూద్రులున్ వైశ్యులైన
స్త్రీలె యైనను భక్తితో సేవ నాకు
చేసి, యాశ్రయించిన, వారు భాసిలుదురు
భవ్యమైనట్టి గతిపొంది, పార్థ! నిజము.. || 9-32 ||
భావము.
అర్జునా! నన్ను ఆశ్రయించిన వాళ్ళు పాప యోనులు కానీ, స్త్రీలు,
వైస్యులు, శూద్రులు కానీ వాళ్ళుకూడా ఉత్తమగతిని తప్పక పొందుదురు.
తే.గీ. పుణ్యులైనట్టి బ్రాహ్మణుల్, పూజ్యులయిన
దివ్యరాజర్షులగువారి దెలుపనేల
నింక, క్షణిక మశాశ్వత మిద్ధరిత్రి
యిందు పుట్టిన నీవు నన్ పొందుమరసి.. || 9-33 ||
భావము.
ఇక పుణ్యులైన బ్రాహ్మణులు, భక్తులైన రాజర్షుల సంగతి చెప్పాడం
దేనికి? క్షణికము, దుఃఖమయమూ అయిన ఈ లోకంలో పుట్టిన నీవు
నన్ను సేవించుము.
తే.గీ. నీదు మదినాకునర్పించు, నేర్పుతోడ
నాదు భక్తుండవై వెల్గు నన్నె కొలిచి
వందనంబులు చేయుచు వదలక నను
నమ్మినన్ జేరగలవు నన్, సమ్మతి గను.|| 9-34 ||
భావము.
నీ మనస్సును నాకు అర్పించు. నా భక్తుడివి అగుము. నన్ను ఆరాధించుము.
నాకే నమస్కరించుము. ఈ విధముగా నాలో మనసు నిలిపి, నన్ను లక్ష్యముగా
పెట్టుకొని నన్నే చేరగలవు.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " రాజవిద్యారాజగుహ్య యోగము " అనెడి
9వ అధ్యాయము. సమాప్తము.

10వ అధ్యాయము.
విభూతియోగఃము

శ్రీ భగవానుడు ఇలా చెప్పుచుండెను..
తే.గీ. మహిత!పార్థుఁడా! నీవు నా మాటలకును
సంతసించుచుండుటఁజేసి సదయ నేను
పలుకు నా మాటలన్ విను వరలు నీకు
మేలు, పొందు సత్యంబుగాఁ గల్గు మేలు నీవు.|| 10-1 ||
భావము.
ఓమహానుభావా! అర్జునా! నా మాటలకు సంతోషిస్తున్న నీకు
మేలు కలగాలని, నేను చెప్తున్న శ్రేష్ఠమైన ఈ మాటలు మళ్ళీ విను.
తే.గీ. దేవతలు ఋషులెఱుఁగరు దివ్యమైన
నాదు జన్మంబు సంగతి, నయనిధాన!
వారి కన్నను ముందె నే వరలి యుంటి,
జ్ఞాన పూర్ణులు గ్రహియింత్రు కలుగు నిజము. || 10-2 ||
భావము.
నా పుట్టుకను గురించి దేవతలుకాని మహర్షులుకాని ఎఱుఁగరు.
దేవతలు మహర్షులు అందరికన్నా పూర్వపు వాడిని నేను.
తే.గీ. పుట్టుకయు మొదల్ లేనట్టి పూర్ణుడనని
ప్రభువుగా నేను జగతికి వరలుదునని
యెఱుఁగు నాతండు సుజ్ఞాని, పరగునతఁడు
పాపదూరుఁడై ముక్తిని పడయఁగలడు,
నీవు గ్రహియింపుమియ్యది నేర్పు మీర. .|| 10-3 ||
భావము.
పుట్టుకా మొదలులేని వాడుగానూ, లోకాలకు ప్రభువుగాను నన్ను
తెలుసుకున్న వాడు మనుష్యులలో జ్ఞాని అయి అన్ని పాపాలనుండి
విముక్తి చెందగలఁడు.
తే.గీ. తెలివి, జ్ఞానమ్ము, సత్యమ్ము, దివ్యమైన
మోహరాహిత్య మోర్పును, పొగడదగిన
మదిని నిగ్రహించెడి శక్తిమరి భయాభ
యములు, సుఖదుఃఖములు నేనె యమర గనుదు. || 10-4 ||
భావము.
తెలివి, జ్ఞానం, మోహరాహిత్యము, ఓర్పు, సత్యము, మనో నిగ్రహము,
సుఖ దుఃఖాలు, ఉండడమూ, లేకపోవడమూ, భయాభయాలు
(నా వలననే కలుగును.)
తే.గీ. అల యహింస, సమత్వము నపయశస్సు,
యశము, దాన తపస్సులు నలరునట్టి
వివిధ భావముల్, తృప్తి, నే వెలయఁ జేయు
చుందునర్జునా! గ్రహియింపమందు నిన్ను. || 10-5 ||
భావము.
అహింస, సమత్వము, తృప్తి, తపస్సు, దానము, యశస్సు, అపయశస్సు
మొదలైన వేరు వేరు భావాలు జీవులలో నా వలననే కలుగును.
తే.గీ. నాదు సంకల్ప బలముచే మోదమలర
ఋషులు, మనువులుండిరి మున్నె సృష్టిలోన,
వారి వలననె కలిగిరి ప్రజలు భువిని,
తెలియ నెంచిన నీకిది తెలియు పార్థ! || 10-6 ||
భావము.
సృష్టి ఆరంభంలో ఉన్న సప్త ఋషులు, నలుగురు మనువులు నా
సంకల్పము వలన పుట్టిన వారే. వారి నుండి ఈ ప్రజలు వచ్చిరి.
తే.గీ. నా విభూతి యోగమ్మును నయనిధాన!
యసలు తత్వంబు నర్మిలి నరయువారు
నిశ్చలంబగు యోగాన నిలిచిపోదు
రిందు సందేహమే లేదదెప్పటికిని. || 10-7 ||
భావము.
ఈ నా విభూతి యోగాన్ని అసలు తత్వములో తెలుసుకున్నవాడు,
చలించని యోగములో నిలిచి పోవును. ఇందులో సందేహము లేదు.
తే.గీ. సృష్టి మూలము నేనని దృష్టిపెట్టి

నన్ను కొలుతురు భక్తులు మిన్నగాను,
నేనె జగతిని నడుపుటన్ జ్ఞానులరసి
ప్రియముతోడ నన్ గొలుతురు నయము దలర. || 10-8 ||
భావము.
నేను అన్నిటి పుట్టుకకి హేతువుని. నా వలననే సమస్తమూ
నడుస్తుందని తెలుసుకున్న వివేకులు భక్తి పూరితులై నన్ను సేవింతురు.
తే.గీ. తమ మనసులను నాలోన తన్మయతను
లీనమున్ జేసి నాదగు లీలలెన్ని
చెప్పుకొందురు తృప్తిగా గొప్పగాను
ముక్తి సాధనకిదియెగా మూలమరయ. || 10-9 ||
భావము.
తమ మనసులను నాలో లీనము చేసి జీవితాలను నాకే అర్పించి,
నన్ను గురించే పరస్పరమూ బోధించుకొనుచు, చెప్పుకొనుచు
నిత్యమూ తృప్తి పడుదురు, ఆనందింతురు.
తే.గీ. సతము నాపైన మనసును సరిగనుంచి
ప్రీతితో సేవ చేసెడి విజ్ఞులకును
నన్ను చేరంగ మార్గమున్ గ్రన్నన నిడ
జ్ఞాన యోగంబు గొల్పెదన్, కాంక్షతీర్చ. || 10-10 ||
భావము.
అలా సతతమూ మనసు నాయందుంచి, ప్రీతితో సేవించే వారికి
నన్ను చేరుకొనుటకు కావలసిన జ్ఞానయోగమును నేను కలుగఁ జేయుదును.
తే.గీ. వారిని కనికరింప నవారిత గతి
మనసులందున నే నుందు, మానితముగ
జ్ఞాన దీప్తిని గొల్పి యజ్ఞాన మనెడి
తిమిర సంహారమును జేయ, ధీవరేణ్య! || 10-11 ||
భావము.
వారిని కనికరించుట కొఱకు నేను వారి మనస్సులలో నిలిచి, వారి
అజ్ఞాన తమస్సుని ప్రకాశించే జ్ఞానదీపముతో నశింపజేయుదును.
అర్జునుడు పలుకుచుండెను.
తే.గీ. నీవె కన పరబ్రహ్మవు, నీవె పరమ
ధాముఁడవు, శాశ్వతుండవు, తలప జన్మ
లేనివాఁడవు, శుచివి సుజ్ఞాన ఖనివి
యాది దేవుడవరయఁగా, ధీనిధాన! || 10-12 |||
భావము.
నీవు పరబ్రహ్మవు, పరంధాముడివి, పరమ పవిత్రుడవు, శాశ్వతుడవు,
దివ్యుడవు, పరమ పురుషుడవు ఆది దేవుడవు. పుట్టుక లేనివాడవు.
తే.గీ. అని ఋషులు, నారదుఁ డశితు, డందు రటులె
దేవలుఁడు వ్యాసుడందురు, తెలియునటుల
నీవు కూడ పల్కితివట్లె నేర్పుమీర,
తెలియ బల్కినన్ వినినను దెలియనగును. || 10-13 ||
భావము.
అని అందరూ ఋషులు, దేవర్షి నారదుడూ, అలాగే అశితుడూ, దేవలుడూ,
వ్యాసుడూ అంటారు. స్వయముగా నీవుకూడా అటులనే చెప్పుచుంటివి.
తే.గీ. విశ్వశింతును నీ మాట విశ్వనాథ!
నీదు వ్యక్తమౌ దేహంబు నిరుపమాన
మెఱుఁగ నేరరు దేవతల్ పరమపురుష!
యెఱుఁగనేరరు రాక్షసు లెన్నటికిని! || 10-14 ||
భావము.
కేశవా! నీవు నాతో చెప్పినదంతా నిజమేనని విశ్వశిస్తున్నాను.
నీ వ్యక్త శరీరాన్ని దేవతలుకాని దానవులు కాని ఎరుగరు.
తే.గీ. భూతభావనుఁడా! దేవ! భూతనాథ!
హే జగన్నాథ! నిన్ను నీవే యెఱుంగు
దువు పురుష పుంగవా! హరీ! తోయజాక్ష!
కనగ నిజమిదే పరమేశ! గుణనిధాన! || 10-15 ||
భావము.
భూత భావనుడా! భూతేశా! జగత్పతీ! పురుషోత్తమా! నిన్ను నీవే నీచేతనే
స్వయంగా ఎఱుఁగుదువు.

తే.గీ. వ్యాపితంబయి జగతిలో వరలియుంటి
వీవె యేయేవిభూతులన్ బ్రీతితోడ
చెప్పగా నీకె సాధ్యమౌన్ గొప్పగాను
తనరు నాయా విభూతులన్ దరళనేత్ర. ‖ 10-16 ‖
భావము.
ఏయేవిభూతులలో నీవు ఈలోకమంతటా వ్యాపించి ఉన్నావో
ఆదివ్యమైన విభూతులను అశేషంగా చెప్పడానికి నీవే తగినవాడివి.
తే.గీ. యోగివైనట్టి నిన్ను నే నొప్పిదముగ
నెఱుఁగుటెట్టుల ధ్యానినై? యీశ్వరుండ!
నిన్ను నేరూపములను ధ్యానింపవచ్చు?
తెలియ జెప్పుము కృపతోడ తెలుసుకొందు. ‖ 10-17 ‖
భావము.
ఓయోగీ! సదా ధ్యానిస్తూ నేను నిన్ను ఎలా తెలుసుకోగలను?
భగవంతుడా! ఏయేరూపాలతో నిన్ను ధ్యానించవచ్చు?
తే.గీ. ఓ జనార్దనా! తెల్పు నీ యోగ మరయ,
సద్విభూతిని కృపతోడ సరసిజాక్ష!
నీదు వాగమృతమదెంత నేను గ్రోలు
చున్నఁ దృప్తియే కలుగదే సుజనపాల! ‖ 10-18 ‖
భావము.
ఓజనార్దనా! నీ యోగాన్ని విభూతిని విస్తారంగా చెప్పు. అమృతతుల్యమైన
నీమాటలు ఎంత విన్నా నాకు తృప్తి కలుగదు.
భగవానుడనుచుండెను.
తే.గీ. నాదు గొప్ప విభూతులన్ నీదు మదికి
వ్యక్త మగునట్లు తెల్పుదున్ బార్థ! వినుము,
నాదు విస్తృతి కంతమే లేదు కనగ
నీవు గ్రహియింపుమా, లసద్భావపూర్ణ! ‖ 10-19 ‖
భావము.
అర్జునా! నా దివ్య విభూతులలో ముఖ్యమైన వాటిని ఇప్పుడు నీకు
చెప్పుదును. నా విస్తారమునకు అంతు అనునది లేదు.
తే.గీ. అన్నిప్రాణుల హృదయాల నమరి యుందు
నే ననుపమాన! పార్థుడా! నిత్యమెలమి,
నాదిమధ్యాంతముల్ నేనె, యందరికిని,
సృష్టి నాదిమధ్యాంతముల్ చెలగ నుంటి. ‖ 10-20 ‖
భావము.
గుడాకేశా! నేను అన్ని ప్రాణుల హృదయాలలో ఉంటాను.ప్రాణుల అది మధ్యంతాలు(సృష్టి స్థితి లయలు)నేనే.
తే.గీ. విష్ణునాదిత్యులందున, వెలుగునిచ్చు
వారిలో సూర్యుడను నేను, పార్థ! తెలియ,
యా మరుత్తులందుమరీచి,నరయ నేనె,
తారలందున చంద్రుడన్ దలప నేనె. ‖ 10-21 ‖
భావము.
నేను ఆదిత్యులలో విష్ణువుని, వెలుగునిచ్చు వారిలో కిరణములు
కలిగిన సూర్యుడను. మరుత్తులలో మరీచిని, నక్షత్రములలో చంద్రుడను.
తే.గీ. వేదములలోన గన సామ వేదమేను,
దేవతలనింద్రుడను నేనె, తెలియగాను,
యింద్రియంబులన్మనసునేనింద్ర తనయ!
ప్రాణులందున చైతన్య భావమేనె. ‖ 10-22 ‖
భావము.
నేను వేదాలలో సామవేదాన్ని, దేవతలలో ఇంద్రుడిని, ఇంద్రియాలలో
మనస్సుని, ప్రాణులలో చేతనత్వాన్ని నేనే.
తే.గీ. రుద్రులందునఁ గన శంకరుండ నేనె,
యక్షరాక్షసులందున నక్షయమగు
ధనపతి యగు కుబేరుడన్, తలచి చూడ,
వసువులన్ బావకుడ నేనె, యసమ చరిత!
పర్వతంబుల మేరువై పరగు దేనె. ‖ 10-23 ‖
భావము.
నేను రుద్రులలో శంకరుణ్ణి, యక్ష రాక్షసులలో కుబేరుడిని, వసువులలో
పావకుడిని, పర్వతాలలో మేరువుని.

తే.గీ. అల పురోహితులందు బృహస్పతినయ!
స్కందుఁడను సేనకధిపతులందు నేనె,
సరసులన్ సాగరము నేనె, సరసభావ!
పార్థ! నన్ను నీ వెఱుఁగుము భవచయముగ. ॥ 10-24 ।
భావము.
అర్జునా! నేను పురోహితులలో శ్రేష్ఠుడైన బృహస్పతిని.
సేనానాయకులలో కుమారస్వామిని, సరసులలో సాగరాన్ని అని తెలుసుకో.
తే.గీ. ఋషులలో నేనె భృగువును, యసమచరిత!
శబ్దములలోన నోంకార శబ్దమేనె,
యజ్ఞ ములలోన గన జప యజ్ఞ మేనె,
స్థావరంబులన్ హిమపర్వతంబు నేనె. ॥ 10-25 ।
భావము.
మహర్షులలో భృగువుని, శబ్దాలలో ఏకాక్షరమైన ఓంకారాన్ని.
యజ్ఞాలలో జపయజ్ఞాన్ని, స్థావరాలలో హిమాలయాన్ని.
తే.గీ. వృక్షములయందు రావి నేన్, వేల్పు ఋషుల
నారదుఁడు నేనె, గంధర్వ ధీరులందు
చిత్రరథుఁడను నేనే, ప్రసిద్ధులయిన
మహిత మునులందు కపిలుఁడన్, మాననీయ! ॥ 10-26 ॥
భావము.
నేను వృక్షాలలో రావి చెట్టుని. దేవర్షులలో నారదుణ్ణి. గంధర్వులలో
చిత్రరథుణ్ణి, సిద్ధులలో కపిల మునిని.
తే.గీ. అరయ నుచ్చైశ్రవమును నే నశ్వములను,
కరులనైరావతమునునే నరసి చూడ,
మనుజులందున రాజును, వినుము పార్థ!
నన్ను నరయగ యత్నించు మన్ననమున. ॥ 10-27 ।
భావము.
నేను గుర్రములలో అమృతంతో పుట్టిన ఉచ్చైశ్రవాన్ని, ఏనుగులలో
ఐరావతాన్ని, మనుష్యులలో రాజుని.
తే.గీ. ధాత్రి నరసిన వజ్రాయుధంబు నేనె,
కామధేనువునావులన్, గామఁడనయ
జన్మనిచ్చెడివారిలో, సర్పములను
వాసుకిని నేనె తెలియుము పార్థ! నీవు. ॥ 10-28 ॥
భావము.
నేను ఆయుధాలలో వజ్రాన్ని. గోవులలో కామధేనువుని. పుట్టించేవాళ్ళల్లో
మన్మధుడిని, సర్పాలలో వాసుకిని.
తే.గీ. నాగు లందు ననంతుండ, నయనిధాన!
జలచరాధిప వరుణుఁడన్, సన్నుతాత్మ!
పితరులందర్యముడను నేన్ వినుతకీర్తి!
యమము నే సంయములలోన, నమర చరిత! ॥ 10-29 ॥
భావము.
నేను నాగులలో అనంతుడిని, జలచరములకు అధిపతి అయిన వరుణుడిని,
పితరులలో ఆర్యముడిని, సమ్యమవంతులలో నిగ్రహాన్ని.
తే.గీ. దైత్యులందు ప్రహ్లాదుడన్, ధాత్రిపైన
కలయితులలోన కాల మేన్, గరుడపక్షి
నేను పక్షులన్, మృగములన్ నేనె సింహ
మనుచు నెఱుఁగుము, పార్థుడా! వినుత కీర్తి! ॥ 10-30 ॥
భావము.
నేను దైత్యులలో ప్రహ్లాదుడీని, లెక్కలు కట్టేవాళ్ళల్లొ కాలాన్ని,
మృగాలలో మృగేంద్రుడిని, పక్షులలో గరుత్మంతుడిని.
తే.గీ. పావనులలోన వాయువున్, పార్థ! నేను,
శస్త్ర ధారులన్ రాముఁడన్, జలచరముల
మొసలి నేనేను తెలియుమా, పుణ్య చరిత!
నదులలో గంగ నేనేను నన్ను గనుమ. ॥ 10-31 ॥
భావము.
నేను పావనం చేసేవాళ్ళల్లో వాయువుని శస్త్రధారులలో రాముడిని,
జలచరాలలో ముసలిని, నదులలో గంగని.
తే.గీ. ఆది మధ్యాంతముల్ నేనె యరయ సృష్టి

ననితరాధ్యాత్మ విద్య నేననుపమాన!
వాదనములలో వాదమై ప్రబలుదేనె,
పార్థ! గ్రహియించువారలు పరవశింత్రు. ‖ 10-32 ‖
భావము.
అర్జునా! సృష్టులన్నిట్లో ఆదిమధ్యాంతాలు నేనే. విద్యలలో
అధ్యాత్మ విద్యని, వాదించేవారిలో వాదన నేనే.
తే.గీ. అక్షరంబులనక్షర మరయ నేనె,
ద్వంద్వమనుసమాసమునేనె ధర సమాస
ములను, నాశ రహితకాలము కన నేనె,
సర్వతోముఖేశ్వరుఁడేనె గర్వరహిత! ‖ 10-33 |
భావము.
నేను అక్షరాలలో అకారాన్ని, సమాసాలలో ద్వంద్వ సమాసాన్ని,
నాశనంలేని కాలాన్ని. సర్వతోముఖంగా ఉండే ఈశ్వరుడిని.
తే.గీ. మృత్యువున్ బుట్టుకయు నేనె మేదినిపయి,
స్త్రీలలో కీర్తి, స్మృతి, వాక్కు, శ్రీయు నేనె,
క్షమయు, ధృతియును, మేధయున్, కనగ నేనె,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పుమీర. ‖ 10-34 |
భావము.
నేను సర్వాన్ని హరించే మృత్యువుని, భవిష్యత్తులో ఉదయించబోయే
వారి పుట్టుకని, స్త్రీలలో కీర్తి, శ్రీ వాక్కు, స్మృతి, మేధా, ధృతి,
క్షమా గుణాలు కూడానేనే.
తే.గీ. సామములలోన నే బృహత్సామమరయ,
ఛందములలోన గాయత్రి, జయుఁడ! నేనె
మార్గశీర్షంబు నేనేను మాసములను,
ఋతువులందు వసంతంబు పృథ్వి నేనె. ‖ 10-35 ‖
భావము.
అలాగే నేను సామాలలో బృహత్సామాన్ని, ఛందస్సులలో గాయత్రిని,
మాసాలలో మార్గశీర్షాన్ని, ఋతువులలో వసంత ఋతువుని.
తే.గీ. మోసములలోన కన ద్యూతమునగుదునయ,
తేజమునవెల్గువారిలో తేజమేనె
నేనె జయమున్, బ్రయత్నంబు నేనె యరయ,
సాత్వికులలోన గలయట్టి సత్వమేనె. ‖ 10-36 ‖
భావము.
నేను మోసములలో జూదాన్ని, తేజోవంతులలో తేజాన్ని,
జయాన్ని ప్రయత్నాన్ని, సాత్వికులలో సత్వాన్ని.
తే.గీ. వాసుదేవుండ శ్రీవృష్ణివంశముననను,
పాండవులలోన పార్థుఁడై పరగుదేనె,
మునులలో నేను వ్యాసుండ పుణ్య చరిత!
కవులలోన శుక్రాచార్య కనగ నేనె. ‖ 10-37 ‖
భావము.
నేను వృష్ణి వంశస్తులలో వాసుదేవుడిని, పాండవులలో,
అర్జునుడిని, మునులలో వ్యాసుడిని, కవులలో శుక్రాచార్యుడిని.
తే.గీ. శాసకులలోని దండన, జయము కోరు
వారిలో నీతియు, రహస్య భావ మౌన
మరయ నేనేను, జ్ఞానులన్ వరలు జ్ఞాన
మదియు నేనేను,పార్థుడా! మదిని గనుమ. ‖ 10-38 ‖
భావము.
శాసకులలో దండమూ, జయంకోరేవారిలోని నీతీ, రహస్యాలలో
మౌనమూ, జ్ఞానులలో జ్ఞానమూ నేనే.
తే.గీ. ప్రాణులకు మూలమేనేను, పార్థ! వినుమ,
ధర చరాచరములలోన తలచి చూడ
నేను లేనన్నదే లేదు, నిజము కనగ,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పుమీర. ‖ 10-39 ‖
భావము.
అర్జునా! అన్ని ప్రాణుల యొక్క మూలకారణం నేను. చరాచర
ప్రపంచంలో నేను లేనిదంటూ ఏదీ లేదు.
తే.గీ. నా విభూతికి తుది లేదు, నీవెఱుంగ

క్లుప్తముగ జెప్పినాడను గొప్పదయిన
దాని విస్తారమును నీకు పూనికగొని
నీవు గ్రహియింపుమర్జునా! నేర్పుమీర. || 10-40 ||
భావము.
అర్జునా! నా దివ్యమైన విభూతులకు అంతులేదు. నా విభూతుల
విస్తారాన్ని క్లుప్తముగానే చెప్పితిని.
తే.గీ. ఏది కలదోవిశిష్టమై మేదినిపయి,
శోభయున్ శక్తిగలదేదొ, శుభగుణాఢ్య!
యరయనదియంతయున్ నాదు పరమ శక్తి
నుండియే కల్గుఁజెంచుమా ఖండితముగ. || 10-41 ||
భావము.
విశిష్టమైన గుణమూ, శోభా, శక్తీ కలిగినది ఏది ఉన్నదో ఆప్రతీదీ
నా తేజము నుండి పుట్టినదని తెలుసుకో.
తే.గీ. ఇన్ని మాటలవేల? నీవన్నిటిఁ గన
నేనె భరియించుచుండిటు నిలిచినాడ
నొక్క యంశతోమాత్రమే నిక్కమిదియె,
నీవు గ్రహియింపుమర్జునా! నేర్పు మీర. || 10-42 ||
భావము.
అర్జునా! ఇన్ని మాటలు దేనికి ఈ యావత్ప్రపంచాన్ని నేను
ఒక్క అంశతో భరించి నిలిచి ఉంటిని.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " విభూతి యోగము " అనెడి
10వ అధ్యాయము. సమాప్తము.

11వ అధ్యాయము.
విశ్వరూపదర్శనయోగము.
అర్జునుడిట్లనియె.
తే.గీ. నన్ననుగ్రహించుటకయి మన్ననమున
ఘన రహస్యమౌ యధ్యాత్మ వినుత మయిన
జ్ఞాన బోధనన్ బొడమె సుజ్ఞానమనఘ!
మోహమంతమైపోయెను మోహనాంగ! || 11-1 ||
భావము.
నన్ను అనుగ్రహించుటకై కరుణతో నీచేత చెప్పబడిన పరమ
రహస్యమైన అధ్యాత్మజ్ఞానముచే నా అజ్ఞాన మోహమంతయు
మాయమైపోయినది.
తే.గీ. భూత సృష్టిస్థితిలయలు మూలమయిన
ఘన రహస్యమున్, నీ యందు కలుగు మహతి
నీవు చెప్ప నెఱింగితి నీరజాక్ష!
విస్తృతంబుగ నేనిట విశదమాయె. || 11-2 ||
భావము.
హే కృష్ణా! సర్వభూతముల సృష్టి, స్థితి, లయ రహస్యమును
గూర్చి నీ శాశ్వతమయిన అవ్యయమైన మహా మహిమను గూర్చి
నీవు చెప్పగా నేను సవిస్తారముగా వింటిని.
తే.గీ. ప్రీతిఁ దెల్పిన నీదగు విశ్వరూప
మహిమ సత్యంబు, పొగడగన్ మనసు కలిగె
నీ యపారమౌ జ్ఞానము, నీయనంత
తేజ మమరు శక్త్యైశ్వర్య పూజనీయ
రూపమునుగాంచగాను గోరుదును తెలియ. || 11-3 ||
భావము.
ఓ పరమేశ్వరా! నీ మహాద్భుత విశ్వరూప మహిమను గూర్చి
నీవు చెప్పినదంతయు పరమ సత్యమే. ఓ పురుషోత్తమా! అపార
జ్ఞాన శక్తి తేజములతో కూడిన మహా ఘనమైన నీ అనంత
ఐశ్వర్య రూపమును ప్రత్యక్షముగ దర్శింప గోరుచున్నాను.
తే.గీ. నీదు ఘనవిశ్వరూపమున్ నేను జూడ
తగినదని నీవు తలచిన తప్పకుండ
గొప్పదైన యా రూపంబు గొప్పగాను
చూపుమిప్పుడే నాకిటన్ శుభద కృష్ణ! | 11-4 ||
భావము.
హే యోగేశ్వర ప్రభో! నీ ఘన విశ్వరూపం నాచేత చూడశక్య
మైనదని నీవు తలంచుచో అట్టి నాశరహితమైన నీ దివ్య రూపమును నాకు చూపుము..
భగవానుడు అనుచున్నాడు.
తే.గీ. కను మసంఖ్యాకముగ ననేకవిధములుగ
కల యనేక వర్ణంబులు, కలయనేక
మయినయాకృతులనునొప్ప, మద్విశిష్ఠ
రూపమునుగాంచు మర్జునా! లోపరహిత! || 11-5 ||
భావము.
ఓ పార్థా! అసంఖ్యాకములైన, అనేక విధములుగనున్న,
అనేక వర్ణములు కలిగిన, అనేకాకృతులలో నున్న నా దివ్య
రూపమును చూడుము.
తే.గీ. వసువులన్ రుద్రులన్, మరుద్భాస్కరులను,
గనుము సూర్యాశ్వినీ తతిన్ మునుపెవరును
గనని యద్భుత విశ్వరూపునిపుడిచట
నర్జునా! నీకు చూపెద ననుపమముగ. || 11-6 ||
భావము.
ఓ అర్జునా! ద్వాదశాదిత్యులను, అష్ట వసువులను, ఏకాదశ
రుద్రులను, అశ్వనీ దేవతలను, సప్త మరుత్తులను నాలో
చూడుము. మరియు మహాశ్చర్యమును కలిగించే పూర్వమెప్పుడూ
ఎవ్వని చేత చూడబడని అనేక అద్భుతములను నాలో
నిపుడుగాంచుము.
తే.గీ. కను చరాచరములనునీ కాంక్ష తీర

లోకములఁగల సర్వమున్ శ్రీకరముగ
చూడు నాలోననిప్పుడే శుభసుచరిత!
యెవ్వరును గాంచరీ రూపు, కవ్వడి! కను. || 11-7 ||
భావము.
ఓ అర్జునా! నాదేహమందే చరాచర ప్రపంచమునెల్లను ఒకే చోట
నున్నట్లు ఇక్కడే ఇప్పుడే చూడుము. మరియు నీవు చూడగోరినదెల్ల
నాలోనే చూడుము.
తే.గీ. స్థూలదృష్టితో కనలేవు సూక్ష్మమయిన
దివ్యచక్షువులిచ్చెద తృప్తి గాను
చూడు నావిశ్వ రూపమున్, శోభనీయ
మనుపమంబగువైభవమును గనుమిట. || 11-8 ||
భావము.
నీ స్థూల దృష్టితో నా అనంత స్వరూప మహిమను చూడలేవు.
కనుక దివ్యదృష్టి నీకిచ్చుచున్నాను. ఈ జ్ఞాన దృష్టితో అపారమైన
నా విశ్వరూప వైభవమును గాంచుము.
సంజయుడిట్లు పలికెను.
తే.గీ. వినుము ధృతరాష్ట్ర! కృష్ణుడీవిధము పలికి
చూపె తన విశ్వరూపమున్, శుభనిధాన
దివ్య మహిమాన్వితంబైన భవ్యమయిన
విశ్వరూపంబు పార్థుఁడు ప్రీతిని గనె. || 11-9 ||
భావము.
ఓ ధృతరాష్ట్ర మహారాజా! మహా యోగీశ్వరుడైన భగవానుడిట్లు
చెప్పిన పిమ్మట సర్వోత్తమమైన ఐశ్వర్యరూపమైన తన మహిమాన్విత
విశ్వరూపమును పార్థునకు చూపెను.
తే.గీ. వక్త్రములు కండ్లనేకముల్, ప్రభలనీను
దివ్యమౌయలంకారముల్, భవ్యపు మహి
తాయుధంబులనొప్పి, మహాద్భుతముగ
నొప్పు విశ్వరూపము చూపె నప్పుడటను. || 11-10 ||
భావము.
అనేక వక్త్రములతో, అనేక నేత్రములతో, అనేక అద్భుత
దర్శనములతో, అనేక దివ్యాభరణములతో, దివ్యాయుధములతో
భగవానుని ఘన దివ్యరూపము శోభిల్లుచుండెను.
తే.గీ. దివ్యమాల్యాంబరములతో దివ్య గంధ
లేపనముతోడవిశ్వవక్త్రోపభాస
మై యలరె విశ్వరూపంబు మహితముగను.
కాంచెనర్జునుడత్తరి ఘనతరముగ. || 11-11 ||
భావము.
దివ్యములైన పుష్పమాలికలను, దివ్యములైన వస్త్రములను
ధరించి, దివ్య సుగంధ చందనాదుల పూతలతో నిండి,
పరమాశ్చర్యకరమై, మహాకాంతివంతమై, అనంతమై,
విశ్వతోముఖమై భగవానుని అద్భుత విశ్వరూపము విలసిల్లుచుండెను.
తే.గీ. వేయిసూర్యులాకాశాన వెలుగులీన
నెంత తేజంబు కలుగునో యంత తేజ
మిచట గనుపించె, శ్రీహరినెంచి చూడ
సాటి లేనిది, గణుతింప జగతిలోన. || 11-12 ||
భావము.
ఆకాశమున ఒక్కసారిగా హఠాత్తుగా సహస్ర సూర్యులు
ప్రకాశించినచో ఎంతటి చూడశక్యముకాని కాంతి కలుగునో
అంతటి అపారకాంతికి ఈ భగవానుని కాంతి సమానమగును.
తే.గీ. విశ్వరూపంబునన్ గాంచె వివిధములుగ
కలుగునన్నిటినొకచోట కలవిగాను,
సృష్టిమొత్తంబునచటనే దృష్టిపెట్టి
కాంచె పార్థుండు కృష్ణుని కరుణ వలన. || 11-13 ||
భావము.
అపుడు అర్జునుడు దేవదేవుడగు భగవానుని శరీరములోనే
అనేక విధములుగా విభజింపబడిన సర్వ ప్రపంచమును
ఒకేచోటనున్న దానినిగా చూచెను.

తే.గీ. విస్మయము పొంది పార్థుడు విశ్వరూప
మును గని పులకితాంగుడై ప్రణతి చేసె
తాను సాష్టాంగముగ భక్తి తత్పరుఁడయి,
కృష్ణున కపుడు, ధన్యత, కీర్తి బడసి. || 11-14 ||
భావము.
పిమ్మట ధనంజయుడు విస్మయముతో పులకాంకితదేహుడై
భగవానునికి సాష్టాంగ ప్రణామము చేసి అంజలి బద్ధుడై ఇట్లనెను.
అర్జునుడు పలికెను.
తే.గీ. నీ విరాట్రూపమందున నేను కంటి
ప్రాణి కోటిని, బ్రహ్మను, భస్మధరుని,
దేవతాళిని, ఋషులను, దివ్యమైన
పాములన్, గృష్ణ! మదిలోన భ్రాంతి తొలగె. || 11-15 |||
భావము.
ఓ దేవాదిదేవా! నీ విరాట్-రూపమునందు సకల దేవతలను,
నానావిధప్రాణికోటిని, కమలాసనుడైన బ్రహ్మను, మహాదేవుడైన
శంకరుని, సమస్త ఋషులను, దివ్య సర్పములను చూచుచున్నాను.
తే.గీ. నీదు బాహువు లుదరముల్, నీదు ముఖము
లును, నయనము లనంతముల్, ఘనతరమగు
నీదు విశ్వతోముఖరూప మేఁ దగఁ గన
నాదిమధ్యాంత రహిత! నన్నాదుకొనుము. || 11-16 ||
భావము.
ఓ విశ్వేశ్వరా! విశ్వరూపా! నీ బాహువులు, ఉదరములు, ముఖములు,
నేత్రములు అసంఖ్యాకములు. నీ అనంతరూపము సర్వతోముఖముగ
విలసిల్లుచున్నది. నీవు ఆదిమధ్యాంతరహితుడవు. మహత్వ పూర్ణమైన
నీ దివ్యరూపమునకు ఆది మధ్యాంతములను తెలిసికొనలేకున్నాను.
తే.గీ. గదను, చక్రమును, కిరీటము ధరియించి
యంతటను తేజ వారాశి నమర నిల్పి
యున్న నిను గాంచుచుంటిని, కన్నుల నిను
గాంచఁజాలని తేజంబు కలిగితివిగ. || 11-17 ||
భావము.
హే విష్ణో! కిరీటమును, గదను, చక్రమును ధరించి, అంతటను
తేజఃపుంజములను విరజిమ్ముచున్న నిన్ను దర్శించుచున్నాను.
ప్రజ్వలితాగ్నివలెను, జ్యోతిర్మయుడైన సూర్యునివలెను
వెలుగొందుచున్న నీ అప్రమేయరూపము దుర్నిరీక్ష్యమై యున్నది.
|| 11-18 ||
శ్లో. త్వమక్షరం పరమం వేదితవ్యం
త్వమస్య విశ్వస్య పరం నిధానమ్|
త్వమవ్యయః శాశ్వతధర్మగోప్తా
సనాతనస్త్వం పురుషో మతో మే.
తే.గీ. అక్షరుం డవవేద్యుఁడ వాదరువువు
లోకముల కవ్యయుండవు, లోక ధర్మ
రక్షకుండవును, సనాతనాక్షయుడవు
గ తలతును నేను నిన్ను భోగ శయనుండ!
భావము.
పరమ - అక్షరస్వరూపుడవైన పరబ్రహ్మపరమాత్మవు నీవే, కనుక అందరికిని తెలుసుకొనదగినవాడవు. ఈజగత్తునకు నీవే
పరమాశ్రయుడవు. సనాతన ధర్మరక్షకుడవు. నీవు అవ్యయుడవు. అని నా విశ్వాసము.
తే.గీ. ఆది మధ్యాంత రహితుఁడ వపరిమిత మ
యిన మహాశక్తిశాలివి, యినుఁడు శశియు
నేత్రములునీకు, భుజములనేక బాహు
వులను ప్రజ్వలితపువక్త్రవుగ కనితిని. || 11-19 ||
భావము.
నీవు ఆదిమధ్యాంత రహితుడవు. అపరిమితశక్తిశాలివి. అసంఖ్యాకములైన
భుజములు గలవాడవు. సూర్యచంద్రులు నీ నేత్రములు. అగ్నివలె
నీ ముఖము ప్రజ్వరిల్లుచున్నది. నీ తేజస్సులో ఈ జగత్తును
సంతప్తమొనర్చుచున్నావు. అట్టి నిన్ను నేను చూచుచున్నాను.
తే.గీ. దివిమొదలుగ నంతటనిటు భువివరకును
కలుగునాకాశమున నిండి కలిగితీవె,

యద్భుతంబు, భీకరమయి యలరు నిన్నుఁ
జూచి ముల్లోకముల్ భీతి జొక్కె గృష్ణ. ॥ 11-20 ॥
భావము.
ఓ మహాత్మా! దివి నుండి భువి వఱకు గల అంతరిక్షమునం దంతటను
అన్ని దిశలను నీవే పరిపూర్ణుడవై యున్నావు. అద్భుతమైన నీ
భయంకరరూపమును చూచి ముల్లోకములును గడగడలాడుచున్నవి.
తే.గీ. నిన్ను జేరుచుండిరిదివ్యు, లెన్నుచు నిను
గొల్చుచుండిరికేల్మోడ్చి, కొందరదిగొ,
సిద్ధులున్ ఋషుల్ నీదుప్రసిద్ధి పాడు
చుండిరంచితముగ స్వస్తి సూక్తములను. ॥ 11-21 ॥
భావము.
ఇదిగో, ఆదేవతలెల్లరును నీలో ప్రవేశించుచున్నారు. కొందఱు
భయపడినవారై అంజలి ఘటించి, నీ నామగుణములను
కీర్తించుచున్నారు. మహర్షులును, సిద్ధులును స్వస్తివచనములతోడను,
ఉత్తమోత్తమ స్తోత్రములతోడను నిన్ను ప్రస్తుతించుచున్నారు.
తే.గీ. భవ్యులైన రుద్రాదిత్యవసువులు నిక ,
సాధ్యులస్వినుల్, పితరులు, సన్నుతులగు
ఘనతనొప్పువిశ్వేదేవులును, మరుద్గ
ణ, సుర యక్ష, సిద్ధుల్ నినున్ గనఁగఁ గంటి. ॥ 11-22 ॥
భావము.
ఏకాదశరుద్రులును, ద్వాదశాదిత్యులును, అష్టవసువులును,
సాధ్యులును, విశ్వేదేవతలును, అశ్వినీకుమారులును,
మరుద్గణములును, పితరులును అట్లే గంధర్వయక్షాసు
రసిద్ధసముదాయములును నిన్నే దర్శించుచున్నారు.
తే.గీ. నీయనేకబాహుల్వక్త్ర నేత్రములును
పాదములునూరువులుదరభాగములును,
కోరలును కడు భీతిని గొలుపుచుండె,
నేనునున్ భీతినొందితి నీరజాక్ష! ॥ 11-23 ॥
భావము.
ఓ మహాబాహో! అసంఖ్యాకములైన వక్త్రములను, నేత్రములను, చేతులను, ఊరువులను, పాదములను, ఉదరములను,
కోరలను కలిగిన మిక్కిలి భయంకరమైన నీ రూపమునుచూచి, అందఱును భయకంపితులగుచున్నారు. నేనుకూడ
భయముతో వణికిపోవుచున్నాను.
తే.గీ. నభము దాకె నీ రూపమనంత దీప్తి
వర్ణముల్ పెక్కు కలుగుచు, పరగు కనులు
కాంతులగ్నిందనొప్పునీ ఘన ముఖంబు,
భీతిలెన్ గని యందరున్, భీతియయ్యె. ॥ 11-24 ॥
భావము.
ఏలనన హే విష్ణో! నీ రూపము అంతరిక్షమును తాకుచున్నది. అదే అనేకవర్ణములతో దేదీప్యమానమై వెలుగుచున్నది.
కాంతులను విరజిమ్ముచున్న విశాలనేత్రములతో, విస్తరించినముఖములతో అద్భుతముగా ఒప్పుచున్నది. అట్టి నీ
రూపమును చూచిన నా మనస్సు తత్తరపడుచున్నది. అందువలన నా ధైర్యము సడలినది. శాంతి దూరమైనది.
తే.గీ. నీ కరాళ దంష్ట్రల్ మోము నాకు భయము
గొల్పు, తోచవు దిక్కులు, కొరత కలిగె
శాంతి కో దేవదేవుఁడా! శాంతి దాల్చి
నీవు సుప్రసన్నుడవయి కావుము నను. ॥ 11-25 ॥
భావము.
ఓ జగన్నివాసా! కరాళదంష్ట్రలతో
(భయంకరమైన కోరలతో) ఒప్పుచున్న నీ ముఖములు ప్రళయాగ్ని
జ్వాలలవలె భీతిగొల్పుచున్నవి. వాటిని చూచిన నాకు దిక్కు
తోచకున్నది. నెమ్మది (శాంతి) శూన్యమైనది. ఓ దేవేశా! ప్రసన్నుడవు కమ్ము.
తే.గీ. ధార్తరాష్ట్రులున్, భీష్ముడున్, ధరనృపాలు
రట్లె కర్ణుడున్, ద్రోణుడు, నట్లె మన ప
రిజనులున్ నిన్ బ్రవేశించిరి, కనితిపుడె,
నాకు మతిపోవుచుండెను నయనిధాన. ॥ 11-26 ॥
భావము.
ఇదిగో! (ఇచ్చట చేరియున్న) ఈ ధృతరాష్ట్రపుత్రులు
(దుర్యోధనాదులు) ఇతర రాజన్యులతోసహా నీలో ప్రవేశించుచున్నారు.
భీష్మపితామహుడు, ద్రోణుడు, కర్ణుడు, అట్లే మన పక్షమునందలి

ప్రధానయోధులు అందఱును.
తే.గీ. అతి భయంకరదంష్ట్రలనమరిన ముఖ
ములను జేరి, చిక్కుచును కోరలకు మరియు
నక్కడటునుగ్గుగానయిరనుపమాన!
భయము కలుగుచునుండె నో భక్త సులభ! || 11-27 ||
భావము.
భయంకరములైన కోరలతోగూడిన నీ ముఖములయందు అతివేగముగా పరుగులుదీయుచు ప్రవేశించుచున్నారు. కొందఱి తలలు కోరల మధ్యబడి నుగ్గునుగ్గైపోవుచుండగా వారు దంతములలో చిక్కుకొని వ్రేలాడుచున్నారు.
తే.గీ. నదులు సంద్రంబులోపలికొదుగునట్లు
సమరయోధులు నీముఖసరసిజమున
కభిముఖంబుగ సాగిరోయగ్ని ముఖుడ!
చూడఁ జాలను శాంతించు సుగుణభాస! || 11-28 ||
భావము.
అనేకములైన నదీనదములప్రవాహములన్నియును సహజముగా సముద్రమునకు అభిముఖముగా ప్రవహించుచు అందు ప్రవేశించుచున్నట్లు, ఈ శ్రేష్ఠులైన సమరయోధులు (నరలోకవీరులు) కూడ జ్వలించుచున్న నీ ముఖములయందు ప్రవేశించుచున్నారు.
తే.గీ. మృత్యువును చేర నగ్నిలో మిడుతలట్లు
పడుచునుండిరి నీ నోట పరుగుపెట్టి
వచ్చి, వింతగానుండెను, భక్త సులభ!
మేము కనలేము నీమాయ నేమొకాని. || 11-29 ||
భావము.
మిడుతలన్నియు మోహవశమున బాగుగా మండుచున్న అగ్నివైపు
అతివేగముగా పరుగెత్తి, తమ నాశనముకొఱకు అందు ప్రవేశించి,
నశించునట్లు ఈ వీరులందఱును తమనాశమునకై అతివేగముగా
పరుగెత్తి, నీ వక్త్రములయందు ప్రవేశించుచున్నారు.
తే.గీ. ప్రజ్వలించు నీ ముఖముతో పట్టుచుండి
యెల్లలోకంబులన్ మ్రింగుచేనుగంటి,
నీదుతేజస్సుచే భీతినే జగంబు
మున్గుటన్ గంటి గోవింద పుణ్యపురుష. || 11-30 ||
భావము.
హే విష్ణో! ప్రజ్వలించుచున్న నీ ముఖములతో సమస్త లోకములను
అన్నివైపులనుంచి కబళించుచు మాటిమాటికిని చప్పరించుచున్నావు.
నీ ఉగ్రతేజస్సులు అంతటను నిండి జగత్తును తపింపజేయుచున్నవి.
తే.గీ. వందనంబులు పరమేశ! వందుచుంటి
యెవరివో నీవు తెల్పు మేనెఱుఁగ నిన్ను,
నాది పురుషుఁడవైన నిన్నరయ నుంటి,
నీ ప్రవృత్తిని సృష్టిలో నే నెఱుంగ. || 11-31 ||
భావము.
ఓ పరమాత్మా! నీకు నా నమస్కారములు - ప్రసన్నుడవు కమ్ము.
ఉగ్రరూపుడవైన నీవు ఎవరో దయతో నాకు తెలుపుము. ఆదిపురుషుడవైన
నిన్ను విశదముగా తెలిసికొనగోరుచున్నాను. ఏలనన నీ ప్రవృత్తిని
ఎఱుంగలేకున్నాను.
శ్రీభగవానుడు పలుకుచుండెను,
తే.గీ. అంతమున్ జేయ సృష్టినే యమరితిచట
కాలునిగ నింక పోరీవు కా దనినను,
రిపులు మిగులరొక్కరును హరింతు నేను,
కాలధర్మంబు తప్పింప గాంచుమీవె. || 11-32 ||
భావము.
నేను లోకములన్నింటిని తుదముట్టించుటకై విజృంభించిన
మహాకాలుడను. ఇప్పుడు ఈ లోకములను రూపుమాపుటకై పూనుకొని
యున్నాను. కనుక నీవు యుద్ధముచేయకున్ననూ ప్రతిపక్షముననున్న
ఈ వీరులెవ్వరును మిగులరు.
తే.గీ. కాన పార్థ! యీ యుద్ధంబు కాదనకుము,
నేనె చంపితిన్ వీరలన్ గాన నీవు
కారణ మగుమ యుద్ధమ్ము కోరి చేసి,
స్ఫూర్తి గాంచుము దీనిచే కీర్తి గనుము. || 11-33 ||
భావము.

కనుక ఓ సవ్యసాచీ! లెమ్ము, కీర్తిగాంచుము. శత్రువులను జయించి
సర్వసంపదలతో తులతూగు రాజ్యమును అనుభవింపుము.
వీరందఱును నాచేత మునుపే హతులైనవారు. నీవు నిమిత్తమాత్రుడవు కమ్ము.
తే.గీ. చంపితిని నేను పూర్వమే చంపు మిపుడు
భీష్మ, ద్రోణ, కర్ణాదులన్, వీరతతిని,
యుద్ధమును జేసి గెలుపొందు మొప్పుగాను,
భీతి విడువుము, యత్నించు ప్రీతితోడ. || 11-34 ||
భావము.
ఇదివరకే నాచే చంపబడిన భీష్మ, ద్రోణ, జయద్రథ (సైంధవ)
కర్ణాది యుద్ధవీరులందఱిని నీవు సంహరింపుము. భయపడకుము.
రణరంగమున శత్రువులను తప్పక జయింపగలవు. కనుక
యుద్ధము చేయుము.
సంజయుడు పలికెను:
తే.గీ. అచ్యుతునిమాట విన్నట్టి యర్జునుండు
భీతి వణుకుచు జోడించి చేతుల నట
వర్ణనము చేయసాగె నాపన్నరక్షు.
మరల ప్రణతులు చేసెనా నరుడు హరికి. || 11-35 ||
భావము.
ఓ రాజా! శ్రీ కృష్ణపరమాత్మ యొక్క ఈ మాటలను విని, అర్జునుడు వణకుచు,
చేతులు జోడించి నమస్కరించెను. మఱల మిక్కిలి భయముతో ప్రణమిల్లి, గద్గదస్వరముతో తడబడుచు శ్రీకృష్ణుని
స్తుతింపసాగెను.
అర్జునుడు పలికెను
తేగీ. నిను గని జగము ముదమున ఘనతఁ బొగడ
రాక్షసుల్ భయముననుపారదొడగెనయ
సిద్ధగణములు ప్రణమిల్లచిత్తమలర,
చూచిధర్మమంచెంచితి శుభద కృష్ణ. || 11-36 ||
భావము.
ఓ అంతర్యామి! కేశవా! నీ నామగుణ ప్రభావములను కీర్తించుచు జగత్తు హర్షాతిరేకముతో, అనురాగముతో
ఉప్పొంగిపోవుచున్నది. ఇది సముచితము. భయగ్రస్తులైన రాక్షసులు నలుదిక్కులకును పారిపోవుచున్నారు.
సిద్ధగణములవారెల్లరును ప్రణమిల్లుచున్నారు.
తే.గీ. శ్రేష్ఠుఁడవు, బ్రహ్మతాతవు, జీవకోటి
మోకరిల్లకెట్లుండును? మూలమయిన
యక్షరుండవు శ్రీకృష్ణ?యమరవినుత!
నిన్ను మించిన సృష్టి యేమున్నదయ్య. || 11-37 ||
భావము.
ఓమహాత్మా! నీవు సర్వశ్రేష్ఠుడవు. సృష్టికర్తయైన బ్రహ్మకే
మూలకారకుడవు - కనుక వారు (సిద్ధాదులందఱును) నీకు
నమస్కరింపక ఎట్లుండగలరు? ఓ అనంతా! ఓ దేవేశా!
ఓ జగన్నివాసా! సత్-అసత్తు నీవే. వాటికంటెను పరమైన
అక్షరస్వరూపుడవు అనగా సచ్చిదానందఘనపరబ్రహ్మవు నీవే.
తే.గీ. ఆదిదేవుండవేనీవనంతరూప!
హరి! సనాతనుఁడవు పరమాశ్రయుడవు,
సర్వమెఱిగిన వాడవు, సకలపతివి,
జగతికాశ్రయుండవు నీవు నిగమవేద్య! || 11-38 ||
భావము.
ఓ అనంతరూపా! నీవు ఆదిదేవుడవు, సనాతనపురుషుడవు,
ఈజగత్తునకు పరమాశ్రయుడవు. సర్వజ్ఞుడవు, సర్వవేద్యుడవు.
ఈ జగత్తు అంతయును నీచే పరిపూర్ణమైయున్నది.
తే.గీ. వరుణ చంద్రాగ్ని యములీవె వాయువీవె,
బ్రహ్మవీవే, ప్రజాపతి, బ్రహ్మ జనకు
లీవె, వందనములనందుమీవె మరల
మరల వందనంబులు నీకు నిరుపమాన. || 11-39 ||
భావము.
నీవే వాయుదేవుడవు, యముడవు, అగ్నివి, వరుణుడవు, చంద్రుడవు,
ప్రజాపతియైన బ్రహ్మవు. బ్రహ్మకును జనకుడవు. నీకు వేలకొలది
నమస్కారములు. మఱల మఱల నమస్కారములు. ఇంకను నమస్కారములు.

తే.గీ. అన్నిటన్ గల నీకు నే నన్నిదిశల
నుండి వందనములొనర్తు వందితపద!
నీవు లేనట్టి చోటునే నేనును చూడ
లేదు కృష్ణయ్య, నీకిది లీలయగును. ‖ 11-40 ‖
భావము.
అనంతసామర్థ్యముగలవాడా! నీకు ఎదురుగా ఉండియు, వెనుకనుండియు నమస్కరించుచున్నాను. ఓ సర్వాత్మా! నీకు అన్నివైపులనుండియు నమస్కారములు. ఏలనన అనంతపరాక్రమశాలివై నీవు జగత్తంతటను వ్యాపించియున్నవాడవు. అన్ని రూపములును నీవియే.
తే.గీ. నీదు మహిమనెరుంగని నేను నిన్ను
యాదవా! కృష్ణ! మిత్రమా! యనుచు నిన్ను
చనువునన్ బిల్చి యుంటిని చవుకగాను
నన్ను మన్నించు మాధవా! నిన్ను గొలుతు. ‖ 11-41 ‖
భావము.
నీ మహిమను ఎఱుగక నిన్ను నా సఖునిగా భావించి, చనువుచేగాని, పొరబాటువలనగాని, ఓ కృష్ణా! ఓ యాదవా! ఓ మిత్రా! అనుచు తొందరపాటుతో ఆలోచింపక, నేను నిన్ను సంబోధించి ఉంటిని.
తే.గీ. కలసి నీతోడ నేనున్న కాలమందు
సకల మిత్రులకడను నేకాంతమందు
చనువుతో పల్కియుందును చవకగనిను,
నాదు దోషంబు మన్నించు జ్ఞాన తేజ. ‖ 11-42 ‖
భావము.
ఓ అచ్యుతా! విహారశయ్యాసనభోజనాది సమయములయందు ఏకాంతమునగాని, అన్యసఖుల సమక్షమునగాని సరసమునకై పరిహాసములాడి, నేను నిన్ను కించపఱచి యుండవచ్చును. ఓ అప్రమేయస్వరూపా! నా అపరాధములనన్నింటిని క్షమింపుమని వేడుకొనుచున్నాను.
తే.గీ. అనుపమప్రభావాలోక జనకుడీవె,
పూజ్యుడవు నీవు నిన్ మించు పూజ్యులెన్న
లేరు సృష్టిలో, నీకన్న లేరు ఘనులు,
దీనరక్షాజగన్నాథ! దేవదేవ! ‖ 11-43 ‖
శ్లో. పితాసి లోకస్య చరాచరస్య
త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్|
న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో
లోకత్రయేఽప్యప్రతిమప్రభావ.

భావము.
ఓ అనుపమప్రభావా! ఈ సమస్త చరాచరజగత్తునకు నీవే తండ్రివి. నీవు పూజ్యుడవు. గురుడవు. సర్వశ్రేష్ఠుడవు. ఈ ముల్లోకములయందును నీతో సమానుడెవ్వడును లేడు. ఇంక నీకంటె అధికుడెట్లుండును?
‖ 11-44 ‖
శ్లో. తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం
ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్|
పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః
ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్.
తే.గీ. నీదు పాదములకుచెంత నాదు దేహ
ముంచి ప్రణమిల్లుదున్ కృష్ణ, యెంచబోకు
నాదు దోషముల్ మన్నించు నన్ను కృపను,
కాంచు మోదేవ! పరునిగా నెంచబోకు.
భావము.
కనుక ఓ ప్రభూ! నాశరీరమును నీపాదములకడనిడి, సాష్టాంగముగా ప్రణమిల్లుచున్నాను. స్తవనీయుడవు, సర్వేశ్వరుడవు ఐన నీవు నాయందు ప్రసన్నుడవగుటకై నిన్ను ప్రార్థించుచున్నాను. దేవా! కుమారుని తండ్రి క్షమించినట్లును, మిత్రుని మిత్రుడు క్షమించినట్లును, భార్యను భర్త క్షమించినట్లును, నా అపరాధములను నీవు క్షమింపుము.
తే.గీ. మునుకననిదివ్య మైనరూపు, ముదముగను
చూచి భీతిలితిని నెను చూపుమీవు
సహజమైనట్టి శ్రీకృష్ణ మహితునిగనె,

సుప్రసన్నుడవగుమయ్య, శుభనిధాన! || 11-45 ||
భావము.
మునుపు ఎన్నడును చూడని ఆశ్చర్యకరమైన ఈ రూపమును గాంచి, మిక్కిలి సంతసించితిని. కాని భయముచే నామనస్సు కలవరపాటు పొందినది. కనుక చతుర్భుజయుక్తుడవై విష్ణురూపముతోడనే నాకు దర్శనమిమ్ము. ఓ దేవేశా! జగన్నివాసా! ప్రసన్నుడవు కమ్ము.
తే.గీ. గద, కిరీటము శంఖచక్రములతోడ
నాల్గుభుజములనొప్పుచు నాకగపడు
నుతసహస్రబాహూ!నీకు నుతులు కృష్ణ!
వందనంబులు చేసెద నందుకొనుము. || 11-46 ||
భావము.
కిరీటమును, గదను, శంఖచక్రములను ధరించిన నీ రూపమును చూడగోరుచున్నాను. ఓ సహస్రబాహూ! విరాడ్రూపా! నీ చతుర్భుజరూపమును నాకు చూపుము.
తే.గీ. మక్కువను యోగశక్తిచే మహితమయిన
నా విరాట్రూపు చూపితిన్ ధీవరేణ్య!
పూర్వమెవ్వరున్ గనలేదు, భూమిపైన,
కార్యదీక్షను పూనుమీ క్షణమునందు. || 11-47 ||
భావము.
ఓ అర్జునా! నీపైగల అనుగ్రహమున నా యోగశక్తి ప్రభావముతో నీకు
నా విరాట్-రూపమును ప్రదర్శించితిని. అది మిక్కిలి తేజోమయమైనది.
అనంతమైనది, ఆద్యమైనది. దీనిని నీవు తప్ప ఇంతకుముందు
మఱి యెవ్వరును చూచియుండలేదు.
తే.గీ. దాన యజ్ఞ, తపములు, వేదాధ్యయనము
లాచరించినన్ గనజాలరయ్య విశ్వ
రూపమును నీవె చూచితి వీపగిదిని,
యన్యులెవ్వరున్ గనలేరు మాన్య చరిత! || 11-48 ||
భావము.
ఓ అర్జునా! వేదాధ్యయనములచేగాని, యజ్ఞాచరణములచేగాని,
దానములచేగాని, తీవ్రతపశ్చర్యలచేగాని, తదితరపుణ్యకర్మలచేగాని
ఈ మానవలోకమున నా ఈ విశ్వరూపమును నీకుదప్ప
మఱియెవ్వరికిని చూడశక్యముగాదు.
తే.గీ. విశ్వరూపంబు కనుటకు భీకరంబు,
మోహ వ్యధలకు గురికాకు, పూజ్యమయిన
యీ స్వరూపంబు చూడు మహిన్ బ్రియమున,
పార్థ! శోభనాళిని నీవు పడయవచ్చు. || 11- 49 ||
భావము.
ఈ విధమైన ఈ భయంకరరూపమును చూచి, నీవు ఎట్టి వ్యథకును,
మోహమునకును గురికావలదు. భయమును వీడి ప్రసన్నచిత్తుడవై
శంఖచక్ర గదాపద్మములతో విలసిల్లుచున్న నా
తుర్భుజరూపమును మరల చూడుము.
సంజయుడు పలికెను:
తే.గీ. ఇట్లు హరి పల్కి, పార్థుని కెన్నలేని
విశ్వ రూపంబు చూపుచు భీతి బాప
సహజరూపమున్ దాల్చెను శాంత వదన
భాసురుండాయె తృప్తిగా పార్థుఁడు కన. || 11-50 ||
భావము.
వాసుదేవుడు ఈ విధముగా పలికి, అర్జునునకు తన
చతుర్భుజరూపమున దర్శనమిచ్చెను. అనంతరము శ్రీకృష్ణపరమాత్మ
సౌమ్యమూర్తియైన తన కృష్ణరూపమును స్వీకరించి భయపడుచున్న
అర్జునునకు ధైర్యము చెప్పెను.
అర్జునుడు పలికెను.
తే.గీ. నీదు సౌమ్యాకృతిని జూచి నాదు మనసు

కుదుటపడెనయా శ్రీకృష్ణ! ముదము గనితి,
నిపుడు స్వాభావికస్థితి నిచటనుంటి.
వందనంబులు చేసెదనందుకొనుము. || 11-51 ||
భావము.
ఓ జనార్ధనా! మీ అతిసౌమ్యమైన మానవాకృతిని (శ్యామసుందరరూపమును)
చూచి, ఇప్పుడు నా మనస్సు కుదుటపడినది. నేను నా స్వాభావిక
(సహజ)స్థితిని పొందితిని.
శ్రీ భగవానుడు పలికెను:
తే.గీ. నా చతుర్భుజ రూపంబు చూచుటకును
వలదు పడదన్యులకు, నీకు కలిగెనిటుల,
దేవతలు చూడనెంతురు, దివ్యమయిన
యీ స్వరూపంబు నర్జునా శాశ్వతమిది. || 11-52 ||
భావము.
నీవు చూచిన నా ఈ చతుర్భుజరూపముయొక్క దర్శనభాగ్యము
అన్యులకు అత్యంతదుర్లభము. దేవతలుసైతము ఈ రూపమును
దర్శించుటకు సదా ఉవ్విళ్ళూరుచుందురు.
తే.గీ. నా చతుర్భుజ రూపము నాల్గువేద
పఠనమున గాని, దాన తపముల గాని
యజ్ఞ ములు చేసిననుగాని యసలు కనగ
జాలరో యర్జునా! నీవే చాలినావు. || 11-53 ||
భావము.
నీవు గాంచిన నా చతుర్భుజరూపమును దర్శించుటకు వేదపఠనములచే
గాని, తపశ్చర్యలచేగాని, దానములచేగాని, యజ్ఞకర్మలచేగాని
శక్యము కాదు. చతుర్భుజరూపమును దర్శించుటకు వేదపఠనములచేగాని,
తపశ్చర్యలచేగాని, దానములచేగాని, యజ్ఞకర్మలచేగాని శక్యము కాదు.
తే.గీ. ఈ చతుర్బాహు రూపంబు నెన్ని కనగ
తత్వ సుజ్ఞానమున్ బొందతదేకమవగ
కేవలము భక్తియే మూల మీవు గనితి
వీచతుర్బాహు రూపమున్ హృద్యముగను. || 11-54 ||
భావము.
ఓ పరంతపా! అర్జునా! ఇట్టి నా చతుర్భుజరూపమును ప్రత్యక్షముగా
చూచుటకును, తత్వజ్ఞానమును పొందుటకును, అందు
ఏకీభావస్థితినందుటకును కేవలము అనన్య భక్తిద్వారా మాత్రమే
సాధ్యమగును.
తే.గీ. కర్మఫలములు నాకిచ్చు జ్ఞాని, మత్ప
రాయణుండు, నా యెడభ క్త్యమాయకతయు,
విషయ దూరుడు, నవిరోధి, ప్రేమమూర్తి,
భక్తుడే నన్ను పొందును భవ్యముగను. || 11-55 ||
భావము.
అర్జునా! కర్తవ్యకర్మలను అన్నింటిని నాకే అర్పించువాడును,
మత్పరాయణుడును, నాయందు భక్తిశ్రద్ధలుగలవాడును,
ప్రాపంచిక విషయములయందు ఆసక్తిలేనివాడును, ఏప్రాణియందును
ఏమాత్రము వైరభావము లేనివాడును ఐన అనన్య (పరమ)
భక్తుడు మాత్రమే నన్ను పొందగలడు.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " విశ్వరూపదర్శన యోగము " అనెడి
11వ అధ్యాయము. సమాప్తము.

12వ అధ్యాయము
భక్తియోగము .

అర్జునుడు పలికెను -
తే.గీ. సగుణ నిర్గుణ రీతులన్ సతతము నిను
భక్తియుక్తులై కొలుతురు భక్తులిలను,
రెంట నేయోగముత్తమరీతియనగ
తగుచునున్నదో తెలుపుమా దయను నీవు. || 12-1 ||
భావము.
ఓ కృష్ణా! అనన్యభక్తితో పూర్వోక్తరీతిగా నిరంతరము నిన్నే భజించుచు,
ధ్యానించుచు, పరమేశ్వరుడవైన నీ సగుణ రూపమును ఆరాధించువారును,
కేవలము అక్షరుడవగు సచ్చిదానంద ఘననిరాకార పరబ్రహ్మవైన నిన్ను
అత్యంతభక్తిభావంతో సేవించువారును కలరు. ఈ రెండు విధములైన
ఉపాసకులలో అత్యుత్తమ యోగవిదులెవరు?
శ్రీ భగవానుడు ఇట్లనెను.
తే.గీ. నిరత మేకాగ్రతను భక్తిని ననుఁ గొలుచు
వారు యోగులు, శ్రేష్ఠులున్, వారె ఘనులు,
సగుణ నిర్గుణోపాసనా సరళి కొలుచు
ధన్యులర్జునా! గ్రహియించు మాన్యసుగతి. || 12-2 |||
భావము.
పరమేశ్వరుడనైన నాయందే ఏకాగ్రచిత్తులై, నిరంతరము
నా భజనధ్యానాదులయందే నిమగ్నులై, అత్యంతశ్రద్ధాభక్తులతో
నన్ను ఆరాధించు భక్తులే యోగులలో మిక్కిలి శ్రేష్ఠులు -
అని నా అభిప్రాయము.(వారు సగుణోపాసన లేదా
నిర్గుణోపాసన లలొ ఏది ఐనను అనుసరించవచ్చు)
తే.గీ. వర జితేంద్రియుల్, సకలమౌ ప్రాణులకును
హితమునే కోరువారును, క్షితిని ప్రాణు
లను సమముగ జూచుసదయుల్ ఘనతనొప్పు
యోగులని చెప్పుకొనుటయే యుక్త మగును. || 12-3 ||
భావము.
కాని ఇంద్రియసముదాయమును చక్కగా వశపరచుకొనినవారును,
సకల భూతములకును హితమునే కోరుచుండువారును,
సర్వప్రాణులను సమభావముతో చూచువారును యోగులు అనబడుదురు.
తే.గీ. మంచిపైనింద్రియమ్ములన్ మలచు వారు,
నంతటన్ సమ దృష్టితో నలరువారు,
సర్వ భూతహితులు, నుర్వి గర్వహీను
లగుటచే నన్నుఁ జేరెద రనుపమముగ. || 12-4 ||
భావము.
అట్టివారు మనోబుద్ధులకు అతీతుడును, సర్వవ్యాపియు,
అనిర్వచనీయమైన స్వరూపము గలవాడును, కూటస్థుడును,
నిత్యుడును, నిశ్చలుడును, నిరాకారుడును, నాశరహితుడును
ఐన సచ్చిదానంద ఘనపరబ్రహ్మయందే నిరంతరము ఏకీభావస్థితులై,
ధ్యానము చేయుచు, భక్తితో భజించుచు, ఆ పరబ్రహ్మమునే పొందుదురు.
తే.గీ. కన నిరాకార బ్రహ్మమున్ గాంచు టరయ
కష్టమౌ దేహధారికి సృష్టిలోన,
నిర్గుణబ్రహ్మ లక్ష్యంబు నియతి నొప్పి
సాధనముచేయుటే కష్ట సాధ్యమరయ. || 12-5 ||
భావము.
నిరాకార బ్రహ్మలో మనస్సు నిలిపిన వాళ్ళకు ప్రయాస ఎక్కువ.
దేహధారులకు నిర్గుణ తత్వ లక్ష్యాన్ని అందుకోవడము చాలా కష్టం.
తే.గీ. కర్మ ఫలములు నా కిడి, ఘనముగ నను
లక్ష్యముగ కల్గి స్థిరపు సల్లక్షణముల
నొప్పుచు ననన్యచిత్తుఁడైయుండి మదిని
భాసితుండయి ననుఁగొల్చు భవ్యముగను, . || 12-6 ||
భావము.
సర్వకర్మలను నాలో వదిలి, నన్నే లక్ష్యముగా పెట్టుకొని మనస్సుని

అన్య విషయముల వైపు మరలనీయకుండా ధ్యానిస్తూ ఎవరు ఉపాసిస్తారో,
తే.గీ. ఎవరు నాలోన మనసుంచి యెల్లవేళ
లందు నుందురో వారిని బంధనములు
నేనె బాపుచు సన్ముక్తి నేనె గొలిపి
యుద్ధరించెదనర్జునా! యొప్పిదముగ. || 12-7 ||
భావము.
అర్జునా నాలో మనసు నిలిపిన వాళ్ళను త్వరలోనే మృత్యుసంసార
సాగరం నుండి నేనే ఉద్ధరిస్తాను.
తే.గీ. నీవు నాలోనె బుద్ధిని నిలుపు పార్థ!
పిదప నాలోననుందువు ప్రీతితోడ,
నిందు సందేహమే యుండ దీవు గనుము
శుభములనుపొందగల్గుదు వభయమొదవి. || 12-8 ||
భావము.
నాలోనే మనసు నిలుపు బుద్ధిని నాలోనే ఉంచు. ఆ తరవాత నాలోనే
నివసిస్తావు. ఇందులో సందేహం లేదు.
తే.గీ. చిత్తమును నిల్పలేకున్న స్థిరముగాను
పార్థ! నాపైన, యోగంబు వరల జేసి
నన్ను బొందగన్ యత్నించు, మన్ననముగ,
శుభము కలుగును నీకిల నభయమిదియె. || 12-9 ||
భావము.
ధనంజయా స్థిరంగా నాలో చిత్తాన్ని నిలపలేక పోయినట్లైతే, అప్పుడు
అభ్యాస యోగం చేత నన్ను పొందడానికి ప్రయత్నించు.
తే.గీ. చేయ లేకున్న యోగమున్, చేవ జూపి
నా పరంబగు కర్మలన్ నయము దలర
నాచరింపుము శుభములనందుమింక
నీకు జయమగు నర్జునా నీవె కనగ. || 12-10 ||
భావము.
అభ్యాసం కూడా నీవు చేయలేక పోతే, నా పరమైన కర్మలలో
నిమగ్నమగుము. నా కోసం కర్మలు చేసినప్పటికీ సిద్ధిని పొందుతావు.
తే.గీ. కర్మ నా కొఱకిల జేయగా తగవొకొ?
యపుడు కర్మఫలములునా కర్పణమును
చేసి, యన్నిటినిన్ విడు, వాసిగాను,
మంచి ఫలితమున్ గనుటకు మాననీయ. || 12-11 ||
భావము.
నా కొరకై కర్మలు ఆచరించడానికి కూడా నీవు అసమర్ధడివైతే నన్ను
శరణు పొంది నీ కోసం చేసే కర్మలన్నింటినీ నాకు సమర్పించి,
ఆ సమస్త కర్మల ఫలాన్ని త్యజించు.
తే.గీ. కనగ నభ్యాసమును మించు జ్ఞాన మరయ,
జ్ఞాన మునుమించు విడిచిన కర్మ ఫలము,
శాంతి లభియించు, కనుమిది చక్కగాను,
మోక్షమబ్బును. నిజమిది రక్షణదియె. || 12-12 ||
భావము.
అభ్యాసంకంటే జ్ఞానం మేలు. జ్ఞానానికన్నా కర్మఫల త్యాగం ఎక్కువైనది.
ఈ త్యాగం వలన తరవాత శాంతి(మోక్షం) కలుగుతుంది.
తే.గీ. ద్వేష మెవరిపైనను లేని దీప్త మతియు,
నహమును,మమతను విడిన సహనశీలి
సమముగా సుఖదుఃఖము ల్సతతముగను,
క్షమను గలిగిన ఘనులెపో ఘనులు భువిని. || 12-13 ||
భావము.
ఏ ప్రాణినీ ద్వేషించని వాడు, అహంకార మమకారాలు లేని వాడు,
సుఖదుఃఖాలలో సమంగా వ్యవహరించేవాడు, క్షమా గుణం కలవాడు,
తే.గీ. నిత్య సంతుష్టుడౌ యోగి, నిగ్రహమతి,
దృఢపు నిశ్చయుండయి నాకు దీపితముగ
మనసు బుద్ధులనర్పించు మహితుఁడవని
నాకు బ్రియుఁడర్జునా! కను శ్రీకరముగ. || 12-14 ||
భావము.
నిత్యము సంతుష్టుడై , యోగియై, మనో నిగ్రహం కలవాడై, దృఢమైన

నిశ్చయముతో, మనో బుద్ధులను నాకు అర్పించిన నా భక్తుడు
నాకు ప్రియుడు.
తే.గీ. వ్యధను చెందదెవ్వనిచేత, వ్యధను చెంద
డెవ్వడీ లోకమువలన, నెవ్వడిలను
ముక్తుడో విషాదోద్వేగములవలనను,
నాకు ప్రియుఁడాతఁడే సుమా నయనిధాన! || 12-15 ||
భావము.
ఎవరివల్ల లోకం వ్యథ చెందదో, లోకం వలన ఎవడు వ్యథ చెందడో,
సంతోషం, కోపం, భయం, ఉద్వేగాల నుండి ఎవడు ముక్తుడో
అతడు నాకు ప్రియుడు.
తే.గీ. శుచియు, దక్షుండు, నిరపేక్షుడుచితమరసి
మెలఁగువాఁడహమేలేక చెలఁగువాఁడు
భక్తుడైనన్ను గొలిచెడి వాఁడు నాకు
బ్రీతుడిద్ధాత్రినర్జునా! వినుము నిజము. || 12-16 ||
భావము.
అపేక్ష లేని వాడు, శుచియైన వాడు, దక్షత కలవాడు, ఉదాసీనుడు,
వ్యథలు నశించిన వాడు, అన్ని విధాలైన, కార్యాలలో నేను
చేస్తున్నాననే భావం లేనివాడు అయిన భక్తుడు నాకు ప్రియుడు.
తే.గీ. దుఃఖ సంతోషహీనుడు, దురితదూరు
డసమ శోకదూరుడు కాంక్ష లరయ లేని
యశుభ శుభములు లేని యా యతులితుడన
నాకుప్రీతుడీవెఱుఁగుము నయనిధాన. || 12-17 ||
భావము.
ఎవడు సంతోషించడో, ద్వేషించడో, శోకించడో, కాంక్షించడో
శుభాశుభాలను వదిలేస్తాడో అలాంటి భక్తుడు నాకు ప్రియుడు.
తే.గీ. అరయ శీతోష్ణ సుఖ దుఃఖ విరహితుం డె
వ డిల మానావమాన దూరుడును సంగ
రహితుడయియుండునో యట్టి రమ్య గుణుఁడు
నాకునిష్టుండు కనుమిది శ్రీకరముఖ. || 12-18 ||
భావము.
శత్రువులు, మిత్రులు, మానావమానాలు, శీతోష్ణాలు, సుఖదుఃఖాలు
వీటియందు సమంగా ఉండే వాడు సంగాన్ని విడిచే వాడు(నాకు ఇష్టుడు).
తే.గీ. మౌని, స్తుతినిందలొకటిగా మదిగను ఘనుఁ
డసమ సంతుష్టు, డనికేతన సరసమతి,
నాకు ప్రీతిపాత్రుఁడు చూడ, శ్రీకరముగ
వానిలో నేనె మసలుదవారితముగ. || 12-19 ||
భావము.
నిందాస్తుతులను తుల్యంగా ఎంచేవాడు, మౌనంగా ఉండే వాడు,
ఉన్నదానితో సంతృప్తి పడేవాడు, నికేతనం అక్కర లేని వాడు,
స్థిరమైన బుద్ధి కల భక్తుడు నాకు ప్రియుడు.
తే.గీ. ధర్మయుక్త శాశ్వతపు పద్ధతియె యిద్ది,
శ్రద్ధతో జేసి నన్మదిన్ జక్కఁగఁ గను
నాదు భక్తులన్ బ్రేపింతు మోదమలర,
నీవు గ్రహియింపుమర్జునా! నేర్పు మీర. || 12-20 ||
భావము.
ధర్మయుక్తమూ, శాశ్వతమూ అయిన దీనిని చెప్పిన ప్రకారంగా శ్రద్ధతో,
నన్ను లక్ష్యంగా పెట్టుకొని ఎవరు ఉపాసిస్తారో ఆభక్తులే నాకు పరమ ప్రియులు.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " భక్తి యోగము " అనెడి
12వ అధ్యాయము. సమాప్తము.

13వ అధ్యాయము
క్షేత్రక్షేత్రజ్ఞవిభాగయోగము

అర్జునుడు అనుచున్నాడు.
తే.గీ. ప్రకృతి, పురుషుడు క్షేత్రంబు పరగుచున్న
మహిత క్షేత్రజ్ఞులను గూర్చి మహిమ తలర
కేశవా! తెల్పు తెలియఁగ క్షేమమలరఁ
దెలియఁ గోరుచునుంటిని దీపితముగ. || 13-1 ||
భావము.
ఓ కేశవా! ప్రకృతియననేమి? పురుషుడెవ్వడు? క్షేత్రమనగానేమి?
క్షేత్రజ్ఞుడెవ్వడు? జ్ఞానమనగానేమి? జ్ఞేయస్వరూపమెట్టిది? వీటిని గూర్చి
తెలియగోరుచున్నాను..
శ్రీ భగవాను డిట్లనియెను.
తే.గీ. క్షేత్రమున్ దేహమనుచును, క్షేత్రధర్మ
మెఱుఁగునాతఁడె క్షేత్రజ్ఞుఁ డరయననుచుఁ
దెలిసినట్టి సద్విజ్ఞులు తెలుపుదురయ,
తెలియుమర్జునా యిది నీవు తెలివి కలిగి. || 13-2 ||
భావము.
ఓ అర్జునా! ఈ దేహము క్షేత్రమని చెప్పబడుచున్నది. ఈ క్షేత్ర ధర్మము
నెవడెఱుంగునో వానిని క్షేత్రజ్ఞుడని ఈ విషయమును తెలిసినవారు చెప్పుదురు.
తే.గీ. దేహములనొప్పుచున్నట్టి దేహిననుచు
నన్నెఱుంగుమో యర్జునా! మన్ననమున,
మహిని క్షేత్రజ్ఞ క్షేత్రమున్ మన్ననమున
దెలియుటే జ్ఞానమరయగ, తెలియుమయ్య. || 13-3 ||
భావము.
మరియు ఓ అర్జునా! సర్వదేహములందుండెడి క్షేత్రజ్ఞుడైన జీవుని నన్నుగా
ఎఱుఁగుము. ఇట్లు క్షేత్రక్షేత్రజ్ఞులగూర్చి తెలిసికొనెడి జ్ఞానమే నిజమైన
జ్ఞానమని నా మతము.
తే.గీ. అట్టి క్షేత్రమేదో? గననెట్టిదగునొ?
యెట్టి వగువికారములతో నెట్టుబుట్టె
నొ? యట క్షేత్రజ్ఞుఁడెవడగునో? ప్రభావ
మెట్టిదికలవాడొ? విను మిప్పట్టు తెలియ. || 13-4 ||
భావము.
ఆ క్షేత్రమేదియో, ఎటువంటిదో, ఎట్టి వికారము కలదియో, దేనివలన బుట్టినదో,
ఆ క్షేత్రజ్ఞుడెవ్వడో, ఎట్టి ప్రభావము గలవాడో ఆ సంగతిని సంగ్రహముగా
నాద్వారా వినుము.
తే.గీ. క్షేత్ర క్షేత్రజ్ఞులను గూర్చి ఋషులు, వేద
ములుననేకవిధంబులఁతెలిపియుండె,
బ్రహ్మ సూత్రము వివరించె ప్రస్ఫుటముగ
సాక్ష్యములతోడనర్జునా! సరిగ వినుము. || 13-5 ||
భావము.
ఈ క్షేత్రక్షేత్రజ్ఞ విషయము మహర్షుల చేత అనేక విధములుగా వివరింపబడినది.
పెక్కు శాఖలు కలిగిన వేదములలో ఇది పలు విధములుగా విభజించి
నిరూపించబడినది. బ్రహ్మసూత్ర పదాలు దీనిని గురించి హేతు బద్ధముగా
నిశ్చయించి చెప్పినవి.
తే.గీ. గోచరములైదు, మరియు నగోచర మతి,
యష్టప్రకృతులు, తగ పది యనుపమేంద్రి
యములు, నిట్లిరువదినాలు గనుపమమగు
క్షేత్రములు కలవర్జునా! కీర్తిసాంద్ర! || 13-6 ||
భావము.
మహాభూతాలు (ఐదు) అహంకారము, బుద్ధి, అవ్యక్తము(అష్టవిధ ప్రకృతి),
ఇంద్రియాలు పది, మనస్సు, ఇంద్రియ గోచరవిషయాలు ఐదూ (మొత్తం 24క్షేత్రాలు).
తే.గీ. ద్వేష, దుఃఖ సుఖేచ్ఛలున్, వినగ దేహ
మును, సుచేతనత్వము, మరి ఘనతరమగు
పట్టుదలయును క్షేత్రమై పరగు పార్థ!
నీవు గ్రహియింపఁగలవిది నేర్పు మీర. || 13-7 ||

భావము.
ఇచ్ఛ, ద్వేషము, సుఖము, దుఃఖము, శరీరము, చేతనత్వము, పట్టుదల
ఇవి వికారాలతో కూడిన క్షేత్రము అని సంగ్రహముగా చెప్పడమైంది.
తే.గీ. స్థైర్య, శౌచ, మమానిత్య, ధర్మనిరతు,
లాత్మనిగ్రహమునదంబ మనుపమ గురు
సేవ, యోర్మియు, నొప్పుచు జీవనమును
సాగఁజేయుట మహితము సత్ ప్రభాస. || 13-8 ||
భావము.
తనని తాను పొగడక పోవడం, డంబము లేకుండా ఉండడమూ, అహింసా,
ఓర్పూ, నిజాయితీ, గురు శుశ్రూష, శుచిత్వమూ, స్థిరత్వమూ, ఆత్మనిగ్రహమూ.
తే.గీ. ఇంద్రియార్థమ్ములందున నెప్పటికిని
యహము, వైరాగ్యమున్ లేక, యలరుచుండి
చావుపుట్టుకలప్పుడుభావమునను
దోషముల్ గాంచుటయు కలదు తెలియుమయ. || 13-9 ||
భావము.
ఇంద్రియ విషయాలలో వైరాగ్యమూ అహంకారము లేకపోవడము , పుట్టుకలో,
చావులో, ముసలితనములో, రోగములో, దుఃఖాన్ని, దోషాన్ని నిత్యమూ చూడటములోను,
తే.గీ. మహిననాసక్తి నిర్లిప్తతిహముపైన,
మంచి చెడులందుసమదృష్టి, మదిని గలిగి
యుండునాతండు ఘనుడిలన్ నిండు మదిని
ప్రేమ వారిపై జూపుదు క్షేమమిడుదు. || 13-10 ||
భావము.
ఆసక్త భావము లేకపోవడము, పుత్రులు-భార్య గృహము మొదలైన వాటితో
తాదాత్మ్యము చెందక పోవడము, ఇష్టములు ప్రాప్తించినా, ఇష్టము కానిది
ప్రాప్తించినా మనస్సుని సమస్థితిలో ఉంచుకోవడమూ,
తే.గీ. వ్యభిచరించనహీనపుభక్తి, మరియు,
లస దనన్యయోగమున నన్నుసమరీతిఁ
గొలుచుచేకాంతముగ నుండు సలలితుడిల
నాదు ప్రీతికి పాత్రుండు, నయనిధాన! || 13-11 ||
భావము.
ఇంకా, నాలోఅనన్య యోగంతో ఉండే వ్యభిచరించని భక్తీ, ఏకాంతంలో గడపడమూ,
జనసమర్దంలో అభిరుచి లేకపోవడమూ,
తే.గీ. నిత్యమాధ్యాత్మికజ్ఞాన నిరతి, తత్వ
కలిత సుజ్ఞాన లక్ష్యమున్ గాంచుటయును
జ్ఞాన మనబడున్, గాని వజ్ఞానమనఁబ
డును గ్రహింపుమో పార్థ! నేడనుపమముగ. || 13-12 ||
భావము.
నిత్యమూ ఆధ్యాత్మ జ్ఞానము ఉండడమూ, తత్వ జ్ఞానము యొక్క లక్ష్యాన్ని
దర్శించడము జ్ఞానమని చెప్పబడినది. దానికి భిన్నమైనది అంతా అజ్ఞానము.
తే.గీ. దేని నరయ నమృతుడౌ సుధీర జీవు
డట్టి జ్ఞేయమున్ దెలిపెద, నదికలుగని
ది పరమగు బ్రహ్మమగు, సత్తది యరయగను
కా దసత్తునున్ గాదయ్య, కౌరవారి! || 13-13 ||
భావము.
దేనిని తెలుసుకోవడము వలన జీవుడు అమృతత్వాన్ని పొందునో ఆ
జ్ఞేయ వస్తువుని గురించి చెబుతాను. అది లేనిది పరబ్రహ్మము. అది సత్తు
కాదని, అసత్తు కాదని చెప్పబడుతున్నది.
తే.గీ. కాళ్ళు, చేతులు, తలలును, కళ్ళు, నోళ్ళు,
చెవులునంతటనుండును, చెలగి యావ
రించి యుండునంతటనిది, కాంచమనము,
నీవు గ్రహియించుమర్జునా నేర్పు మీర. || 13-14 ||
భావము.
దానికి అంతటా చేతులు, కాళ్ళూ, కళ్ళు, తలలూ, నోళ్ళు, చెవులు ఉండి,
అది లోకంలో సర్వాన్ని ఆవరించి ఉంటుంది.
తే.గీ. ఇంద్రియములెన్న లేనిది యింద్రియముల
లక్షణములున్న బ్రహ్మము, లక్ష్యమొప్ప
నంటుకొనకనె భరియించు నన్నిటిని, క

నగను గుణహీన, గుణముల సొగసునొందు. || 13-15 ||
భావము,
అపర బ్రహ్మము ఇంద్రియాల లక్షణాల ద్వారా ప్రకాశించేది, ఏ ఇంద్రియాలు
తనలో లేనిది, దేనిని అంటకుండానే అన్నింటినీ భరించేది, గుణ హీనమైనా
కూడా గుణాలను భోగించేది.
తే.గీ. కదులు కదలదు, ప్రాణులన్ గలుగు బయట
లోపలన్, గాని కనరాదు, శ్లోకులకది
చేరువనె యుండు,దురితుల చెంత నుండ
దట్టిదగు బ్రహ్మమర్జునా!తలచిచూడ. || 13-16 ||
భావము.
అది (జ్ఞేయము) జీవులకు బయటా, లోపలా ఉండెడిది, కదిలెడిది కదలనిది కూడా
ఐనప్పటికి, సూక్ష్మము ఐనందువలన తెలియబడదు. (అవిద్వాంసులకు)దూరంగానూ,
విద్వాంసులకు దగ్గరగాను ఉన్నది.
తే.గీ. బ్రహ్మమొక్కటే, జీవులన్ బరిగణింప
వేరువేరుగాతోచును, విశ్వ భార
మంతమ్రోయుచు సృష్టిని సొంతమదియె
పుట్టఁజేయును జంపును పట్టిపట్టి. || 13-17 ||
భావము.
ఆ పరబ్రహ్మము విభాగములు లేనిదైనా, జీవులలో విభజింపబడి నట్లుగానూ,
జీవులను భరించేది, సృష్టి సంహారాలను చేసేదిగా తెలియవలెను.
తె.గీ. వెలుగులకు వెలుగది చూడ, విశ్వమునను,
చీకటికినావలుండును లోకమునను,
జ్ఞాన మును జ్ఞేయమదియెన్న, కడకు చూడ
జ్ఞాన గమ్యంబు సిద్ధియు గాంచ నదియె. || 13-18 ||
భావము.
వెలుగులకు వెలుగది. (అజ్ఞానమనే) చీకటికి ఆవల ఉన్నదని చెప్పబడుతున్నది. అదే జ్ఞానమూ, జ్ఞేయమూ, జ్ఞాన గమ్యమూ
అందరి హృదయాలలో సిద్ధించి ఉన్నది.
తే.గీ. క్షేత్ర, సుజ్ఞాన, సుజ్ఞేయ పాత్రలెఱుఁగ
తెలిపితిని, నాదు భక్తులు తెలిసికొనుచు
నన్ను పొందుదు రర్జునా! సన్నుతముగ.
నీవు గ్రహియింపుమియ్యది నేర్పు మీర. || 13-19 ||
భావము.
క్షేత్రము, జ్ఞానము, జ్ఞేయము సంగ్రహముగా చెప్పబడినవి. నా భక్తుడు
దీనిని తెలుసుకొని నాభావాన్ని(మోక్షాన్ని) పొందును.
తే.గీ. ప్రకృతిపురుషులనాథులు, ప్రకృతి నుండి
గుణ వికారాదులొదవెను ఘనతరముగ
వాటివలననె యీసృష్టి మేటిగాను
సాగుచుండెనో యర్జునా! సతతమిటుల. || 13-20 ||
భావము.
ప్రకృతి పురుషుడు ఇద్దరూ అనాది అని తెలుసుకో. వికారాలూ, గుణాలూ
ప్రకృతి నుండి పుట్టునవని తెలుసుకో.
తే.గీ. కార్యములకకార్యములకుఁ గారణంబుఁ
గనఁగ ప్రకృతి, నిజమదియె, కర్త పురుషు
డె, సుఖ దుఃఖానుభవముల కెన్న మదిని,
పార్థ! గ్రహియింపుమియ్యది, వరలనెంచి. || 13-21 ||
భావము.
కార్యాకార్యాలకు ప్రకృతి కారణము అని చెప్పబడుచున్నది. సుఖదుఃఖాల
అనుభవాలకు కర్త పురుషుడని చెప్పబడును.
తే.గీ. ప్రకృతిలోగలపురుషుడు ప్రకృతి గుణము
లనుభవించు,తత్ గుణములయనుభవమున
మంచిచెడులుండి జన్మకు సంచితఫల
ములవి కారణమగునయ్య! ఫలితమదియె. || 13-22 ||
భావము.
ప్రకృతిలో నిలిచిన పురుషుడు ఆ ప్రకృతి నుండి పుట్టిన గుణాలను
అనుభవించును. గుణములతో అతడి సంయోగమే అతడు మంచీ,
చెడు జన్మలెత్తుటకు కారణము.
తే.గీ. సాక్షి దేహాన పురుషుడు, సన్నుతుడగు

భారవహుడును, భోక్తయున్, వర మహేశు
డు, పరమాత్మయు, భోగియు, స్వపర భేద
రహితుడనుమంతయును తానె మహిత! కనగ. ॥ 13-23 ॥
భావము.
ఈ శరీరంలో పరమ పురుషుడు సాక్షి అనీ, అనుమతించేవాడనీ,
భరించేవాడనీ, భోగించేవాడనీ, మహేశ్వరుడనీ పరమాత్మ అనీ
చెప్పబడుచుండెను.
తే.గీ. సగుణ ప్రకృతిని, పురుషుని, చక్కగనెవ
రెఱుఁగుదురొ వారు ముక్తిననితరముగను
కనుదురర్జునా! యెట్లున్న గాని, నిజము.
ముక్తిపథమది భువిపైన పూజ్యులకును. ॥ 13-24 ॥
భావము.
పూర్వము చెప్పిన విధముగా పురుషుని, గుణాలతో సహా ప్రకృతినీ ఎవడు
తెలుసుకొనునో, అతడు ఏ విధముగ ప్రవర్తించినా తిరిగి పుట్టడు.
తే.గీ. ధ్యానమునఁ గాంతు రాత్మను ధన్యులరసి
యాత్మలో నాత్మనే గాంతు రమలినులిల,
సాంఖ్య యోగంబులన్ గాంత్రు సాధు మహితు
లాత్మ దర్శనమున్ ముక్తి యమరు మనకు. ॥ 13-25 |
భావము.
కొందరు ధ్యానము ద్వారా తమలోనే తమ ఆత్మని ఆత్మ ద్వారా చూతురు.
కొందరు జ్ఞాన యోగము ద్వారాను, మరి కొందరు కర్మ యోగము ద్వారాను
ఆత్మను చూతురు.
తే.గీ. ఇట్టు లెఱుఁగలేకున్నచో పట్టుపట్టి
తెలిసినట్టివారికడను తెలుసుకొనియు
ముక్తి పొందగవచ్చు నాసక్తియున్న,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర. ॥ 13-26 ॥
భావము.
ఈ ప్రకారముగా తెలుసుకోలేని వారు కూడా అన్యుల ద్వారా విని, ఆ విధముగ విన్న
దానిపై గురి ఉంచిన వారు కూడా సంసారమును తప్పక తరింతురు.
తే.గీ. జంగమము స్థావరములుగా జగమునందు
కలదొ క్షేత్రముక్షేత్రజ్ఞులలిని కలిసి
యున్నదేనని యెఱుఁగుము మన్ననమున
పార్థ! నీవింక వినుతమౌ పథమునందు. ॥ 13-27 ॥
భావము.
భరతశ్రేష్ఠుఁడా ! స్థావర జంగమ రూపమగు ప్రాణికోటి ఏదైతే ఉందో అది
క్షేత్ర క్షేత్రజ్ఞుల కలయిక వలననే పుడుతుందని తెలుసుకో.
తే.గీ. చెడెడివాటిలోనున్నట్టి చెడని తత్వ
మన్ని భూతంబులన్ గల యసమ హరిని,
చూడఁ గలుగును యోగియే వాఁడె ఘనుఁడు,
పార్థ! గ్రహియింపు మియ్యది భవ్యముగను. ॥ 13-28 ॥
భావము.
నశించిపోయెడి వాటిలో నశించని తత్వముగా, అన్ని భూతాలలో సమంగా
ఉన్న పరమేశ్వరుని సమముగా చూసిన వాడే, నిజమైన దృష్టి కలవాడు.
తే.గీ. సమముగా తాను సర్వత్ర నమరు హరిని
సమముగా గను పూజ్యుండు సన్నుతుఁడిల
తనను హింసించుకొననివాఁ డనగవచ్చు,
పరమగతిఁ బొందు నాతండు, పార్థ! వినితె? ॥ 13-29 ॥
భావము.
సర్వత్ర సమంగా ఉన్న ఈశ్వరుణ్ణి సమంగా చూసిన వాడే, తనని
తాను హింసించుకోనివాడు. అతడు దానివలన పరమ గతిని చేరుకొనును.
తే.గీ. కలుగువాటికి ప్రకృతియె కారణమని
యాత్మ యేమియున్ జేయఁబో దనుచు తలచు
నాతఁడే జ్ఞాని నిజము నీవరయుమిచట
పార్థ సత్యంబు నెఱుఁగుము భవ్యమతిని. ॥ 13-30 ॥
భావము.
అన్ని విధములైన కర్మలు ప్రకృతి వలననే జరుగుచున్నవని, ఆత్మ
ఏమీ చెయ్యదనీ తెలిసినవాడే నిజమైన చూపు కలవాడు

తే.గీ. మానవుండెప్పుడందరిన్ మనెడు వాడు
దైవమొక్కడంచెఱుఁగునో తత్వమరసి,
యతడెపో జ్ఞాని, బ్రహ్మం బునతఁడె చేరు.
పార్థ! నీవిది గ్రహియించి పరవసించు. || 13-31 ||
భావము.
ఎప్పుడైతే(మానవుడు)వేరు వేరుగా కనిపించే ప్రాణికోటి ఏకత్వము మీద
ఆధారపడి ఉన్నదని, అక్కడినుండే విస్తరించిందని నిరంతరము
చూడగలుగునో అప్పుడు బ్రహ్మమును పొందగలడు.
తే.గీ. ఆది లేనట్టి యా బ్రహ్మ మవ్యయంబు,
దేహమందుండియున్ కర్మ మోహ రహితు
డతఁడు, కర్మలంటవతనికనుపమాను
డతఁడె బ్రహ్మంబు గ్రహియించు మర్జునాఖ్య! || 13-32 ||
భావము.
ఆది లేని వాడు నిర్గుణుడు కనుక, ఈ పరమాత్మ అవ్యయుడు. కౌంతేయా!
శరీరంలో ఉన్నా అతడు కర్మ చెయ్యడు. ఆ కర్మ ఫలంతో మలినపడడు..
తే.గీ. వ్యాప్తమయియున్న నభమెట్టు లంటఁబడదొ
దేని చేతను నట్టులే దేహికూడ
యంటబడదెందునున్నను నఖిలమతఁడె
యయియు, నర్జునా!గ్రహియించు మనుపమముగ || 13-33 ||
భావము.
ఎటుల అంతటా వ్యాపించి ఉన్న ఆకాశము సూక్ష్మ తత్వము వలన దేనిచేతా
అంటబడదో, అటులనే దేహమంతటా వ్యాపించి ఉన్న ఆత్మ అంటబడదు.
తే.గీ. సూర్యుఁడొక్కఁడే జగతికి శోభగూర్చు
కాంతినిచ్చుచు న్నట్టులే ఘనతరముగ
క్షేత్ర మంతనునొక్క యా క్షేత్రధారి
సత్ప్రకాశంబుతో నొప్పుఁ జక్కగ గను. || 13-34 ||
భావము.
ఓ భారతా! ఎట్టుల సూర్యుడు ఒక్కఁడే ఈ యావత్తు లోకమును ప్రకాశింప చేయునో,
అటులనే ఈ యావత్తు క్షేత్రమును క్షేత్రధారి ఒక్కడే ప్రకాశింప చేయును.
తే.గీ. క్షేత్రమున మరి క్షేత్రజ్ఞుఁ జెలఁగు భేద
మరసి భూతప్రకృతినుండి నిరుపమమగు
మోక్షమును పొందు దృష్టితో పూజ్యులెవరు
తెలుసుకొందురో వారికి కలుగు ముక్తి. || 13-35 ||
భావము.
ఈ ప్రకారముగా క్షేత్రక్షేత్రజ్ఞుల భేదాన్ని, భూత ప్రకృతి నుండి మోక్షము పొందెడి
పద్ధతిని జ్ఞాన దృష్టితో ఎవరు తెలుసుకొందురో వారు పరమ పదమును
చేరుకొందురు.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " క్షేత్రక్షేత్రజ్ఞవిభాగ యోగము " అనెడి
13వ అధ్యాయము. సమాప్తము.

14వ అధ్యాయము
గుణత్రయవిభాగయోగము

శ్రీభగవానుడిట్లనియెను
తే.గీ. వర చిదానంద సుజ్ఞానమరయుమీవు
మునులు దీనిన్ చిదానందపూర్ణులగుచు
సిద్ధిపొందుదు రర్జునా! సిద్ధమిదియె,
నీకుఁ దెలిపెద వినుమీవు నేర్పుతోడ. || 14-1 ||
భావము.
సర్వ మునీశ్వరులును ఏ జ్ఞానమునెఱుంగుట చేత సర్వోత్కృష్ఠమైన
చిదానంద స్వరూప సిద్ధిని పొందిరో అట్టి అనంతమైన జ్ఞానములన్నిటిలో
నుత్తమమైన చిదాకాశజ్ఞానమును మరల చెప్పుచున్నాను.
తే.గీ. పొంది యీ జ్ఞాన మెవరు నన్ పొందకలుగు
దురొమరలపుట్టబోరింక నిరుపమమగు
ముక్తిసామ్రాజ్యమున్ బొంది పొంగఁగలరు.
ప్రళయమందునన్ గలఁగరు పార్థ! నిజము.. || 14-2 ||
భావము.
ఈ జ్ఞానమును పొంది నాలో నేకమై శోభిల్లువారు సృష్టికాలమున జన్మించరు.
ప్రళయ కాలమున దు:ఖ పడరు. అనగా మృతినొందరు.
తే.గీ. నే మహద్బ్రహ్మ, నా చేతనిరుపమాన
ప్రకృతి యోనిని చైతన్యభాసమాన
బీజ రూపమౌ జీవుని వేయుదునయ.
సృష్టి వర్ధిల్లు దీనిచే శ్రీకరముగ. || 14-3 ||
భావము.
ఓ అర్జునా! మహద్బ్రహ్మయని చెప్పబడు నామూల ప్రకృతి యోనియందు
నేను చైతన్య బీజ రూపమున జీవుని ఉంచుచున్నాను. అందువలన
సర్వ భూతముల ఉత్పత్తి కలుగుచున్నది.
తే.గీ. పుట్టు జీవకోటికి తల్లి మూల ప్రకృతి,
బీజమునునాటు నేఁ దండ్రి సాజముగనె
యనుచు గ్రహియింపుమర్జునా! యనితరమగు
పురుష ప్రకృతులమీ సృష్టి మూలమయ్య. || 14-4 ||
భావము.
ఓ కౌంతేయా! దేవమానవ పశు పక్ష్యాది సకల యోనులందు పుట్టు
దేహములన్నింటికిని, మహద్బ్రహ్మయగు మూల ప్రకృతి తల్లి యనియు,
పరమేశ్వరుడనైన నేను అందు బీజమునుంచు తండ్రిననియు తెలియుము.
తే.గీ. ప్రకృతి సిద్ధత్రిగుణములు, వరలుచుండి
దేహిని వినాశరహితుని దేహదృష్టి
నాశమగుదాని బంధించు, నయనిధాన!
నీవు గ్రహియింపుమియ్యది నేర్పు మీర. || 14-5 ||
భావము.
ఓ అర్జునా! ప్రకృతివలన బుట్టిన సత్త్వము, రజస్సు, తమస్సు అను
మూడు గుణములును నాశరహితుడైన గగనాత్మను అనగా దేహిని నశించు
దేహదృష్టిలోనే బంధించుచున్నది.
తే.గీ. సత్త్వమమలంబగుటచేత సత్ప్రకాశ
కం బనామయమును, తాను కట్టివేయు
సుఖము, సంగతిన్ సుజ్ఞాన శోభఁ గూర్చ
నశ్వరపుదేహమునఁ గూర్చి యర్జునుండ! || 14-6 ||
భావము.
పాపరహితుడవగు ఓ అర్జునా! సత్త్వరజస్తమోగుణములలో మొదటిదగు
సత్త్వగుణము నిర్మలమైనదగుటచేతను ప్రకాశింపజేయునదై, ఆరోగ్యకరమైనదై,
ప్రపంచసుఖములలో సంగమము కలిగించుటచేతను, శాస్త్రజ్ఞానములో
ఆసక్తిని, తృప్తిని కలిగించుటచేతను అంతవరకే ఉంచి బంధించుచున్నది..
తే.గీ. కన రజోగుణమాశలన్ గలుగఁజేయు
ధనముమున్నగువానిపై, దానివలన
బంధనము కల్గునాత్మకు, బౌతికేచ్ఛ
పెరిగి కర్మబంధంబులే పెరుగు, పార్థ! || 14-7 ||
భావము.

ఓ అర్జునా! రజోగుణము ఆశాపాశముచే కలిగి ధనాది లోకవిషయములయెడ
రాగము కలుగజేయునని ఎఱుంగుము. అందుచే రజోగుణము దేహమందున్న
ఆత్మను ఐహిక సుఖములందాసక్తిని కలిగించి వాటికై అనేక కర్మలను చేయించి బంధించుచున్నది.
తే.గీ. తమమె యజ్ఞాన జనితము, దానివలన
నాత్మ నిద్రాదులన్ ముస్గ ననవరతము
బద్ధకము హెచ్చి నిత్యమున్ పడుకొనుటను
జీవుఁడజ్ఞాన తమమునఁ జెలగి మాయు. || 14-8 ||
భావము.
హే భారతా! తమోగుణమన్నచో అజ్ఞానముచే జనించిన దానినిగ నెఱుంగుము.
అది సర్వజీవులకు మోహమును, భ్రమను కలిగించి, అజాగ్రత్త, సోమరితనము,
అతినిద్ర అనువానిచే ఆత్మను బంధించుచున్నది.
తే.గీ. సత్వగుణమది కలిగించు శాంతి, సుఖము,
కొల్పు డాంబికంబులు రజోగుణము తెలియ,
చెడ్డనెన్నుచు గూర్చుచున్ జెరచు తమము,
అర్జునా గ్రహియింపుమీవనవనుపమముగ. || 14-9 ||
భావము.
ఓ అర్జునా! సత్త్వగుణము శాంతిసుఖములను కలిగించుచున్నది. రజోగుణము
భోగములకై బాహ్య కర్మాడంబరములను కలిగించుచున్నది. తమోగుణమన్నచో
మంచిపనిని చేయించక చెడును చేయించి ప్రమాదమును కలిగించుచున్నది.
తే.గీ. సత్వ మధికంబుగానున్న జరుపు మంచి,
అధికమై యొప్పు రజముతా నైహికమిడు,
తమమెబలమైన చెరచును తలచిచూడ
దైవబలముచే సత్వమున్ నీవు కనుము. || 14-10 ||
భావము.
హే భారతా! సత్త్వగుణము రజస్తమోగుణముల కంటే శక్తితోనున్నపుడు వాటిని
అణచి జ్ఞానసుఖాదులను కలిగించును. అట్లే రజోగుణము సత్త్వతమస్సులకంటే
బలముగనున్నపుడు వాటిని అణచి అనేక కర్మలయందు ఆసక్తిని కలిగించును.
అట్లే తమోగుణము సత్త్వరజోగుణములకంటే అధికముగ నున్నపుడు జ్ఞాన
శూన్యతతో ప్రమాదములను కలిగించును.
తే.గీ. ఈ శరీరమందున్న సర్వేంద్రియముల
ను నయ విజ్ఞానమే ప్రసరణము జరుగు
చున్న సత్వసంవర్ధన మున్నదనుచు
మదిని భావింపుమర్జునా! మాన్యవర్య! || 14-11 ||
భావము.
ఈ దేహమందున్న సర్వేంద్రియముల ద్వారా విజ్ఞాన ప్రకాశమే
ప్రసరించుచున్నప్పుడు సత్త్వగుణము బాగా వృద్ధి చెంది శోభిల్లిచున్నదని
తెలియవలెను.
తే.గీ. మది రజోగుణవృద్ధిచే మహితమయిన
లోభమును, కామ్యకర్మలలోన మునిగి
శాంతి నశియించుచుండి యాశ పెరుగుచును
పతనమార్గంబుఁ బట్టుట క్షితిని జరుగు. || 14-12 ||
భావము.
ఓ అర్జునా! రజోగుణము వృద్ధిలోనున్నపుడు లోభత్వము, కామ్యకర్మల నారంభించి
వాటిలో మునిగి వర్తించుట, ఇంద్రియనిగ్రహము, మనశ్శాంతిలేకుండుట,
మిక్కుటమైన ఆశ మొదలైనవి కలుగుచున్నవి.
తే.గీ. మది తమోగుణవృద్ధిచే మందమతియు,
భ్రమయు, దానిచే నష్టము, వరలుచుండు
పతనమార్గాన పడిపోయి యతులితమగు
జీవితమువ్యర్థమయిపోవు జీవులకును. || 14-13 ||
భావము.
హే కురునందనా! తమోగుణము వృద్ధిలో నున్నపుడు బుద్ధిమాంద్యము,
అజ్ఞాన భ్రమతో కూడిన ప్రమాదములు కలుగుచున్నవి.
తే.గీ. సత్వగుణవృద్ధిలోనుండి మహత్వమయిన
మృత్యు వొందినన్ ఘనులట్లు మేల్తరమగు
ముక్తినొందుదురర్జునా యుక్తమదియె
జీవమొందినవానికి జీవితమున. || 14-14 ||
భావము.

దేహధారియగు జీవుడెప్పుడు సత్త్వగుణము అభివృద్ధిలో నుండగా మరణించునో,
అప్పుడు ఉత్తమ జ్ఞానులు పొందెడు నిర్మలమైన లోకములను పొందుచున్నాడు.
తే.గీ. కర్మ సంగిగా జన్మంబు కలుగఁజేయు
మృతి రజోవృద్ధిలోగాంచ క్షితిని పార్థ!
తమవివృద్ధిలో మృత్యువు ధర్మహీన
మూఢునింటనో పశువుకో పుట్టఁజేయు. || 14-15 ||
భావము.
రజోగుణము అభివృద్ధిలో నున్నపుడు మరణించినచో కామ్య కర్మాసక్తులగు
మనుష్యుల కుటుంబములందు తిరిగి జన్మించుచున్నాడు. తమోగుణము
అభివృద్ధిలోనున్నపుడు మృతినొందినచో జ్ఞానహీనులైన మూఢుల
వంశమునందుగానీ, పశుపక్ష్యాదులలోగానీ పుట్టుచున్నాడు.
తే.గీ. సాత్వికంబది కలిగించు సత్ఫలంబు,
రాజసంబున దుఃఖంబు ప్రాప్తమగును,
తామసంబున నజ్ఞాన తమము కలుగు,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పుమీర. || 14-16 ||
భావము.
సాత్త్వికములైన మంచి కర్మలను చేయుటచే నిర్మల శాంతిసుఖములే
ఫలమనియు, రజోకర్మలను చేయుటచే సాంసారిక సుఖదు:ఖములే
ఫలమనియు, తామసి కర్మలచే అజ్ఞానమే ఫలమనియు తత్వవేత్తలు చెప్పిరి.
తే.గీ. సద్వివేక సుజ్ఞానము సత్వమిచ్చు
ఘన దురాశ, లోభము, రజోగుణమొసంగు,
తమమె యజ్ఞానమున్ బ్రమాదములనిడును,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పుమీర. || 14-17 ||
భావము.
సత్త్వగుణమువలన వివేకముతో కూడిన జ్ఞానము కలుగుచున్నది.
రజోగుణమువలన తరగని ఆశయను లోభము జనించుచున్నది.
తమోగుణముచే అజ్ఞాన ప్రమాదములు కలుగుచున్నవి.
తే.గీ. సత్వమూర్ధ్వలోకములిచ్చు సన్నుతముగ,
రాజసంబున భూమిపై ప్రజననమగు,
నీచజననంబు తమముననేలభించు
నీవు గ్రహియింపుమర్జునా నేర్పుమీర. || 14-18 ||
భావము.
సత్వగుణమందున్నవారు స్వర్గాది ఊర్ధ్వలోకములను పొందుచున్నారు.
రజోగుణము కలవారు మధ్యమమగు మనుష్యలోకమును పొందుచున్నారు.
నీచగుణవృత్తులు గల తమోగుణము కలవారు అధోలోకమును అనగా
మనుష్యులలో హీనులుగాగానీ పశుపక్ష్యాదులుగగానీ జన్మించుచున్నారు.
తే.గీ. కర్మలన్ ద్రిగుణప్రకృతి కాంక్షఁ గొలిపి
చేయఁజేయును, నేన్ గాదు చేయువాడ
నాత్మ నాకాశమేనంచు నాత్మనెన్ను
వాడు సన్ముక్తుడై తాను వరలగలడు. || 14-19 ||
భావము.
ఎవడు సర్వకర్మలను ప్రేరేపించి చేయునది త్రిగుణాత్మిక ప్రకృతితప్ప
అన్యమెవరూ కాదనియు, తానీప్రకృతికంటె వేరైన గగనాత్మ స్వరూపునిగ
నెపుడు తెలియునో అపుడు వాడు నా అనంత చిదాకాశ విశ్వగర్భస్వరూపమునే
పొందుచున్నాడు.
తే.గీ. త్రిగుణ దూరుఁడౌ జీవుడు ప్రగణితముగ
నైహికంబగు బాధలనధిగమించి
జననమరణముల్ లేనట్టి చక్కనైన
ముక్తిసన్మార్గమందున పొలుపుగాంచు. || 14-20 ||
భావము.
దేహోత్పత్తికి కారణభూతములైన ఈ త్రిగుణముల నతిక్రమించి జీవుడు
జనన మరణ వార్ధక్య దు:ఖములనుండి విముక్తుడై జననమరణములులేని
అమృత చిదాకాశ దైవస్వరూపమును పొంది శాశ్వతముగ శోభిల్లుచున్నాడు.
అర్జునుడిట్లనియెను:
తే.గీ. త్రిగుణ దూరుడెట్లుండును? దీనబంధు!
యెట్లు వర్తించునోయాతఁ?డెట్లతండు
త్రిగుణములనుజయించును? దేవదేవ

తెలియ జెప్పుమా నాకిల తెల్లమవగ. || 14-21 ||
భావము.
హే ప్రభో! సత్త్వరజస్తమోగుణములను మూడింటిని అతిక్రమించినవాడు
ఏ లక్షణములతో నుండును? వాని వర్తన ఎట్లుండును? ఈ త్రిగుణములను
వాడెట్లు అతిక్రమించుచున్నాడు?
శ్రీ భగవానుడిట్లనియెను
తే.గీ. త్రిగుణ సంభవ ఫలములన్ దిట్టడెవడొ,
విడిచి పెట్టిన వాటిపై ప్రీతి వీడి
మరలనాశింపడో, వాడె మహితుడిలను,
త్రిగుణ దూరుడై వర్ధిల్లు ప్రగణితముగ. || 14-22 ||
భావము.
హే పాండవా! సంప్రాప్తములైన సత్త్వగుణ సంబంధమగు ప్రకాశమును,
రజోగుణ సంబంధమగు కర్మప్రవృత్తిని, తమోగుణ సంబంధమగు
మోహమును ఎవడు ద్వేషింపడో, ఇవి విడిచిపోయినచో వీటిని తిరిగి కోరడో అట్టివాడు త్రిగుణాతీతుడగును.
తే.గీ. తెలియు నెవ్వడు చర్యలు త్రిగుణములవ
నుచును, తానుదాసీనుడై యచలితమతి
నుండునో చిదాకాశ మందుండు వాడు,
త్రిగుణములనుజయించిన ధీరుఁడతఁడు. || 14-23 ||
భావము.
ఎవడు ప్రకృతిగుణములే ప్రవర్తించుచున్నవని తెలిసి, ఉదాసీనుడై ఉండి,
త్రిగుణములచే చలింపక చిదాకాశ స్వరూపస్థితిలో సదా విలసిల్లుచుండునో
వాడే త్రిగుణాతీతుడు.
తే.గీ. దుఃఖ సుఖములన్ సమముగా, తోచు నెవని
కిలను మట్టియు పుత్తడి నెంచ నొకటి
గా కనునెవండు, తిట్లుపొగడ్తలొక్క
టిగనె నెన్ను గుణాతీతునిగ గణించు. || 14-24 ||
భావము.
సమ దు:ఖ అనంత చిదాకాశ స్వరూపమందు స్థిరుడై, సుఖదు:ఖములందు
సమముగనుండి, మట్టిని, రాతిని, బంగారమును సమముగ జూచుచు, ఇష్టానిష్ట
వస్తుప్రాప్తితో సమచిత్తమునే కలిగి దూషణభూషణములందు చలింపక, ధీరుడై
ఎవడు విలసిల్లునో వాడే త్రిగుణాతీతుడు.
తే.గీ. ఎవడు మానావమానము లెంచు సమము
శత్రుమిత్రులన్ సమముగ ధాత్రి గనుచు
సర్వకర్మలారంభముల్ చక్కగ విడి
చిమెలగు నతడు జితగుణుడు మహి పార్థ! || 14-25 ||
భావము.
మానావమానములందు సమచిత్తముతోనుండి, శత్రుమిత్రులందు సముడై సర్వ కర్మలను పరిత్యజించి ఎవడు సర్వదా
చిదాకాశ దైవప్రజ్ఞతో ప్రకాశించుచుండునో వాడే త్రిగుణాతీతుడని చెప్పబడుచున్నాడు.
తే.గీ. భక్తితోనన్నెవడిలను పరవశించి
కొలుచు త్రిగుణంబులన్ దాను గెలుచి, బ్రహ్మ
తత్త్వ మెఱుఁగుచున్ బొందును ధరను నిజము,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పుమీర. || 14-26 ||
భావము.
ఎవడు అచంచలమైన భక్తియోగముతో నన్నే సేవించుచున్నాడో వాడే ఈ త్రిగుణములను సులభముగ నతిక్రమించి
బ్రహ్మాకాశ విశ్వగర్భస్వరూపమును పొందుట కర్హుడగుచున్నాడు.
తే.గీ. అవ్యయామృత, శాశ్వత, భవ్య ధర్మ
రూపము, నఖండ, సద్బ్రహ్మ రూపమునకు
నునికిపట్టు నేనర్జునా! కనుము మదిని,
నీవు గ్రహియింపుమియ్యది నేర్పు మీర. || 14-27 ||
భావము.
అవ్యయమైన, అమృతమైన, శాశ్వతమైన, ధర్మ స్వరూపమైన, అఖండానంద స్వరూపమైన బ్రహ్మస్వరూపమునకు
ఉనికిపట్టుగ మూలాధారముగ నున్నది నేనే కదా.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " గుణత్రయవిభాగ యోగము " అనెడి
14వ అధ్యాయము. సమాప్తము.

15వ అధ్యాయము
పురుషోత్తమయోగము

శ్రీ భగవానుడన్నాడు:
తే.గీ. మొదలు పైకి, శాఖలుక్రిందికిఁ దనరునని
యందురశ్వత్థమును ఘనులరసిచూడ
నాకులే ఛందములు, దీని నరయువారు
వేదవిదులర్జునా, కాంచు ప్రీతితోడ. || 15-1 ||
భావము.
మొదలు పైకి, శాఖలు క్రిందకి ఉన్న అశ్వత్థమును అవ్యయమైనదని పె
ద్దలు చెప్పుదురు. దాని ఆకులు ఛందస్సులు. దీనిని ఎఱిఁగినవాడు వేదాలను
ఎఱిఁగినట్లే.
తే.గీ. క్రిందికిన్ బైకిఁ బెరుగుచు బంధనములు
భూమిపై పెంచు, నీశాఖ లేమనందు,
మాయలోముంచి మనలను మదనపరచు,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర. || 15-2 ||
భావము.
దానికొమ్మలు క్రిందికి పైకి విస్తరించుకొని ఉన్నవి. గుణాలచే పెరుగునవి.
విషయ వస్తువులనే చిగుళ్ళు కలవి. కర్మలలో బంధించును. దాని వేళ్ళు క్రింద
బాగా పాతుకొని మనుష్య లోకము అంతా వ్యాపించి కర్మలతో బంధించును.
తే.గీ. దాని రూపముండదటుల తలచిచూడ,
దాని తుదిమొదల్ కనరావు, దాని నిల న
సంగభావంబుతో చెండి, పొంగదగును.
నీవు గ్రహియింపుమర్జనా! నేర్పుమీర. || 15-3 ||
భావము.
దాని రూపము ఆ ప్రకారము(తల క్రింద ఉండే చెట్టులా)ఇక్కడ కనిపించదు.
దాని మొదలూ, తుదీ, ఆధారము ఏవీ కనిపించదు. గట్టిగా పాతుకు పోయిన
ఈ అశ్వత్థానిని దృఢమైన అసంగ భావమనే ఆయుధంతో ఛేధించి,
తే.గీ. ఎక్కడికి పోవ నిక రారొ యెఱిగి వెతుక
వలయు, సృష్టి యెవరినుండి వరలు నతని
నాదిపురుషుని శరణంబు ననుపమగతి
వేడుదును నేను ముక్తికై వేల్పతండె. || 15-4 ||
భావము.
ఆ తరవాత ఎక్కడికి పోతే మరలా తిరిగి రారో ఆ స్థానమును వెదకవలెను. ఎవరినుండి
ఈ పురాతన సృష్టి కార్యము ప్రారంభము ఐనదో , ఆ ఆది పురుషునే
నేను శరణు వేడుదును
తే.గీ. దూర మానమోహు లసంగులారయాత్మ
విజ్ఞులు నవాంఛులున్ ప్రీతిఁ గనుదు
రవ్యయానందమున్ మూఢరహితులగుచు
నీవు గ్రహియింపుమర్జునా నేర్పుమీర. || 15-5 ||
భావము.
మానవ మోహాన్ని త్యజించిన వారు, సంగదోషాన్ని జయించిన వారు,
సదా ఆత్మ జ్ఞానంలో నిమగ్నమైన వారు, విషయ వాంఛలన్నీ వెనుకకు
మరలించిన వారు, సుఖ దుఃఖాలనే ద్వంద్వాలనుండి విముక్తులైన వారు,
మూఢత్వము పోయి అవ్యయ పదాన్ని చేరు కొందురు.
తే.గీ. ఆ పరమగు పథము నాది, యది గనినను
ముక్తులగుదురు, వెలిగింపఁ బోల రెఱుఁగ
రవి,శశియు,నగ్నియున్, మార్గమవగతమగు
నీవు గ్రహియింపఁగల్గినన్ నేర్పుమీర. || 15-6 ||
భావము.
ఆ పదాన్ని సూర్యుడు, చంద్రుడు, అగ్ని వెలిగించరు. ఎక్కడకు వెళ్ళినచో
తిరిగి రారో అది నా పరమ ధామము
తే.గీ. నా సనాతనాంశయె జీవి, యాశ గొలిపి
ప్రకృతి నుండి యాకర్షించు, భ్రమను చెంది
యింద్రియంబుల వశమయి యిలను చెలఁగు
జీవి ననుచూడఁ జాలమిన్ జేరలేడు. || 15-7 ||
భావము.

సనాతనమైన నా అంశయే జీవలోకములో జీవుడిగా మారి, ప్రకృతి నుండి
మనస్సుతో కూడిన ఆరు ఇంద్రియాలను ఆకర్షించును.
తే.గీ. దేహమీశుండు పొందినన్, దేహమువిడి
పోయినప్పుడా యింద్రియ మాయఫలము
లంది గొనిపోవుచుండు ననవరతమ్ము,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పుమీర. ‖ 15-8 ‖
భావము.
ఈశ్వరుడు శరీరాన్ని పొందినప్పుడూ, విడిచినప్పుడూ వాయువు పూలలోంచి
వాసనను తీసుకుపోయే విధముగా ఈ ఆరింటిని తీసుకొని ప్రయాణిస్తాడు.
తే.గీ. ఇంద్రియమ్ములషట్కమ్మునెక్కి జీవి
విషయలోలుడై జీవించు విలువ మరచి,
ప్రకృతి ధర్మమునకు జీవి పట్టుబడును
తెలియుమిది, సత్యమును గను తెలివిగాను. ‖ 15-9 ‖
భావము.
చెవీ, ముక్కూ, కన్నూ, నాలుకా, చర్మమూ, మనస్సు వీటిని అధిష్ఠించి
జీవుడు విషయాలను అనుభవిస్తాడు.
తే.గీ. దేహముననున్న, పోయినన్ మోహమగ్న
మూఢులెన్నరు దైవమున్ పూజ్యులయిన
జ్ఞానులెన్నుదురునిజంబు, కాన, కనుము
సత్యపథమున నడువుము చక్కగాను. ‖ 15-10 ‖
భావము.
శరీరము నుండి నిష్క్రమించేటప్పుడు కానీ, శరీరంలో ఉన్నప్పుడు కానీ
విమూఢులు ఈయనను చూడరు. జ్ఞానులు మాత్రమే చూస్తారు.
తే.గీ. సాధనముచేత యోగికి సాధ్యపడెడు
నాత్మలోనున్నదైవంబునరయువిధము,
జ్ఞాన హీనులకునసాధ్యమౌను కనుట
సాధనముచేయుచున్నను, సద్గుణాఢ్య! ‖ 15-11 ‖
భావము.
సాధన చేసే యోగులు తమ ఆత్మలో ఉన్న భగవదంశను చూడకలరు.
మనస్సు పరిపక్వము కాని వారు వివేకహీనులు సరైన జ్ఞానము లేనందువలన
సాధన చేసినా చూడలేరు.
తే.గీ. చంద్రసూర్యాగ్నులరయుచు జగతికిడెడి
తేజమంతయు నాదని ధీవరేణ్య!
తెలుసుకొనుమయ్య, నా శక్తి, దీప్తి, యుక్తి
తెలివిగా నీవు శ్రద్ధతో తెలుసుకొనుము. ‖ 15-12 ‖
భావము.
జగత్తు నంతటినీ వెలిగించే సూర్యునిలో, చంద్రునిలో, అగ్నిలో ఉన్న తేజస్సు
ఏదో అది నాదని తెలుసుకో.
తే.గీ. పృథ్విలోనికి నే జొచ్చి వివిధ జీవ
కోటినే మోయుచుంటిని మేటిగాను,
శశిగ నోషధులిచ్చుచుచక్కగాను
వృక్షవృద్ధిని చేసెడి వెన్నుఁడనయ. ‖ 15-13 ‖
భావము.
భూమిలోనికి ప్రవేశించి ప్రాణులందరిని నేను నా శక్తితో భరింతును. ఇంకను
రసాత్మకుడైన చంద్రుడిని అయి ఓషధులన్నింటికీ పుష్టి ని ఇత్తును.
తే.గీ. నేను వైశ్వానరుండను, ప్రాణికోటి
నాశ్రయించి యా ప్రాణాదులాశ్రయించి
నలువిధమ్ముల సేవింతు కలుగు భుక్తి,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర. ‖ 15-14 ‖
భావము.
నేను వైశ్వానరుణ్ణి అయి ప్రాణుల శరీరాన్ని ఆశ్రయించి, ప్రాణ
ఆపానములతో కలిసి నాలుగు రకముల అన్నమును ఆరగింతును.
తే.గీ. జనుల మదులలోనుందును, జ్ఞానము, మరు
పు, తలపులు, జ్ఞాపకములును పొలయఁజేయు
దు, విదుడన్ వేదముల నేనె, ప్రవిమలమతి
నరయుమర్జునానీవిది యహము విడిచి. ‖ 15-15 ‖
భావము.

ఇక నేను అందరి హృదయాలలో ప్రవేశించి ఉన్నాను. నానుండి జ్ఞానము, జ్ఞాపకము, మరుపూ కలుగును. అన్ని వేదముల ద్వారా తెలియఁబడవలసిన వాడిని నేనే, వేదాంతమును చేసిన వాడిని, వేదమును తెలుసుకునే వాడిని కూడా నేనే.

తే.గీ. పార్థ! క్షరుడునక్షరుడిల వరలుచుండ్రు,
కూటవర్తియక్షరుఁడెన్న, కూర్మిని గను
క్షరుడు నశియించిపోవును, ధరను నిజము.
నిరుపముండక్షరుండెన్న నిత్యముగను. || 15-16 ||

భావము.
లోకములో క్షరుడు, అక్షరుడు అనే ఇద్దరు పురుషులు ఉండిరి. అన్ని ప్రాణులు క్షరమైనవి. కూటస్థుడిని అక్షరుఁడంటారు.

తే.గీ. ఉత్తమంబైనపూరుషుండుండె నతఁడె
చూడ పరమాత్మ, యుండి తా నీడవోలె
నంతటన్ బ్రోయు జగతిని సొంతమతఁడె
కలడు, లేడన్యుఁడెఱుఁగుమా యిలను పార్థ! || 15-17 ||

భావము.
ఉత్తమ పురుషుడు వేరే ఉన్నాడు. అతనిని పరమాత్మ అందురు. నాశనము లేని ఆ ఈశ్వరుడు మూడు లోకాలలో ప్రవేశించి వాటిని భరించువాడు.

తే.గీ. క్షరముకన్న నతీతుఁడక్షరముకన్న
మిన్న నేనేను కనుకనే మన్ననమున
వెలుగుదును వేదములను నేన్ సులలితముగ
నీవు గ్రహియించు నా కీర్తి నేర్పు మీర. || 15-18 ||

భావము.
నేను క్షరమునకు అతీతుడను మరియు, అక్షరుడికన్నా కూడా ఉత్తముడను కనుక ఈ లోకములోనూ వేదములోనూ పురుషోత్తముడిగా కీర్తింపబడితిని.

తే.గీ. అట్టి పురుషోత్తముననన్నునరయువారు
కనఁగ సర్వజ్ఞులిద్ధరన్, గనుచు నన్ను
పొంది సేవింపుదురు నన్ను పూజ్యముగను.
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర. || 15-19 ||

భావము.
అర్జునా! పురుషోత్తముడిని అయిన నన్ను ఈ విధముగా ఏ జ్ఞాని తెలుసుకొనునో, అతడు సర్వమూ తెలిసిన వాడై అన్ని విధములుగా నన్ను సేవించును(పొందును).

తే.గీ. గుహ్యతమమైన శాస్త్రంబుఁ గోరి తెలిపి
యుంటి, గ్రహియించు ధన్యులే యుత్తమోత్త
ములును కృతకృత్యులిద్ధరఁ దెలియుమీవు,
చక్కనైనట్టి ముల్లోక జయముగనుము. || 15-20 ||

భావము.
భారతా! అలా గోప్యమైన ఈ శాస్త్రం నాచే చెప్ప బడినది. దీనిని అర్థము చేసుకుంటే బుద్ధిమంతుడు కృతకృత్యుడు.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " పురుషోత్తమప్రాప్తి యోగము " అనేడి
15వ అధ్యాయము. సమాప్తము.

16వ అధ్యాయము.
దైవాసురసమ్పద్విభాగయోగము..
శ్రీ భగవానుడనుచున్నాడు.
తే.గీ. సత్వసిద్ధ్యభయంబులు జ్ఞాన యోగ
మందునిలకడ, విజితేంద్రియమును, తపసు,
యజ్ఞమును,మరి యిలను స్వాధ్యాయమొకటి
వరనిజాయితీ, దేవునిభాగ్యతతియె.. ‖ 16-1 ‖
భావము.
అభయము, సత్వసుద్ధి, జ్ఞానయోగములో నిలుచుట, ఇంద్రియ నిగ్రహము, యజ్ఞము, స్వాధ్యాయము, తపస్సు, నిజాయితీ (దైవీ పురుషుడికి కలుగుతాయి)
తే.గీ. శాంతమున్, సత్యమునహింస, చపల దూర
తయును, సిగ్గు, మృదుత్వమున్, ధరను కలుగు
టను సులక్షణములు దైవమునకుఁగలుగు
నీవు గ్రహియింపుమర్జునా నేర్పుమీర.. ‖ 16-2 ‖
భావము.
అహింస, సత్యము, కోపము లేకపోవుట, మృదుస్వభావము, సిగ్గు, చాపల్యము లేకపోవుట.
తే.గీ. తేజమోర్మియు దీక్షయు, దివ్య శుచియు,
ద్రోహచింతవిదూరత, మోహదూర
తయును, ద్వేషరాగవిదూరతయును, దైవ
లక్షణములు పార్థ! గ్రహించు, లక్ష్యమరసి.‖ 16-3 ‖
భావము.
తేజస్సు, ఓర్మి, పట్టుదల, శుచిత్వము, ద్రోహచింతన లేకపోవుట, అభిమాన రాహిత్యము. . . అర్జునా! ఇవి దైవీ సంపదతో పుట్టిన వానికి కలుగునవి.
తే.గీ. దంభమభిమాన క్రోధముల్, దర్పము పరు
షతయు, నజ్ఞానమాసురీ, సహజలక్ష
ణములు, గ్రహియింపు మర్జునా! నయనిధాన!
దైవభావంబునన్ మెల్గ దగును మనము.. ‖ 16-4 ‖
భావము.
అర్జునా! దంభము, దర్పము, అభిమానము, క్రోధము, పరుషత్వము, అజ్ఞానము. . . ఈ లక్షణాలు అసుర సంపదతో పుట్టిన వానికి కలుగును.
తే.గీ. మోక్షమిచ్చు దైవీయము పూర్తిగాను,
మహిత సంసార బంధంబు మహిని యసుర
మునను గల్గును మనలకు, వినుము పార్థ!
నీవు దైవాంశజుండవే, నిజము కనుము.. ‖ 16-5 ‖
భావము.
దైవీ సంపద మోక్షానికి, అసుర సంపద సంసార బంధానికి కారణము. అర్జునా! విచారించకు, నీవు దైవీ సంపదతోనే పుట్టితివి
తే.గీ. దైవమాసురమన్రెండు జీవకోటి
వరలు, దైవమున్ దెల్పితి, పరగు నసుర
విషయమరయుము తెలిపెద విపులగతిని.
యరసి వర్తింపుమా తగన్ నిరుపమాన!. ‖ 16-6 ‖
భావము.
ఈ లోకంలో దైవము, అసురము అని ప్రాణుల సృష్టి రెండు రకములు. దైవసృష్టిని గురించి విస్తారముగా చెప్పబడినది. అర్జునా! అసుర సృష్టిని గూర్చివినుము.
తే.గీ. నిజమిది ప్రవృత్తిని నివృత్తిని నసురగుణు
లెఱుఁగ, రిల శౌచమాచార మెఱుఁగబోరు,
సత్యదూరులై యుందురు సతతమిలను,
నీవు గ్రహియింపుమర్జునా! నేర్పు మీర.. ‖ 16-7 ‖
భావము.
అసుర స్వభావం కలవారు ప్రవృత్తిని కాని నివృత్తిని గాని ఎఱుఁగరు. వాళ్ళలో శౌచమూ, ఆచారమూ, సత్యమూ ఉండవు.
తే.గీ. జగతి మిథ్యని యిది సహజంబటంచు,
కామమే సృష్టిమూలమై కలిగెననుచు,
పాపపుణ్యధర్మంబులే వరలవనుచు
నసురభావులు తలచెదరనుపమముగ.. ‖ 16-8 ‖
భావము.
జగత్తు మిథ్య అనీ, దానికి ధర్మా ధర్మములు ఆధారము ఉండవని, ఈశ్వరుడే లేడనీ ఈ ప్రపంచములోని ప్రాణులు స్త్రీ పురుషుల కలయిక వలననే పుట్టినదనీ వారు అందురు. అందుచేత ఈ జగత్తుకి కారణం కామమే అందురు అసుర జనులు.

తే.గీ. ఇట్టి దుర్భావపూర్ణులై కౄరగతిని
ధర్మదూరులై పాపులై ధరణిపైన
మంచినణచుచు వంచనన్ మసలుచుందు
రాసురంబున చెడుచుంద్రు ధీసమేత!. || 16-9 ||
భావము.
ఈ దృష్టినే పట్టుకుని వేలాడుతూ వీళ్ళు ధర్మ భ్రష్టులై సంకుచిత బుద్ధులై, ప్రపంచానికి శత్రువులై, కౄరకర్ములై లోక నాశనము కోసము పుట్టుదురు.
తే.గీ. తృప్తిచెందనం తాశలో తేలుచుంద్రు
దంభ, మాన, మదంబులన్, దారి తప్పి
సత్యదూరమౌ మిథ్యపై సతము మసలి
పాపవర్తులై చెడుదురు లోపమదియె.. || 16-10 ||
భావము.
వాళ్ళుతృప్తి పరచడానికి వీలులేనంత కోరికలను పెట్టుకొని దంభ, మాన,
మదాలతో నిండి, భ్రాంతి వలన అసత్యమైన వాటి వెంట అనాచారంగా ప్రవర్తింతురు.
తే.గీ. కామభోగంబులవధిగా కలుగువారు,
జన్మకడదాక పాపులై జగతిమెలగి
నరకమును చేరుచుందురాసురగుణులిల
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 16-11 ||
భావము.
వాళ్ళు మరణించే వరకు అపరిమితములైన యోచనలలో మునిగి తేలుతూ, కామ భోగాలు తప్ప జీవితానికి వేరే లక్ష్యం లేదని నిశ్చయించుకున్న వారు.
తే.గీ. అంతులేనట్టి యాశలనలమటింత్రు,
కామమునకును వశులయి భూమిపైన
ధనము కామాదులకునయి తగలబెట్టు
చుందురర్జునా! లేకయే ముందుచూపు.|| 16-12 ||
భావము.
వాళ్ళు వందలాది ఆశా పాశాలతో కట్టుబడి, కామక్రోధాలకు వశులై తమ కామభోగానికిగాను, అన్యాయముగానైనను సంపదలను సమకూర్చుకొనవలెనని అనుకొందురు.
తే.గీ. పెరుగుచున్నట్టి కోర్కెలన్ పెచ్చురేగి
పాపముల్జేయుచుందురు భ్రష్టులగుచు,
దుష్టసంపాదనాసక్తితోడ చెడుచు
రాక్షసంబునన్ నశియింత్రు రక్ష లేక.. .|| 16-13 ||
భావము.
ఈ రోజు ఇంత సంపద నాకు లభించినది. ఈ కోరికలని తీర్చుకొందును. ఇంత ధనము నాకు కలదు. ఇకపై ఇంకా ఇంత ధనము వచ్చును.
తే.గీ. శత్రువులజంపినాడను,చంపుదన్యు
లనిలనింక దైవంబేనె, యని రహింతు
రన్నియున్ నేనె యని ఖలులెన్ని గనుచు
పాపవర్తులై చెడుదురు పాండు తనయ!. || 16-14 ||
భావము.
ఈ శత్రువు నాచే చంపబడెను, ఇతరులను కూడా చంపివేయుదును. నేను ఈశ్వరుఁడను, భోగిని, సిద్ధుడిని, బలవంతుడను, సుఖిని.
తే.గీ. నేను ధనికుడను కులీనుఁ డేనె ఘనుడ,
యజ్ఞ ముల్జేయుదున్, దానమాచరింతు
ననుచు మూర్ఖుడై పతనంబు గనునతండు
రాక్షసములక్షణంబిది, శిక్షితుఁడగు.. || 16-15 ||
భావము.
నేను ధనవంతుణ్ణి, కులమున్న వాడిని, నాకు సమానులు ఎవరున్నారు?యజ్ఞము చేయుదును. దానములిత్తును, సంతోషింతును ఈ విధముగా అజ్ఞానముతో భ్రాంతిని చెందుదురు.
తే.గీ. అంతు లేని తలపులతో, భ్రాంత చిత్తు
లగుచు నజ్ఞానమున జిక్కి, యంతులేని
కామభోగాలచే నరకమునబడుచు
హేయముగ నాసురులు భువిన్ మాయఁదగులు.. || 16-16 ||
భావము.
అనేక రకముల ఆలోచనలతో భ్రాంత చిత్తులై అజ్ఞానపు వలలో చిక్కుకొని, కామభోగాలలో మరులుగొని అపవిత్రమైన నరకములో పడుదురు.
తే.గీ. యసురులాత్మస్తుతులు మూర్ఖ లసమదృష్టు

లరయదంబ,ధనమదాంధులనవరతము
నామమాత్రపు యజ్ఞ ముల్ భూమిజేయు
చుందు రనుపమ మూర్ఖులై మందభతులు. || 16-17 ||
భావము.
తమని తాము మెచ్చుకునే వాళ్ళు, మొండి వారు ధన మాన మదాలతో కూడుకుని, గ్రుడ్డి వారై దంభము కోసము శాస్త్ర పద్ధతిని వర్జించి నామమాత్రముగా యజ్ఞాలు చేయుదురు.
తే.గీ. దర్ప బలముల నహమును, ధాత్రి క్రోధ
కామముల నాశ్రయించుచు, గర్వమొంది,
యంతటన్గల నన్ దిట్టు నట్టివాని
నాసురంబగు యోనుల నమర విడుతు.. || 16-18 ||
భావము.
అహంకారాన్ని, బలాన్ని, దర్పాన్ని, కామ క్రోధాలను ఆశ్రయించుకొని, తమలోను, ఇతరులలోను ఉన్న నన్ను ద్వేషించే కౄరులు, దుష్టులు నరాధములను నేను నిత్యము అసురీ యోనుల్లోకి విసిరేస్తాను.
తే.గీ. నన్ను దూషించు కౄరులన్, నాదుభక్తు
ల నిల ద్వేషించునామూర్ఖులన్ గణించి
యాసురీయోనులన్ బుట్ట నమరజేసి
శిక్షగొలుపుదు శిష్టుల రక్షణకని.. || 16-19 ||
భావము.
ఇట్లు నన్ను ద్వేషించే కౄరులు, దుష్టులు, నరాధములను నిత్యమూ నేనుఅసురీ యోనుల్లోకి విసిరేస్తాను.
తే.గీ. ఆసురీయోనిజుల్ నన్ను నరయ లేక
జన్మజన్మలకును నీచ జన్మలెత్తు,
పాపపంకిల జన్ములై పాపకూప
ముననె కృంగుచునుందురు వినుము పార్థ!. || 16-20 ||
భావము.
అర్జునా! ఆసురీ జన్మను పొందిన మూర్ఖులు ప్రతి జన్మలోను నన్ను చేరకుండానే ఇంకా అధోగతికి పోతారు.
తే.గీ. ఆత్మనాశనహేతువు లరయ మూడు
కామముక్రోధలోభముల్, కాన నరుడు
విడువగావలె మూడిటిన్, విజ్ఞత గలి
గి, కను మర్జునా సత్యంబు ప్రకటితమవ.. || 16-21 ||
భావము.
ఆత్మ నాశనానికి దారి తీసే నరక ద్వారాలు మూడు-కామం, క్రోధం, లోభం. అందుచేత ఈ మూడింటిని త్యజించవలెను.
తే.గీ. నరకమార్గ మీ మూటిని నరుడు విడువ
శ్రేయమునుగొల్పు కర్మలే చేయుచుండు,
పరమగతిపొందునాతడు నరకము విడి
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 16-22 ||
భావము.
కౌంతేయా! నరక ద్వారాలైన ఈ కామ క్రోధ లోభాలు మూడింటి నుండి విడుదల పొందిన నరుడు, తనకు శ్రేయస్సును కలిగించే కర్మలు చేయును.దాని వలన పరమగతిని పొందును.
తే.గీ. కోరికలు పెచ్చి శాస్త్రమున్ దూరి దురిత
వర్తులిల కార్య విఫలులై బాధితులగు,
సుఖము, పరగతి దూరమౌచు వెతలందు
చుందురో యర్జునా! మది యందు కనుము.. || 16-23 ||
భావము.
తన కోరికల కారణముగా శాస్త్రమును ఉల్లంఘించి ప్రవర్తించిన వాడు కార్యసిద్ధిని పొందడు. సుఖమును పరమగతిని కూడా పొందడు.
తే.గీ. శాస్త్రమాధారమిచ్చుట చక్కగగొని
మంచి త్రోవలో నడచిన మంచి జరుగు,
శాస్త్రమును గాంచి వర్తించ చక్కగాను
ముక్తిమార్గంబు నందుట పొసగు పార్థ!. || 16-24 ||
భావము.
అందుచేత కర్తవ్యాన్ని, అకర్తవ్యాన్నినిర్ధారించుకొనుటకు శాస్త్రము ప్రమాణము.
శాస్త్రము చెప్పిన విధిని తెలుసుకుని ఇక్కడ నీవు కర్మ చేయుట మంచిది.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " దైవాసురసమ్పద్విభాగ యోగము " అనెడి
16వ అధ్యాయము. సమాప్తము.

17వ అధ్యాయము.
శ్రద్ధాత్రయవిభాగయోగము

అర్జునుడనుచున్నాడు.
తే.గీ. శాస్త్రమును వీడి, నిన్నె తా శ్రద్ధతోడ
కొలువ నాసేవ యేమగు కూర్మి జెపుమ
సాత్వి కమొ తామసమొ రాజసంబొ కృష్ణ!
తెలియఁ జెప్పుమునాకీవు దివ్య తేజ!. ‖ 17-1 ‖
భావము.
కృష్ణా! ఎవరైనా శాస్త్ర విధిని వదిలిపెట్టి శ్రద్ధతో ఆరాధిస్తే వాళ్ళ నిష్ఠ ఎటువంటిది? సాత్వికమా, రాజసికమా, తామసికమా?.
శ్రీ భగవానుడనుచున్నాడు.
తే.గీ. శ్రద్ధ సత్వ రజస్తమ రమ్య తేజ
ములను మనుజుల నుండును, పుట్టినపుడె
యుండునవి నీవెఱింగిన,నొప్పిదముగ
నీవు గ్రహియింపుమర్జునా! నేర్పు మీర.. ‖ 17-2 ‖
భావము.
మనుష్యుల శ్రద్ధ సాత్వికము, రాజసికము, తామసికము అని మూడు విధాలుగా ఉండును. అది స్వభావము నుండి జనించునట్టిది. వాటిని గురించి విను.
తే.గీ. వ్యక్తియొక్క స్వభావంబుననుసరించి
శ్రద్ధయుండును మనుజులన్, శ్రద్ధ నొప్పు
నతఁడు నిరతంబు, శ్రద్ధయునతులితముగ
నొప్పునెట్టిదోవ్యక్తిత్వమొప్పునటులె. ‖ 17-3 ‖
భావము.
అర్జునా! ప్రతివారిలోను వ్యక్తి యొక్క స్వభావమును అనుసరించి అతని శ్రద్ధ ఉండును. ఈ మానవుడు శ్రద్ధా మయుడు. ఎవరి శ్రద్ధ ఎటువంటిదో వాళ్ళ వ్యక్తిత్వము అటువంటిది అగును.
తే.గీ. దేవతలఁ గొల్చు సాత్వికుల్ దివ్యముగను,
రాజసికులింక యక్షులన్ రాక్షసులను,
తామసికులు భూతప్రేత తతిని గొలుచు,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర. . ‖ 17-4 ‖
భావము.
సాత్వికులు దేవతలను, రాజసికులు యక్షరాక్షసులను, తామసికులు భూత ప్రేత గణాలను ఆరాధింతురు.
తే.గీ. ప్రబల కామరాగములతో వరలుచుండి
యహముదంబంబులనుగల్గియహరహంబు,
శాస్త్రమొప్పని, చెడుగొల్పు సద్విరుద్ధ
తపము చేసెడివారుంద్రు ధరణిపైన. ‖ 17-5 ‖
భావము.
దంభాహంకారాలతో, ప్రబలమైన కామరాగాలతో కూడి శాస్త్ర విరుద్ధమైన, పీడా కరమైన తపస్సు చేసే వారూ,
స్తే.గీ. తెలివిమాలి జీవకణాళి, తేజమయిన
నన్ను హింసింతురాసుర మున్న జనము
లసురనిశ్చయులనియెంచునట్టి వారి
కిహము పరమును చెడిపోవు, మహిత! కనుమ. . ‖ 17-6 ‖
భావము.
తెలివి తక్కువగా శరీరంలోని జీవకణాలనూ, శరీరంలో ఉండేనన్ను కూడా హింసించే వాళ్ళు అసురిక నిశ్చయం కలవారని తెలుసుకో.
తే.గీ. జనులకిష్టంబు త్రివిధభోజనములవని
తపము, యజ్ఞము,ధనమట్లె, తలచి చూడ,
భేదమరయుము వానిలో మోదమలర,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర. . ‖ 17-7 ‖
భావము.
మానవులకు మూడు విధాలైన ఆహారము ప్రియము. యజ్ఞమూ, తపస్సూ, దానమూ కూడా అటులనే ఉండును. వాటిలోని భేదమును వినుము.
తే.గీ. ఆయువును, సత్వబలముల, ననితరముగ
సుఖము, నారోగ్యమున్, ప్రీతి, శోభఁ గలుగఁ
జేయు, రసయుక్తమౌ, స్నిగ్ధ, శ్రేయమునిడు
భోజనము కోరు సాత్వికుల్ పూర్తిగాను. . ‖ 17-8 ‖
భావము.

ఆయువు సత్వగుణము, బలము, ఆరోగ్యము, సుఖము ప్రీతి వీటిని పెంచేవీ, రసముతో నిండినవీ, జిడ్డుతో నిగనిగలాడునవీ, కడుపులో చాలా కాలము ఉండునవీ, మనస్సునాకర్షించునవీ అయిన ఆహారములు సాత్వికులకు ప్రియముగా ఉండును.
తే.గీ. కటువు నామ్లము, లవణము, కలిగి యతిగ
పొడిగ, వేడి కారాలతో, కడకురోగ
దుఃఖమును గొల్పువాటినే ధూర్తగుణులు
రాజసికులిష్టపడుదురు రాజ! పార్థ! . || 17-9 ||
భావము.
చేదూ, పులుపూ, ఉప్పూ, వేడీ, కారమూ, అన్నీ అతిగా కలిగి, పొడిపొడిగా ఉండి, దాహం పుట్టిస్తూ, దుఃఖాన్నీ, శోకాన్నీ, రోగాన్నీ కలిగించేవి రాజసికులకు ఇష్టము.
తే.గీ. పాసిపోయిన, రుచిచెడ్డ వాసనగల
యెంగిలైనవి తిననెంత్రు యింగితమును
పూర్తిగా వీడి తామసుల్ మూర్ఖులగుచు
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర. . || 17-10 ||
భావము.
వండిన తరువాత ఝాము దాటి పోయినదీ, రుచి పూర్తిగా పోయినదీ, పాసిపోయినదీ, వాసన గొట్టునదీ, ఎంగిలిదీ, అశుభ్రమైనదీ అయిన భోజనము తామసికులకు ఇష్టము.
తే.గీ. ఫలితమాశించకయె ధర్మ మెలయ కర్మ
శాస్త్ర విహితమున్ జేయుట సాత్వికమగు
యజ్ఞ మగునర్జున! కనుమహర్నిశములు
ధర్మబద్ధతన్ వర్తింప ధరణిపైన. . || 17-11 ||
భావము.
ఫలాపేక్ష లేకుండా, శాస్త్రాలలో విధింపబడిన ప్రకారంగానూ, తను ఆ కర్మ చేయడం కర్తవ్యమనే స్థిర చిత్తంతో చేయబడే యజ్ఞం సాత్విక యజ్ఞం.
తే.గీ. ఫలమునాశించి చేయుట, మలిన మతిని
దంబమునకయి చేయుట తగదు యజ్ఞ
కర్మ, రాజసయజ్ఞమౌ కనగనదియు,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పుమీర. || 17-12 ||
భావము.
అర్జునా! ఫలాన్ని ఆశించుచునో, డంభము కోసమో చేయబడు యజ్ఞము
రాజసిక యజ్ఞము అని తెలుసుకో.
తే.గీ. శాస్త్రవిధిలేక, మంత్రముల్ శ్రద్ధ లేక,
యన్నదానంబు చేయక, మన్ననమున
దక్షిణేమాత్రమీయక, ధాత్రిఁ జేయు
యజ్ఞ మదితామసికమను యజ్ఞమరయ.. || 17-13 ||
భావము.
శాస్త్ర విధి లేకుండా అన్నదానము చేయకుండా, మంత్రములు లేకుండా, దక్షిణ ఇవ్వకుండా, శ్రద్ధ లేకుండా చేయబడే యజ్ఞము తామసిక యజ్ఞము అని చెప్పబడుతుంది.
తే.గీ. గురుల, దేవతలన్, బ్రహ్మకులజుల నిల
పండితులఁ బూజ చేయుట, బ్రహ్మచర్య
ము, శుచి, రుజువర్తనంబును, ముక్తిదమగు
నట్టి శారీరకతపస్సు, నరయుమయ్య.. || 17-14 ||
భావము.
దేవతలను, బ్రాహ్మణులను, గురువులను, విద్వాంసులను పూజించుట, శుచిత్వము, సూటియైన ప్రవర్తన, బ్రహ్మచర్యము అహింస ఇవి శారీరక తపస్సులు.
తే.గీ. వాక్కులుద్వేగరహితమై, వరలుచు, ప్రియ,
సత్య, హిత యుక్తమైనట్టి చక్కనొప్పు
నట్లుపలుకుట, స్వాధ్యాయ మరసి నేర్వ,
వాచికంబగు తపమది, పార్థ! వినుమ.. || 17-15 ||
భావము.
ఇతరులను బాధింపనిదీ, సత్యమూ, ప్రియమూ, హితమూ అయిన వాక్కు, స్వాధ్యాయాన్ని అభ్యసించడమూ ఇది వాచికమైన తపస్సు.
తే.గీ. సుప్రసన్నచిత్తముతోడ సుగుణచయము,
మౌనమును, నిగ్రహంబును, మహితభావ
శుద్ధి, మానసికతపస్సు, చూడ ఘనము.
నీవు గ్రహియింపుమర్జునా! నేర్పు మీర.|| 17-16 ||
భావము.
ప్రసన్నమైన మనస్సూ, మంచితనమూ, మౌనమూ, మనోనిగ్రహమూ, శుద్ధమైన భావాలూ-ఇవి మానసిక తపస్సు.

తే.గీ. మూడు తపములున్ శ్రద్ధతో కూడి, లాభ
కాంక్షలేకుండి, నిగ్రహ గతిని చేయఁ
బడిన సాత్వికతపముగ వరలు పార్థ!
నీవు గ్రహియించు శ్రద్ధతో నేర్పు మీర.. || 17-17 ||
భావము.
పై మూడు రకాల తపస్సు పూర్తి శ్రద్ధతో, ఏ లాభమూ కోరకుండా, నిగ్రహము చేత చేయబడినప్పుడు, సాత్వికమైన తపస్సుగా చెప్పబడును.
తే.గీ. సత్కృతికొ, మానమర్యాద సంస్తుతులకొ,
దంబమున తాము చేసెడి తపములరయ
రాజసికతపములిల పార్థ! తెలియుమిది.
నీకు తెలియవలయునిది నిజము తెలియ.. || 17-18 ||
భావము.
సత్కారముకోసమూ, మాన మర్యాదల కోసమూ డంభముతోనూ ఏ తపస్సు చేయబడునో దానిని స్థిరత్వము లేని రాజసిక తపస్సుఅందురు.
తే.గీ. తనను హింసించుకొనుచు తాననవరతము
నితరులకు పీడ గొలుపుచు వెతలుగొలుపు
తపము తామసతపమగు ధరణిపైన
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 17-19 ||
భావము.
సరిగా అర్థము చేసుకొనక, తన్ను తాను హింసించుకొనుచు, లేదా ఇతరుకలకు పీడా కరముగా చేయబడునది తామసికము అనబడును.
తే.గీ. దేశ కాలపాత్రములుమదిని తలచుచు
ననుపకారికి దానంబు నందజేయ,
నదియె సాత్విక దానంబు ముదముగొలుపు,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 17-20 ||
భావము.
దానము చేయుట కర్తవ్యము అనెడి భావముతో, తిరిగి ఉపకారము చేయని వారికి దేశకాల పాత్రలను చూచి, చేసిన దానము సాత్వికమని చెప్పబడును.
తే.గీ. ప్రతిఫలార్థమో, ఫలముకో, బాధపడుచు
తాను బలవంతముగ చేయు దానమరయ
రాజసికమగు, రమణీయ రాజవదన!
నీవుగ్రహియింపుమియ్యది నేర్పు మీర.. || 17-21 ||
భావము.
ప్రత్యుపకారం ఉద్దేశించిగాని, ఫలాన్ని ఆశించిగాని, బలవంతంగానూ,
బాధపడుతూ ఇచ్చే దానిని రాజసిక దాన మందురు
తే.గీ. ధర నపాత్రున, కహితమౌ సరణి, కాని
వేళ, నవమానపరచుచు, వినగరాని
విధముగాదానమును చేయ ప్రీతి గనుమ
తామసికదానమదియౌను, తలచి చూడ.. || 17-22 ||
భావము.
అపాత్రునికి, తగని సమయంలో, ఇవ్వకూడని చోట, అగౌరవంతో, అవమానిస్తూ ఇచ్చేది తామసిక దానమని చెప్పబడును.
తే.గీ. బ్రహ్మమును జూపు గుర్తులు వరలు మూడు,
కనగ నోం, తత్తు, సత్తును, కలిగె వీటి
నుండిబ్రాహ్మణుల్, వేదముల్, దండి యజ్ఞ
ములురచింపగబడెనయ్య పుణ్యపురుష!. || 17-23 ||
భావము.
ఓం తత్ సత్ అనేవి బ్రహ్మపదార్థాన్ని నిర్దేశించే మూడు సంకేతాలని చెప్పబడుచున్నది, వీటితోనే పూర్వము బ్రాహ్మణులు, వేదములు, యజ్ఞములు ఏర్పరుప బడినవి.
తే.గీ. బ్రహ్మవాదులీహేతువున్ వరలు మంత్ర
ములకు ముందు నోంకారంబు పలుకుచుంద్రు,
యజ్ఞ, దానతపములందు, విజ్ఞులగుచు,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 17-24 ||
భావము.
అందుచేత "ఓం"అంటూ బ్రహ్మవాదుల చేత శాస్త్ర విధానము ప్రకారము నిత్యమూ యజ్ఞ దాన తపః కర్మలు చేయబడుచున్నవి.
తే.గీ. తత్తటంచు మోక్షార్థులు చిత్తమలర
కాంక్షలను వీడి, యజ్ఞ సత్కార్యములను

తపములను చేయుచుందురు, ధర్మమరసి,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.|| 17-25 ||
భావము.
"తత్"అంటూ మోక్షాన్ని కాక్షించే వారు ఫలం ఆశించకుండా, వివిధములైన యజ్ఞములూ, తపస్సులూ చేయుచుందురు.
తే.గీ. సత్యమునకు మంచికి వాడు సత్పదంబు,
మంచి కర్మలకునువాడు మంచి దెలుపు
సత్ పదంబునో యర్జునా! సత్యమిదియె
నీవుగ్రహియింమియ్యది నేర్పు మీర.. || 17-26 ||
భావము.
పరమసత్యమునకు, మంచితనమునకు సూచనగా "సత్"అనే పదమును ప్రయోగింతురు.
అర్జునా! మంచి కర్మలకు కూడా"సత్"అనే పదము ప్రయోగింప బడును.
తే.గీ. దానముల, యజ్ఞ తపములలోననిలిచి
యుండుటయె సత్తనందురు మెండుగాను,
దీని కొరకు చేసెడికర్మ దియును సత్తు,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర. || 17-27 ||
భావము.
యజ్ఞ దాన తపస్సులలో నిలిచి ఉండడం"సత్"అని చెప్పబడుతున్నది. దాని కోసము చేసెడి కర్మని కూడా "సత్"అనే అందురు.
తే.గీ. అట్టి మహనీయ శ్రద్ధ లేనట్టి తపము,
హెూమ దానముల్, క్రియలు నహెూ యసత్త
టంచు గ్రహియింపుమర్జునా! యెంచి చూడ
యిహపరంబులనీయవీ మహిని, నిజము.. || 17-28 ||
భావము.
అర్జునా! అట్టి శ్రద్ధలేని హెూమము, దానము, తపస్సు, మరి యే క్రియ అయినా సరే అది"అసత్"అని చెప్పబడును.
అట్టి కర్మ ఇహములో కానీ, పరములో కానీ ఫలము ఇవ్వదు.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " శ్రద్ధాత్రయవిభాగ యోగము " అనెడి
17వ అధ్యాయము. సమాప్తము.

18వ అధ్యాయము.
మోక్షసన్న్యాసయోగము.

అర్జునుడనుచున్నాడు.
తే.గీ. వినుహృషీకేశ! సన్యాస విషయ మెఱుఁగ
వేరువేరుగా, తెలుపుము, విదితమవగ,
నీవు తెలిపిన గ్రహియింతు నీకు మ్రొక్కి,
తెలుపుమోకృష్ణ వివరించి, తెలియ నాకు.. || 18-1 ||
భావము.
ఓ హృషీకేశా! కేశి సంహారా! సన్యాసం యొక్క తత్వాన్ని వేరువేరుగాతెలుసుకోవాలని కోరుతున్నాను.
శ్రీ భగవానుడన్నాడు :
తే.గీ. కామ్య కర్మల త్యాగమున్ ఘనతరమగు
దివ్యసన్యాసమందురు దేవఋషులు,
కర్మఫలముల త్యాగమే ఘనతరమగు
త్యాగమంద్రు వివేకులు తలచి చూడు.. || 18-2 ||
భావము.
కామ్య కర్మలని వదిలి పెట్టడం సన్యాసమని ఋషులంటారు. అన్ని కర్మల ఫలాన్ని త్యజించడం త్యాగమని వివేకులు అంటారు.
తే.గీ. దోషకరమగు కర్మలన్ దొలఁగ విడువ
వలెననందురుకొందరు, పండితులిల,
యజ్ఞ దాన తపః కర్మ లజ్ఞలగుచు
విడువరాదంద్రు కొందరు విజయ! వినుమ.. || 18-3 ||
భావము.
దోషం కల కర్మలని వదలాలని కొందరు పండితులంటారు. యజ్ఞ దాన తపః కర్మలని వదలరాదని కొందరు అంటారు.
తే.గీ. భరతవంశజశ్రేష్ఠుఁడా! పార్థ! వినుమ
య, పురుషవ్యాఘ్రమా! వినుమయ్య! యిందు
నాదు నిర్ణయమున్ త్యాగ మీధరిత్రి
మూడు విధములుగాఁ జెప్పఁ బొసగునయ్య.. || 18-4 ||
భావము.
భరత శ్రేష్టుడా! ఈ విషయంలో నా నిర్ణయాన్ని విను. పురుష వ్యాఘ్రమా! త్యాగం మూడు విధాలని చెప్ప బడుతుంది.
తే.గీ. యజ్ఞ దాన తపఃకర్మ లజ్ఞలగుచు
మాన కాచరింప వలయు, దాన యజ్ఞ
తపము లిల వివేకులకును, ధరను శుద్ధి
చేయుటను నీవెఱుంగుము, చిత్తమలర,. || 18-5 ||
భావము.
యజ్ఞ దాన తపః కర్మలను మానరాదు. చేయవలసినదే. వివేకులను శుద్ధం చేసేది యజ్ఞ దాన తపస్సులే.
తే.గీ. చేయు నీకర్మలన్నిటిన్ చేయ వలయు
సంగ, ఫలితంబులను వీడి, సన్నుతమతి,
నాదు మతమిది, యుత్తమమైధరణిని
యొప్పు గ్రహియింపుమియ్యది యొప్పిదముగ.. || 18-6 ||
భావము.
అర్జునా! ఈ కర్మలను కూడా సంగమును, ఫలితమును వదిలి చేయవలెనని నా నిశ్చితమైన ఉత్తమమైన అభిప్రాయము.
తే.గీ. నియతకర్మలు విడరాదు, నిష్ఠఁగలిగి
యాచరింపవలయు పార్థ! యనితరముగ
భ్రాంతితో సన్యసించిన వానినెల్ల
త్యాగ మదితామసికమౌను, తలఁచుమిదియు.. || 18-7 ||
భావము.
నియత కర్మలను సన్యసించకూడదు. భ్రాంతితో వానిని సన్యసించడం తామసిక త్యాగం అనిపించుకుంటుంది.
తే.గీ. దేహమునకది శ్రమయంచు, మోహముననను,
భయముతోఁ గర్మ మానినన్ ఫలము లేదు,
త్యాగమిది రాజసికమౌను, తలచి చూడ,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 18-8 ||
భావము.
శరీరానికి కష్టం కలుగుతుందనే భయముతోనూ, బాధాకరమని కర్మని వదిలినచో అది రాజసిక త్యాగము అగును. దానివలన త్యాగఫలము లభించదు.
తే.గీ. సంగ భావంబు ఫలకాంక్ష సరగున విడి,
కర్మ కర్తవ్యమని చేయ, ఘనతరముగ

సాత్వికత్యాగమనఁదగు, సద్విభాస!
నీవు గ్రహియింపుమా యిది నేర్పు మీర.. || 18-9 ||
భావము.
కర్తవ్య బుద్ధితో సంగభావం, ఫలాపేక్ష వదిలి నియత కర్మని చేసినపుడు అది సాత్విక త్యాగం అవుతుందని నా అభిప్రాయం.
తే.గీ. సత్వగుణపూర్ణ మేధావి శంకవీడి
కలుగు ప్రతికూలఫలమున కలతపడడు
నిందచేయడు దానిని నిశ్చితముగ.
నీవు గ్రహియింపుమర్జునా! నేర్పు మీర.. || 18-10 ||
భావము.
సత్వగుణంతో నిండిన మేధావి సంశయ రహితుడై ప్రతికూల కర్మని ద్వేషించడు.
తే.గీ. కర్మలను వీడుటన్నది కాయమున్న
వానికెన్న నసాధ్యమ్ము, వాఁడు కర్మ
ఫలములను వీడ త్యాగిగా వరలునవని,
నీవు గ్రహియింపుమర్జునా! నేర్పు మీర.. || 18-11 ||
భావము.
దేహధారికి కర్మలన్నింటిని త్యజించడం సాధ్యం కాదు. కర్మ ఫలాన్ని త్యజించిన వాడే త్యాగి అనిపించుకొనును.
తే.గీ. మంచి, చెడు,మిశ్ర ఫలములు మహిని కర్మ
లకులభించునత్యాగికిప్రకటితముగ
నంతమందున, త్యాగుల కంటవయ్య,
నీవు గ్రహియింపుమియ్యది నేర్పు మీర.. || 18-12 ||
భావము.
కర్మ ఫలం దుష్టమైనవి, మంచివి, మిశ్రమమైనవి అని మూడు విధములు త్యాగులు కాని వారికి మరనణానంతరం లనభించును. అవి సన్యాసులకు ఏమాత్రమూ కూడా రాదు.
తే.గీ. కర్మలేవైన సిద్ధింప కావలె భువి
నైదు కారణముల్, విను మర్జునుండ!
సాంఖ్యసిద్ధాంతమునుబట్టి సన్నుతముగ,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 18-13 ||
భావము.
ఓ మహానుభావా సాంఖ్య సిద్ధాంతంలో ఏ కర్మలైనా సరే సిద్ధించడానికి ఈ అయిదు కారణాలు కావాలని చెప్ప బడినవి. వాటిని గురించి వినుము.
తే.గీ. కన నధిష్ఠాన దేహంబు కర్మకర్త,
జ్ఞాన కర్మేంద్రియమ్ములు, ఘనతరమగు
లబ్ధ ప్రారబ్ధ మీ యైదు లక్ష్యగతిని
సర్వ కర్మసిద్ధికి వలెన్ సరసహృదయ!. || 18-14 ||
భావము.
అధిష్ఠానమైన శరీరం, కర్మ చేసే వాడు, వేర్వేరు ఇంద్రియాలు, కర్మేంద్రియాలు, ప్రారబ్ధం ఈ అయిదూ(సర్వ కర్మ సిద్ధికి కారణాలు)
తే.గీ. త్రికరణములతోఁ చేయు మంచికి, చెడునకు,
కారణంబగు నీయైదు కనుము మదిని,
తెలియ వలయును సుజ్ఞాన తేజమొదవ
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 18-15 ||
భావము.
మంచిది కాని, చెడ్డది కాని మానవుడు మనో వాక్కాయములతో ఏ కర్మ చేసినా దానికి ఈ అయిదు కారణమగును
తే.గీ. విషయ మిటులుండ నజ్ఞాను లసలు కనరు,
తామె కర్తగా భావింత్రు ధరణిపైన,
విషయమును గనఁ జాలరు విశ్వమునను.
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 18-16 ||
భావము.
విషయం ఇలా ఉండగా, అపరిపక్వమైన బుద్ధితో కేవలం తానే కర్తననుకునే మూర్ఖుడు తెలివి తక్కువ తనం వలన సరిగా గ్రహించడు.
తే.గీ. ఎవ డహంబును వీడునో, యెవని బుద్ధి
కర్మలం దగల్కుండునో, గణ్యుడయిన
యట్టివాడు లోకుల జంప, నంటనేర
దట్టి కర్మఫలంబెన్న నతనికిలను.. || 18-17 ||
భావము.
ఎవరిలో అహంకారం లేదో, ఎవరి బుద్ధి కర్మలో తగుకుకొనదో, అతడు ఈ లోకులను చంపినా, చంపినవాడు కాదు. బంధనంలో చిక్కుకొనడు.

తే.గీ. జ్ఞాత, జ్ఞానమున్ జ్ఞేయము, కర్మకెపుడు
ప్రేరణము గొల్పుచుండును,వినుము పార్థ!
యింద్రియము, కర్త, కర్మయు, నిట్టి కర్మ
నిర్వహించుచునుండును, నిజము కనుము.. || 18-18 ||
భావము.
జ్ఞానమూ, తెలుసుకోవలసిన విషయమూ, తెలుసుకునే వాడూ, ఈ మూడూ కర్మని ప్రేరేపించేవి. ఇంద్రియం, కర్మ, కర్మ చేసినవాడు, ఈ మూడూ కర్మను నిర్వహించునవి.
తే.గీ. జ్ఞానమును, కర్మ, కర్తయు, కనగ గుణవి
భేదమునుబట్టి మూడేసి విధములనుచు,
గుణపు సంఖ్యాన వివరించె కూర్మితోడ
వినుము శ్రద్ధగా నీవిది ఘనతరముగ.. || 18-19 ||
భావము.
జ్ఞానము, కర్మ, కర్త-ఈ మూడూ గుణ భేదములని బట్టి మూడేసి విధములని, గుణాలకు సంబంధించిన సాఖ్యంలో చెప్పబడినది. అందులో ఉన్నదానిని వినుము.
తే.గీ. నాశరహితమౌ సత్తు కనంగ నొకటె,
యన్ని ప్రాణుల నవిభక్తమై రహించు
ననుచు గ్రహియించుసాత్వికమనుపమముగ,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.|| 18-20 ||
భావము.
అన్ని ప్రాణులలోనూ నాశనం లేని ఒకే సత్తు ఉన్నదనీ, భిన్నమైన వాటిలో అది అవిభక్తంగా ఉన్నదనీ గ్రహించేది సాత్విక జ్ఞానమని తెలుసుకో.
తే.గీ. వేరువేరుగ కనిపించు వివిధ రూప
ములను జీవులు వేరని తలచుటదియె
రాజసికమగు జ్ఞానంబు, రాజ తనయ!
పార్థుడా! నీవు గ్రహియించు ప్రస్ఫుటముగ.. || 18-21 ||
భావము.
వేరు వేరుగ కనబడే రూపాలలో వేరువేరు జీవులు ఉన్నారని గ్రహించునది రాజసిక జ్ఞానమని తెలుసుకొనుము.
తే.గీ. ఒక్క వస్తువే సర్వమం చొప్పనట్టి
యుక్తికి విరుద్ధముగనెంచి, యొప్పనట్టి
విధముగా పట్టుకొనుటది విశ్వమందు
తామసికమగు జ్ఞానమ్ము, తలచు మిదియు.. || 18-22 ||
భావము.
ఒక వస్తువే సర్వమూ అని, యుక్తికి విరుద్ధంగా, అసంబద్ధంగా, అల్పత్వంతో పట్టుకు కూర్చునేది తామసిక జ్ఞానమని అనబడును.
తే.గీ. విగతసంగము, మరి ఫలాపేక్ష రహిత
ము ననురాగమునుద్వేషములకు దూర
ముగ మసలి చేయు నిత్యకర్మ గతిసాత్వి
కముగ నెఱుఁగుమీవర్జునా! కనుము నిజము.. || 18-23 ||
భావము.
సంగభావం లేక, ఫలం మీద ఆశ లేక, రాగ ద్వేషాలు లేక చేసిన నిత్య కర్మ సాత్విక కర్మ.
తే.గీ. కోరికలతోడను దురహంకారమునను,
మిక్కుటమ్మగు శ్రమతోడ మేదినిపయి
చేయుకర్మ రాజసికంబు, చిత్తమలర
వినుచు గ్రహియింపుమర్జునా! విశదముగను. || 18-24 ||
భావము.
కోరికతో అహంకారంతో బహు శ్రమతో చేసే కర్మ రాజసిక కర్మ.
తే.గీ. క్షయము ననుబంధమున్ హింస, శక్తిఁ గనక
మించి చేయుట మోహమున్ మించి మొదలు
పెట్టుటివి తామసికమగు, విజయ! నిజము
నీవు గ్రహియింపుమీ భువిన్ నేర్పు మీర.|| 18-25 ||
భావము.
బంధనంలో ఇరికించేది, నాశనాన్ని హింసను కలుగచేసేది శక్తి సామర్థ్యాలు లెక్కించకుండా చేసేది, మోహంతో ఆరంభించబడినదీ అయిన కర్మ తామసిక కర్మ అని చెప్ప బడుతుంది.
తే.గీ. సంగముక్తు డహము లేక సదయనొప్పి,
పట్టుదల దీక్ష నొప్పుచు బరగువాడు,
నిరతముత్సహియై, జయ! ధరనపజయ
ముల కచలచిత్తుఁడేసాత్వికుడరయంగ.

(ల-డ.లకుప్రాసయతి). || 18-26 ||
భావము.
సంగభావం నుండి ముక్తుడైన వాడు, అహంకారం లేని వాడు, పట్టుదల ఉత్సాహం ఉన్నవాడు, జయాపజయాల వలన చలించని వాడు అయిన కర్త సాత్వికుడని చెప్పబడును.
తే.గీ. రాగి, లోభి, ఫలాపేక్షఁ గ్రాలువాఁడు,
హింస చేసెడివాడు, మహి నశుచియును,
దుఃఖసుఖములకుఁ గలగు దుస్స్వభావి,
రాజసికుడని యెఱుఁగుము, రాజపుత్ర.. || 18-27 ||
భావము.
రాగంతో కూడి ఫలం కోరుతూ, పిసినిగొట్టు తనమూ, హింసా స్వభావం కలిగి, అశుచి అయి, సుఖదుఃఖాలకు లోనయ్యే కర్త -- రాజసికుడని చెప్ప బడును.
తే.గీ. నిగ్రహము లేని, పామరుని, మొరటును, వి
పాదపూర్ణు, సంకుచితమౌ ఖేదగుణుని,
బద్ధకస్తుని, మొండిని, ప్రబల మోస
గానినిల కాల యాపకున్, గాంచ తామ
సికులుగాఁ జెప్పనొప్పును స్థిరగుణాఢ్య!. || 18-28 ||
భావము.
ఎట్టి నిగ్రహము లేని వాడు, పామరుడు, సంకుచిత స్వభావము కలవాడు, మొండివాడు, మోసగాడు బద్ధకస్తుడు, విషాదంలో ఉండి ప్రతి దానికి కాలయాపన చేసే కర్త, తామసికుడని చెప్ప బడును.
తే.గీ. గుణములనుబట్టి మూడేసి కూడియున్న
బుద్ధి, ధృతిని,నేఁ దెలిపెదన్ బూర్తిగాను
వినుము విజయుండ! తెలివితో వీనులార,
నీవు గ్రహియింపుమియ్యది నేర్పు మీర. || 18-29 ||
భావము.
ధనంజయా! గుణాలనిబట్టి మూడేసి విధాలుగా ఉండే బుద్ధినీ, ధృతినీ గురించి వేరువేరుగా, పూర్తిగా చెబుతాను విను.
తే.గీ. విను ప్రవృత్తినివృత్తులు,వివరముగను,
బంధ మోక్షముల్, భువి భయాభయములనిక
కన నకార్య కార్యములను, గనుము తెలియ
తెలిపెదను పార్థ! ధీయుతా! తెలుసుకొనుము.. ||18-30 ||
భావము.
అర్జునా! ప్రవృత్తి-నివృత్తులు, కార్యాకార్యాలు, భయాభయాలు, బంధ మోక్షాలు---వీటిని వివరంగా చెబుతాను విను.
తే.గీ. ధర్మమును, దురితంపు నధర్మము నిఁక
కార్యమును మరియు కడు నకార్యమునిల
సరిగ కానఁగ లేకుంట జగతిలోన
రాజసికమని దలచుము ప్రస్ఫుటముగ.. || 18-31 ||
భావము.
పార్థా! ధర్మాధర్మాలను, కార్యాకార్యాలను సరిగా నిర్ణయించ లేని బుద్ధి రాజసికమైనది.
తే.గీ. కప్పబడియుండి మాయచేఁ గనగ లేక
ధర్మమని గాంచుచుండి యధర్మము నిల,
వక్రగతి చింతనముచేయు సక్రమమును
కనగ తామసికమదియె, కనుము పార్థ!
. || 18-32 ||
భావము.
అజ్ఞానంతో కప్పబడి అధర్మాన్ని ధర్మంగా, అన్ని విషయాలను విపరీతంగా ఎంచే బుద్ధి తామసిక మైనది.
తే.గీ. నిశ్చలంబగు యోగాన నిరుపమముగ
మదిని, ప్రాణేంద్రియములను మలగు చేష్ట
లను జయించి నిగ్రహమున మనుట కనగ
సాత్వికంబని యననగు సన్నుతాత్మ!. || 18-33 ||
భావము.
చలించని యోగములో మనస్సు, ప్రాణ, ఇంద్రియాల చేష్టలను నిగ్రహించి ఉంచే ధృతి సాత్విక మైనది.
తే.గీ. ధర్మ కామార్థముల బార్థ! ధరణిపైన
లౌకికంబగు పురుషార్థ లక్ష్యమనుచు
పట్టుదల యేది మమకార ముట్టిపడగ
నిలుపు నది రాజసికధృతి నిజము కనుమ.. || 18-34 ||
భావము.
అర్జునా! ఏ పట్టుదల ధర్మ కామార్థాలనే లౌకిక పురుషార్థాలని మమకారంతో, ఫలాశతో నిలబెట్టి ఉంచునో అది రాజసిక ధృతి.
తే.గీ. శోక, భయ, స్వప్న, ఖేదముల్, లోకమునను

మదము లను పట్టి విడువక మసలుటదియె
తామసమ్మగున్, మనకిలఁ దగనిదిదియె.
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 18-35 ||
భావము.
పార్థా! మూర్ఖుడు ఏ ధృతితో స్వప్నములను, భయమును, శోకమును, విషాదమును, మదమును విడువక పట్టుకొనునో అది తామసికము అయిన పట్టుదల.
తే.గీ. దేని నభ్యాస మునసొంది దివ్యమయిన
సుఖము నరుడొందు దుఃఖంబు సోకనీయ
కట్టి మూడు సుఖమ్ముల నర్జునుండ!
నీకుఁ దెలిపెద గ్రహియించు, నేర్పుమీర.. || 18-36 ||
భావము.
భరతశ్రేష్ఠుఁడా! అభ్యాసము వలన దేనిలో మానవుడు దుఃఖమును
అంతమొనరించి సుఖపడ కలుగునో ఆ మూడు విధములైన సుఖములను
గురించి వినుము.
తే.గీ. తొలుత దుఃఖమయమ్ముగాఁ దోచి సుఖము
కడకుఁ గొల్పునో, శాంతిచే కలుగు మనకు
నట్టి సుఖము సాత్వికమగు నరయపార్థ!
నీవు గ్రహియింపుమియ్యది నేర్పు మీర.. || 18-37 ||
భావము.
ఏ సుఖమైతే మొదట విషంగా తోచి, చివరకు ఏది అమృతమగునో, ఏది శాంతించిన బుద్ధి వలన లభించునో అది సాత్విక సుఖము.
తే.గీ. కనగ విషయేంద్రియంబుల కలయికవల
న మొదటమృతమ్ము, తుదికి విషముగ నగునొ
రాజసికసుఖమది పార్థ! భూజనులకు
నీవు గ్రహియింపుమా యిది నేర్పు మీర.. || 18-38 ||
భావము.
విషయాలు ఇంద్రియాలు సంయోగం వలన మొదట అమృతప్రాయంగా ఉండి, చివరికి విషము వలె అగునది రాజసిక సుఖము.
తే.గీ. నిద్దుర, మరుపు,నుండియు బద్ధకంబు
నుండియునుబుట్టి, మరిముందు నుండివెనుక
వరకు భ్రాంతిలో పడవేయు పరమసుఖము
తామసికమని యెఱుఁగుము ధరణిపైన.. || 18-39 ||
భావము.
నిద్ర, బద్ధకము, ఏమరుపాటుల నుండి జనించి ముందు నుండి చివరకు భ్రాంతిలో పడఁజేసి ఉంచెడి సుఖము తామసికము
తే.గీ. ప్రాకృతంబైన గుణములై వరలుచున్న
యీ త్రిగుణములన్ విడివడి యింత వరకు
కలుగు వారలు స్వర్గాన, క్ష్మాప్రదేశ
మందునన్ లేరు, గ్రహియింపమందు నిన్ను, || 18-40 ||
భావము.
భూమిపైనగాని, స్వర్గములోని దేవతలలో కాని ప్రకృతి వలన పుట్టిన ఈ మూడు గుణముల నుండి విడిపడి ఉన్నప్రాణి ఏదీయు లేదు.
తే.గీ. బ్రాహ్మణ, క్షత్రియుల, వైశ్య వర్ణ, శూద్ర,
జాతి కర్మలు నిజ భావ జనితమయిన
లక్షణములనుబట్టియే లక్ష్యముగను
భువిని విభజింపబడె పార్థ! పూర్తిగాను.. || 18-41 ||
భావము.
పరంతపా! బ్రాహ్మణ , క్షత్రియ, వైశ్య, శూద్రుల కర్మలు వాళ్ళ స్వభావం నుండి జనించిన లక్షణలను బట్టి విభజింప పడినాయి.
తే.గీ. శమము, దమ, తప స్సౌచముల్, క్షాంతి, యార్జ
వమును, జ్ఞాన, విజ్ఞానముల్, వరలుచుండి,
ధరణినాస్తిక్య మనునవి తప్పక భువిఁ
గలుగు సహజంబుగా బ్రాహ్మణులకు పార్థ!. || 18-42 ||
భావము.
శమము, దమము, తపస్సు, శౌచము, ఓర్మి, ఋజుత్వము, జ్ఞాన విజ్ఞానాలు, ఆస్థిక భావము---ఇవి బ్రాహ్మణులకు స్వభావ సిద్ధమైన కర్మలు.
తే.గీ. శౌర్యమును, తేజమున్, ధృతి, జయపిపాస,
యుద్ధమున వెన్ను చూపని యోధ గుణము,

దానగుణము, సమర్ధత, జ్ఞాన దీప్తి,
దైవలక్షణముల్ క్షాత్ర ధర్మములగు.|| 18-43 ||
భావము.
శౌర్యం, తేజం, పట్టుదల, సమర్థత, యుద్ధంలో వెన్ను చూపక పోవడం, దానగుణం, ఈశ్వర లక్షణం---ఇవి స్వభావ సిద్ధమైన క్షత్రియ కర్మలు.
తే.గీ. కృషియు, గోరక్ష, వాణిజ్య, ధిషణతలిల
వైశ్య కర్మలు సహజమై వరలుచుండు,
భువికి పరిచర్య చేయుట, ముఖ్యవిధిగ
శూద్రులకుఁబుట్టుకనె గల్గు, శూరవరుడ!. || 18-44 ||
భావము.
వ్యవసాయం, గోసంరక్షణ, వాణిజ్యం స్వభావ సిద్ధమైన వైశ్య కర్మలు. పరిచర్య భావంతో కూడినవి శూద్రులకు స్వభావ సిద్ధమైన కర్మలు.
తే.గీ. మానవుడు తన కర్మ నిమగ్నుఁడగుచు,
తనదు కర్మలన్ నిరతుఁడై తనరువాఁడు
సిద్ధి పొందెడి విధమును చెప్పెద విని,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 18-45 ||
భావము.
తన తన కర్మలలోనిమగ్నుడైన మానవుడు , తన కర్మలో నిరతుడైన వాడు సిద్ధిని ఎలా పొందుతాడో చెబుతాను విను.
తే.గీ. జీవ సృష్టి యెవ్వనినుండి చేయబడునో,
యెవని సృష్టిచే వ్యాపించు నవని నతని
దనదు కర్మలన్, కొలుచుచు తనరువాడు
సిద్ధి పొందునో యర్జునా! సిద్ధమిదియె.. || 18-46 ||
భావము.
ఎవరి నుండి జీవులు పుట్టుకొస్తారో, ఎవరి వలన ఇది యావత్తు వ్యాపించబడి ఉన్నదో అట్టివానిని తన కర్మ చేత ఆరాధించే మానవుడు సిద్ధిని పొందును.
తే.గీ. బాగుగాయనుష్ఠించెడి పరులదైన
ధర్మ మనుసరించుట కన్న తనదు ధర్మ
మదియు హీనమైనదియగు సాదరమున
చేయుటొప్పును దోషంబు చేరబోదు.. || 18-47 ||
భావము.
బాగా అనుష్ఠించిన పరధర్మంకన్నను, హీనమైన స్వధర్మము మేలు. స్వభావము చేత ప్రేరేపించబడిన కర్మను చేయుట వలన పాపమును పొందడు.
తే.గీ. సహజ కర్మ దోషయుతమౌన్, జక్కగాను
విడవ కాచరింప వలయు విశ్వసించి,
యగ్ని పొగతోడ మొదలగు నటులె యన్ని
కర్మలున్, మొదలగు కలిగి ఖిలము.. || 18-48 ||
భావము.
కౌంతేయా! సహజమైన కర్మ దోషంతో కూడినను వదలరాదు. పొగ చేత కప్పబడిన అగ్ని లాగా అన్ని కర్మలూ దోషంతోనే మొదలౌతాయి.
తే.గీ. తగులమే లేని బుద్ధితోఁ దనదు మదిని
జయ! జయించి, కోర్కెలు వీడి, సన్యసింప
కర్మ నిర్ముక్తిని గను, ప్రకాశమైన
యుత్తమోత్తమ స్థితిపొందు నుర్విపైన.
. || 18-49 ||
భావము.
సర్వత్రా దేనికీ తగుల్కొనని బుద్ధితో, మనస్సును జయించి, కోరికలు వదిలి సన్యసించడం ద్వారా కర్మల నుండి విడుదల పొందే ఉత్తమోత్తమమైన స్థితిని పొందుతాడు.
తే.గీ. పుడమి నైష్కర్మ్య సిద్ధిని పొందువాడు
బ్రహ్మమును చేరు విధమును పలికెద విను,
క్లుప్తముగ, నర్జునా యిది కువలయమున,
పరమమైన జ్ఞానాభ్యాస, మరయ పార్థ!|| 18-50 ||
భావము.
నైష్కర్మ్య సిద్ధిని పొందిన వాడు బ్రహ్మ పదార్ధమును ఏ విధముగా చేరుకొనునో క్లుపముగా చెప్పెదను విను. అర్జునా ఇది పరమమైన జ్ఞానాభ్యాసం.
తే.గీ. ఒప్పుచు విశుద్ధ బుద్ధితో, నొప్పిదమగు
పట్టుదలతోడ మనసుపై పట్టు కలిగి,
వినెడి శబ్దాదులన్ విడి, విడిచి రాగ

మును, మహద్వేషమును భువి ఘనతరముగ
నుండుటొప్పునో పార్థ! నీ వుండుమటుల.!. || 18-51 ||
భావము.
విశుద్ధమైన బుద్ధితో కూడుకొని, పట్టుదలతో మనస్సుని నియమించి, శబ్దాది విషయాలని త్యజించి, రాగద్వేషాలను వదిలి,
తే.గీ. ధరణి నేకాంతముగనుంట, తగు సుభుక్తి,
తనదు వాక్కాయకర్మలన్ దా నియంత్ర
ణమును జేయుచు, ధ్యానియై, ప్రముదభరిత
మహిత వైరాగ్యమునుపొంది మసలవలయు.. || 18-52 ||
భావము.
ఏకాంత ప్రదేశంలో వసిస్తూ, ఆహారాన్ని స్వల్పంగా మాత్రమే స్వీకరిస్తూ, మనోవాక్కాయాలను నియంత్రిస్తూ, నిత్యమూ ధ్యాన యోగంలో నిమగ్నుడై వైరాగ్యంలో నిలిచి,
తే.గీ. అహము, బలదర్పమున్ వీడి, మహిని కామ
క్రోధమున్ బరిగ్రహబుద్ధి, కోర్కెలు విడి,
మమత త్యజియించి, శాంతితో మసల బ్రహ్మ
రూపుఁ డగుటకర్హుఁడగును, లోప రహిత!. || 18-53 ||
భావము.
అహంకారాన్ని, బల దర్పాన్ని, కామ క్రోధాలను, పరిగ్రహ బుద్ధిని వదిలి, మమకారాన్ని త్యజించి, శాంతుడై బ్రహ్మ స్వరూపుడు అగుటకు అర్హుఁడగును.
తే.గీ. బ్రహ్మభూత ప్రసన్న చిద్భాసురుండు,
దేనికిన్ శోకమొందడు, దేనినిలను
కోర కందరిన్ సమముగాఁ గూర్మిఁ జూచు,
తాను నాయందు భక్తితోఁ దనరు నెపుడు.. || 18-54 ||
భావము.
బ్రహ్మ భూతుడై ప్రసన్న చిత్తుడైన వాడు దేనికీ శోకించడు. దేనినీ కోరడు. ప్రాణులందరి యందు సమభావం కలిగి నాయందు పరమ భక్తిని పొందుతాడు.
తే.గీ. నేనెవండనో, నేనెట్టి జ్ఞాన ఖనినొ,
పూర్తి తత్వంబు నెరుగును, పూజ్యమతిని
భక్తి మార్గాన నన్ గని వరలి తాను
కడకు నన్ జేరగలుగును కనుము పార్థ!. || 18-55 ||
భావము.
భక్తి ద్వారా నేనెవరినో, ఎట్టి వాడినో నా పూర్తి తత్వమును గుర్తెరుగును. నా తత్వమును గ్రహించినందు వలన తరవాత నాలోనే ప్రవేశించును.
తే.గీ. అన్ని కర్మలన్ జేయుచు నన్ను శరణుఁ
బొంద నా యనుగ్రహమొంది పొందు తుదకు
శాశ్వతావ్యయపథమును సన్నుతముగ,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 18-56 ||
భావము.
అన్ని కర్మలను సదా చేస్తూనే, నన్ను శరణు పొందిన వాడు నా అనుగ్రహం వలన శాశ్వతమైన అవ్యయమైన పదాన్ని పొందుతాడు.
తే.గీ. కర్మలన్నాకునర్పించి ఘనతరముగ
మానసికముగ నను గమ్య మార్గమనుచు,
జ్ఞాన యోగంబునేపట్టి, మానధనుఁడ
నన్ను మదిలోన నిల్పుకో మన్ననమున.. || 18-57 ||
భావము.
(అర్జునా)మానసికంగా కర్మలన్నింటినీ నాకు సమర్పించి నన్నే గమ్యముగా పెట్టుకొని జ్ఞాన యోగాన్ని ఆశ్రయించి నన్ను నీ చిత్తములో నిలుపుకో.
తే.గీ. మనసు నాపైన నిలిపిన మహిత! నీవు
కలుగు నాటంకముల్ వీడ గలుగుదువయ
నాదు కృప చేత నర్జునా! నన్ను వీడి
యహము పొందితో చెడుదువు మహిని నీవు.. || 18-58 ||
భావము.
మనస్సు నాలో ఉంచితే నా అనుగ్రహము వలన అన్ని అడ్డంకులనూ దాటగలవు. అహంకారం వలన వినక పోయినచో నశింతువు.
తే.గీ. అహముతో యుద్ధమును జేయ ననితివేని
నీదు యత్నంబు వ్యర్థమౌ నీ స్వభావ
మదియె యుద్ధంబు చేయించు నరసి చూడ
నీవు గ్రహియింపుమియ్యది నేర్పు మీర.. || 18-59 ||

భావము.
అహంకారంతో యుద్ధం చేయనని నిర్ణయించుకున్నా, నీ యీ ప్రయత్నం దండుగ అవుతుంది. నీ స్వభావమే నిన్ను యుద్ధంలో నియోగిస్తుంది.
తే.గీ. నీవు కర్మబద్ధుడవిల నీదు భ్రాంతి
వలన చేయనన్ననుగాని, వదలకుండ
చేయుదువునీవు బవరము చేవ చూపి,
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 18-60 ||
భావము.
అర్జునా! నీ స్వభావ సిద్ధమైన కర్మలకు నీవు బద్ధుడివి. భ్రాంతి వలన కర్మ చేయడానికి ఇష్ట పడకపోయినా తప్పని సరిగా చేసి తీరుతావు.
తే.గీ. జీవకోటి మనంబులన్ దేవుడుండి,
తనదు మాయచే ద్రిప్పుచు, ఘనతరమగు
యంత్రములవోలె, నో పార్థ! యరయుమిదియు,
యరయకున్నచో నీకింక తెరవు లేదు. || 18-61 ||
భావము.
అర్జునా! ఈశ్వరుడు ప్రాణులందరి హృదయాలలోను కూర్చుని, యంత్రం ఉన్న(బొమ్మల వలె)జీవులను మాయచేత త్రిప్పుతూ ఉన్నాడు.
తే.గీ. అన్ని విధములన్ బొందు మీ వతని శరణ
మతని దివ్యమైన దయచే ననితరమగు
శాంతియున్ శాశ్వతంబైన స్థానమీవు
పొంద గలుగుదు వర్జునా, పొందుమటుల.. || 18-62 ||
భావము.
అన్ని విధాల ఆయన్నే శరణు పొందు. ఆయన అనుగ్రహం వలన పరమ శాంతిని శాశ్వతమైన స్థానాన్ని పొందుతావు.
తే.గీ. అతి రహస్యమౌ జ్ఞానమునరయనీవు
చెప్పితిని నీకు గ్రహియింప గొప్పగాను,
నీవు చింతించి బాగుగా నీకు తోచి
నట్టులన్ జేయు మర్జునా! యనుపమముగ.. || 18-63 ||
భావము.
ఈ విధముగా నీకు అతి రహస్యమైన జ్ఞానం చెప్పాను. దానిని క్షున్నంగా విమర్శించి తెలుసుకొని, నీకు ఏ విధముగ ఇష్టమగునో ఆ విధముగా చేయుము.
తే.గీ. సర్వ గుహ్యతమపు రహస్యంబు నీకు
మరల చెప్పెద ప్రేమతోఁ బరమవాక్కు
వినుము మిత్రమా! శ్రద్ధగా వీనులార,
మేలు గను మీవు, నా వాక్కు మేలు గొలుపు.. || 18-64 ||
భావము.
అన్నిటికన్నా ఎక్కువైన రహస్యాన్ని మళ్ళీ నాపరమ వాక్కు ద్వారా విను. నాకు చాలా ఇష్టమైన వాడివని నీ హితము కోరి చెప్పుచుంటిని.
తే.గీ. ప్రతిన చేసి చెప్పుదు నీవు భక్తి గలిగి
నన్ను గలుగుము నీ మదిన్ మన్ననమున,
నన్ను భక్తితోఁ గొలువుము మన్ననమున,
వందనముచేయుమా నాకు, భక్తితోడ.. || 18-65 ||
భావము.
మనస్సు నాలో ఉంచు, నా భక్తుడివిఅగుము. నన్ను ఆరాధించు. నాకు నమస్కరించు. నన్నే పొందుదువు. ఇది సత్యం. నీవు నాకు ప్రియుడివి. నీకు ప్రతిజ్ఞ చేసి చెప్పుచుంటిని.
తే.గీ. సర్వధర్మముల్ విడిచి నన్ సన్నుతముగ
శరణు వేడి పొందుము పార్థ! సకలమైన
పాపముల నుండి ముక్తిని వరలఁ జేతు,
నీకిక విచారమేలను, నిజము కనుమ.. || 18-66 ||
భావము.
అన్ని ధర్మాలను పరిత్యజించి నన్ను మాత్రమే శరణు పొందుము. అన్ని పాపాలనుండి నీకు నేను మోక్షమిచ్చెదను. విచారించకు.
తే.గీ. తపము చేయనివానికి, ధరను భక్తి
హీనునకు, నన్ను ద్వేషించు హీనునకును
చెప్పకూడదీ జ్ఞానమున్, జేటు కలుగు,
నీవు గ్రహియింపుమా యిది నేర్పు మీర.. || 18-67 ||
భావము.
ఈ జ్ఞానాన్ని తపస్సు చేయని వానికి, భక్తుడు కాని వానికి, నన్ను ద్వేషించే వానికీ , ఏ సందర్భంలోనూ చెప్ప కూడదు.

తే.గీ. పరమ గుహ్య మీ జ్ఞానమ్ము, భక్తితోడ
నాదు భక్తులకును జెప్ప మేదురముగ
నాదు భక్తిని పొంది తా నన్ను జేరు,
నిందు సందేహమేలే దనింద్య చరిత! . || 18-68 ||
భావము.
పరమ రహస్యమైన ఈ జ్ఞానాన్ని నా భక్తులకు చెప్పిన వాడు , నాలో పరమమైన భక్తిని పొంది నన్నే చేరతాడు. ఇందులో అనుమానము లేదు.
తే.గీ. మనుజులం దట్టివాఁడేను మహితుఁడెన్న,
నాకుఁ బ్రియమట్టి పనిచేయు శ్రీకరుండె.
యింతకన్నను ఘనమని యెన్నదగిన
పనియె లేదర్జునా యిది కనుము నీవు.. || 18-69 ||
భావము.
మనుష్యులందరిలో అతడికన్నను నాకు ప్రియమైన పని చేసేవారు లేరు, అతడికన్నను నాకు బాగుగా ఇష్టులూ ఉండరు.
తే.గీ. మనదు ధార్మిక సంవాద మహితవిషయ
మునిల జ్ఞానయజ్ఞముననను పూర్తిగాను
గొప్పగానధ్యయనమును కోరిచేయు
వారికిష్టుడ నగుదును, పార్థ! నిజము.. || 18-70 ||
భావము.
ధార్మికమైన మన ఈ సంవాదాన్ని జ్ఞాన యజ్ఞంద్వారా ఎవరు అధ్యయనం చేస్తారో వారికి దాని వలన నేను ఇష్టమైనవాడిని అగుదును.
తే.గీ. శ్రద్ధగలవాఁ డసూయకు చాల దూర
మైనవాడీ మహద్గీత నరయ వినిన
పుణ్యులొందెడి ముక్తిని పొందు పార్థ!
నీవు గ్రహియింపుమర్జునా నేర్పు మీర.. || 18-71 ||
భావము.
అసూయ లేకుండా శ్రద్ధతో (ఈ గీతను)వినినప్పటికీ ఆ మానవుడు ముక్తుడై పుణ్యాత్ములకు లభించే శుభలోకాలని పొందును.
తే.గీ. నేను చెప్పిన గీతను నిశ్చయముగ
పార్థ! యేకాగ్ర చిత్తమున్ వరల వినితె,
నీకు దొలగెనే యజ్ఞాన శోక జలధి?
తెలియ జేయుమో యర్జునా! తీరుగాను.. || 18-72 ||
భావము.
అర్జునా! నా ఈ మాటలను(గీత)ఏకాగ్ర చిత్తంతో విన్నావా?ధనంజయా! నీ అజ్ఞానం నశించిందా..
అర్జునుడనుచుండెను.
తే.గీ. మోహమది వీడిపోయెనో మోహనుండ!
స్మృతిలభించెను, శంకలు మతిని వీడె,
నీవు చెప్పిన విధముగా నేను బ్రీతిఁ
చేయుదును కృష్ణ! నీ కృపన్ శీఘ్రగతిని.. || 18-73 ||
భావము.
అచ్యుతా! నీ అనుగ్రహం వలన నాకు మోహం నశించింది. స్మృతి లభించింది. సందేహాలు తీరాయి. నీవు చెప్పినట్లు చేస్తాను.
సఞ్జయ ఉవాచ|
భావము.
సంజయుడు ఇట్లు పలికెను
తే.గీ. ఇట్టు లర్జున కృష్ణుల హితము గూర్చు
నచ్చెరువుగొల్పు భాషణ కచ్చితముగ
వింటినిట నేను, మదిలోనఁ బ్రీతి కలిగె,
పూర్వజన్మలో కలిగిన పుణ్యఫలము.|| 18-74 ||
భావము.
ఇలా వాసుదేవునికీ, మహాత్ముడైన అర్జునుడికీ మధ్య, పులకరింతలు పుట్టించే విధంగా జరిగిన అద్భుతమైన సంవాదాన్ని నేను విన్నాను.
తే.గీ. పరమ గుహ్యమౌ యోగమున్ భక్తవత్స
లుండు కృష్ణుండు చెప్పగా మెండుకృపను
వ్యాసుని యనుగ్రహంబున భక్తితోడ
వింటి, నాదైవసత్కృపన్ వినగనయ్యె.. || 18-75 ||
భావము.
పరమ రహస్యమైన ఈ యోగాన్ని, సాక్షాత్తు యోగేశ్వరుడైన కృష్ణుడే స్వయంగా చెప్పుచూ ఉండగా వ్యాస మహర్షి అనుగ్రహం వలన నేను వినగలిగితిని.

తే.గీ. కృష్ణునకు నర్జునునకును క్షితిని జరిగె
నద్భుత, పవిత్ర సంవాద మనవరతము
తలచి తలచి మనంబున ధన్యునయితి,
పట్టరానంత సంతోష మిట్టె కలిగె.|| 18-76 ||
భావము.
రాజా! కృష్ణార్జునుల ఈ అద్భుతమైన పవిత్రమైన సంవాదాన్ని తలచుకొని తలచుకొని క్షణ క్షణం ఆనందంతో పొంగిపోవుచుంటిని.
తే.గీ. హరి మహాద్భుత రూపమహర్నిశంబు
తలచి తలచి నా మది పొంగు ధాత్రిపైన,
నమిత విస్మయమొందితి ననితరమగు
తృప్తి కలిగెను మదికిని. తెలుపజాల. || 18-77 ||
భావము.
రాజా హరియొక్క ఆ అద్భుతమైన రూపాన్ని తలచుకొని తలచుకొని నాకు అమితమైన విస్మయం కలుగుతోంది. మళ్ళీమళ్ళీ ఆనందం కలుగుతుంది.
తే.గీ. యోగి యైనట్టి కృష్ణుడున్ రాగదూర
ఘన ధనుర్ధారి పార్థుఁడు కలిగి యుండు
నెచట, నట శ్రీలు, విజయమ్ము లెలమినొప్పి
నీతితోనొప్పుచుండును ఖ్యాతిగాను.. || 18-78 ||
భావము.
యోగేశ్వరుడైన కృష్ణుడూ ధనుర్ధారి అయిన అర్జునుడు ఎక్కడ ఉంటారో అక్కడ, సంపద, గొప్పతనం, విజయం, స్థిరమైన నీతి ఉంటాయని నానిశ్చయం.

ఇది ఉపనిషత్తులు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రం,
శ్రీకృష్ణార్జున సంవాదము అయిన
శ్రీమద్భగవద్గీతలోని " మోక్షసంన్యాస యోగము " అనెడి
18వ అధ్యాయము. సమాప్తము.

గీతా మాహాత్మ్యము

ధరోవాచ.
శ్లో. భగవాన్! పరమేశాన! భక్తిరవ్యభిచారిణీ!|
ప్రారబ్ధం భుజ్యమానస్య కథం భవతి హేప్రభో || 1 ||
క. ప్రారబ్ధ కర్మ బద్ధుల
కే రకముగ భక్తి యబ్బు నీశ్వర! యనుచున్
చేరి ధర హరిని యడుగగ
నారాయణుఁ డిట్లు చెప్పె నమ్మిక మీరన్.
భావము.
భూదేవి విష్ణుభగవానుని గూర్చి ఇట్లు ప్రశ్నించెను. ఓ భగవానుడా! పరమేశ్వరా! ప్రభూ! ప్రారబ్ధము అనుభవించే వానికి అచంచలమైన భక్తి ఎట్లు కలుగగలదు?
శ్రీవిష్ణురువాచ:
విష్ణువు చెప్పుచున్నాఁడు.
శ్లో. ప్రారబ్ధం భుజ్యమానోపి గీతాభ్యాసరతస్సదా |
స ముక్త స్స సుఖీ లోకే కర్మణా నోపలిప్యతే || 2 ||
క. ప్రారబ్ధ కర్మ బద్ధులు
తీరికగా గీత చదివి తృప్తిగ నాపై
భారము వేసిన, కర్మలు
వారల కంటవు. విముక్తి వారికిఁ గలుగున్.
భావము.
ఓ భూదేవీ! ప్రారబ్ధము అనుభవిస్తున్ననూ ఎవరు నిరంతరము గీతాభ్యాసమందు నిరతుడై ఉండునో అట్టివాడు ముక్తుడై కర్మలచే అంటబడక ఈ ప్రపంచమునందు సుఖముగా ఉండును.
శ్లో. మహాపాపాదిపాపాని గీతాధ్యానం కరోతి చేత్ |
క్వచిత్ స్పర్శం న కుర్వంతి నలినీదళమంభసా || 3 ||
క. గీతా ధ్యానము చేయు పు
నీతుల కఘమంట బోదు. నీరము గన తా
నేతఱిఁ దామర కంటునె?
యాతీరుగ నిదియు. నిజము నరయుము దేవీ!
భావము.
తామరాకును నీరంటనట్లు గీతాధ్యానము చేయు వానిని మహాపాపములు కూడా కొంచమైనను అంటవు.
శ్లో. గీతాయాః పుస్తకం యత్ర యత్ర పాఠః ప్రవర్తతే
తత్ర సర్వాణి తీర్థాని ప్రయాగాదీని తత్ర వై || 4 ||
క. గీతా గ్రంథ మదెచ్చట,
గీతా పారాయణమెట కీర్తి ప్రదమై
భూతలమందున నుండును
నా తలమున పుణ్య తీర్థ మమరిక నుండున్.
భావము.
ఎచ్చట గీతా గ్రంథము ఉండునో మరియు ఎచ్చట గీతా పారాయణము జరుగుచుండునో అచ్చట ప్రయాగ మొదలగు సమస్త తీర్థములు ఉండును.
శ్లో. సర్వే దేవాశ్చ ఋషయో యోగినః పన్నగాశ్చ యే |
గోపాల గోపికా వాపి నారదోద్ధవ పార్షదైః
సహాయో జాయతే శీఘ్రం యత్ర గీతా ప్రవర్తతే || 5 ||
గీ. ఎచట గీతపారాయణంబెలమిఁ జరుగు
నచట దేవతల్, ఋషి వరు లఖిల యోగు
లఖిల నాగులు గోపిక లఖిల గోప
కులును నారదోద్ధవులును గొలుపు మేలు.
భావము.
ఎచ్చట గీతాపారాయణము జరుగుచుండునో అచటికి దేవతలు, ఋషులు, యోగులు, నాగులు, గోపికలు, గోపాలురు నారద, ఉద్ధవాదులు వచ్చి శీఘ్రముగా సహాయమొనర్తురు.
శ్లో. యత్ర గీతా విచారశ్చ పఠనం పాఠనం శ్రుతం |
తత్రాహం నిశ్చితం పృథ్వి నివసామి సదైవ హి || 6 ||
గీ. గీత పఠన పాఠన ములు, గీత చర్చ
యెచట శ్రవణమున్ జరుగునో యచట నేను
నిష్ఠతో నుండి కాతును నేర్పు మీర.
గమ్య మార్గము చూపుదు. కనుమ! పృథ్వి!
భావము.
ఓ భూదేవీ! ఎచట గీతను గూర్చి విచారణ, పఠనము, భోధన, శ్రవణము జరుగుచుండునో అచట నేను ఎల్లప్పుడు తప్పక నివసింతును.

శ్లో. గీతాశ్రయేహం తిష్ఠామి గీతా మే చోత్తమం గృహమ్ |
గీతాజ్ఞానముపాశ్రిత్య త్రీన్ లోకాన్ పాలయామ్యహమ్ || 7 ||
ఆ. గీత నాశ్రయించి క్రీడింతు సృష్టిలో.
గీతయే గృహముగ ప్రీతి నుందు.
గీత నాశ్రయించి ఖ్యాతి ముజ్జగముల
నేలు చుంటి నేను మేలుగాను.
భావము.
నేను గీతనాశ్రయించి ఉన్నాను, గీతయే నాకు ఉత్తమగు నివాస మందిరము మరియు గీతాజ్ఞానమును ఆశ్రయించియే మూడు లోకాలను నేను పాలించుచున్నాను.
శ్లో. గీతా మే పరమా విద్యా బ్రహ్మరూపా న సంశయః |
అర్థమాత్రాక్షరా నిత్యా స్వనిర్వాచ్య పదాత్మికా || 8 ||
గీ. గీతయే నా పరమ విద్య. ఖ్యాతిఁ గనిన.
గీత బ్రహ్మస్వరూపము. కీర్తి పథము.
ప్రణవమందున నాల్గవ పాదమైన
అర్థ మాత్ర. నిత్య సుశాశ్వతానుపమము.
భావము.
గీత నాయొక్క పరమవిద్య అది బ్రహ్మస్వరూపము దీనిలో సందేహము లేదు, మరియు అది ప్రణవములో నాలగవ పాదమగు అర్థమాత్రా స్వరూపము, నిత్యమైనది, నాశరహితమైనది, అనిర్వచనీయమైనది.
శ్లో. చిదానందేన కృష్ణేన ప్రోక్తా స్వముఖతోర్జునమ్ |
వేదత్రయీ పరానందతత్త్వార్థజ్ఞానమంజసా || 9 ||
గీ. కృష్ణుఁ డర్జుననకుఁ జెప్పె గీత కృపను
మూడు వేదాల సారము. మూడు లోక
ములకు నానందసుధయిది. కలుగఁజేయు
తత్వ విజ్ఞానమును తనన్ దలచినంత.
భావము.
సచ్చిదానంద స్వరూపుడగు శ్రీకృష్ణ పరమాత్మచే స్వయముగా అర్జుననుకు ఉపదేశింప బడినది. ఇది మూడు వేదముల సారము, పరమానందమయినది, తన్నాశ్రయించిన వారికి శీఘ్రముగా తత్వజ్ఞానాన్ని కలుగచేయును.
శ్లో. యోష్టాదశ జపేన్నిత్యం నరో నిశ్చలమానసః |
జ్ఞానసిద్ధిం స లభతే తతో యాతి పరం పదమ్ || 10 ||
గీ. ప్రీతి నష్టా దశాధ్యాయి ఖ్యాతి నెఱిగి,
పఠన చేయు నా నరుఁడు తా బ్రహ్మ పథము
నొందు. సందేహమే లేదు. మంద మతియు
దీని పఠియించి మోక్షంబు తాను పొందు.
భావము.
ఏ నరుడు నిత్యమూ గీతయందలి పద్దెనిమిది అధ్యాయములను పఠించునో అతడు జ్ఞానసిద్ధిని పొంది తద్వారా పరమ పదమును (మోక్షమును) పొందును.
శ్లో. పాఠే సమర్థస్సంపూర్ణే తదర్థం పాఠమాచరేత్ |
తదా గోదానజం పుణ్యం లభతే నాత్ర సంశయః || 11 ||
గీ. శక్తి హీనులు గీతను భక్తి తోడ
సగము చదివిన చాలును సత్ ఫలమిడు.
గంగి గోదాన ఫలమిచ్చు. గాన చదివి
సత్ ఫలంబును గాంతురు సహృదయులిల.
భావము.
గీతని మొత్తము పఠించలేని వారు అందులో సగమైనను పఠించవలెను దీనివలన అతడికి గోదాన ఫలము వలన కలుగు పుణ్యము లభించుననుటలో సందేహము లేదు.
శ్లో. త్రిభాగం పఠమానస్తు గంగాస్నానఫలం లభేత్ |
షడంశం జపమానస్తు సోమయాగఫలం లభేత్ || 12 ||
గీ. గీత మూడవ వంతైన ప్రీతి తోడ
చదువ స్వర్గంగ స్నాన ఫలదము. నిజము.
గీతనారవ భాగము ప్రీతిఁ జదువ
సోమ యాగ ఫలంబిచ్చు. శుభము లొసగు.
భావము.
గీతయొక్క మూడవభాగము(ఆరు అధ్యాయములు) పఠించినవానికి గంగా స్నాన ఫలము లభించును, ఆరవ భాగము(మూడు అధ్యాయములు)పఠించువారికి సోమయాగ ఫలము లభించును.
శ్లో. ఏకాధ్యాయం తు యో నిత్యం పఠతే భక్తిసంయుతః |
రుద్రలోకమవాప్నోతి గణోభూత్వా వసేచ్చిరమ్ || 13 ||
గీ. ఒక్క అధ్యాయమైనను నిక్కముగను

గీత ప్రతిదినంబు చదువఁ బ్రీతి తోడ
రుద్ర లోకము పొంది తా రుద్ర గణము
నందు నొకఁడగు. నివసించునం దనిశము.
భావము.
ఎవడు గీతయొక్క ఒక అధ్యాయము భక్తితో పఠించునో అతడు రుద్రలోకమును పొంది రుద్ర గణములలో ఒకడుగా శాశ్వతముగా నివసించును.
శ్లో. అధ్యాయశ్లోకపాదం వా నిత్యం యః పఠతే నరః |
స యాతి నరతాం యావన్మనుకాలం వసుంధరే! || 14 ||
గీ. నిత్య మధ్యాయ పాదము నేర్పు మీర
చదువ నుత్కృష్ట నర జన్మ చక్క నొదవు
నొక్క మన్వంతరము. కాన నొప్ప చదువు
భక్తి తోడను గీత సద్భక్తు లెల్ల.
భావము.
ఓ భూదేవీ ఎవరు గీతనందలి ఒక అధ్యాయమునందలి నాల్గవ భాగమును నిత్యమూ పఠించునో అతడు ఉత్కృష్టమైన మానవ జన్మ ఒక మన్వంతర కాలము పొందును.
శ్లో. గీతాయాః శ్లోకదశకం సప్త పంచ చతుష్టయమ్ |
ద్వౌత్రీనేకం తదర్ధం వా శ్లోకానాం యః పఠేన్నరః || 15 ||
ఆ. గీత పదియొ, యేడొ, భ్రాతి నైదో నాల్గొ,
మూడొ, రెండొ, యొకటొ, ముచ్చట పడి
యర్ధ శ్లోకమయిన నర్థితో చదివిన
యమర సుఖములబ్బు నరసి చూడ.
భావము.
ఎవరు గీతనందలి పది శ్లోకములను కానీ, ఏడుశ్లోకములను కానీ, ఐదు శ్లోకములను కానీ, నాలుగు శ్లోకములను కానీ, మూడు శ్లోకములను కానీ, రెండు శ్లోకములను కానీ, ఒక శ్లోకమును కానీ, అర్ధ శ్లోకమును కానీ నిత్యము ఏవరు పఠింతురో,
శ్లో. చంద్రలోకమవాప్నోతి వర్షాణామయుతం ధ్రువమ్ |
గీతాపాఠ సమాయుక్తో మృతో మానుషతాం వ్రజేత్ || 16 ||
గీ. వారు చంద్రలోకమునందు వరలు నిజము
వేయి పదులవత్సరములు ప్రీతితోడ.
గీత చదువుచు మృతిఁ జెంద ఖ్యాతి నాతఁ
డుత్తమంబగు నరజన్మ నొనర పొందు.
భావము.
వారు చంద్రలోకములో పదివేల సంవత్సరములు సుఖముగా జీవించుననుటలో సందేహము లేదు మరియు గీతను పఠిస్తూ ఎవరు మరణిస్తారో అతడు ఉత్తమ మగు మానవ జన్మను పొందుట నిశ్చయము.
శ్లో. గీతాభ్యాసం పునః కృత్వా లభతే ముక్తిముత్తమాం |
గీతేత్యుచ్చారసంయుక్తో మ్రియమాణో గతిం లభేత్ || 17 ||
గీ. అట్టి నర జన్మ పొందిన దిట్ట మరల
గీత పఠియించి పఠియించి ఖ్యాతిగాను
మోక్షమును పొందు, గీత పూజ్యాక్షరములు
పలుకుచుండి గతించిన వచ్చు ముక్తి.
భావము.
అట్లాతడు మానవుడై జన్మించి గీతాభ్యాసమును మరల మరల గావించి ఉత్తమమగు మోక్షమును పొందుననుటలో సంశయము లేదు. గీతా గీతా అనుచు ప్రాణమును వదలువాడు సత్గతిని పొందుననుటలో సందేహము లేదు.
శ్లో. గీతార్థశ్రవణాసక్తో మహాపాపయుతోపి వా |
వైకుంఠం సమవాప్నోతి విష్ణునా సహ మోదతే || 18 ||
క. పాపాత్ముఁడయిన గీతను
దీపించెడి యర్థమెఱిఁగి తీరగ వలవన్
బ్రాపించు విష్ణులోకము
ప్రాపించును సుఖములచట భక్తియునొడమున్.
భావము.
మహా పాపాత్ముడైనను అతడు గీతార్ధమును తెలుసుకొనుటలో ఆసక్తుడైనచో అతడు విష్ణు లోకమును పొంది శ్రీమహా విష్ణు సన్నిధిలో ఆనందమును అనుభవించుచూ ఉండును.
శ్లో. గీతార్థం ధ్యాయతే నిత్యం కృత్వా కర్మాణి భూరిశః |
జీవన్ముక్తస్స విజ్ఞేయో దేహాంతే పరమం పదమ్ || 19 |
క. గీతార్థ నిరత చింతన
ఖ్యాతిగ కల నరుఁడు కర్మ గతినున్నను వి
ఖ్యాతిగ కను పరమ పదము

నే తరి గన దేహ పతన మిది సత్యమిలన్.
భావము.
ఎవడు గీతార్థమును నిత్యము చింతన చేయుచుండునో అతడు అనేక కర్మల నాచరించిననూ జీవన్ముక్తుడేనని చెప్పబడెను, మరియు దేహ పతనానంతరము పరమ పదమును(కైవల్యమును) పొందును.
శ్లో. గీతామాశ్రిత్య బహవో భూభుజో జనకాదయః।
నిర్ధూతకల్మషా లోకే గీతా యాతాః పరమం పదమ్ ॥ 20 ॥
క. జనకాదులుముక్తిని గని
రనితరమగు గీతనరసి రమలిన మతులన్
జనియించిన నరులు పునర్
జననము గన రరయ గీత. సత్యంబిదియే.
భావము.
ఈ ప్రపంచమున గీతను ఆశ్రయించి జనకాది రాజులు అనేకులు పాపరహితులై ముక్తిని పొందియున్నారు.
శ్లో. గీతాయాః పఠనం కృత్వా మాహాత్మ్యం నైవ యః పఠేత్।
వృథాపాఠో భవేత్ తస్య శ్రమ ఏవ హ్యుదాహృతః ॥ 21 ॥
క. గీతా పఠన మహత్త్వము
నేతరి చదువకను గీత నెంత చదివినన్
ఖ్యాతిని గొలపదు. సరికద
యాతని శ్రమ వ్యర్థమిలను. హరినుత భక్తా!
భావము.
గీతని పఠించి పిదప మహత్యమును ఎవరు పఠించకుందురో అట్టి వారి గీతా పఠనము వ్యర్థమే(నిష్ఫలమే). అట్టివారి గీతాపఠనము శ్రమ మాత్రమేనని చెప్ప బడినది.
శ్లో. ఏతన్మాహాత్మ్యసంయుక్తం గీతాభ్యాసం కరోతి యః।
స తత్ఫలమవాప్నోతి దుర్లభాం గతిమాప్నుయాత్ ॥ 22 ॥
క. గీతా మాహాత్మ్యముతో
గీతను పఠియించువాఁడు కీర్తిదమగు వి
ఖ్యాతమగు ఫలములు గని పు
నీతంబగు పరమునొందు నిరుపమగతితోన్.
భావము.
గీతా మహత్యముతో గీతా పారాయణము చేయువారు పైన చెప్పబడిన ఫలములను పొంది, దుర్లభమగు సద్గతిని పొందుతురు.
సూత ఉవాచ:
భావము.
సూతుడు చెప్పెను.
శ్లో. మాహాత్మ్యమేతద్గీతాయా మయా ప్రోక్తం సనాతనమ్।
గీతాంతే చ పఠేద్యస్తు యదుక్తం తత్ఫలం లభేత్ ॥ 23 ॥
క. ఋషులారా! గీతను గొని
యసమానపు గీత మహిమ నరసి చదివినన్
ప్రసరిత సత్ ఫలమహిమ
న్నసదృశ శుభతతియుఁ గలుగునని సూతుఁడనెన్.
భావము.
శౌనకాది ఋషులారా! ఈ ప్రకారనముగా సనాతనమైన గీతా మహత్యమును మీకు తెలుపుచున్నాను. దీనిని గీతా పారాయణానంతరము ఎవరు పఠింతురో అతడు పైన చెప్పిన ఫలమును పొందును.

ఓం ఇతి శ్రీవరాహపురాణే గీతామాహాత్మ్యం సంపూర్ణమ్.
ఇట్లు వరాహ పురాణమునందలి గీతా మహత్యము సమాప్తము.

గద్య.

శ్రీమదాంధ్రప్రదేశమున విశాఖపట్టణము జిల్లా సర్వసిద్ధి గ్రామస్తులయిన పూజ్య కాణ్వ శాఖోద్భవ శ్రీ చింతా వంశ సంభవ జానకీ రామ మూర్తి దంపతుల పౌత్రుఁడను, వేంకట రత్నం సన్యాసిరామారావు పుణ్య దంపతుల పుత్రుఁడను శ్రీమాన్ కల్వపూడి వేంకట వీర రాఘవాచార్యమహోదయుల శిష్యుండను చిత్రకవితాసమ్రాట్, కనికల్పభూజ, బిరుదాంకితుఁడను రామ కృష్ణా రావు నామధేయుండను అగు నాచేత శ్రీ చాంద్రమాన శుభకృన్నామ సంవత్సరములో ఆ పరమేశ్వరానుగ్రహముచే విరచింపఁబడి
నా పూజ్య జననీజనకులకు హృదయపూర్వకముగా అంకితము గావింపఁబడిన
శ్రీమద్భగవద్గీత భావసహిత పద్యానువాదము శ్రీమద్భగవద్గీత చింతామృతం సంపూర్ణము.
స్వస్తి.

కృతికర్త



.

భాషాప్రవీణ చింతా రామ కృష్ణా రావు. P.O.L., M.A.,
విశ్రాంత ఆంధ్రోపన్యాసకుఁడు.
ఫ్లాట్ నెం. A 601. శిల్పాస్ ఆర్వీధర్మిష్ఠ... డీమార్టుకు ఎదురుగా.. మియాపూర్, హైదరాబాద్. 49.
తెలంగాణా. భారత దేశము. చరవాణి 8247384165

రచనలు.

1) శ్రీ శిరిడీశ దేవ శతకము,(వారం రోజులలో వ్రాసినది.)
2) వృద్ధబాలశిక్ష శతకము. (ఒక్క రోజులో వ్రాసినది.)
3) రామకృష్ణ శతకము. (ఒక్క రోజులో వ్రాసినది.)
4) అశ్వధాటి సతీ శతకము.(ప్రాస నియమముతో, ప్రతీపాదమునా మూడు ప్రాసయతులతో ఒక్క రోజులో వ్రాసినది.)
5) చంపక భారతీ శతకము. (ఒక్క రోజులో వ్రాసినది.)
6) వసంతతిలక సూర్యదేవ శతకము.
7) శ్రీయాజ్ఞవల్క్య శతకము. (ఒక్క రోజులో వ్రాసినది.)
8) శ్రీమన్నారాయణ శతకము.(ద్విత్వనకార ఏక ప్రాసతో)
9) శివ శతకము. (ఒక్క రోజులో వ్రాసినది.)
10) శ్రీ అవధాన శతపత్ర శతకము.
11) రమాలలామ శతకము. (ఒక్క రోజులో వ్రాసినది.)
12) శ్రీమద్యాదాద్రి శ్రీనృసింహ శతకము.(అష్టోత్తరశత నృసింహనామాంచిత 118 ఛందో గర్భ చిత్ర సీసపద్య శతకము.)
13) లలితా శ్రీచంద్రమౌళీశ్వర శతకము. (ఒక్క రోజులో వ్రాసినది.)
14) శ్రీవేణుగోప కంద గీత గర్భ చంపకోత్పల శతకము.(బంధచిత్రకృతి ఒకే శతకమున మూడు మకుటములతో మూడు శతకములు.)
15) ప్రజ పద్య సీస గర్భిత ఆటవెలది కృష్ణ శతకము.
16) విజయభావన శతకము.
17) సురగవి నవ రత్నమాలిక. (చిత్రకవితా ప్రసూనములు.)
18) సుందర కాండ.(రామాన్వయముగా కందపద్యములు, సీతాన్వయముగా తేటగీతి పద్యములు, హనుమదన్వయముగా ఉత్పలమాలలుతో సుందరోత్పల నక్షత్రమాల.)
19) పురుష సూక్త ఆంధ్ర పద్యానువాదము.
20) నేరెళ్ళమాంబ సుప్రభాతము.
21) కాళిదాసు కాళీ అశ్వధాటికి తెలుఁగు పద్యానువాదము.
22) శ్రీచక్ర బంధ సప్తస్వర సర్వమంగళాష్టకము.
23) శ్రీచక్రబంధ మంగళాష్టకము.
24) శ్రీచక్రబంధ శ్రీరామ దశకము.
25) శ్రీచక్రబంధ అష్టలక్ష్మీ స్తోత్రము.
26) రుద్రమునకు తెలుగు భావము.
27) మేలిమిబంగారం మన సంస్కృతి. సంస్కృత సూక్తిశ్లోకములకు తెలుఁగు పద్యానువాదము.
28) శ్రీలలితా సహస్ర నామాంచిత పద్యసహస్రదళపద్మార్చన.
29) బాలభావన శతకము.
30) ఆంధ్రామృతమ్, పద్యవిపంచి, యువతరంగమ్. బ్లాగుల నిర్వహణ.
31) భగవద్గీత ... తెలుఁగుపద్యానువాదము.
32. శ్రీ లక్ష్మీ సహస్ర నామాంచిత సహస్రపద్యదళ పద్మరచన.
33. ౨౨౦౦. అనంత ఛందము కొఱకు శతకము.

34. స్వతంత్ర భారత వజ్రోత్సవము సందర్భముగా రకార ప్రాసతో అష్టోత్తర శత పాద ఉత్పలమాలిక
35. వేద స్తుతి, షోడశ చిత్రకవితలు.
36. ఆంధ్ర సౌందర్యలహరి.